# విశ్వ ప్రయత్నం



మధుబాబు

# విశ్వప్రయత్నం

ఉత్తరంగామెరిసింది ఛటేల్‌న ఓ పెద్ద మెరుపు.

కాకా హోటల్ బల్లమీద కూర్చున్న ఆ యువకుడు హేట్ పైకెత్తి ఓసారి అటు చూసాడు. పోటీపడి కమ్ముకొస్తున్నాయి అటుగా నల్లటి దట్టమైన మబ్బులు. అవి ఇక్కడికి చేరుకోడానికి ఇంకా అర్ధగంట సమయం పట్టొచ్చు. చేతిలో సగం తాగిన టీ గ్లాసును టేబిల్ మీద వదిలేస్తూ ఎదురుగా కనిపిస్తున్న మైదానం వంక చూసాడు.

సువిశాలమైన ఆ మైదానంలో క్రికెట్ ఆడుకొంటున్న పిల్లలు గోల గోలగా అరుస్తున్నారు. జరుగనున్న ఘోరాన్ని ముందే వూహించిందో ఏమిటోగాని మైదానాన్ని ఆనుకొనున్న ఆ విశాలమైన రోడ్డు నిర్మానుష్యంగా వుంది.

బద్ధకంగా ఒళ్ళు విరుచుకొంటూ నిలబడ్డాడు అతను. లేచి ఓసారి టైం చూశాడు. అది సాయంత్రం నాలుగు గంటల సమయం. జేబులోంచి టు రుపీస్ కాయిన్ తీసి కాకా హోటల్ యజమానివైపు విసిరి ఆ సమీపంలోని యస్.టి.డి. బూత్ వైపుఅడుగులేశాడతను.

కాయిన్ మిస్ గాకుండా కేచ్ పట్టిన కాకా హోటల్ ఓనర్ వెళుతున్న ఆ యువకుడ్నే ఆశ్చర్యంగా అలా చూస్తుండిపోయాడు.

అతడిలో ఏదో విశిష్టత.

చెప్ప వీలుకాని ప్రత్యేకత.

అతడి చూపుల్లో వేటకు బయలుదేరిన సింహపు వీక్షణం స్పష్టంగా కనబడుతోంది. నడకలో చిరుతపులి వేగం. టోటల్‌గా ఆకాశం విరిగి మీద పడినా లెక్కచేయని సాహసం అతడిలో చూడగలుగుతున్నాడు. అందుకే -

"హి ఈజ్ సంథింగ్ స్పెషల్" అనుకుంటూ వెనుతిరిగాడు కాకా హోటల్ ఓనర్.

అతగాడు వూహించిందాంట్లో -

అవగింజంత కూడా అబద్ధంలేదు.

ఖచ్చితంగా అతను సంథింగ్ స్పెషల్.

చూడ్డానికి ఆరడుగుల ఆజానుబాహుడు. వయసు ముప్పై మించదు. దబ్బపండు రంగులో మగాళ్ళకి అసూయ కలిగించే పర్సనాలిటీ. మగతనానికి మగతనం. అందానికి, హుందాకి గీటురాయి అతను. మగాడంటే ఇలా వుండాలి అని అమ్మాయిలు మురిసిపోయే చక్కని రూపం. నిత్య వ్యాయామంతో బలిష్ఠమైన శరీరం. కాని చూడ్డానికి నాజూగ్గా, అందంగా కన్పిస్తాడు. సింపుల్ గా పాంటు, షర్టు ధరించాడు. కాళ్ళకు ఆక్షన్ షూస్ వున్నాయి. సింపుల్ అండ్ సూపర్ పర్సనాలిటీ.

అతను యస్.టి.డి. బూత్ లో అడుగుపెట్టాడు. రిసీవర్ ఎత్తి ఒక నంబర్ కి డయల్ చేశాడు. అవతల ఎవరో లిఫ్ట్ చేశారు. అయినా పెదవి విప్పలేదతను. పది సెకన్ల తర్వాత -

"ఎవరు ?" అంటూ గరగరలాడిందో గొంతు అవతల.

"ఖాద్రితో మాట్లాడాలి" చెప్పాడు కూల్ గా.

"మాట్లాడు. నేను ఖాద్రినే."

"నువ్వు ఖాద్రి కాదని నాకు తెలుసు" యువకుడి గొంతు స్మూత్‌గా హెచ్చరించింది. ఆ హెచ్చరికలో ప్రమాదఘంటికలు మోగుతున్నాయి.

"ఓ పని చెయ్యి" తిరిగి తనే చెప్పాడు.

"ఖాద్రి ఎక్కడున్నా వెంటనే నా మెస్సేజి పాస్ చెయ్యి. అర్థమైందిగా విను. మీ చిరకాల ప్రత్యర్థి మన్సూర్ ఆలీ ప్రస్తుతం సీతానగరం మెయిన్ రోడ్ నానుకొనున్న మైదానంలో కొంతమంది రౌడీలతో తిరుగుతున్నాడు. వెంటనే వస్తే పనయిపోతుంది."

"ఎవర్నువ్వు ?"

"ఖాద్రితో చెప్పు. ఫోన్ చేసింది ఆర్. డి. ఎక్స్ అని."

"ఆర్.డి. ఎక్స్ ?"

బదులు చెప్పలేదతను.

క్రూరంగా నవ్వుకొంటూ లైన్‌కట్ చేశాడు.

మన్సూర్ ఆలీ గురించి విన్నాక ఆర్. డి.ఎక్స్. గురించి ఆలోచించాడు ఖాద్రి. సిటీలోని ఒక ఇన్ ఫార్మర్ నిక్‌నేమ్ ఆ ఆర్.డి. ఎక్స్. కలుగులో ఎలకల్ని బయటకి రప్పించటంకోసం ప్రస్తుతం తను ఆ పేరు వాడుకొంటున్నాడు.

సరిగ్గా మూడు నిముషాలు వ్యవధి తీసుకుని మరో నంబర్ కి ఫోన్ చేశాడు. లిఫ్ట్ చేసినవాడు కీచుగొంతుతో చాలా నిర్లక్ష్యంగా "ఎవరు కావాలి ?" అనడిగాడు.

"నీ బాస్.... మాల్యాద్రితో మాట్లాడాలి" కూల్‌గా చెప్పాడు.

"బాస్ బిజీ. విషయం నాతో చెప్పు. ఇంతకీ నువ్వెవరు ?"

"ఎక్కువ మాట్లాడకు, అట్టే టైం లేదు. చెప్పింది విను. మీ చిరకాల ప్రత్యర్థి ఖాద్రి తన మనుషులతో బయల్దేరాడు. సీతానగరం మెయిన్ రోడ్ నానుకొని వుంది మైదానం. వాళ్ళంతా అక్కడికి వస్తున్నారు. తాడోపేడో తేల్చుకోవాలనుకుంటే మాల్యాద్రిని తన బలగంతో రమ్మను. ఇప్పుడే.... ఈ క్షణమే మీరంతా బయలుదేరి రావాలి. నా మాటగా మాల్యాద్రితో చెప్పు."

"ఇంతకీ నువ్వెవరు ?"

"ఆర్.డి.ఎక్స్. గురించి విన్నావా ?"

"అర్. డి.ఎక్స్ ?"

"బుర్ర చించుకోకు. అది నేనే."

చిన్నగా నవ్వుకుంటూ లైన్‌కట్ చేశాడు యువకుడు.

రెండు ఫోన్ కాల్స్ కి మూడు రూపాయలు ఇచ్చి బూత్ లోంచి బయటికొచ్చాడు. మహాసంగ్రామం ఆరంభం కాబోతోంది. సిటీలోని రెండు అతిపెద్ద ముఠాలకు ఆ మైదానం కొద్దిక్షణాల్లో రణరంగం కానుంది.

ఆకాశంవంక చూశాడు.

ఇప్పుడు ఆకాశంలో పూర్తిగా మబ్బులు కమ్మేశాయి. నల్లటి మబ్బులు, జివ్వున చలిగాలి. ఏ క్షణంలోనయినా వర్షం పడొచ్చు. మైదానంలో అంతవరకు కేకలు, అరుపులతో ఉత్సాహంగా క్రికెట్ ఆడుతున్న పిల్లలు చెదిరిపోనారంభించారు.

అతను తిరిగి కాకా హోటల్ వద్దకొచ్చి అదే బల్లమీద కూర్చున్నాడు. సిగరెట్ ముట్టించుకుని టీ ఆర్డర్ చేశాడు. ఓనరు తెచ్చిన పొగలు గక్కుతున్న టీ గ్లాసు అందుకుంటూ అతనివంక చూశాడు.

"ఇదే నువ్వు నాకిస్తున్న ఆఖరు టీ. ఈ టీ తాగి నేను వెళ్ళిపోయే లోపల ఇక్కడ చాలా దారుణాలు జరగొచ్చు. ఎలాగూ బేరం లేదు. వర్షం వేరే పడబోతోంది. సో..... నువ్వు హోటల్ కట్టేసి త్వరగా వెళ్ళిపోడం బెటర్. లేదంటే తర్వాత నువ్వూ వుండవు. నీ హోటలూ వుండదు. నా మాటమీద నమ్మకం వుంటే చెప్పింది చెయ్యి" టీ సిప్ చేస్తూనే వాడ్ని హెచ్చరించాడు. ఖాళీగ్లాసు వాడి చేతికిచ్చి టు రుపీస్ కాయిన్ అందించాడు.

"చెప్పింది అర్థమైందా ?" బల్లమీంచి లేస్తూ అడిగాడు.

"అర్థమైంది సాబ్! ఇప్పుడే హోటల్ బంద్ చేస్తాను" చెప్పాడు వాడు.

"త్వరగా చెయ్యి" అంటూ తిరిగి చూడకుండా రోడ్ మీదకు వచ్చేశాడు.

టపటప రాలిన రెండు వానచినుకులు అతడి ముఖాన్ని తాకాయి. టైం చూశాడు. నాలుగున్నర కావస్తోంది. రోడ్ వెంట వందగజాలు ముందుకెళ్ళి ఒక శాలివృక్షం వెనక్కి చేరుకున్నాడు. సిగరెట్ ఆఖరి దమ్ములాగి అవతల పారేస్తూ రోడ్ ఎగువకు దృష్టి సారించాడు.

అంతే -

అతడి కళ్ళు ఉత్సాహంగా మెరిశాయి.

కారణం -

అతడి అంచనా నూటికి నూరుశాతం నిజమైంది. ఖాద్రి తన బలగంతో వచ్చిపడుతున్నాడు. దుమ్ము తెరలు రేపుతూ దూసుకొస్తున్నాయి అరడజను వాహనాలు

అదే సమయంలో -

మైదానం అవతల స్ట్రెయిట్‌గావున్న మరో రోడ్‌లో మలుపు తిరిగి ఇటుగా దూసుకొస్తూ కన్పించాయి మరికొన్ని వాహనాలు. సందేహం లేదు. అవి మాల్యాద్రి వాహనాలు. ఇక్కడలేని తన శత్రువు మన్సూర్ ఆలీకోసం ఖాద్రీ వచ్చిపడుతున్నాడు. ఖాద్రి అంతు తేల్చుకోడానికి మాల్యాద్రి దూసుకొస్తున్నాడు. రెండు పొట్టేళ్ళని తను ఉసిగొలిపి పోరాటంలోకి దించాడు. దీనిక్కారణం పొట్టేళ్ళమధ్య నక్కలా నలిగిపోడానిక్కాదు. తన పని చక్కబెట్టుకుపోడానికి. జరగబోయే యుద్ధారంభం కోసం చెట్టు చాటునుంచి ఉత్సాహంగా ఎదురుచూస్తున్నాడా యువకుడు.

అదే సమయంలో_

సన్నటి తుంపరజల్లు కాస్తా చినుకులుగా మారి తడిపొడి చినుకులతో వానజల్లు ఆరంభించింది. చూస్తుండగానే ఖాద్రి వాహనాలు రాకెట్ వేగంతో దూసుకొచ్చి మైదానంలోకి ఎంటరయ్యాయి. మైదానం మధ్యకుపోయి దుమ్ముతెరలు రేపుతూ ఆగాయి. సుమారు నలభైమంది దుక్కల్లా బలిసిన గూండాలు కోతులదండులా వాహనాల్లోంచి బయటకు దూకారు.

అటుచూస్తే వాన ఇటుచూస్తే గూండాల రాకతో ఇంకా మిగిలివున్న కొద్దిమంది పిల్లలు తారెత్తి మైదానం వదిలి పరుగులుతీశారు.

ఖాద్రి మనుషులు ఉత్తినే రాలేదు. వాళ్ళచేతుల్లో ఇనుపరాడ్‌లు, వేటకత్తులు, బరిశెలు మొదలయిన మారణాయుధాలున్నాయి. చింపిరిజుత్తు, పిల్లిగడ్డంతో పైజామా, జుబ్బాధరించిన వ్యక్తి మీద పడింది చెట్టుచాటు యువకుడి దృష్టి.

వాడే ఖాద్రి.

మోస్ట్ డేంజరస్ కిల్లర్.

వాడ్ని బయటకు రప్పించటం కోసమే మూడురోజులుగా ఇక్కడ తిరుగుతూ వర్కవుట్ చేసింది. ఖాద్రితోపాటు అతడి మనుషులు కూడా మన్సూర్ ఆలీకోసం చుట్టూ చూస్తున్నారు. వర్షాన్ని కూడా లెక్కచేయకుండా గమనిస్తున్నారు. ఖాద్రి కొందర్ని రోడ్ అవతల కాకా హోటల్, యస్.టి.డి. బూత్, షోడా బంక్‌లున్న చోటకు తరిమాడు. వర్షానికి ఆలీతోబాటు మిగిలినవాళ్ళు అక్కడ తలదాచుకున్నారేమోనన్న అనుమానంతో.

ఇక్కడే ఖాద్రి చిన్న పొరబాటు చేశాడు. మన్సూర్ ఆలీమీద పగ తీర్చుకునే ఆవేశంలో పరిసరాల్ని విస్మరించాడు.

అది కొద్దిసేపట్లోనే-

తన కొంప ముంచబోతుందన్న సంగతి ఆ క్షణంలో వాడికి తెలీదు. అందుకే మైదానం వెనకవైపుఎగువ రోడ్ నుంచి మాల్యాద్రి తన బలగంతో దిగుతున్నాడని ఎంతమాత్రం ఊహించలేకపోయాడు. అంతలో మైదానంలోకి ఎంటరవుతున్న వాహనాల్ని ఖాద్రి అనుచరుల్లో ఒకడు మాత్రం గమనించాడు. మరుక్షణం గొంతుచించుకుని అరిచాడు.

"మోసం....దగా..... మాల్యాద్రి మనుషులు వచ్చి పడుతున్నారు ఖాద్రిభాయ్....వచ్చేస్తున్నారు."

ఆ అరుపులు విన్న మరుక్షణం -

తోకతొక్కిన త్రాచులా చివ్వున తిరిగి చూశాడు ఖాద్రి. వాడితోబాటు మిగిలిన గూండాలంతా చూశారు. సర్రున ఆయుధాల్ని బయటికి తీశారు. ఆవేశంతో వూగిపోతున్నారు.

"ఆలోచించకన్నా. వేసేద్దాం నా కొడుకుల్ని. మాల్యాద్రిగాడ్ని ప్రాణాలతో వదలకూడదు" వెర్రెత్తి పోతూఅరిచాడొకడు.

"వేసేయండి. వచ్చినవాళ్ళలో ఒక్కడూ ప్రాణాలతో మైదానం దాటిపోకూడదు. గెట్ రెడీ!" అంటూ ఆదేశించాడు ఖాద్రి.

అంతలోనే -

ప్రతిపక్షం వాహనాలన్నీ వాననీటిని చెల్లాచెదురు చేస్తూ రివ్వు రివ్వున దూసుకొచ్చి అంత దూరంలో వరసగా ఆగాయి. వాటిలోంచి మిడతలదండులా కిందకు దూకుతున్నారు మాల్యాద్రి మనుషులు. మొదట వాహనం లోంచి నల్లగా, దుక్కలావున్న వ్యక్తి క్రిందకు దిగాడు. వాడే మాల్యాద్రి. వాడి చేతిలో తెల్ల త్రాచులా మెరుస్తోంది పొడవాటి కత్తి.వాడి కళ్ళు ఎర్రగా కాలిన చింతనిప్పుల్లా మెరుస్తున్నాయి.

"పొండిబే. ఈరోజుతో వాడో మనమో తేలిపోవాలి. నా కొడుకుల్ని ముక్కలుగా నరికి పోగులు పెట్టండి. మారో సాలే కో...." అని అరుస్తూ ఎలుగ్గొడ్డులా దూసుకొచ్చేశాడు ముందుకు.

ఫినిష్....

రెండు వర్గాలు ఒకరిమీదికి ఒకరు దూసుకొచ్చి కూలబడిపోయారు. అరుపులు , కేకలు , ఆర్తనాదాలతోఒకరిమీద ఒకరు దాడిచేసుకుంటూ దారుణమైన పోరాటంలో దిగిపోయారు.

ఒక పక్కన ఖాద్రి తన వాళ్ళని హెచ్చరిస్తూనే మాల్యాద్రి మనుషుల మీదికి రాక్షసుడిలా విజృంభిస్తున్నాడు. మరో ప్రక్కన మాల్యాద్రి ఖాద్రి మనుషుల్ని దొరికినవాడ్ని దొరికినట్టు కత్తికి బలిచేస్తున్నాడు. ఆ క్షణంలో మైదానంలో కురుస్తోంది వానకాదు. నెత్తుటి వాన. చూస్తూండగానే వాన నీళ్ళలో రక్తంకలిసి ఎర్రబారిపోతోంది.

పోరాటం ఆరంభమైన సరిగ్గా మూడో నిముషంలో తను దాగిన చెట్టు చాటునుంచి ఇవతలకు వచ్చాడా యువకుడు. కాలికొద్దీ మైదానంలోకి పరుగుతీశాడు. ఆ పరుగు చూస్తున్న వాళ్ళకు ఎడారి చిరుతపులి ఒకటి మైదానంలోకి వేగంగా దూసుకొస్తోందా అన్పించింది.

మెరుపు వేగంతో ప్రత్యర్థుల వాహనాల్ని సమీపించాడతను. అప్పటికే పదిమంది ప్రాణాలు ఎగిరిపోయాయి. తలకాయలు తెగి కాళ్ళు, చేతులు తెగి, పొట్టచీలి పేగులు బయటికొచ్చి నేలమీద పడున్న దృశ్యం బీభత్సంగా వుంది. కోడిపుంజుల్లా పోరాడుతున్న ఇరువర్గాలు కొత్తగాచేరిన ఈ యువకుడ్ని అస్సలు గమనించలేదు.

అతను వస్తూనే కిందపడున్న ఓ పట్టా కత్తిని అందుకున్నాడు. తన దారికి అడ్డం వస్తున్న వాళ్ళను నిర్దాక్షిణ్యంగా నరికిపారేస్తూ, వేగంగా ఖాద్రి వెనక్కి చేరాడు.

కుంభవృష్టిగా -

వర్షం పడుతూనే వుంది.

మైదానంలో వాన నీరు వరదగా ప్రవహిస్తోంది. నిలువునా తడుస్తున్నా ఎవరూ పోరాటం ఆపటంలేదు. అరుపులు, ఆర్తనాదాలు. చూస్తుండగానే మొదలునరికిన చెట్లలా కూలిపోతున్నారు.

"హలో మిస్టర్ ఖాద్రి..." ఆ యువకుడు పిలిచాడు.

అవతల తన మనుషులతో పోరాడుతున్న మాల్యాద్రి మీదికి దూసుకెళ్ళబోతూ ఆ పిలుపు విని సర్రున తిరిగి చూశాడు ఖాద్రి. చేతిలో పొడవాటి ఖడ్గంతో గ్రీకువీరుడిలా నిలబడుతున్న ఆ యువకుడ్ని చూసి నొసలు విరిచాడు వాడు. వాననీళ్ళు కళ్ళలోపడి స్పష్టంగా అతడ్ని చూళ్ళేకపోతున్నాడు. అతడ్ని ఎప్పుడూ ఎక్కడా చూసిన గుర్తుకూడా లేదు.

"ఎవర్నువ్వు ?" కత్తి నివాటంగా పట్టుకొని క్రూరంగా చూస్తూ అడిగాడు.

"ఆర్.డి.ఎక్స్.... మర్చిపోయావా ? మన్సూర్ ఆలీ గురించి ఉప్పందించింది నేనే."

"ఆ కుక్క కి బదులు మాల్యాద్రి ఎలా వచ్చాడు ?" ఎనుబోతులా అరిచాడు ఖాద్రి.

"చూశావ్‌గా ఎలా వచ్చాడో. నాటకం.... నిన్ను బయటికి రప్పించటంకోసం ఆడిన చిన్న నాటకం."

"తప్పుచేశావ్ బే! నీ ప్రాణాలు తోడేస్తా! ఖాద్రి అంటే ఏమనుకున్నావ్ రా....." అనరుస్తూ రెచ్చిపోయిన కోపంతో కత్తితో యువకుడి మీదకు దాడిచేశాడు ఖాద్రి.

వాడి కత్తి వేటుల్ని -

తన కత్తితో కాచుకుంటూ అడుగులు వెనక్కి సాగించాడా యువకుడు. పిచ్చికోపంతో రెచ్చిపోయివున్న ఖాద్రి ఆ కుర్రాడు భయపడే వెనక్కు పోతున్నాడనుకున్నాడు. రెట్టించిన కోపంతో ముందుకు రానారంభించాడు.

అయితే ఆ యువకుడు తెలివితక్కువగా అడుగులు వెనక్కి వేయలేదు. కావాలనే అలా అలా వాడ్ని నడిపిస్తూ వాహనాల వెనక ప్రాంతానికి తీసుకొచ్చేశాడు. కుండపోతగా పడుతున్న వర్షంలో తీవ్రపోరాటంలో మునిగివున్న ఇరువర్గాల్లో ఎవరూ వాళ్ళిద్దర్నీ గమనించలేదు. ఆ యువకుడు ఆశించింది అదే!

వాహనాల వెనక్కి వచ్చిన మరుక్షణం -

దారుణంగా విజృంభించాడు.

మూడే మూడు ఖడ్గ ప్రహారాలు.

నాలుగోదెబ్బకి ఖాద్రి చేతిలోని కత్తి తారాజువ్వలా ఎగిరి మూడుగజాల దూరంలో నేలను తాకి ధ్వజస్తంభంలా నిలబడింది తత్తరపడి చూస్తునంతలోనే ఆ యువకుడి కాలు హేమర్‌లా తాకింది వాడి గుండెల మీద.

పెద్ద కాంక్రీట్ పిల్లర్ ఏదో గుండెలమీద పడినంత బాధతో కంఠనాళాలు తెగిపోయేలా బిగ్గరగా అరుస్తూ వెనక్కి విరుచుకుపడిపోయాడు వాడు. పడ్డవాడు లేచేలోపల తన చేతిలో కత్తిని వాడి గుండెలమీద ఆన్చి ఎదురుగా నిలబడి క్రూరంగా చూశాడా యువకుడు.

ఆ క్షణంలో ఆ యువకుడ్ని చూసిన ఖాద్రి మృత్యువును చూస్తున్నంత భయంతో వణికిపోయాడు. అతను అసాధారణ యువకుడని అప్పటిగ్గానీ అర్థంకాలేదు. మార్షల్ ఆర్ట్స్‌లో అతను మాస్టరు, ఎత్తుకు పై ఎత్తులు వేయటంలో జిత్తులమారి నక్కను మించిన కుయుక్తులు తెలిసిన గడసరి. అతన్ని గుర్తుపట్టాలని ఖాద్రి బుర్ర ఎంతగా చించుకున్నా సాధ్యపడలేదు. అతడి మనసులో మాట తెలిసినట్టు క్రూరంగా నవ్వుతూ -

"నా గురించి ఆలోచించి బుర్ర పాడుచేసుకోకు. అడిగిన ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పు. నీకు బ్రతకాలనుందా ?" అన్నాడు.

అవునన్నట్టు -

చిన్నగా తలూపాడు వాడు.

"వెరీగుడ్! నువ్వు అబద్ధం చెప్పిన మరుక్షణం నీ తల పుచ్చకాయలా నేలమీద దొర్లుతుంది. అండర్ స్టాండ్ ?"

"అడుగు - నాకు తెలిసింది చెప్తాను."

"సరిగ్గా మూడు సంవత్సరాలక్రితం ఉత్తర ఢిల్లీలో.... రాయల్ అకాడమీ ఆఫ్ స్కూల్‌కి చెందిన ఒక స్కూలునుంచి ఆదిత్య ప్రతాప్ సింగ్ అనే ఆరేళ్ళ పసివాడు కిడ్నాప్‌కి గురయ్యాడు. బరోడా రాజవంశానికి చెందిన ఆ కుర్రాడి అపహరణలో ఐదుగురు దుండగులు ముఖ్యపాత్ర పోషించారు. వాళ్ళలో ఒకడివి నువ్వు. సరిగ్గా మూడేళ్ళ క్రితం గుర్తుందిగా ? ఆ కుర్రాడు ఎక్కడున్నాడు ? వాడ్ని ఏం చేశారు ?"

ఆ యువకుడి మాటలు వింటూ -

క్షణకాలం తనను తాను మర్చిపోయాడు ఖాద్రి. ఎందుకంటే తనే మర్చిపోయిన చాలాకాలం కిందటి సంగతి ఇది. ఈ మూడేళ్ళలో తనకి ఎంతో నేరచరిత్ర వుంది. దొంగలుపడ్డ ఆరుమాసాల తర్వాత కుక్కలు మొరిగినట్టు వీడెవడో ఇప్పుడు వచ్చి ఎంక్వయిరీ చేయటమేమిటి ? అసలు ఎవరీ యువకుడు ?

గుండెలమీద కత్తి చురుక్కుమనటంతో -

ఆలోచనలనుంచి బయటపడ్డాడు ఖాద్రి.

"నువ్వు ఆలస్యం చేసేకొద్దీ నీ ప్రాణం కత్తి అంచున వుంటుంది. సొంత ఆలోచనలు మాని సూటిగా బదులు చెప్పు. నాలుగువందల కోట్ల ఆస్తికి ఏకైక వారసుడు ఆదిత్య ప్రతాప్ సింగ్. ఆ బాలుడు ఇప్పుడెక్కడ ?" కళ్ళలోకి క్రూరంగా చూస్తూ అడిగాడు యువకుడు.

"తెలీదు" అన్నాడు అప్రయత్నంగా ఖాద్రి.

"ఏం తెలీదు ? ఆ పసివాడ్ని ఏం చేశారు ?"

"ఏం చేశారో నాకు తెలీదు. ప్రాణాలతో వుంచారో, చంపేశారో కూడా తెలీదు. ఇంతకాలం తర్వాత నువ్విలా నన్ను ట్రేస్ అవుట్ చేసి రావటమే నమ్మలేని నిజం. కానీ.... ఐయాం సారీ! పూర్తి వివరాలు నాకూ తెలీదు. ఆపరేషన్ కిడ్నాప్ పేరుతో ఆ పసివాడ్ని పకడ్బందీగా మేము అపహరించిన మాట నిజం. కానీ దానికి పథకరచన చేసింది మా ఐదుగురిలో ఎవరూకాదు. ఇంకా చెప్పాలంటే, ఐదుగురిలో ఏ ఇద్దరికో తప్ప మూడోవాడికి మిగిలినవాళ్ళ వివరాలు తెలీదు.

వివరంగా చెప్పాలంటే, నన్ను కాంటాక్ట్ చేసింది ఆ గ్రామానికి చెందిన బడేభాయ్. స్థానికంగా ఢిల్లీవాసిని గనక కిడ్నాప్ కి కావలసిన ఏర్పాట్లు సమకూర్చటం, వాళ్ళతో పాలుపంచుకోవటం నా బాధ్యత. అలాగే బడేభాయ్‌ని మరొకడు, వాడ్ని ఇంకొకడు కలుపుకున్నారు. కాబట్టి బడేమియా తప్ప మిగిలినవాళ్ళు నాకు తెలీదు. బడేమియాకు నేను తెలుసు. వాడ్ని కాంటాక్ట్ చేసినవాడు తెలుసు.

కానీ ఆ వివరాలు నాకు తెలీదు. ఆ పథకం వెనక సూత్రధారి ఎవరోగాని వెరీ క్లవర్. చాలా జాగ్రత్తగా ప్లాన్ చేశాడు. ఐదులక్షల కాంటాక్టు గాబట్టి స్వయంగా నేనే వాళ్ళతో చేతులు కలిపి కుర్రాడ్ని కిడ్నాప్ చేశాం. దారిలో మమ్మల్ని అక్కడక్కడ దించేసి డ్రయివరు కుర్రాడితో వెళ్ళిపోయాడు. తర్వాత ఏం జరిగిందో ఇంతవరకూ తెలీదు. తెలుసుకోవలసిన అవసరం కూడా నాకు లేదు" అంటూ తనకు తెలిసింది వివరించాడు ఖాద్రి.

ఆ యువకుడు అసహనంగా చూశాడు వాడ్ని.

"నువ్వు చెప్పింది నిజం కాకపోతే ఏం జరుగుతుందో తెలుసా ?" క్రూరంగా హెచ్చరించాడు.

"నాకు తెలిసిన నిజం అదే" స్థిరంగా చెప్పాడు ఖాద్రి.

"ప్రస్తుతం బడేమియా ఆ గ్రామంలోనే వున్నాడా ?"

"వాడు ఆ గ్రామం వదిలి ఎక్కడికీ పోడు."

"ఓ.కె." అంటూ వాడి గుండెలమీంచి కత్తి తీసి వెనుతిరిగాడు అతను.

మరుక్షణం తుపాకీ తూటాలా దూసుకొచ్చింది ఖాద్రి ప్రశ్న.

"ఎవర్నువ్వు ?" అంటూ.

"విశ్వా...." ఓరగా తలతిప్పి చూస్తూ కూల్ గా చెప్పాడతను.

"విశ్వనాథ్ నా పేరు. కావలసినాళ్ళు విశ్వా అని పిలుస్తారు. పూర్వాశ్రమంలో లాయర్ ని. ప్రస్తుతం ప్రైవేట్ డిటెక్టివ్ ని. చాలా...." అంటూ ముందుకు పోతుండగా, ఎనుబోతులా అతని దారికి అడ్డు వచ్చేశాడు మాల్యాద్రి. ఎంతమందిని హతమార్చాడోగానీ మృత్యుదూతలా వున్నాడు వాడు.

విశ్వనాథ్‌ని చూస్తూనే నొసలు విరుస్తూ - "ఎవర్నువ్వు... ?" అనరిచాడు.

"ఆర్. డి. ఎక్స్.... మీకు ఉప్పందించిన ఆర్. డి.ఎక్స్. ఓ.కె. నీ శత్రువు ఇక్కడే వున్నాడు వెళ్ళి తేల్చుకో" అంటూ అప్పుడే లేచి నిలబడి కత్తి అందుకుంటున్న ఖాద్రిని చూపించాడు. అంతలో ఆగకుండా ఇక అక్కడ తనకు పనిలేనట్టు కత్తి అవతలకు విసిరిపడేసి , మైదానానికి అడ్డంపడి తూర్పు దిక్కుగా అడుగులేశాడు.

వెనకనుంచి -

ఖాద్రి , మాల్యాద్రిల పోరాటానికి గుర్తుగా కత్తులమోత వినబడుతోంది. పాతిక అడుగులు వేసేలోపల ఖాద్రి చావుకేక దారుణంగా విన్పించింది.

సందేహం లేదు. మాల్యాద్రి వాడ్ని బ్రతకనివ్వడు.

తలతిప్పి కూడా వెనక్కి చూడలేదు విశ్వనాథ్. హోరున వర్షంలో తడుస్తూ మైదానం అవతల రోడ్ ఎక్కాడు.

అప్పటికి ఎగువ నుంచి పోలీస్ వాహనాల రాకను సూచిస్తూ సైరన్లమ్రోత విన్పించింది. మైదానం మధ్యలో పోరాటంలోవున్న రెండు వర్గాల్లోనూ కలకలం ఏర్పడింది. చచ్చినవాళ్ళు చావగా, గాయాలతో రోదనపెడుతూ కిందపడి దొర్లుతున్న వాళ్ళు పోగా, మిగిలినవాళ్ళు చట్రాతికి కొట్టిన చిల్లపెంకుల్లా పరుగులు తీశారు. వాహనాలు మైదానం వదిలి దూసుకుపోనారంభించాయి.

ఇక అక్కడ ఆగలేదు విశ్వనాథ్.

పదడుగుల దూరంలో చెట్టుక్రింద నిలబడున్న తన కారును చేరుకుని ఎక్కి కూర్చున్నాడు. అది ఏ మోడల్ కారో చెప్పడం కష్టం. చూడటానికి బీసీనాటి డొక్కు కారులా వుంది. కానీ దాని ఇంజన్ పవర్ తెలిసిన వాళ్ళెవరూ ఆ కారుతో పోటీపడటానికి సాహసించరు.

అటునుంచి పోలీసు వాహనాలు మైదానంలోకి ఎంటరవుతుండగా ఇటు నుంచి విశ్వనాథ్ కారు మెరుపు వేగంతో ఆ ప్రాంతంనుంచి అదృశ్యమైంది.

పై సంఘటన జరిగిన -

సరిగ్గా మూడురోజుల తర్వాత.

ఆగ్రా!

అందాల సిటీ ఆగ్రాలో -

యమునానదీ తీర ప్రాంతం.

అది ఒక ఫైవ్ స్టార్ హోటల్. ఖరీదైనఆ హోటల్ తూర్పు భాగంలో ఒక సూట్. అక్కడ కిటికీ పక్కన రిలాక్స్‌గా కూర్చుని విస్కీ సిప్ చేస్తున్నాడు విశ్వనాథ్.

అప్పుడు సమయం రాత్రి పదిగంటలు.

పున్నమిరాత్రి.....

మబ్బులేని ఆకాశంలో వెండి పళ్ళెంలా మెరుస్తున్నాడు చంద్రుడు. రాత్రిపూట వెన్నెట్లో ఆగ్రా సిటీ అందాలు కనువిందు చేస్తున్నాయి... ముఖ్యంగా దగ్గరలోని తాజ్ మహల్ వెన్నెల్లో మెరిసిపోతూ ఎంత చూసినా తనివితీరటం లేదు.

అలా చూస్తూనే వున్నాడు విశ్వనాథ్.

అంతలో చిన్నగా అలికిడి అయింది. అటుచూసిన విశ్వనాథ్ కి రూం సర్వీస్ బోయ్ కన్పించాడు. వాడు దగ్గరకొచ్చి వినయంగా చెప్పాడు.

"సాబ్! మీరు చెప్పిన మీల్స్ ఐటమ్స్ అన్నీ టేబిల్ మీద ఉంచాను. వేరే ఏమైనా కావాలా ?"

"అక్కర్లేదు" అంటూ గ్లాసులో మిగిలిన విస్కీని గొంతులో పోసుకుని వాడ్ని దగ్గరకు రమ్మని సైగ చేశాడు.

"చెప్పండి సాబ్" మరికాస్త దగ్గరగా వచ్చి అడిగాడు వాడు.

"అక్కడ నీకు ఏం కనిపిస్తోంది ?" చేయిచాపి కిటికీ గుండా బయటకు చూపిస్తూ అడిగాడు.

"కన్పిస్తోంది సాబ్! అది ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సుందరకట్టడం. తాజ్ మహల్!"

"నీకు తాజ్ మహల్ తప్ప ఇంకేమీ కన్పించటంలేదా ?"

"లేదు సాబ్!"

"నాకు తాజ్ మహల్‌తో బాటు అమర ప్రేమికులయిన షాజహాన్, ముంతాజ్ బేగంల ఆత్మలు కన్పిస్తున్నాయి. తాజ్ మహల్ వున్నంతవరకూ వారి ప్రేమ నిలిచే వుంటుంది."

"అవున్సాబ్! అంత గొప్ప ప్రేమికులు ఇక పుట్టరు. పుట్టబోరు."

"పొరపాటు. గొప్ప ప్రేమికులు పుడుతూనే వున్నారు. ప్రేమించుకొంటూనే వున్నారు. కాదంటే తాజ్ మహల్ వంటికట్టడాన్ని కట్టి ఎవడూ తన ప్రేయసికి అంకితం ఇవ్వలేకపోయాడు."

"ఇది కరక్టు సాబ్! నే వెళుతున్నాను. అవసరమైతే రూం సర్వీస్ కి ఫోన్ చేయండి సాబ్" చెప్పి వాడు వెళ్ళిపోయాడు.

విశ్వనాథ్ మరో పెగ్గు విస్కీ కలుపుకున్నాడు.

అతడి ఆలోచనలు.

సరిగ్గా వారం రోజులు వెనక్కి మళ్ళాయి.

## 2

తమ డైనమిక్ సెక్యూరిటీ ఆఫీసు బిల్డింగుముందు ఆటో దిగాడు వాత్సవ.

"మళ్ళీ ఎక్కడికైనా వెళ్ళాలా ? వెయిట్ చేయమంటారా సార్ ?" వాత్సవ అందించిన నోటుని భద్రంగా జేబులోకి తోస్తూ అడిగాడు ఆటో రిక్షావాలా.

"వద్దు బ్రదర్! నీ పని చూసుకో" అంటూ మరో మాటకి అవకాశం ఇవ్వకుండా రెండో అంతస్థులోని తమ ఆఫీసు మెట్లమీదికి వెళ్ళిపోయాడు వాత్సవ.

అతనితో మరికొంతసేపు తిరిగితే బాగుండు అనిపిస్తోంది ఆటోవాలాకి. వాత్సవ సాబ్ కి సవారీ కట్టడం తన అదృష్టంగానే భావిస్తున్నాడతను. ఆయన వద్దన్నందుకు ఇంతే అనుకుని భారంగా నిట్టూర్చి ఆటో స్టార్ట్ చేశాడు.

ఆతగాడు అలా అనుకోవడంలో ఆశ్చర్యం ఏమీలేదు. ఉదయం పదకొండు గంటలనుంచి ఆ ఆటోలోనే తన పనులు చక్కబెట్టుకుని వచ్చాడు వాత్సవ.

ఇప్పుడు సమయం సాయంత్రం నాలుగు గంటలు. ఒకసారి వాత్సవను ఆటో ఎక్కించుకుంటే, మరో సవారీ గురించి ఆలోచించడు ఏ ఆటోవాలా అయినా. వాత్సవ ట్రీట్ మెంట్ అలాంటిది.

వాత్సవ లోనికి రావటం చూసి కంప్యూటర్ ముందు చేస్తున్న పని ఆపి లేచివచ్చింది సెక్రటరీ వాసంతి.

"శ్యామ్ సుందర్ ఎక్కడ ?" సరాసరి వచ్చి తన సీట్లో కూర్చుంటూనే అడిగాడు వాత్సవ.

"మధ్యాహ్నం రెండుగంటలవరకు ఇక్కడే వున్నాడు. రెండూ పది నిముషాలకి ఎవరో ఫోన్ చేశారు. ఇప్పుడే ఓ గంటలో వచ్చేస్తానంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు. ఇంతవరకు రాలేదు" చెప్పింది వాసంతి.

"ఫోన్ చేసింది ఎవరు.... ?" నొసలు ముడివేస్తూ అడిగాడు వాత్సవ.

పెదవి విరిచింది వాసంతి.

"అతను చెప్పలేదు. నేనడిగే ఛాన్స్ కూడా ఇవ్వకుండానే వెళ్ళిపోయాడు. ఇంతవరకు మెస్సేజి లేదు. చాలా అలసిపోయినట్టున్నావ్. ఈ రిపోర్టులు చూస్తుండు. నీకోసం స్పెషల్ ఛాయ్ తీసుకొస్తాను" అంటూ రిపోర్టు ఫైల్‌ని అతని ముందుంచి కిచెన్ లోకి వెళ్ళింది వాసంతి.

ఫైలు ఓపెన్ చేశాడు వాత్సవ.

రిపోర్టు కాగితాలమీదికి దృష్టి సారించేలోపలే బయట అలికిడి అయింది. తలెత్తి చూశాడు వాత్సవ. కరచరణాల ఆర్నమెంట్స్ చక్కని సౌండ్స్ ఇస్తుండగా ఒక యువతి వీనస్‌లా ఆఫీస్ లోకి అడుగుపెడుతూ కన్పించింది. ఆమె అటూ ఇటూ చూసి సుడిగాలిలా వాత్సవ రూం గ్లాస్ డోర్ నెట్టుకుని సరాసరి లోపలికి వచ్చేసింది.

ఎలాంటి మగాడయినా సరే థ్రిల్ అయిపోయే సూపర్ పర్సనాలిటీ ఆమెది. చాలా హై సొసైటీ అమ్మాయని చూడగానే చెప్పొచ్చు.

అంతేకాదు.

ఆమె డ్రస్ తీరు చూస్తుంటే ఏదో వెడ్డింగ్ సెరమనీ నుంచి బర్త్ డే పార్టీనుండి సరాసరి ఆఫీసుకు వస్తున్నట్టుగా అన్పిస్తోంది. చాలా ఖరీదైన కళ్ళను జిగేల్ మన్పించే దుస్తులు, అంతకుమించి కళ్ళు మిరుమిట్లు గొలిపే ఖరీదైన వజ్రవైడూర్యాలతోకూడిన ఆభరణాలు ఆమె వంటి మీద వున్నాయి. ఆమె నడక తీరు చూస్తే, మద్యం సేవించి వున్నట్లు అర్థం అవుతోంది. ఆమె వాత్సవ టేబిల్ ముందు నిలబడి అతన్ని చూస్తూ -"నేను మిస్టర్ వాత్సవను చూడాలి" అంది.

"చెప్పండి మేడమ్! నేనే వాత్సవని. ప్లీజ్ సిడౌన్" ఎదురుగా సీటు చూపించాడు.

సీట్లో కూర్చుంటూ ఓసారి చుట్టూ చూసిందామె.

"స్టాఫ్ ఎవరూ కన్పించటంలేదు. ఇది డైనమిక్ సెక్యూరిటీ సర్వీసెస్ ఆఫీసేనా ?" అనుమానంగా అడిగింది.

ఆమె ముఖంలో భావాల్ని , ఆమె మాటల్ని గమనిస్తూ చిన్నగా నవ్వాడు వాత్సవ.

"మీరు వచ్చింది సరైన అడ్రస్ కే. ఇది పోలీస్ స్టేషన్ కాదు. డైనమిక్ సెక్యూరిటీ కన్సల్టింగ్ సర్వీసెస్ ఆఫీస్. మా స్టాఫ్ ఫీల్డ్ వర్క్ లో తిరుగుతూంటారు కాబట్టి ఎవరు ఎప్పుడొస్తారో, ఎప్పుడు వెళతారో చెప్పలేం. సో.... వాటబవుట్ యు..... మీ పేరు.... వివరాలు..... ప్రాబ్లం...."

"ప్రాబ్లం.... యస్.... ప్రాబ్లం స్టార్టయి ఒకటి కాదు, రెండు కాదు, మూడేళ్ళయింది. ఇవాళ మా తాతగారు నన్ను నిందించారు. ఆస్తికోసం నా తమ్ముడ్ని నేనే కిడ్నాప్ చేయించి ఏదో చేయించానని. నా పుట్టినరోజున ఆయన మాటలు నేను చచ్చిపోవాలన్నంతగా నన్ను హర్ట్ చేశాయి. నా కష్టం మీతో చెప్పుకోవాలని బ్రతికేవున్నాను" అంటూ ఉన్నట్టుండి రెండు చేతులతో ముఖం కప్పుకుని ఏడ్చేసిందామె.

కిచెన్ లో వున్న వాసంతి అంతా గమనిస్తూనే వుంది. ఆమె పొగలు గక్కుతున్న చాయ్‌ని అందమైన కప్పులో తెచ్చి వాత్సవ ముందు ఉంచింది. వాత్సవ కనుసైగను అర్థం చేసుకుని తను ఆ యువతి భుజంమీద చేయి వేసింది.

చివ్వున తలెత్తి చూసిందామె. మంచి ముత్యాల్లా జలజలారాలుతున్న కన్నీటిని కూడా తుడుచుకోకుండా చూసింది.

"మీరు నాతో రండి. ఫ్రెషప్ అయి రిలాక్సయితేగానీ మీరు సరిగా మాట్లాడగలిగేస్థితిలో లేరు. ప్లీజ్. కం విత్ మి" రిక్వెస్ట్ చేసింది వాసంతి.

కాదనలేదామె.

మౌనంగా వాసంతి వెంట లోపలికి అడుగులు వేసింది. ఇలాంటి సందర్భంలో వాసంతి ఎంత చక్కగా ట్రీట్ చేస్తుందో, వాత్సవకు బాగా తెలుసు. అతని అంచనా కరక్టే. సరిగ్గా పావుగంట తర్వాత చాలా ప్రశాంతమైన ముఖంతో వాసంతి వెంటవచ్చి సీట్లో కూర్చుంది ఆ యువతి. ఈ లోపల చాయ్ తాగి ఒక సిగరెట్ కూడా వూదిపారేశాడు వాత్సవ.

ఆ యువతిని వాత్సవ ఎదురుగా కూర్చుండజేశాక అక్కడ ఆగలేదు వాసంతి. అవతలి తన గ్లాస్ రూంలోకి వెళ్ళి తన సీట్లో కూర్చుంటూ సౌండ్ సిస్టం ఆన్ చేసింది. దాంతో వాత్సవ ఎన్ క్లౌజర్ లో చీమ చిటుక్కుమన్నా ఆమెకు విన్పించటమే కాదు. మొత్తం సంభాషణ రికార్డవుతోంది.

"వెల్....ఆర్ యు ఓ.కె ?" ఆలోచిస్తూ అడిగాడు వాత్సవ.

"యస్! ఐయాం ఓ.కె" అంది క్లుప్తంగా. లిక్కర్ ఎఫెక్ట్ నుంచి ఆమె బయటపడిందని చూడగానే అర్థమవుతోంది.

"సో....ఇప్పుడు చెప్పండి" అడిగాడు.

"నా పేరు భానుమతి. నా వయసు ఇరవై అయిదు. బరోడా రాజవంశానికి చెందిన అమ్మాయిని....." చాలా ప్రశాంతంగా అనౌన్స్ చేసిందామె.

ఆ మాటలు విని ఆశ్చర్యపోలేదు వాత్సవ. ఖచ్చితంగా అలాంటి గొప్ప వంశానికి చెందిన యువతే అయి వుండవచ్చునని ముందుగానే వూహించాడు.

"దెన్....ప్రాబ్లంఏమిటి ?" అడిగాడు.

"ప్రాబ్లం ఇప్పుడు స్టార్ట్ కాలేదు. మూడుసంవత్సరాల క్రితం స్టార్టయింది."

"కాస్త వివరంగా చెప్పండి."

"మీరు నాకు తెలీదు. మీ యాక్టివిటీస్ అంతకన్నా తెలీదు. కాని ఈ విషయంలో నాకు సాయం చేస్తారన్న కొండంత నమ్మకంతో వచ్చాను. " నాకు ఇలా నమ్మకం కలిగించిన పర్సన్ మీకు తెలుసు. అది నా ఫ్రెండ్ కంప్యూటర్ ఇంజనీర్ శ్రావణి. కర్ణాటకు చెందిన మిలియనీర్ కూతురు."

ఆ మాటలు వినగానే చిన్నగా నవ్వాడు వాత్సవ. అతని కళ్ళ ముందు మెదిలింది శ్రావణి అనే అమ్మాయి. కంప్యూటర్ ద్వారా గగన తలంలోని శాటిలైట్స్ నితన ఆధీనంలోకి తెచ్చుకుని ప్రపంచ దేశాల్ని బ్లాక్ మెయిల్ చేయాలనుకున్న స్వార్థపరుడు భజరంగదాస్ అనే క్రిమినల్ చేతిలో చిక్కుబడిన శ్రావణిని, ఆమెతోబాటు ఇంకో ముగ్గురు కంప్యూటర్ ఇంజనీర్లయిన యువతుల్ని రక్షించటానికి తాముపడ్డ పాట్లు కూడా వాత్సవకు ఆ క్షణంలో గుర్తుకొచ్చాయి. శ్రావణి ఈమెను తన వద్దకు వెళ్ళమని సలహా ఇవ్వటంలో ఆశ్చర్యం ఏమీలేదు. అందుకే ఆ విషయానికి అంతగా ప్రాధాన్యత నివ్వకుండా -

"ఓ.కె. మేడం! మీ ప్రాబ్లమ్ ని వివరంగా చెప్పండి... అప్పుడే మాకు సాధ్యపడుతుంది.... మేం నీకు సాయం చేయగలమా లేదా అనే విషయం."

"మీరు సాయం చేయాలి తప్పదు. వివరంగా చెప్తాను" అంటూ టేబిల్ మీది గ్లాసు అందుకొని కొద్దిగా వాటర్ తాగింది.

"మా తాతగారి పేరు ఆదిత్య ప్రతాప్ సింగ్ , మా తండ్రిగారి పేరు విజయప్రతాప్ సింగ్. ఆయన మొదటి భార్య పేరు శ్యామలాదేవి. ఆమెకు సంతానం కలక్కపోవడంతో అంజనాదేవిని రెండో భార్యగా వివాహం చేసుకున్నాడు. నా తల్లిగారు అంజనాదేవి. నేను పుట్టిన పదహారు సంవత్సరాలవరకు ఆస్తికి నేనే వారసురాల్ని అనుకున్నారంతా. కానీ అది నిజం కాలేదు. ఇక పిల్లలే పుట్టరనుకున్న మా పెద్దమ్మ శ్యామలాదేవి గర్భం ధరించి పండులాంటి బిడ్డను కని కన్ను మూసింది. మరో రెండేళ్ళ తర్వాత ఒక ప్రమాదంలో మా తండ్రిగారు గతించారు. దాంతో నాలుగువందల కోట్ల ఆస్థికి వారసుడైన మనవడిని పెంచే బాధ్యతని తన భుజాలకు ఎత్తుకున్నారు మా తాతయ్య!" చెప్పటం ఆపి క్షణకాలం చూసింది భానుమతి.

ఆమె చెప్తున్న విషయాల్ని శ్రద్ధగా వింటున్నాడు వాత్సవ.

తన మాటల్ని తిరిగి కంటిన్యూ చేసిందామె.

" ఆస్తికి దాయాదులున్నారు. తమ్ముడు పుట్టి వుండకపోతే ఆస్తి ఏదో విధంగా కబళించే వంచకులకు తక్కువలేరు. కాబట్టి పసివాడికి అటువంటి వారినుండి ఏదైనా ప్రమాదం ఎదురుకావచ్చని వూహించి చాలా జాగ్రత్తలు తీసుకున్నారు తాతయ్య. తమ్ముడికి ఆరో సంవత్సరం వచ్చేసరికి సిటీలోనే ఖరీదైన స్కూలు రాయల్ అకాడమీ ఆఫ్ స్కూల్స్ లో చదువుకుంటున్నాడు. వాడికి సెక్యూరిటీగా నలుగురు గార్డ్స్ నియమించబడ్డారు. ఇక ఆ స్కూల్లో చాలా ముఖ్యమైన గొప్ప వాళ్ళ పిల్లలు చదువుతారు కాబట్టి స్కూలుకి కట్టుదిట్టమైన సెక్యూరిటీ వుంది. ఇన్ని వున్నప్పటికీ దుండగులు నంబర్ ప్లేట్ లేని వేన్ లో స్కూలు ఆవరణలోకి జొరబడి ఆరేళ్ళున్న తమ్ముడ్ని కిడ్నాప్ చేశారు. ఆ సందర్భంగా తమ్ముడికి సెక్యూరిటీవున్న నలుగురు , స్కూలు గార్డ్స్ నలుగురు ఎనిమిదిమంది ఆగంతకుల రివాల్వర్లకు బలయిపోయారు. కిడ్నాపర్స్ అయిదుగురూ ముఖాలకు మాస్క్ లు తగిలించుకోవడంచేత వాళ్ళని ఐడెంటిటీ చేయటం సాధ్యం కాలేదు. ఇది మూడేళ్ళ కిందటి మాట!" అంటూ చెప్పడం ఆపింది భానుమతి.

ఒకసారి చదివితే మర్చిపోయే అలవాటు వాత్సవకు లేదు. ఆమె మాటలు వినగానే అతడి మస్తిష్కంలో గిర్రున తిరిగి నిలిచాయి. మూడేళ్ళక్రితం సంచలనం కలిగిస్తూ న్యూస్ పేపర్స్‌లో వచ్చిన ఛైల్డ్ కిడ్నాప్‌కి సంబంధించిన వార్త. ఆ కేసు తమ డైనమిక్ సెక్యూరిటీ సర్వీసెస్ కి రాలేదు. పోలీసులు ఇన్వెస్టిగేషన్ సాగించారు. ఒకరిద్దరు ప్రైవేట్ డిటెక్టివ్ లు కూడా పరిశోధించి చేతకాక చేతులెత్తేశారు. తర్వాత ఏం జరిగిందో తమకి తెలీదు. మూడేళ్ళ తర్వాత ఇప్పుడు ఆ కేసు తమ ముందుకురావటం ఆశ్చర్యంగానే వుంది.

" వెరీ ఇంట్రస్టింగ్! ఆ కుర్రాడు... ఐమీన్ మీ తమ్ముడు సేఫ్‌గా వుండివుంటే ప్రస్తుతం ఆ బోయ్‌కి తొమ్మిది సంవత్సరాల వయసు. యామై కరెక్ట్ ?" అడిగాడు.

"యస్.... అంతా మిస్టరీగానే వుండిపోయింది. కిడ్నాపర్స్ ఎవరో, ఎందుకు కిడ్నాప్ చేశారో తెలీదు. తమ డిమాండ్స్ కూడా తెలపలేదు. పోలీసులు, డిటెక్టివ్ లు అంతా చేతులెత్తేశారు. ఒకవిధంగా చెప్పాలంటే మా తాతగారు కూడా ఆశ వదులుకున్నారనే చెప్పాలి. మనవడ్ని పోగొట్టుకున్న బాధ ఆయన గుండెల్లో గూడుకట్టుకునుంది. ఆ బాధని అర్థం చేసుకోగలను. ఆ మాటకొస్తే ఒక్కగానొక్క తమ్ముడు దూరమైనందుకు ఎంతగానో కుమిలిపోయాను. అయితే ఇవాళ జరిగింది వేరు.

ఇవాళ నా పుట్టినరోజు. బర్త్ డేకి గ్రాండ్‌గా ఏర్పాట్లు చేశారు మమ్మి. వాడుక ప్రకారం తాతయ్యను కూడా ఆహ్వానించాం. బర్త్ డేకేక్ కట్ చేసిన సంతోషం పదినిముషాలు కూడా మిగల్లేదు. చిన్న విషయానికి నాతో గొడవ పెట్టుకున్నారు. ఆస్తి కోసం తమ్ముడ్ని నేనే కిడ్నాప్ చేయించి ఏదో చేశానని నామీద నింద వేశారు. మనసులో మాటని బయటపెట్టేశారు. తట్టుకోలేకపోయాను. అందుకు కాస్త ఎక్కువే మందు పుచ్చుకున్నాను. నా బర్త్ డేకి రావటం వీలుకాక ఫోన్ చేసింది శ్రావణి. దాంతో నా బాధ చెప్పుకోగానే అది వెంటనే మీ వివరాలు అందించింది.

నామీద మచ్చపడింది మిష్టర్ వాత్సవ. అది పోవాలంటే డెడ్ ఆర్ ఎలైవ్ నా తమ్ముడి ఆచూకీ తెలియాలి. మీరు నాకీ సాయం చేయకతప్పదు. మీ ఫీజు రెట్టింపు ఇచ్చుకుంటాను. కిడ్నాప్‌కి ఆ రోజు లభించిన ఆధారాలు ఈ ఫోటోలు మాత్రమే. స్కూలు వరండాలో ఫిక్స్ చేసిన వీడియో కెమేరా ఆ సంఘటనని రికార్డు చేసింది. అందులోంచి తీసిన ఫోటోలివి. సీ దిస్!..." అంటూ తన హేండ్ బేగ్ ఓపెన్ చేసి సుమారు ఇరవై ఫోటోగ్రాఫ్స్‌ని వాత్సవ ముందుంచింది భానుమతి.

ఆ ఫోటోలన్నీ జాగ్రత్తగా గమనించాడు వాత్సవ. కిడ్నాప్ కి గురైనబాలుడు ఆదిత్య ప్రతాప్ సింగ్ ఫోటోకూడా స్పష్టంగా వుంది. వేన్ డ్రైవర్‌తో సహా కిడ్నాపర్స్ అయిదుగురు. వాళ్ళంతా మంకీ కేప్స్ ధరించటం వలన ముఖాలు గుర్తించటం అస్సలు వీలుకావటం లేదు. కుర్రాడ్ని వేన్ లోకి విసరటం, గార్డుల్ని షూట్ చేయటం వివిధ దశల్లో సంఘటనలు ఆ ఫోటోల్లో క్లియర్‌గా వుంది.

ఒకటికి రెండుసార్లు క్లోజ్‌గా ఆ ఫోటోల్ని పరిశీలించాక తిరిగి ఆమెకు ఇవ్వబోతూ మెరుపులా ఏదో ఫ్లాష్ కావటంతో ఆగాడు వాత్సవ. తిరిగి చకచకా ఆ ఫోటోలను చూస్తూ ఒక ఫోటోను తీసి పక్కన పెట్టాడు.

వేన్ మూవ్ అవుతుండగా -

చివరిగా డోర్ మీద చేయివేసి లోపలకు జంప్ చేస్తున్న ముసుగు వ్యక్తి ఆ ఫోటోలో వున్నాడు. డోర్ మీద అతని చేయి అస్పష్టంగా వుంది.

వాత్సవ రెడ్ ఇంక్ స్కెచ్ పెన్ తీసుకుని ఆ చేతిభాగం చుట్టూ రౌండ్ చుట్టి వాసంతికి సైగచేశాడు. క్షణంకూడా ఆలస్యం చేయకుండా లోపలికి వచ్చిందామె. ఫోటోని ఆమె చేతికిచ్చాడు వాత్సవ.

"రౌండ్ చేసిన ప్రాంతం ఎన్లార్జ్ కావాలి. మన రీ కాపీయింగ్ మిషన్‌లో మేగ్జిమమ్ ఎన్లార్జ్ చేసి తీసుకురా!" అంటూ సూచించాడు.

వాసంతి అక్కడ్నుంచి వేగంగా వెళ్ళిపోయింది.

"ఏదన్నా క్లూ దొరికిందా.... ?" ఆశ్చర్యాన్ని అణచుకుంటూ ఉద్వేగంగా అడిగింది భానుమతి.

"సారీ! ఇప్పుడే ఏమీ చెప్పలేను. లెటజ్ సీ! మూడేళ్ళుగా పోలీసులు, డిటెక్టివ్ లు పరిశీలించినవే ఈ ఫోటోలు. అంచేత వాళ్ళకి కనపడని క్లూస్ ఏవో నాకు కన్పించాయని మీరు ఎక్కువగా వూహించుకోవద్దు" హెచ్చరించాడు వాత్సవ.

"యూ నో.... నాకు అడ్వంచర్స్ అంటే చాలా ఇష్టం. అప్పుడప్పుడూ అన్పించేది, నా తమ్ముడ్ని నేనే వెదికి పట్టుకుంటే ఎలా ఉంటుందని!" ఉత్సాహంగా చెప్పిందామె.

"ఇట్స్ ఫన్నీ.... ఎలా పట్టుకుందామనుకున్నారు ?"

"లుక్ మిష్టర్ వాత్సవ! నాలో ప్రవహించేది సాధారణ రక్తం కాదు. రాచకన్యను. బరోడా వంశపు నెత్తురు నాలో ప్రవహిస్తోంది. సాహసాలకు, శౌర్యప్రతాపాలకు మా వంశం పెట్టింది పేరు. ఇప్పుడు మామూలు ఆడపిల్లలా కనిపిస్తున్నానని తక్కువ అంచనా వేయకండి. హార్స్ రైడింగ్ వచ్చు. కరాటేలో బ్లాక్ బెల్ట్ హోల్డర్‌ని. అన్యాయాన్ని కాలర్ పట్టి నిలదీసే దమ్ము, ధైర్యంవున్న యువతిని."

"వెరీగుడ్! కీపిటప్. వన్ మినిట్!" అంటూ అప్పుడే లోపలికి వస్తున్న వాసంతివంక చూశాడు.

ఆమె ముఖం ట్యూబ్ లైట్ లా వెలిగిపోతోంది. చేతిలో జిరాక్స్ కాపీని అతని ముందు పరుస్తూ, "నీ ఊహ నూటికి నూరుశాతం నిజమైంది. ఆ చేతికి నాలుగువేళ్ళే వున్నాయి. చిటికెన వేలు లేదు!" అంది.

వాత్సవ చెప్పకుండానే అతని అభిప్రాయాన్ని గ్రహించిన వాసంతి తెలివితేటలకి భానుమతి మరోసారి ఆశ్చర్య చకిత అయింది. అంతేకాదు. ఇంతవరకు చీమ తలకాయంత కూడా క్లూ దొరకని ఈ కిడ్నాపింగ్ నేరంలో వాత్సవ దగ్గరకొచ్చిన కొద్దిసేపటిలోనే క్లూ లభించినందుకు ఆమె ముఖం కాంతివంతమైంది.

వాత్సవ ఆ జిరాక్స్ కాపీని పరిశీలించాడు.

కారు డోర్ మీదవున్న దుండగుడి చేతికి నాలుగువేళ్ళే వున్నాయి. చిటికెన వేలు లేదు. ఎప్పుడో తెగిపోయి వుండాలి. అతను అడిగేవరకూ వెయిట్ చేయలేదు వాసంతి. లోనకు వెళ్ళి సిటీలోని టాప్ క్రిమినల్స్‌కి సంబంధించిన ఫైల్‌ని అతని ముందుకు తీసుకువచ్చింది.

"నా ఉద్దేశం కరక్టయితే.... ఖచ్చితంగా వీడు ఖాద్రి అయి వుండాలి" అన్నాడు వాసంతితో.

అతడి జ్ఞాపకశక్తికి ఈ సారి ఆశ్చర్యపోవటం వాసంతి వంతయింది. "యు ఆర్ సెంట్ పర్సంట్ కరెక్ట్" అంటూ ఖాద్రి వివరాలున్న పేజీ తీసి ఫైలు అతని ముందుంచింది. ఆ ఫైలువంక చూడనుకూడా చూడలేదు వాత్సవ.

"దాంతో పనిలేదు. యస్సై రమేష్ స్టేషన్లో వున్నాడేమో ఫోన్ చేసి తెలుసుకో! ఉంటే అర్జంటు మేటర్ మాట్లాడాలంటున్నానని చెప్పు. నీ టేబిల్ నుంచి ఫోన్ చెయ్యి" అన్నాడు.

వాసంతి తన గ్లాస్ రూంలోకి పరుగుతీసింది. అయితే వెళ్ళిన రెండో నిముషంలోనే కార్డ్ లెస్ ఫోన్ తో వాత్సవ ముందుకొచ్చేసింది.

"యస్సై రమేష్ చాలా కోపంగా వున్నాడు. నిన్న ఆదివారం శ్యామ్ సుందర్‌తో కలిసి నువ్వు వాళ్ళింటికి డిన్నర్ కొస్తానని చెప్పి వెళ్ళలేదట. మండిపడుతున్నాడు" అంటూ వస్తున్న నవ్వును బలవంతంగా ఆపుకుంటూ ఫోన్‌ని వాత్సవ చేతికి అందించింది.

"నాకో ఇన్ఫర్మేషన్ కావాలి రమేష్! అర్జంట్" కుండ పగలగొట్టినట్టు డైరక్ట్ గా పాయింట్ చెప్పాడు వాత్సవ.

"నేను డిన్నర్ విషయం మాట్లాడాలనుకుంటున్నాను. మీ ఇద్దరూ తోడు దొంగలు. చీటర్స్. మీకోసం సిద్ధం చేసినవన్నీ వ్యర్థం అయ్యాయి. ఎందుకు రాలేదు ?" గ(య్ న అరిచాడు అవతల రమేష్.

"రాలేదు అంటే దానిక్కారణం వుంటుంది. అనవసరంగా టైం వేస్ట్ చేయక ఫైవ్ టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలో వుంటున్న ఖాద్రి అనే రౌడీషీటర్ గురించి ఇన్ఫర్మేషన్ కావాలి. నీకేమన్నా తెలుసా ?"

"నన్నడిగితే ఖచ్చితంగా తెలీదంటాను. అయినా రెండు మర్డర్ కేసుల్లో వాడిమీద అరెస్ట్ వారెంట్లున్నాయి. ఓ పక్క ఆ మాల్యాద్రిగాడు సందు దొరికితే వీడ్నో నొక్కు నొక్కాలని చూస్తున్నాడు. ఇటు అరెస్టులకి , అటు మాల్యాద్రికి భయపడి ప్రస్తుతం అండర్ గ్రౌండ్ లో ఎక్కడో తల దాచుకుంటున్న

గుంటనక్క. అంత అర్జంటుగా వాడి వివరాలతో నీకేం పని ? అయినా వాడి గురించి అడగాలంటే ఫైవ్ టౌన్ పోలీస్ స్టేషన్ కి ఫోన్ చేయ్యి. టుటౌన్ కి చేయటం ఎందుకు ?" అవతలినుంచి దబాయించాడు రమేష్.

వాత్సవ పెదవులమీద సన్నటి చిరునవ్వు అందంగా మెరిసింది.

"థాంక్యూ రమేష్! అడక్కుండానే అసలు విషయం చెప్పేశావ్. సీయు" అంటూ ఫోన్ పెట్టేశాడు.

"ఏమంటున్నాడు ?" ఫోన్ అందుకుంటూ అడిగింది వాసంతి.

"ఖాద్రి సిటీలోనే వున్నాడు. అండర్ గ్రౌండ్ లో వున్నాడు. బయటకి రప్పించి కార్నర్ చేస్తే తీగ దొరక్కపోదు" అంటూ భానుమతివంక చూశాడు.

ఇక ఆలోచించలేదా అమ్మాయి.

తన వేనిటీ బేగ్ లోంచి మూడు బేంక్‌లకు చెందిన మూడు ఎ.టి.యం. కార్డ్ లను బయటకు తీసి అతడి ముందుంచింది.

"ఒక్కోటి పది లక్షలకి. మూడు కార్డులమీద ముప్పై లక్షలుంది. ఇవి మీకిచ్చేస్తున్నాను. కేసు పూర్తి కాగానే మరో ముప్పై లక్షలిస్తాను. మీరీ కేసు అంగీకరిస్తున్నారు. బట్. చిన్న రిక్వెస్ట్" అంది.

"చెప్పండి మేడం."

"మీతోబాటు నేను కూడా ఈ కేసులో వర్క్ చేయాలనుకుంటున్నాను. మీరు అంగీకరించాలి."

ఒక్కక్షణం ఆమెను చూశాడు వాత్సవ. చాలా వేగంగా రియాక్ట్ అయ్యాడు.

"సారీ! నేనీ కేసు అంగీకరించలేదు. యు కెన్ గో" అంటూ క్రెడిట్ కార్డులని, ఫోటోలని వెనక్కి తిరిగి ఇచ్చేశాడు.

భానుమతి హర్ట్ కాలేదు.

పైగా చురుగ్గా చూసింది.

"నాకు రీజన్ కావాలి. ఎందుకు ఈ కేసు టేకప్ చేయనన్నారు ?" అనడిగింది సూటిగా.

"కారణం వుంది మేడం! మాది సెక్యూరిటీ కన్సల్టంట్ సర్వీసెస్ మాత్రమే. ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ కాదు. సో....మీరు రాంగ్ అడ్రస్ కి వచ్చారు. మీరు వెళ్ళొచ్చు..." అంటూ చెప్పాడు వాత్సవ నిర్మొహమాటంగా.

వాసంతి అక్కడే వుంది , ఆమె బలవంతంగా నవ్వు ఆపుకుంది.

వాత్సవ ఇంట్రస్ట్ చూపించాక ఆ కేసు విడిచిపెట్టడమనేది ఎట్టి పరిస్థితులలోనూ జరగదన్న సంగతి ఆమెకు బాగా తెలుసు. ఇన్వెస్టిగేషన్ లో తను వేలు పెడతానంటోందా అమ్మాయి. అది వాత్సవకి నచ్చని విషయం. ఆ విషయం ఆ పిల్లకు ఇంకా అర్థమైనట్టులేదు.

"వెళ్ళను" అంది మొండిగా భానుమతి.

"నేను వచ్చింది రైట్ అడ్రస్‌కే గానీ రాంగ్ అడ్రస్‌కి కాదని నాకు బాగా తెలుసు. నా ఫ్రండ్ శ్రావణి చెప్పిందాంట్లో ఆవగింజంత కూడా అబద్ధంలేదని ఇక్కడికొచ్చాక బాగా అర్థమైంది. మీకు డబ్బు ఎంత కావాలి...అరవై లక్షలు చాలదనుకుంటే చెప్పండి. కోటి..... రెండు కోట్లు...."

వాత్సవ ఏదో చెప్పేలోపే–

అతని టేబిల్ మీది ఫోను రింగయింది. రిసీవర్ ఎత్తగానే అవతల ఎస్.ఐ. రమేష్ అగ్గిరాముడయిపోతూ అరిచాడు.

"అసలు మీ ఇద్దరూ నా గురించి ఏమనుకుంటున్నారో తెలియాలి. నిన్న డిన్నర్‌కి ఎందుకు రాలేదో చెప్పకుండానే ఫోన్ పెట్టేస్తే వదులుతాననుకున్నావా ?"

"రమేష్! ప్లీజ్, మరోసారి తీరిగ్గా మాట్లాడుకుందాం. ఇప్పటికి వదిలెయ్" రమేష్ మాటల్ని మధ్యలోనే కట్ చేశాడు వాత్సవ. అయినా వదల్లేదు రమేష్.

"ఓ.కె. డిన్నర్ సంగతి వదిలేస్తున్నాను. ఖాద్రిగాడి సంగతి చెప్పు" అనడిగాడు.

ఇది వాత్సవ ఊహించిందే! ఎంతయినా పోలీస్ మైండ్. కారణం లేకుండా ఒక నోటోరియస్ క్రిమినల్ గురించి తను వాకబుచేయడని అతడికి బాగా తెలుసు.

"చెప్పుకునేంత విషయం ఏమీలేదు బ్రదర్. ఊరకే అడిగానంతే, సీయు...."

"అంటే..... నా చెవిలో ఈ మధ్య పెద్ద పెద్ద కాలిఫ్లవర్స్ ఏమన్నా కనిపిస్తున్నాయా నీకు ? నువ్వు వూరకే అడిగింది ఓ పిక్ పాకెటర్‌నో, ఆకు రౌడీనోకాదు. పెద్ద గూండాని. ప్రస్తుతం సిటీ ప్రశాంతంగా వుంది. నువ్వు కెలికి తిరిగి గగ్గోలు పుట్టిస్తావన్న భయంతోనే ఇంతగా అడుగుతున్నాను. వాడి అవసరం ఏమొచ్చింది ?"

"నువ్వు అనవసరంగా ఏవేవో వూహించుకుని భయపడకు. అలాంటి ప్రమాదాలేమీ ముంచుకురావటంలేదు. అసలు విషయం ఏమంటే, ఆ ఖాద్రిగాడి మూడోపెళ్ళాం తమ్ముడు ఒకడు నా

దగ్గరకొచ్చాడు. తన బావగారు కన్పించటంలేదని , పోలీసులు వాడ్ని ఎన్‌కౌంటర్ చేసి వుంటారని భయపడుతున్నా డు. ఇన్వెస్టిగేషన్ చేయమని అర్థించాడు. సో..."

"ఏమిటి ? బాణం మా మీదకు ఎక్కుపెట్టాలనా ?" వాత్సవ మాటలు పూర్తిగాకముందే గట్టిగా అరిచాడు రమేష్.

"అబద్ధాలు చెప్పకు. నువ్వు నిజం చెప్పకపోయినా బాధలేదుగానీ , లా అండ్ ఆర్డర్ ని బ్రేక్ చేసే పనులు చేయకు. లేదంటే నువ్వు ఖాద్రి గురించి వాకబుచేసిన విషయాన్ని నేను మా సుపీరియర్స్ దృష్టికి తీసుకుపోవాల్సి వుంటుంది" అంటూ హెచ్చరించాడు.

"డోంట్ వర్రీ! నువ్వు భయపడాల్సినంత సీన్ ఇక్కడ ఏమీలేదు. గుడ్ బై" అంటూ మరోమాటకి అవకాశం ఇవ్వకుండా ఫోన్ కట్ చేసి వాసంతి వంక చూశాడు.

"ఈ దుర్మార్గుడు వదలడు , ఖచ్చితంగా మళ్ళీ ఫోన్ చేస్తాడు. నేను బయటికెళ్ళిపోయానని చెప్పు" అంటూ సలహా ఇచ్చాడు ఆమెకు.

"నా విషయం చెప్పలేదు. కోటిరూపాయలు ఆఫర్ చేస్తున్నా ను" అంది పట్టుదలగా భానుమతి.

"మీరు పదికోట్లు ఆఫర్ చేసినా మేం పనిచేయం. మీరు వెళ్ళిపోండి మేడం! దయచేసి వెళ్ళిపోండి" అన్నా డు ఖచ్చితంగా వాత్సవ.

ఆమె చివ్వున లేచింది.

క్రెడిట్ కార్డులని , ఫోటోలని టేబిల్ మీదే వదిలేసి సీరియస్‌గా చూసింది.

"ఓ.కె. మిస్టర్ వాత్సవ. మీ పరిశోధనలో భాగం పంచుకోవాలనుకుంటున్న నా మాటల్ని వాపస్ తీసుకుంటున్నా ను. ఇప్పుడు మీరు పనిచేయటానికి అభ్యంతరం వుండదనుకుంటున్నా ను. కేసు ఫినిష్ చేయండి. కోటిరూపాయల ఆఫర్‌ని మీకోసం అలాగే వుంచుతున్నా ను. సీయూ...." అంటూ అతడి రిప్లయ్ కోసం ఎదురుచూడకుండా చరచరా బయటకు వెళ్ళిపోయింది.

వాసంతి వెనుతిరిగేసరికి_

బయటకి ప్రయాణమయ్యాడు వాత్సవ.

"చిన్న పని చూసుకుని చీకటిపడేలోపు వచ్చేస్తాను. శ్యామ్ సుందర్ ఫోన్ చేస్తే ఎక్కడవున్నా అర్జంటుగా ఆఫీసుకు వచ్చి , నాకోసం వెయిట్ చేయమని చెప్పు" అంటూ సజస్ట్ చేస్తూనే వేగంగా కిందకు వెళ్ళిపోయాడతను.

వాసంతి లెక్కప్రకారం ఎస్.ఐ. రమేష్ మళ్ళీ ఫోన్ చేయాలి. కానీ వాత్సవ వెళ్ళిన రెండో నిముషంలో ఫోన్ చేసింది రమేష్ కాదు , శ్యామ్ సుందర్.

"వాసంతీ! నేను శ్యామ్ సుందర్ ని . నా గురించి కంగారుపడాల్సిందేమీ లేదు. ప్రస్తుతం గురుదాస్ పూర్‌లో వున్నాను. తెల్లవారేసరికి వచ్చేస్తాను" అంటూ రెండే రెండు ముక్కలు గబగబా చెప్పి , వాసంతి పెదవి విప్పేలోపలే లైన్‌కట్ చేశాడు శ్యామ్ సుందర్.

మధ్యాహ్నం రెండు గంటలకు హడావిడిగా వెళ్ళిన పెద్దమనిషి , సాయంత్రం ఐదుగంటలకి వందకిలోమీటర్ల దూరంలోని గురుదాస్ పూర్‌కి ఎందుకు వెళ్ళాడో బుర్ర చించుకున్నా అర్థంకాలేదు వాసంతికి. వాత్సవ ఫోన్ కోసం వెయిట్ చేస్తూ భానుమతి వప్పగించిన చైల్డ్ కిడ్నాప్‌కి సంబంధించిన ఫైల్ ప్రిపేర్ చేయటంలో బిజీగా వుండిపోయింది వాసంతి.

## 3

నేతాజీమార్గ్‌కి సమీపంలోనే వుంది బాద్‌షా టీ కార్నర్. ఆ ప్రాంతంలో చాయ్ కి మంచి పేరున్న స్టాల్ అది. ఒకసారి బాద్ షా చాయ్ రుచి చూసినవాళ్ళు మర్చిపోలేరు. ఆ చాయ్ కోసమే మళ్ళీ మళ్ళీ నేతాజీ మార్గ్ సెంటర్‌కి రావాలనుకుంటారు.

అటువంటి చక్కని పేరున్న బాద్ షా టీ స్టాల్ లోపల కార్నర్ టేబిల్ ముందు బైఠాయించి వున్నాడు శ్యామ్ సుందర్. సిగరెట్ పొగను రింగు రింగులుగా వదులుతూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అతను కూర్చున్న చోటుకి వీధి స్పష్టంగా కన్పిస్తోంది.

అప్పటికే శ్యామ్ సుందర్ అక్కడికి వచ్చి అరగంట గడిచిపోయింది. అరడజను చాయ్‌లు తాగి , అరపెట్టె సిగరెట్లు వూదిపారేశాడు. అయినా తనను కలుసుకోవాలనుకుంటున్న కేండిడేట్ ఇంతవరకూ అడ్రస్ లేదు.

టీ స్టాల్ ఓనర్ బాద్ షా శ్యామ్ సుందర్‌కి బాగా తెలిసినవాడు. అందుకే అతను తన స్టాల్‌కి ఎప్పుడు వచ్చినా, అతనికేం కావాలో స్వయంగా కేష్ కౌంటర్ లోంచి వచ్చి వినయంగా తనే సర్వ్ చేస్తుంటాడు గానీ తన కుర్రాళ్ళకి ఆ పని వప్పగించడు. శ్యామ్ సుందర్ అలవాట్లు అతనికి బాగా తెలుసు.

"ఏమిటి సాబ్! ఇంకో చాయ్ తీసుకురానా ?" బాద్ షా దగ్గరకొచ్చి అడగటం చూసి చిన్నగా నవ్వాడు శ్యామ్ సుందర్.

"నీ స్టాల్ కొస్తే ఎన్ని చాయ్ లు తాగినా తృప్తి తీరదు బాద్ షా భాయ్ ! తీసుకురా. వేడి కాస్త కూడా తగ్గకూడదు" అన్నాడు.

"మీరు ప్రత్యేకించి చెప్పాలా సాబ్! నాకు తెలుసుగదా" అంటూ వెళ్ళి చిటికెలో పొగలు గక్కుతున్న చాయ్ ని అందమైన కప్పులో తెచ్చి అతని ముందుంచాడు బాద్ షా.

చాయ్ సిప్ చేస్తూ ఆలోచిస్తున్నాడు శ్యామ్ సుందర్. తను వచ్చి అర్థ గంట గడిచిపోయింది. అర్జంటుగా తనను కలుసుకోవాలని ఫోన్ లో కాంటాక్ట్ చేసిన యువతి ఏమైనట్టు ? ఇంతవరకు ఇక్కడికి చేరుకోపోడానికి కారణం ఏమైవుంటుంది ? ఆమె గొంతు చాలా కంగారుగా విన్పించింది. గొంతునుబట్టి ఖచ్చితంగా పాతికలోపు యువతి అని అంచనా వేశాడు. ఆమె స్పష్టమైన ఇంగ్లీష్‌లో మాట్లాడింది. ఆమె స్థానికురాలా లేక బయటవూరునుంచి వచ్చిందా ? ఆమె పేరేమిటి, వూరేమిటి ? ఆమె సమస్య ఏమిటి ? మొదలయిన వివరాలు ఏ ఒక్కటీ తెలీదు. తనను కలుసుకోవాలని ఫోన్ లో చాలా కంగారుగా మాట్లాడిందామె. తమ ఆఫీసుకు వచ్చే వ్యవధి లేదని, తను చాలా ప్రమాదంలో వున్నానని కూడా చెప్పింది. ఆమె నేతాజీ మార్గ్ పరిసరాల్లో వున్నట్టు తెలిసి బాద్ షా టీ కార్నర్ అడ్రస్ చెప్పి తక్షణం ఇక్కడికి వచ్చి తనను కలుసుకోమని చెప్పాడు. అయిదు నిముషాల్లో తను ఇక్కడికి వచ్చి ఆమెకోసం వెయిట్ చేస్తున్నాడు.

కాని అర్థగంట గడిచినా ఆమె అడ్రస్ లేదు. ఆమె వస్తున్న జాడ ఎక్కడా కనుచూపు దూరంలో కన్పించటంలేదు. తను ఇక వెళ్ళిపోవటం బెటరా ?

సిగరెట్ పొగను రింగు రింగులుగా వదులుతూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"ఎందుకుబే ఇంతగా బుర్ర చించుకొని ఆలోచిస్తావ్ ? ముక్కూ, ముఖం తెలీని అపరిచిత అమ్మాయికోసం ఎంతసేపు ఎదురుచూస్తావ్ ? అనవసరంగా నీ టైం వేస్ట్ చేసుకుంటున్నావ్ ? వెళ్ళిపో" అంటూ అంతరాత్మ అయిదు నిముషాలక్రితం నుంచే గోల చేస్తోంది. దాని గోలని పెడచెవినపెడుతూ, మరో పదినిముషాలు ఓపిగ్గా వెయిట్ చేశాడు శ్యామ్ సుందర్.

అంటూ అంతరాత్మ అయిదు నిముషాలక్రితం నుంచే గోల చేస్తోంది. దాని గోలని పెడచెవినపెడుతూ, మరో పదినిముషాలు ఓపిగ్గా వెయిట్ చేశాడు శ్యామ్ సుందర్.

అంతలో వీధిలో హడావిడిగా వస్తున్న ఒక యువతి అతన్ని ఆకర్షించింది. ఆమె తెల్లగా రబ్బరుబొమ్మలా వుంది. పాతికలోపు వయసుండవచ్చు. పైజమాలాంటి చారల పాంటు, టీ షర్టుమీద అలాంటిదే పొడవు చేతుల చారల షర్టు ధరించింది. కాళ్ళకు చక్కని డిజైన్ తో కూడిన ఆఫ్ షూ వేసుకుంది. పొడవు జుట్టు భుజాలమీదికి వేలాడుతోంది చక్కగా.

ఖచ్చితంగా ఆమె ఇండియా అమ్మాయి కాదని ఒక్క లుక్‌లో టక్కున చెప్పేయొచ్చు. చైనా, మలేషియా, లేదా జపాన్ యువతి కావచ్చు. ఆమె మాటి మాటికి వెనక్కిచూడ్డం, కంగారుగా వీధిలో పాదచారుల్ని , వెహికల్స్‌ని తప్పించు కొంటూ రావటం చూసి తన సీట్లో నిటారుగా కూర్చున్నాడు శ్యామ్ సుందర్.

తనను తలుసుకోవాలనుకుంటున్న యువతి ఆ అమ్మాయే కావచ్చన్న అనుమానం క్రమంగా బలపడసాగింది. అందుకు తగ్గట్టే ఆమె బాద్ షా టీ కార్నర్ వైపేవస్తోంది.

ఎంతో ఆతృతగా శ్యామ్ సుందర్ గమనిస్తున్నాడు.

కాని అతను వూహించినట్టు--

ఆమె టీ కార్నర్ మెట్లు ఎక్కలేదు.

చివరి క్షణంలో వెనక్కి వెనక్కి చూస్తూ ఎందుకో మనసు మార్చుకుంది. బాద్ షా టీ కార్నర్ ని దాటి ముందుకుపోయింది. అది గమనించి, చెంగున సీట్లోంచి లేచి వేగంగా టీ కార్నర్ ఫ్రంట్ కొచ్చి చూశాడు శ్యామ్ సుందర్.

ఆ యువతి కొద్దిదూరం ముందుకెళ్ళి తిరిగి పాదచారుల్ని , వెహికిల్స్ ని తప్పించుకొంటూ రోడ్డు క్రాస్ చేసి అవతలి సన్నటి సందులోకి వెళ్ళి అదృశ్యమైంది.

అదే సమయంలో హారన్ మోగించుకుంటూ ఆమె వచ్చిన దిశలోంచే దూసుకొచ్చిందో కారు. ఆ యువతిమీదే దృష్టి నిలిపిన శ్యామ్ సుందర్ ఆ కారును కాస్త ఆలస్యంగా గమనించాడు. ఆ కారు ఖచ్చితంగా యువతి పారిపోయిన సందుముందే ఆగటం శ్యామ్ ని మరింత ఆశ్చర్యపరిచింది.

ఆ కారులోంచి వేగంగా దూకారు అరడజనుమంది దృఢకాయులు. వాళ్ళలో నలుగురు తూర్పు ఆసియా దేశాలకి చెందిన వాళ్ళు. ఇద్దరు ఇండియన్స్. వాళ్ళంతా చాలా వేగంగా అదే సందులోకి ఎంటర్ కాగానే, ఆ కారు అక్కడినుంచి మూవ్ అయింది.

శ్యామ్ సుందర్ ఫ్రెష్ గా సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు, తనను కలుసుకోవాలనుకున్న యువతి ఆమె కాకపోవచ్చుననే ఫీలింగ్ ఏర్పడింది. ఫారెన్ అమ్మాయి తనకోసం రావలసిన అవసరం ఏముంది ? ఇది యాదృచ్ఛికంగా జరిగిన సంఘటన మాత్రమే, తను పొరబాటున ఆ యువతికోసం ఇక్కడినుంచి కదిలితే, నిజంగా తనకోసం రానున్న యువతిని తను మిస్ కావచ్చు. ఆమె సమస్య ఏమిటో, ఏ పరిస్థితిలో వుందో తనకు తెలీదు.

అందుకే బయటికొచ్చినంత వేగంగానూ తిరిగి లోనకు వచ్చేసి ఇంతకు ముందు తను కూర్చున్న అదే సీట్లో ఆసీనుడయ్యాడు. ఈసారి అతన్ని అడక్కుండానే బాద్ షా స్వయంగా తన చేతులతో చాయ్ కలిపి తీసుకొచ్చి అతని ముందుంచాడు.

"ఏమైంది సాబ్! మీరు కలుసుకోవలసిన మనిషి ఇంకా రాలేదా ? వచ్చి వెనక్కి వెళ్ళిపోయాడా ?" అంటూ అనుమానంగా అడిగాడు.

"అర్థంకాలేదు. ఇంకొద్దిసేపు వెయిట్ చేస్తాను" అంటూ చాయ్ కప్పు అందుకొని సిప్ చేయటం ఆరంభించాడు.

పెద్దవాళ్ళ వ్యవహారాలు ఇలాగే వుంటాయని బాద్ షాకి బాగానే తెలుసు. అందుకే మరో ప్రశ్న వేయకుండా కేష్ కౌంటర్ లోకి వెళ్ళిపోయాడు.

సరిగ్గా పది నిముషాల తర్వాత -

కేష్ కౌంటర్ మీది ఫోన్ రింగయింది. బాద్ షా మాట్లాడి కార్డ్ లెస్ రిసీవర్ ని తెచ్చి శ్యామ్ సుందర్ చేతికిచ్చాడు.

"ఎవరో లేడీ.... ఇంగ్లీష్ లో మాట్లాడుతోంది. ఫోన్ మీకిమ్మంది అంటూ చెప్పి అవతలికి వెళ్ళిపోయాడు.

ఫోన్ చేసింది ఖచ్చితంగా వాసంతి కాదని శ్యామ్ సుందర్ కి తెలుసు. ఎందుకంటే తను బాద్ షా టీ కార్నర్ లో కూర్చున్న సంగతి ఆమెకి తెలిసే అవకాశంలేదు. తనను కలుసుకోవాలనుకుంటున్న అమ్మాయి ఫోన్ కాల్ అయి వుండాలి.

ఆలోచిస్తూనే "హలో!" అన్నాడు.

నాలుగే నాలుగు ముక్కలు కంగారుగా మాట్లాడిందామె.

"సారీ ! కలుసుకోలేకపోయాను. నన్ను వెన్నంటి తరుముతున్నారు వాళ్ళు. ఇక్కడ వుండటం ప్రమాదం. వాళ్ళకి స్లిప్ ఇచ్చి గురుదాస్ పూర్ వెళ్ళిపోతున్నాను. రాత్రి ఏడుగంటలకి గురుదాస్ పూర్ చౌరస్తా దగ్గర్లోని దర్గా దగ్గర కలుసుకుందాం. ప్లీజ్ కం....నేను మిమ్మల్ని గుర్తుపట్టగలను. డోన్ట్ వర్రీ" అంతవరకే చెప్పిందామె.

శ్యామ్ సుందర్ కి మరోమాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా మాట్లాడినంత వేగంగానూ లైన్ కట్ చేసింది.

అతను ఎంతమాత్రం వూహించని మలుపు ఇది.

వెంటనే మేటర్ తెలిసిపోతుందనుకున్న విషయం ఇప్పుడు గురుదాస్ పూర్ వరకు సాగుతోంది. ఏం చేయాలి ?

ఆమె మాటలు విన్నాక – తను పొరబాటు చేసిన సంగతి వెంటనే అర్థమైపోయింది శ్యామ్ సుందర్‌కి. తనని కలవాల్సిన యువతి రాకపోడాన్ని బట్టి ఫోన్‌లో యువతి మాటల్ని దృష్టిలో వుంచుకుని ఆలోచిస్తే ఇంతక్రితం వీధిలో కన్పించి సందులోకి పారిపోయిన అమ్మాయే ఇప్పుడు ఫోన్లో మాట్లాడిన అమ్మాయని అర్థమవుతోంది. ఇంతక్రితమే తను ఆమెను ఫాలో అయివుంటే ఇప్పుడు గురుదాస్ పూర్ వరకూ పరుగెత్తాల్సిన తిప్పలు తప్పేవి. ఆమె ఎవరు, ఆ గూండాలు ఎందుకు వెంబడిస్తున్నారు ? ఫారెనర్స్ ఎఫైర్‌లో తన ఇన్‌వాల్వ్‌మెంట్ ఎంతవరకు అవసరం ? మొత్తంఈ పాటికి తెలిసిపోయేది.

ఇక ఇప్పుడు ఆలోచించి లాభంలేదు. ఈ పాటికి గూండాలకు స్లిప్ ఇచ్చిన ఆ యువతి గురుదాస్ పూర్ మార్గంలో ఏ బస్ లోనో, టాక్సీలోనో వెళ్ళి పోతూ వుంటుంది. ఇంతవరకూ వచ్చాక తనూ వెళ్ళక తప్పదు.

లేచి కాష్ కౌంటర్ వద్దకొచ్చి రిసీవర్ ని బాద్ షా కిచ్చేశాడు. తాగిన చాయ్ లకు డబ్బులు పే చేశాడు.

"ఏమైంది సాబ్! మీరు కలవాల్సిన పర్సన్ మిస్సయినట్టున్నాడు ?" ముఖమంతా నవ్వులు నింపుకొంటూ అడిగాడుబాద్ షా.

"అవును! అందుకే వెళ్ళిపోతున్నాను. అన్నట్టు బాద్ షా భాయ్! ఇక్కడినుండి గురుదాస్ పూర్ కి రైలు బెటరా బస్ బెటరా ? త్వరగా చేరుకోవాలి. ఏది బెటర్ సాబ్ ?" అనడిగాడు శ్యామ్ సుందర్.

"టాక్సీ బెటర్ సాబ్" టక్కున చెప్పాడు బాద్ షా.

"వందకిలోమీటర్లు ఎంతసేపు సాబ్ ? రెండు గంటల్లో చేరుకోవచ్చు. ఒక్క నిముషం....ఒక్క నిముషం ఆగండి. ఇంతక్రితమే గురుదాస్ పూర్ నుంచి వచ్చిన ప్రైవేట్ టాక్సీవాలా ఒకడు చాయ్ తాగి వెళ్ళాడు. ఇక్కడే ఎక్కడో వుంటాడు" అంటూనే కౌంటర్ దిగి గబగబా కిందికెళ్ళాడు బాద్ షా.

వెళ్ళినవాడు మూడో నిముషంలోనే వెంటబెట్టుకు వచ్చాడు ఒక టాక్సీవాలని, కొద్దిగా గడ్డం మాసినా బలంగా, దృఢంగా, చలాకీగా వున్నాడు టాక్సీవాలా.

"నా పేరు జలీల్ ఖాన్. తెలిసినవాళ్ళంతా ఖాన్ అని పిలుస్తారు సాబ్. ఇక్కడ్నుంచి గురుదాస్ పూర్ కి సవారీలు దొరకటం కష్టం సాబ్. ఖాళీగా వెళ్ళటం ఎలాగని ఆలోచిస్తూంటే బాద్ షా అన్న సోడాబంక్ దగ్గర కొచ్చి నన్ను లాక్కొచ్చాడు. రండి సాబ్ వెళ్ళిపోదాం" అన్నాడు కలుపుగోలుగా ఖాన్.

"అరే ఖాన్ భాయ్! మీ గురుదాస్ పూర్ వాళ్ళని అస్సలు నమ్మకూడదంటారు. ఆనక తేడా పాడాలొస్తే మంచిగ వుండదు. మా సాబ్ గురించి నీకు తెల్వదు" హెచ్చరించబోయాడు బాద్ షా.

"అరే బాద్ షా అన్నా! నువ్వు చెప్పాక ఇక తేడాపాడాలుండవ్. డోంట్ వర్రీ! రండి సాబ్ వెళ్ళిపోదాం" అంటూ వెనుతిరిగాడు ఖాన్.

అక్కడికి ఏభై గజాల దూరంలో–

సోడాబంక్ వెనక నిలబడుంది ఆకుపచ్చని అంబాసిడర్ కారు. కండిషన్ లోవున్న వెహికిల్ అది. శ్యామ్ సుందర్ వెనకసీట్లో కూర్చోగానే కారును వీధిలోకి తీసి కుడిపక్కగా దూకించాడు ఖాన్. సిటీ లిమిట్స్ దాటగానే కళ్ళెం వదిలిన గుర్రంలా హైవేలో దూసుకుపోసాగింది. చల్లటిగాలికి తనకు తెలీకుండానే నిద్రలోకి జారుకున్నాడు శ్యామ్ సుందర్.

తిరిగి అతనికి మెలకువ వచ్చేసరికి–

గురుదాస్ పూర్ వీధుల్లో వుంది కారు.

టైంచూస్తే అయిదు కావస్తోంది. రెండు గంటల్లో ఖాన్ తనని గురుదాస్ పూర్ చేర్చినందుకు అభినందించకుండా వుండలేకపోయాడు శ్యామ్ సుందర్.

"ఎక్కడ దించమంటారు సాబ్ ?" అడిగాడు ఖాన్.

ఆ విషయం చెప్పేముందు–

ఒకసారి హెడ్ క్వార్టర్స్ కి ఫోన్ చేయటం మంచిదనిపించింది. ఒక యస్.టి.డి బూత్ ముందు కారాపించి దిగాడు. లోనకెళ్ళి తమ డైనమిక్ సెక్యూరిటీ సర్వీసెస్ ఆఫీస్‌కి రింగ్ చేశాడు. తన అంచనా ప్రకారం వాత్సవ ఆఫీస్ లోనే వుండాలి. కాని అతను లేడు. సెక్రటరీ వాసంతి రిసీవర్ లిఫ్ట్ చేసింది. వాసంతికి ఛాన్స్ ఇస్తే మొత్తం మేటర్ చెప్పేవరకు విడిచి పెట్టదని తెలుసు. అందుకే ఆమెకా ఛాన్స్ ఇవ్వలేదు. ప్రస్తుతం గురుదాస్ పూర్ లో వున్నట్టు, ఉదయానికి ఆఫీస్ కి చేరుకుంటున్నట్టు క్లుప్తంగాచెప్పి లైన్‌కట్ చేశాడు. తిరిగి కార్లో కూర్చుంటూ, "చౌరస్తా దగ్గర్లోని దర్గాకి పోనీ!" అన్నాడు.

పదినిముషాల్లో–

కారు దర్గా ప్రాంతానికి చేరుకుంది. ఆ ప్రాంతమంతా కిటకిటలాడటం చూసి ఆశ్చర్యపోయాడు శ్యామ్ సుందర్. అతడి ఆశ్చర్యాన్ని గమనిస్తూ, చిన్నగా నవ్వి చెప్పాడు ఖాన్. "ఉర్సు ఉత్సవాలు సాబ్. ఆఖరిరోజు... అందుకే ఇంత జనం. రాత్రంతా ఇట్టనే వుంటుంది" అంటూ ఆ జన ప్రవాహానికి కారణం చెప్పాడు.

ఆ జనాన్ని చూడగానే–

ఎక్కడలేని నీరసం ముంచుకు వచ్చేసింది శ్యామ్ సుందర్ కి. మామూలు సమయాల్లో ఇక్కడ పెద్దగా జనం వుండరు. కానీ జరుగుతోంది ఉరుసు ఉత్సవం. బహుశా ఆ అజ్ఞాత సుందరికి ఈ విషయం తెలీక మీటింగ్ ప్లేస్ ఇక్కడ ఏర్పాటు చేసింది. ఈ జన సందోహంలో తను ఆమెనుగాని, ఆమె తననుగాని మూడురోజులు తిరిగినా గుర్తించటంసాధ్యంకాదు.

కారు దిగిపోయాడు శ్యామ్ సుందర్.

వాలెట్ తీసి ఖాన్ కి ఇవ్వాల్సిన పేమెంట్ కన్నా కాస్త ఎక్కువగానే ముట్టజెప్పాడు. దాంతో ఖాన్ తెగ సంతోషపడిపోతూ - "సాబ్! మీలాంటి పాసింజర్సు దొరకటం అదృష్టం సాబ్ కష్టాన్ని గుర్తించే మీలాంటివారు వుండబట్టే దేశం ఇలా ఇంకా సుభిక్షంగా వుంటోంది. ఈ సెంటర్ మనదే సాబ్. అవసరమైతే పిలవండి. మీ ముందుంటాను" అన్నాడు.

"డోన్ట్ వర్రీ బ్రదర్! ఇక నీ అవసరం ఏర్పడదనుకుంటాను. పనికాగానే ట్రైన్ కి వెళ్ళిపోతాను" అన్నాడు సిగరెట్ అందుకుంటూ శ్యామ్ సుందర్.

ఆ మాటలకి పళ్ళికిలించి నవ్వాడు ఖాన్.

"అంత మాటనకండి సాబ్. చెప్పలేం. మీరు నా టాక్సీ ఎక్కకపోతారా, వస్తాను సాబ్!" అంటూ సలాంచేసి టాక్సీని ముందుకు తీసుకుపోయాడు ఖాన్.

అతని మాటలకు చిన్నగా నవ్వుకుంటూ సిగరెట్ ముట్టించుకున్నాడు శ్యామ్ సుందర్.

అక్కడే నిలబడి రింగులు రింగులుగా పొగ వదులుతూ తాపీగా ఓ సారి ఆ ప్రదేశాన్ని పరికించాడు.

దర్గా ముందు భాగంలోని సువిశాలమైన మైదానం అది. మామూలు సమయాల్లో ఖాళీగా వుండే ఆ ప్రదేశంలో ఇప్పుడు బారులు తీరి అనేక అంగళ్ళు వెలిశాయి ఇంకా చీకట్లు ముసురుకొనకముందే ఆ ప్రాంతమంతా విద్యుద్దీపాల కాంతులతో పట్టపగల్లా వుంది. తిరునాళ్ళకి తరలి వచ్చినట్టు పిల్ల, పీచు, ముసలి, ముతక అంతా గుంపులు గుంపులుగా వచ్చి చేరుతూ ఆ ప్రాంతం కిటకిటలాడుతోంది. రణగొణ ధ్వనితో కోలాహలంగా వుంది.

ఏడుగంటల్లోపలే ఆ ప్రాంతమంతా ఓ రౌండ్ వేసి కాస్త అనుకూలమైనచోట సెటిలయ్యే వుద్దేశంతో అక్కడి జన ప్రవాహంలోకి తనూ అడుగులు వేశాడు శ్యామ్ సుందర్.

## 4

ఆఫీసు మెట్లుదిగి రోడ్ మీదికి వచ్చిన వాత్సవకి కనుచూపు దూరంలో లెక్కపెడదామన్నా కన్పించలేదు ఒక్క ఆటోకూడా.

ఏదో ఒక ఆటో అటుగా వచ్చేంతవరకూ వెయిట్ చేయకతప్పదు.

రోడ్ క్రాస్ చేస్తూ యధాలాపంగా దృష్టి సారించాడు వాత్సవ ఎదురుగావున్న బడ్డీషాపు వైపు.

షాపు ముందు అరడజనుమంది కస్టమర్లు వెయిట్ చేస్తున్నారు. పాన్ లు కట్టడంలో మహా బిజీగా వున్నాడు లోన కాలేషావలీ.

ఒక్కసారి అతగాడి జరదాపాన్ రుచిమూసిన ఎవరైనా అతని కస్టమర్‌గా మారిపోవలసిందే. పాన్ కట్టడంలో అంతగా అందెవేసిన చేయి అతనిది.

ఇక్కడ బడ్డీకొట్టు పెట్టాక బాగా పెరిగింది అతని వ్యాపారం. ఆ క్రెడిట్ మొత్తం శ్యామ్ సుందర్ దంటే ఆశ్చర్యం ఏమీలేదు. ఎందుకంటే పెట్టుబడి పెట్టి తమ ఆఫీసు ఎదురుగా కాలేషావలీచేత ఆ బడ్డీకొట్టు పెట్టించింది శ్యామ్ సుందర్.

సిగరెట్ దమ్ము కొడుతూ రోడ్డుదాటి ఈవలకు వచ్చాడు వాత్సవ. పనిలో బిజీగావున్న కాలేషావలీ క్షణం ఆలస్యంగా గుర్తించాడు వాత్సవని. గుర్తించిన మరుక్షణం చేస్తున్న పని మొత్తం అలాగే వదిలి, కష్టమర్ల అభ్యంతరాన్ని కూడా పట్టించుకోకుండా చెంగున బయటకు దూకి వాత్సవకు ఎదురువచ్చేశాడు ముఖంనిండా నవ్వు పులుముకుంటూ.

"ఏమిటి సార్! ఆటో కోసమా ?" ఆతృతగా అడిగాడు.

"డోన్ట్ వర్రీ వలీ! నేను వెయిట్ చేస్తాలే!" అన్నాడు వాత్సవ.

"ఇంతే సార్! దొంగనాయాళ్ళు. అవసరం లేనప్పుడు ఎగబడతారు. ఎదురు చూస్తే ఒక్కడు రాడు. మీరు వెయిట్ చేయటం ఏమిటి సార్ ? వుండండి, ఒక్క నిముషం వుండండి. మీ ముందు పూలరథంలాంటి ఆటో వచ్చి నిలబడుతుంది" అంటూ వాత్సవ వారిస్తున్నా వినకుండా, కష్టమర్లని పక్కకుతోసి బడ్డీకొట్టు లోపలికి చేయిచాపి తన ఫోన్ అందుకొని ఒక నంబర్ కొట్టాడు.

క్షణంలో లైను దొరికింది.

"అరే రహీం..... ఇప్పుడు ఎక్కడున్నావ్ రా ?" ఫోర్స్ గా అడిగాడు వలీ.

"ఫ్లై ఓవర్ దిగుతున్నాను. ఏమిటి విషయం ?" అడిగాడు అవతలి ఆటోవాలా.

"నీ ఆటోలోవున్న పాసింజర్స్ ఎవరైనాగానీ దించేసి సరిగ్గా రెండు నిముషాల్లో నా బడ్డీకొట్టు ముందుండాలి నువ్వు. వెరీ అర్జంట్! అర్థమైందిగా! త్వరగా రా!" అంటూ ఫోన్ పెట్టేశాడు.

"వలీ... నువ్వు కాస్త ఎక్స్ట్రాలు చేస్తున్నావీ మధ్య" నవ్వుతూనే చురక వేశాడు వాత్సవ.

"ఎంతమాట సాబ్! అదేం లేదు. రహీం మావాడే. ఈ మధ్యనే వూరునుంచి వచ్చాడు. వాడు ఆటో కొనుక్కోడానికి నేనే సాయంచేశాను. మన మాట కాదనడు. మీరే చూస్తారుగా చిటికెలో వచ్చేస్తాడు" సంజాయిషీ ఇచ్చుకున్నాడు వలీ.

అతడి మాట సరిగ్గా మూడో నిముషంలో యదార్థం అయింది. గాలితో పోటీపడుతూ దూసుకొచ్చిన ఆటో ఒకటి బడ్డీకొట్టు ముందు ఆగింది. ఆటో నడుపుతున్న రహీంభాయ్ దృఢంగా, బలిష్టంగా వున్నాడు.

కాలేషావలీ ఒకటికి రెండు సార్లు అతడ్ని హెచ్చరించి మరీ వాత్సవని ఆటో ఎక్కించి పంపించాడు. ఆ తర్వాతే తన వ్యాపారం చూసుకోడానికి బడ్డీకొట్టులో ప్రవేశించాడు.

"ఎక్కడికెళ్ళాలి సాబ్ ?" ఆటో రన్నింగ్ లో వుండగా అడిగాడు రహీం.

"సుల్తాన్ బజార్ కి పోనీ" ఆఖరి దమ్ము లాగి , సిగరెట్ అవతలికి విసిరిపడేస్తూ చెప్పాడు వాత్సవ.

"జీ సాబ్" అంటూ ఆటోవేగం పెంచాడు డ్రైవర్.

"నీకు సుల్తాన్ బజార్ తెలుసా ?" అడిగాడు వాత్సవ.

"ఏరియా తెలుసు. అంతగా పరిచయం లేదు."

"డేంజర్ ఏరియా! జాగ్రత్తగా వుండాలి. కావాలని గొడవ పెట్టుకుని, అందినంతవరకు దోచుకుపోయే బద్మాష్ గాళ్ళు జాస్తి. కన్ను మూసి తెరిచేటంతలోనే నీ ఆటో మాయమవుతుంది. అర్ధగంట తర్వాత అదే ఏరియాలోని స్పేర్ పార్ట్స్ దుకాణాల్లో నీ ఆటో పార్టులు ప్రత్యక్షమవుతాయి. హుషారుగా వుండాలి."

"జీ సాబ్! కొమ్ములు తిరిగిన రౌడీలను అనేకమందిని ఈ కళ్ళతో చూశాను సాబ్. నా దగ్గర ఎవరూ తోకాడించలేదు."

"ఆహాఁ. అయితే నో ప్రాబ్లం" అంటూ చిన్నగా నవ్వి ఫ్రెష్ గా ఇంకో సిగరెట్ ముట్టించాడు వాత్సవ.

ఇరవై నిముషాల్లో సుల్తాన్ బజార్ వీధుల్లోకి ఎంటరయింది ఆటో. అప్పటికే చీకట్లు ముసురుకునే టైమైంది. వీధిదీపాలు వెలిగాయి. సుల్తాన్ బజార్ చిల్లరమల్లర వ్యాపారాలకు ప్రసిద్ధి. ఈ టైంలో వుండాల్సిన రద్దీనే వీధుల్లో వుంది.

థర్డ్ క్రాస్ వీధి దాటేవరకు ఏవిధమైన ట్రబులు ఎదురుకాలేదు ఆటోకి. ఫోర్త్ క్రాస్ వీధిలోకి తిరిగి కొంతదూరం వెళ్ళగానే ఆటోకి సడెన్ బ్రేక్ పడింది. తూలి ముందుకు పడబోయిన వాత్సవ చివరిక్షణంలో పడకుండా కంట్రోల్ చేసుకున్నాడు.

అది ఇరుకు గల్లీ.

రెండు ఆటోలు ఎదురుబొదురుగా వస్తేనే తప్పించుకోవటం కష్టంతో కూడుకున్న పని. సడెన్‌గా ఒక ప్రాణి ఆటో ముందునుంచి క్రాస్ చేసేసరికి డ్రయివరు రహీంభాయ్‌కి సడెన్ బ్రేక్ వేయక తప్పలేదు.

"క్షమించాలి సాబ్! మీకేం కాలేదుకదా ? ఎవడో రాస్కెల్ సడెన్ గా అడ్డం వచ్చాడు. బ్రేక్ వేయక తప్పలేదు" జరిగిందానికి నొచ్చుకుంటూ వెనక్కి తిరిగి వాత్సవకి సంజాయిషీ ఇచ్చుకున్నాడు రహీం.

అయితే అలా సడెన్ బ్రేక్‌కి కారణమైన శాల్తీ డ్రయివరు మాటలు విన్నాడు. సన్నగా, రివటలా వుండి ఆఫ్ నిక్కరు , బనియన్ తో వున్నాడు వాడు. చేతిలో మెడకోసిన రెండు నాటుకోళ్ళు నిర్జీవంగా వేలాడుతున్నాయి. డ్రయివరు మాటలు వినగానే చాలా వేగంగా రియాక్టవుతూ దురుసుగా వచ్చేశాడు.

"ఏందిబే రాస్కెల్ అంటున్నావ్! సుల్తాన్ బజార్ నుంచి బయటికి పోవాలనుందా ? ఖస్తాప్ నా కొడకా...." అంటూ కళ్ళెర్రజేసి చూపుడు వేలు డ్రయివర్ ముఖంమీద ఆడించి రఫ్‌గా హెచ్చరించి వెనుతిరిగాడు వాడు.

ఒక్క గుద్దుకే గుక్కెడు నెత్తురు కక్కుకుని చస్తాడు. ఒంటిమీద పదికేజీల కండలేదు. వాడిలో ఆ పొగరేమిటో డ్రయివర్ రహీంభాయ్ కి అర్థంకాలేదు. కాని వాత్సవకి అర్థమైంది కాబట్టి, ఆటో దిగబోతున్న రహీంని షర్టుపట్టి లాగి సీట్లో కూర్చుండబేశాడు.

"మీరు వదలండి సాబ్! వాడి ముక్కు పచ్చడయ్యేలా ఒక్క గుద్దు గుద్ది వస్తాను" అన్నాడు ఆవేశంగా రహీం.

"నువ్వు గుద్దితే వాడి ముక్కు చట్నీ అవుతుంది సందేహంలేదు. కానీ వాడి వెనక బలగం వందమంది వచ్చి నిన్ను వంద గుద్దులు గుద్దుతారు. నీ ఒళ్ళు అప్పుడు చట్నీ కాదు, సాంబారు అవుతుంది. మనం వచ్చింది గొడవలు పడ్డానిక్కాదు. పని చూసుకుని అవతలికి పోడానికి. ఆటో పోనీ" అంటూ హితవు చెప్పాడు వాత్సవ.

"మీరు చెప్పింది నూటికి నూరుశాతం కరక్ట్ సాబ్. మీలాంటి గొప్ప వాళ్ళు ఏం చెప్పినా అందులో ఏదో అర్థం వుంటుంది. ఇలాంటి లఫూట్ నాయాళ్ళతో గొడవపడ్డం మన తప్పే" అంటూ ఆటోని ముందుకు దూకించాడు రహీంభాయ్.

అయితే మరో నూటయాభై గజాలదూరం కూడా పోకముందే తిరిగి ఆటోకి బ్రేక్ పడింది. రహీం అదేపనిగా హారన్ కొడుతుంటే ఆటోకి దున్నపోతులు ఏమైనా అడ్డు వచ్చాయేమోనన్న డౌటుతో వేళ్ళమధ్య తానుగా ఆరిపోయిన సిగరెట్ పీకను అవతల పారేస్తూ ముందుకు చూశాడు వాత్సవ.

అతనూహించినట్టు దున్నపోతులేమీ లేవుగాని — దున్నపోతుల్లాంటి నాలుగు శాల్తీలు మాత్రం సరిగ్గా వీధి మధ్యలో నిలబడి టీ లు తాగుతూ, జోకులేసుకుని, ఎవర్నీ లెక్కచేయనంతగా నవ్వుకొంటున్నారు. పక్కన కాకాహోటల్ ఒకటుంది. ఆ సమీపంలో ఇంకా రఫ్ కారక్టర్లు కొన్ని కనబడుతున్నాయి.

వాళ్ళు తప్పుకొంటేగాని ఆటో ముందుకుపోదు. రహీం ఎంతగా హారన్ కొట్టినా ఆ పెద్దమనుషులకి చీమ కుట్టినట్టు కూడా లేదు. వాళ్ళకి నచ్చచెప్పి పక్కకి పంపించే ఉద్దేశ్యంతో ఆటో దిగబోయాడు వాత్సవ. అది గమనించి వారించాడు డ్రైవరు.

"మీకెందుకు సాబ్ శ్రమ. మీలాంటివాళ్ళు మాట్లాడతగ్గ మనుషులు కాదు వీళ్ళు. నేను సర్దుబాటు చేస్తాగదా" అంటూ బిగ్గరగా హారన్ కొట్టాడు.

దాంతో తమకి డిస్టర్బ్ అయినట్టు ఆ రఫ్ కారక్టర్లలో ఒకడు ముఖం మాడ్చుకుంటూ తలతిప్పి సీరియస్‌గా చూశాడు.

"ఏందిబే నీ గోల ? ఇక్కడ కొందరు పెద్దమనుషులం ముఖ్యమైన పనిలో వున్నాం. గోల చేయకూడదన్న ఇంగిత జ్ఞానం కూడా లేదుబే నీకు ? ఎందుకలా హారన్ కొట్టి అల్లరి చేస్తావ్ ? మేం అవతలకు పోయే వరకు కామ్‌గా ఇంజన్ ఆఫ్ చేసి కూర్చో. మళ్ళీ హారన్ మోత వినబడితే హారన్ పీకి నీ చేతిలో పెడతాం..... సమజయిందిగా.... కామోష్" అంటూ ఘాటుగా వార్నింగిచ్చాడు వాడు.

ఆ మాటలు వింటూనే అంతకుముందు వాత్సవ చేసిన హెచ్చరికల్ని గాలికి వదిలేశాడు రహీంభాయ్. "వీధి వీళ్ళ అబ్బసొత్తు అనుకుంటున్నారా వెధవలు. కంచరగాడిదల్లా వీధి మధ్యలో నిలబడి వెధవ ఫోజు వీళ్ళును. వీడేమన్నా గవర్నరా అవతలకు పోయేవరకు ఆటో ఇంజన్ ఆపి కూర్చోడానికి" అనుకుంటూ చెంగున ఆటోలోంచి దూకి ఇవతలికి వచ్చాడు. అతనలా చేస్తాడని వూహించని వాత్సవ ఖంగుతిన్నాడు. అతన్ని వెనక్కిపిలిచే అవకాశం కూడా లేకపోవడంతో వెంటనే తనూ ఆటో దిగాడు. దిగిన మరుక్షణమే గమనించాడు కాకాహోటల్ పరిసరాల్లోని రఫ్ కారక్టర్లలో కదలికని. ఈ లోపల--

ఆటో దిగిన రహీంని చూడగానే అంతక్రితం మాట్లాడిన శాల్తీ మరింత రెచ్చిపోతూ —"ఏందిబే! ఆటో దిగివస్తున్నావ్ ? కొడతావా ? కొట్టు. నువ్వు కొట్టలేకపోతే ఖచ్చితంగా నేను నిన్ను కొట్టేస్తా....కమాన్" అంటూ రహీంని ఛాతిమీద చేయివేసి వెనక్కి నెట్టాడు. అంతలో రెండోవాడు జబర్దస్త్ గాముందుకొస్తూ—

"వాడ్నేమిటన్నా బ్రతిమాలటం ? వేసేయ్ నా కొడుకుని. నీమీద రుబాబ్ చేస్తాడా వాడు ? అంత మొనగాడా ?" అంటూ పిడికిలి బిగించి చేయి ఎత్తాడు.

క్షణం ఆలస్యమైతే—

రహీంభాయ్ ముఖం పచ్చడయ్యేదే. ఎప్పుడూ ఫేస్ చేయని గొడవ ఇది అతనికి. కయ్యానికి కాలు దువ్వటం అంటే ఏమిటో మొదటిసారిగా అర్థమవుతోంది వాడికి. ఆ షాక్ లో ఎదుటివాడు తనని కొట్టబోతున్నా , వెంటనే రియాక్ట్ కాలేకపోయాడు. చివరి క్షణంలో వాత్సవ చేయి ప్రత్యర్థి చేతిని బ్లాక్ చేయటంతో రహీంకి ప్రమాదం తప్పిపోయింది.

తను బ్లాక్ చేసిన చేతిని ముందుకులాగి ఆ చేతి తాలూకు ముఖంమీద బలంగా చరిచాడు వాత్సవ. చాలా బలమైన దెబ్బ. కెవ్వుమన్నాడు వాడు. బొటాబొటా నెత్తురు ఓడుతున్న ముక్కును రెండు చేతులతో అదిమిపట్టుకొంటూ ఉన్న చోటే కూలబడిపోయాడు వాడు.

వాడ్ని కొట్టడంతో ఆగకుండా రహీంని వెంటనే హెచ్చరించాడు వాత్సవ. "వెళ్ళి ఆటోలో కూర్చో. పొరబాటున కూడా కింద అడుగుపెట్టబాక. గెట్ బాక్" అనరిచాడు.

అక్కడి రఫ్ కారక్టర్లు ఎంతమాత్రం వూహించని పరిణామం ఇది. పైగా కింద పడ్డవాడు చెవికోసిన మేకలా అరుస్తున్నాడు.

"నా ముక్కు నాశనం చేశాడు నాయనో.... వాడ్ని వేసేయండిరా! లేదంటే మన పరువులు నాశనమైపోతాయి. వాడ్ని ముక్కలుగా నరకండి" అంటూ.

వాడి అరుపులు పూర్తిగాకముందే వాత్సవ బూటుకాలు వాడి గుండెల్ని దారుణంగా తాకింది. కాలు వెంటనే ఎగిరి గింగిరాలు తిరుగుతూపోయి కాకా హోటల్ పందిరికింద పడ్డాడు వాడు. గుండెలు చితికిపోయినంత బాధతో దారుణంగా అరిచాడు వాడు.

వాడు ఏమయ్యాడో చూడలేదు వాత్సవ. షాక్ నుంచి తేరుకుని, తనమీద ఆటాక్కి రెడీ అవుతున్న మిగిలిన ముగ్గురిమీదికి లంఘించాడు.

వాళ్ళు ముగ్గురూ ఒకర్నొకరు హెచ్చరించుకుంటూ వాత్సవని చుట్టుముట్టే లోపల మరో ముగ్గురు వాళ్ళకి సాయంగా వచ్చారు.

వాళ్ళ ఆరుగురికీ తను ఒక్కడు సమాధానం చెపుతూ వాత్సవ కలబడ్డం చూసి తనను తాను మర్చిపోయాడు ఆటోరిక్షావాలా రహీంభాయ్. ఎంతో గొప్పవాడిగా తన ఆటోలో వచ్చిన పెద్దమనిషి పక్కా

వీధిరౌడీ కన్నా దారుణంగా వాళ్ళని విరగదీయటం చూసి రెప్పవాల్చటం కూడా మర్చిపోయాడు. ఆ పరవశంలో వాత్సవ హెచ్చరికను గాలికి వదిలేసి , ఆటో ఎక్కకుండా వున్న చోటే నిలబడిపోయాడు.

ఊహించని విధంగా ఎదురయిన గొడవ ఇది. ఎంత త్వరగా ముగించి బయటకుపోతే అంత మంచిదన్నది వాత్సవ అభిప్రాయం..... అందుకే చాలా వేగంగా కదులుతున్నాడు. దొరికినవాడ్ని దొరికినట్టు విరగదీస్తున్నాడు.

వాళ్ళంతా గూండాయిజం చెలాయింది మోసాలుచేసి బ్రతికే క్రిమినల్స్. వాత్సవ మార్షల్ ఆర్ట్స్ తాకిడికి ఎదురు నిలవటం వాళ్ళకి సాధ్యంకాలేదు. పోరాటం ఆరంభమైన మూడో నిముషంలోనే కరెంట్ షాక్ తిన్న కాకుల్లా వాళ్ళంతా తలోపక్కన పడిపోయి ఆర్తనాదాలుచేశారు.

"వీళ్ళ తాలూకూ ఇంకా ఇక్కడ ఎవరన్నా వున్నారా ? మీ సంగతులేమిటి ? వాడెవడు ?" అంటూ కాకాహోటల్ వైపు తిరిగి అరిచేసరికి , అక్కడున్న కొద్దిమంది తలకాయలు అడ్డంగా వూపుతూ అప్పుడే అర్జంటు పని గుర్తుకొచ్చినట్టు వేగంగా అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

అదే సమయంలో వూహించని విధంగా జరిగిపోయింది మరో సంఘటన.

వాత్సవ హెచ్చరికల్ని పెడచెవినపెట్టి ఆటో ఎక్కకుండా నిలబడి ఫైటింగ్ చూస్తున్నాడు రహీంభాయ్. దాని ఫలితం ఇప్పుడు కన్పించింది.

ఉన్నట్టుండి ఆటో స్టార్టయిన సౌండ్ విని అదిరిపడి తిరిగి చూశాడు రహీం. చూసీ చూడకముందే అతడ్ని తోసేసుకుంటూ చివ్వున వెనుతిరిగింది ఆటో. చూస్తుండగానే వేగం అందుకుని వీధి చివరకు పరుగుతీసి అదృశ్యమైంది. అక్కడికీ గుండెలు బాదుకుంటూ—

"ఆటో... .నా ఆటో.... ఆటోని ఆపండి నాయనో.... దొంగనాయాలు నా ఆటో ఎత్తుకుపోతున్నాడు ఎవడో" అని గొంతు చించుకుని అరుస్తూ కొంత దూరం ఆటో వెనక పరుగెత్తాడు. ప్రయోజనం లేకపోగా ఏడుపు ముఖంతో వెళ్ళినంత వేగంగానూ వాత్సవ వద్దకి పరుగెత్తుకు వచ్చాడు. అక్కడ అతడి గోడు పట్టించుకునే నాధుడే లేడు.

"పోరబాటై పోయింది సాబ్. మీరు నన్ను ఎందుకు ఆటో దిగవద్దని హెచ్చరించారో ఇప్పుడు అర్థమయింది. మీరే కాపాడాలి" అంటూ ఏడుపు ముఖంతో అర్థించాడు.

"భయపడకు బ్రదర్" అంటూ ఫ్రెష్‌గా సిగరెట్ ముట్టించుకుని గుండెల నిండా పొగపీల్చి వదిలాడు వాత్సవ.

"వీళ్ళ మూలంగానేగా నీ ఆటో పోయింది ? మర్యాదగా దాన్ని వెనక్కి రప్పించకపోతే వీళ్ళ దగ్గర వడ్డీతోసహా వసూలు చేద్దాం. రేయ్....మీలో ఎవడయినాసరే వున్న చోటునుంచి ఒక్క ఇంచ్ కదిలినా నిర్దాక్షిణ్యంగా కీళ్ళు విరిచేస్తాను. ఆటోని వెనక్కి రప్పిస్తారో, దాని ఖరీదు మీరిచ్చుకుంటారో మీరే ఆలోచించుకోండి" అంటూ వాళ్ళందరికీ వార్నింగిచ్చాడు వాత్సవ.

చుట్టూ చూస్తున్న వాళ్ళలో ఎవడికీ ముందుకొచ్చి వాత్సవని అడిగే దమ్ము లేకపోయింది. ఎవడు వచ్చినా బ్రహ్మరాక్షసుడిలా మీదపడి కీళ్ళు విరిచేస్తాడని భయంగా వుంది వాళ్ళకి. ఇంతలో ఒక శాల్తీ హడావుడిగా లుంగీ ఎగ్గట్టుకొంటూ, నలుగురు కుర్రాళ్ళని వెంటేసుకుని వచ్చిందక్కడికి. బట్టతల, పైజామా, లుంగీతో సీమపందిలా వున్నాడు మనిషి. వాడు వాత్సవని గమనించలేదు.

వస్తూనే -

"రేయ్.... ఏమిట్రా ఇక్కడ గొడవ జరుగుతోందట ? మన ఇలా కా లోకొచ్చి తోకాడించిన ఆ బద్మాష్ గాడు ఎవడుబే ? ఏం జరుగుతోందిక్కడ ?" అనరిచాడు.

"ఆ బద్మాష్ గాడ్ని నేనే సుకూర్ భాయ్! ఇక్కడే వున్నాను" అన్నాడు వాత్సవ కూల్‌గా.

అప్పుడు చూశాడు వాడు వాత్సవని.

చూసిన మరుక్షణం పక్కలో ఆటంబాబు పేలినట్టు అదిరిపడి , పరుగున వచ్చేశాడు దగ్గరికి.

"సాబ్....వాత్సవ సాబ్! మీరేమిటి ? ఇలా రావటం ఏమిటి ?" ఈ బచ్చాగాళ్ళు మీతోనా గొడవపెట్టుకుంది ? క్షమించండి సాబ్! మీరు క్షమించేయాలి తప్పదు. పిల్ల కాకికేం తెలుసు ఉండేలు దెబ్బని, ఈ బచ్చాగాళ్ళకేం తెలుసు మీ గురించి ? రేయ్....ఎదవల్లారా! పోయి పోయి ఎవరితో పెట్టుకున్నారో తెలుసా ? మీ మూలంగా సుల్తాన్ బజార్‌కే చెడ్డపేరు వస్తోంది పోండిబే...! ఆవలకు పోండి" అనరిచాడు నేలమీద గొంతుక్కూర్చున్న అరడజనుమంది రౌడీల్ని.

అయితే వాళ్ళు ఒక్క అంగుళం కూడా అవతలికి కదలలేదు. కదిలే ధైర్యంకూడావాళ్ళకి లేదు.

"వాళ్ళు కదలరు సుకూర్ భాయ్. ఇక్కడి నుంచి మీ వాడొకడు మా ఆటోని కిడ్నాప్ చేసుకుపోయాడు. నీకు సరిగ్గా అయిదే ఐదు నిముషాలు టైమిస్తున్నాను. ఆటో ఇక్కడ ఉండాలి. తర్వాత ఒక్క సెకను ఆలస్యమైనా ఇక్కడ భూకంపం వస్తుంది" హెచ్చరించాడు వాత్సవ.

"ఎవడ్రా ఆటో తీసుకెళ్ళింది ? ఎవడ్రా ?" విన్న తక్షణం గ౹య్ న తమ వాళ్ళమీద అరిచాడు సుకూర్ భాయ్.

"మీరు తొందరపడకండి సాబ్.....ఇప్పుడే వచ్చేస్తుంది" అంటూ అవతలకు వెళ్ళి తన సెల్ ఫోన్ లో మూడుచోట్లకు ఫోన్‌లు కొట్టి వచ్చాడతను.

జరుగుతున్న హైడ్రామాని ఆశ్చర్యంగా చూస్తున్నాడు రహీం భాయ్. కాటువేసి పారిపోయిన త్రాచుపాముని వెనక్కి రప్పించి, విషాన్ని వెనక్కి తీసుకునేలా చేసే మంత్రగాళ్ళ గురించి తను విన్నాడు. ఇప్పుడు అటువంటి మంత్రగాడిలాగే అతని కళ్ళకు కన్పిస్తున్నాడు వాత్సవ.... సుల్తాన్ బజార్ లో వేయి దాటిపోయిన ఆటో వెనక్కి తిరిగి రావటమా.....అది సంభవమేనా ? రహీంభాయ్ కి నమ్మకం కుదరటం లేదు. ఖచ్చితంగా అరగంట తర్వాత తన ఆటో పార్టులను స్పేర్ పార్ట్స్ అంగళ్ళలో వెదుక్కోవాల్సిందే...! గుండెలు చేతబట్టుకొని టెన్షన్ గా చూస్తున్నాడతను.

మూడు నిముషాలు భారంగా దొర్లిపోయాయి.

నాలుగో నిముషం పూర్తి కావటానికి మరో ఇరవై సెకండ్లు ఉందనగా మబ్బులేని పిడుగులా ఆ వీధిలోకి తిరిగి దూసుకొస్తున్న ఆటోని చూసి తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు రహీంభాయ్. చెక్కు చెదరకుండా వచ్చి వాత్సవకి సమీపంలో ఆగింది ఆటో.

దాన్ని నడుపుకొచ్చిన చార్ సొబీస్ గాడ్ని చూసి తెల్లబోయాడు రహీం. వాడు ఎవడోకాదు, తన ఆటోకి అడ్డంవచ్చిన బక్కప్రాణి. వచ్చిన నాటుకోళ్ళని చేత్తోపట్టుకుని, తన ముఖంమీద వేలు చూపించి బెదిరించి వెళ్ళిన రివటలాంటి యువకుడు.

అయితే వాత్సవ దృష్టి ఆటోమీద లేదు. ఆటో ఆగిన అదే సమయంలో వీధి చివర విన్పించిన పోలీస్ వెహికిల్ సైరన్ అతన్ని అలర్ట్ చేసింది. చూస్తుండగానే పోలీస్ పెట్రోలింగ్ జీప్ ఒకటి వీధిలోకి తిరిగి దూసుకురానారంభించింది.

దాన్ని చూసిన మరుక్షణం చెలరేగింది కలకలం అక్కడ. ఆటోని వెనక్కి రప్పించిన సుకూర్ భాయ్‌తో బాటు అంతవరకూ బుద్ధిమంతుల్లా దెబ్బల బాధను ఓర్చుకుంటూ కూర్చున్న గూండాలతోసహా అంతా

ఒక్కసారి కదిలారు. కన్నుమూసి తెరిచేలోపల ఛత్రాతికి కొట్టిన చిల్ల పెంకుల్లా తలోదిక్కుకు పరుగుతీసి అదృశ్యమయ్యారు. ఆటోలోంచి ఛెంగున దూకి పారిపోబోతున్న బక్కప్రాణిని మాత్రం వదల్లేదు రహీం. జబ్బపుచ్చుకుని వెనక్కి లాగాడు. గాలానికి చిక్కన చేపలా తప్పించుకుపోవడానికి గింజుకుంటున్నాడు వాడు.

"ఒంటిమీద గుప్పెడు కండలేదు నీ యవ్వ. ఏం బిల్డప్ ఇచ్చావ్ బే ? నా ముఖంమీద వేలుపెట్టి మరీ బెదిరించావ్ గదరా....నా ఆటోని ఎత్తుకెళ్ళి స్పేర్ పార్ట్‌లకి అమ్మేంత మొనగాడివిరా నువ్వు ? టైం లేదుగాని వుంటే నీ గొంతు కొరికి చంపేసేవాడ్ని. చూడుబే, రహీంభాయ్ దెబ్బ ఎలా వుంటుందో రుచిచూడు" అంటూ ఆపుకోలేని కోపంతో ఎత్తి వాడ్ని గిరగిరా తిప్పి ఉప్పుమూటను విసిరి పడేసినట్టు విసిరి పడేశాడు.

దబ్బున అంతదూరంలో కిందపడ్డాడు వాడు. బాధతో గొంతు నరాలు తెగిపోయేలా అరిచాడు. అంతలోనే బాధను కూడా లెక్కచేయకుండా స్ప్రింగ్ లా లేచి కన్నుమూసి తెరిచేలోపల వాడు కూడా అక్కడినుంచి మంత్రం వేసినట్టు మాయమైపోయాడు.

అవతల పోలీస్ జీప్ సమీపిస్తోంది. క్షణంకూడా ఆలస్యం చేయలేదు రహీం. ఛెంగున ఆటోలో కూర్చున్నాడు.

"రండి సాబ్! త్వరగా ఎక్కండి సాబ్. అర్జంటుగా మనం కూడా ఇక్కడ్నుంచి వెళ్ళిపోదాం. వచ్చేయండి సాబ్" అంటూ తొందరచేశాడు వాత్సవని.

కాని వాత్సవ కదల్లేదు. ఆ పెట్రోలింగ్ వేన్‌లో వస్తోంది వేరెవరన్నా అయితే లెక్క చేయకుండా వెళ్ళిపోయి వుండేవాడే. కాని వస్తోంది యస్సైరమేష్. పైగా తనని చూసేశాడు. పారిపోతే మరింత అనుమానించే ప్రమాదం వుంది.

"మనం వెళ్ళటానికింకా టైముంది రహీంభాయ్! నువు కాకా హోటల్ నుంచి అర్జంటుగా మూడు స్పెషల్ టీలు తీసుకురా. కమాన్" అంటూ సజస్ట్ చేశాడు.

ఏమనుకున్నాడోగాని ఎందుకు ఏమిటని అడగలేదు రహీం. స్టార్ట్ చేసిన ఆటో ఇంజన్ ఆపి పక్కనున్న కాకాహోటల్ ముందుకి పరుగుతీశాడు.

ఆటో వెనక జీప్ ఆగిన తక్షణం కిందకు దిగి బూట్లు టకటకలాడిస్తూ గబగబా వాత్సవ వద్దకొచ్చేశాడు యూనిఫాంలో వున్న యస్సైరమేష్.

"నువ్వేమిటి ఇక్కడ ?" వాత్సవని అనుమానంగా చూస్తూ అడిగాడు.

"చిన్న పనుండి వచ్చాలే."

"ఇక్కడేదో గొడవ జరుగుతున్నట్టు తెలిసింది."

"గొడవా.... అలాంచిదేమీ లేదే! ఇప్పుడే ఛాయ్ కోసం ఆటో ఆపించాను. ఇదో చాయ్ వచ్చేసింది టేకిట్" అంటూ రహీం తెచ్చిన గ్లాసుల్లో ఒకటి రమేష్ కిచ్చి రెండోది తను తీసుకున్నాడు. అభ్యంతరం చెప్పకుండా గ్లాసు అందుకున్నాడు రమేష్.

"సుల్తాన్ బజార్ లో నీకేం పని ?" టీ సిప్ చేస్తూ అనుమానంగా అడిగాడు

చెప్పాగా బ్రదర్. చిన్న పనుందని."

"ఏమిటా చిన్న పని ?"

"టాప్ సీక్రెట్. ఇక్కడెక్కడో చక్కని నెమలిమాంసం కావలసినంత దొరుకుతుందట. ఆ విషయం తెలుసుకుందామని వచ్చాను."

"హలో! నెమలి మన జాతీయపక్షి. నెమలిని చంపినా, నెమలి మాంసం అమ్మినా, నెమలి మాంసం పర్చేజ్ చేసినా, నెమలి మాంసం వండుకుతిన్నా అదంతా నేరమవుతుంది తెలీదా ?"

"తెలుసు....అందుకే నేరస్తుల్ని గాలించాలని వచ్చాను. నువ్వనుకుంటున్నట్టు నెమలి మాంసం కాదులే."

"షిట్. నీతో వాదించి నెగ్గలేం. నీ పిట్టకథలు నమ్మేంత మూర్ఖుడ్ని కాను నిజం చెప్పు. ఎవరిని కలుసుకోవాలని సుల్తాన్ బజార్ లో అడుగుపెట్టావ్ ?"

"నువ్వు యస్సై గాకముందునుంచే నాకు ఫ్రెండ్ వి. నా మాటలు నువ్వెందుకు నమ్మవో అర్థంగావటంలేదు."

"ఎలా నమ్ముతాను ? ఆదివారం ఇంటికి డిన్నర్ కి రాకుండా ఎగ్గొట్టిన ఫ్రెండ్స్ ని అసలు నమ్మను" అంటూ ఖాళీగ్లాసు పక్కన పెడుతుంటే తను అందుకున్నాడు రహీం. ఖాళీగ్లాసుల్ని కాకాహోటల్ వైపు తీసుకెళ్ళాడు.

"ఓ.కె. నమ్మకు. టైం ఏడుగంటలు కావస్తోంది. సీయూ" మరోమాటకి ఛాన్స్ ఇవ్వకుండా ఆటో ఎక్కికూర్చున్నాడు వాత్సవ.

రమేష్ మరింతగా ఉడికిపోతున్నాడని తెలుసు. అందుకే ఉబికివస్తున్న నవ్వును బలవంతంగా ఆపుకున్నాడు. ఇంతలో రహీం కూడా వెనక్కి వచ్చేసి తన సీట్లో కూర్చున్నాడు.

"నాకు తెలుసు. కారణం లేందే నువ్వీ ఏరియాలో అడుగుపెట్టవని. మధ్యాహ్నం ఖాద్రి గురించి అడగటానికి, నువ్విటు రావటానికి లింకు వుండే వుంటుంది. అనవసరమైన తలనొప్పులు తీసుకురావని ఆశిస్తాను. అసలు విషయం చెప్పటం మంచిది" ఆటోమీద చేయివేసి వంగి లోనకు చూస్తూ సజస్ట్ చేశాడు రమేష్.

"నువ్వు ఎక్కువగా వూహించుకోవటం తగ్గించు రమేష్! ఆరోగ్యానికి మంచిది. గుడ్ బై. ఆటో పోనీ బ్రదర్!" అంటూ వెనక్కి జరిగాడు.

అతని మాటకోసమే ఎదురుచూస్తున్న రహీం వెంటనే ఆటోని ముందుకు దూకించాడు. అయితే తమ సుల్తాన్ బజార్ లో వున్నంతవరకు రమేష్ తనను ఒదిలిపెట్టడని మనస్సులో పీకుతూనే వుంది వాత్సవకి. అది అక్షరసత్యమని కొద్దిసేపట్లోనే రుజువైంది.తమ ఆటోని పోలీస్ జీప్ తోకలా ఫాలో అవుతోంది. దాంతో మూడు సందుల అవతలవున్న తనకు కావలసిన పర్సన్ ని కలిసే పని వాయిదా వేసుకొనక తప్పలేదు.

పావుగంటపాటు తిరిగిన వీధులే తిరిగి, యస్సై రమేష్ కి ఎలాగో స్లిప్ ఇచ్చి సుల్తాన్ బజార్ నుంచి బయటపడింది ఆటో. కొంతదూరం వెళ్ళాక ఒక టెలీఫోన్ బూత్ దగ్గర ఆటో ఆపించి బూత్ లోకి వెళ్ళాడు వాత్సవ.

ఆయన బయటకొచ్చేలోపల ఒక సిగరెట్ దమ్ము కొట్టిరావటానికి దగ్గర్లోని సోడా బంక్ వైపు అడుగులేశాడు రహీం.

## 5

గురుదాస్ పూర్‌లో జనమంతా ఆ రాత్రికి దర్గా ముందున్న మైదానంలో వున్నారంటే ఆశ్చర్యంలేదు. పట్టపగల్లావున్న మైదాన ప్రాంతంలో బారులుతీరి అనేక అంగళ్ళు కన్పిస్తున్నాయి. ఎటుచూసినా జనసందోహమే. ఇక దర్గాలో అయితే ఇసకవేస్తే రాలనంత జనం.

దర్శనానికి తొక్కిసలాట జరక్కుండా చూడటంలో ఇటు పోలీసులు , అటు హోంగార్డులు తలమునకలుగా వున్నారు. అప్పుడే ఒక రౌండ్ వేసిన శ్యామ్ సుందర్ ఏడుగంటలకి ఒక కార్నర్ కొచ్చి నిలబడ్డాడు. ఆ జనప్రవాహంలో ఆ అజ్ఞాతసుందరి అక్కడికి వచ్చినా ఇద్దరూ తారసపడటం అనేది కల్లోమాట. ఏం చేయాలి ?

సిగరెట్ పొగను రింగులురింగులుగా గాల్లోకి వదులుతూ తీవ్రంగా ఆలోచిస్తున్న శ్యామ్ సుందర్ దృష్టి తనకు పాతిక గజాలదూరంలో చీకట్లలో నిలబడున్న వాటర్ టాంక్ మీద పడింది.

సుమారు అరవై అడుగుల ఎత్తున్న బలిష్టమైన కాంక్రీట్ పిల్లర్స్ మీద నిలబడుంది అతిపెద్ద వాటర్ టాంక్. పైకి పోడానికి మెట్లు వున్నాయి. ఆ టాంక్ పైనుంచి క్లాత్ బేనర్లు కొన్ని ఉత్సవానికి వచ్చే జనాల్ని ఆకర్షించటం కోసం పబ్లిసిటీకి కట్టబడివున్నాయి.

ఈ జనసందోహంలో ఆమె తనని వెదికి కలుసుకోవటం అనేది జరగని పని. కాబట్టి టైం వేస్ట్ చేయకుండా ఆమెను తనే వెదికి పట్టుకోవటం బెటర్. అలా చేయాలంటే కాస్త ఎత్తు ప్రదేశంలోంచి జనాన్ని అబ్జర్వ్ చేయాలి. అందుకు వాటర్ టాంక్ చాలా అనువైనచోటు.

శ్యామ్ సుందర్ కి ఒక అభిప్రాయం రానేకూడదు. వచ్చిందంటే దానిని వెంటనే ఆచరణలో పెట్టేస్తాడు. ఇప్పుడూ అదే జరిగింది. సిగరెట్ ఆఖరి దమ్ము లాగి కిందపడేసి నెమ్మదిగా చీకట్లోకి కదిలాడు.

ఎవరూ గమనించకుండా మెట్లు వద్దకు చేరుకుని, నీడలా పైకి అడుగులు వేశాడు. రెండే రెండు నిముషాల్లో వాటర్ టాంక్ పైకి చేరుకుని అనుకూలమైన చోట నిలబడ్డాడు. తన డేగకళ్ళతో ఉత్సవ ప్రాంతాన్ని నిశితంగా గమనించనారంభించాడు.

తన అంచనా కరక్టయితే....

ఆమె ఇప్పటికే తన కోసం జనంలో తిరుగుతూ, వెదుకులాడుతూ వుంటుంది. పట్టపగల్లావున్న విద్యుద్దీపాల కాంతిలో ఆమెను గుర్తించటం తనకి పెద్ద సమస్య కాదు. ముందుచూపుతో ఉత్సవ ప్రదేశంలోని ఒక స్టాల్ లో టిఫిన్ తిని చాయ్ తాగటం మేలైంది.లేదంటే ఆకలి తననిక్కడ కూర్చోనిచ్చేది కాదు.

ఓపిగ్గా సిగరెట్ దమ్ము కొడుతూ—

అర్థగంట వెయిట్ చేశాడు శ్యామ్ సుందర్.

సరిగ్గా ఏడుగంటల ముప్పై అయిదు నిముషాల తర్వాత అతని నిరీక్షణ ఫలించింది. ఒక యువతి జనం మధ్య గా బెదురుచూపులు చూస్తూ వాటర్ టాంక్ దిశలోనే వడివడిగా వస్తూ కన్పించింది.

ఆమెను గుర్తించటంలో ఆవగింజంత కూడా పొరపాటుపడలేదు శ్యామ్ సుందర్. అతడి వూహే అక్షరసత్యమైంది. ఆ యువతి వేరెవరో కాదు. బాద్ షా టీ కార్నర్ దగ్గర వచ్చినట్టే వచ్చి, దుండగులకు భయపడి అవతలి సందులోకి పారిపోయిన ఆదే యువతి.

ఆమె వంటిమీద అదే చారలు ఫ్యాంటు, చారల షర్టు వున్నాయి. ఆమె ముఖంలో ఆందోళన, కంగారు గమనించి నిటారుగా కూర్చున్నాడు శ్యామ్. ఆమె చాలా వేగంగా జనాన్ని నెట్టుకొంటూ వస్తోంది. ఆమె ముఖంలో ఆతృత, భయం స్పష్టంగా కనపడుతున్నాయి.

సందేహం లేదు. ఆ రౌడీ గుంపు ఇక్కడ కూడా ఆమె వెంటపడి వుండాలి. ఎక్కడ వాళ్ళు ?

మరికాస్త నిశితంగా పరిశీలించాక శ్యామ్ దృష్టి పథంలోకి వచ్చారు వాళ్ళు. సరిగ్గా ఆ యువతికి పాతిక అడుగుల దూరంలో అడవిమృగాల్లా జనాన్ని విరగదోసుకుంటూ దూసుకొచ్చేస్తున్నారు వాళ్ళు. అదికూడా కాదు శ్యామ్ సుందర్ ని కలవరపరిచింది. వాళ్ళందరికన్నా ముందుగా ఆ యువతికి జస్ట్ పదడుగుల దూరంలోకి వచ్చేసి , ఎలాగయినా ఆమెను ఆపాలనే ఉద్దేశంతో పట్టువదలని విక్రమార్కుల్లా పరుగులెత్తుకొస్తున్నారు ఇద్దరు దృఢకాయులు. ఆ ఇద్దరి చేతుల్లోనూ లైటు కాంతిపడి తళుక్కున మెరుస్తున్న పేష్కవ్ లను గమనించగానే శ్యామ్ సుందర్ కి అరచేతులు చెమటలు పట్టేశాయి.

వాళ్ళంతా ఆమెను కిడ్నాప్ చేయటానికి ఛేజ్ చేస్తున్నారని ఇంతవరకూ వూహిస్తూ వచ్చాడు. అది తప్పని ఇప్పుడు అర్థమవుతోంది. అవసరమైతే ఆమె ప్రాణాలు తీయటానిక్కూడా వాళ్ళు వెనుకాడరని అర్థమవుతోంది. అవసరమైతే ఆమె ప్రాణాలు తీయటానిక్కూడా వాళ్ళు వెనుకాడరని అర్థమవుతోంది.

చూస్తుండగానే ఆమెకు మరింత చేరువవుతున్నారు వాళ్ళిద్దరూ. ఇక ఉపేక్షించలేదు శ్యామ్ సుందర్. తను వాటర్ టాంక్ దిగి వాళ్ళ మధ్యకు పరుగెత్తే అవకాశం లేదు. అంత టైం లేదు. డెస్పరేట్ గా పక్కనవున్న క్లాత్ బేనర్ తాళ్ళను లాగి, చేతికి చుట్టుకుంటూ నిశితంగా చూశాడు. ఆ బేనర్ రెండో పక్క అంతదూరంలోని ఒక చెట్టుకొమ్మకు కట్టబడి వుంది.

శ్యామ్ సుందర్ పది సెకన్లు లెక్కపెట్టాడు. పదకొండో సెకన్లో క్లాత్ బేనర్ని బలంగా పట్టుకుని టార్జాన్ లా కుప్పించి గాల్లోకి దూకేశాడు.

సరిగ్గా ఇదే సమయంలో–

ఆమెకు అతి సమీపంలోకి వచ్చేస్తున్న ఆగంతకులిరువురికీ అడ్డంగా వచ్చేసిందో చంటిబిడ్డ తల్లి. దాంతో వాళ్ళిద్దరూ అగ్గిమీద గుగ్గిలం మాదిరి భగ్గున మండిపడ్డారు.

ఒకడు ఆమె చేతిలోని రెండేళ్ళ పసిబిడ్డను లాగి చేతికొద్దీ విసిరేశాడు పైకి. కెవ్వుమన్న ఆ పసిబిడ్డడి అరుపుతో ఆ ప్రాంతం ఉలిక్కిపడింది.

"నా బిడ్డా... నా బిడ్డను చంపేశారు నాయనో" అనే ఆ బిడ్డతల్లి అరుపులు ఆగకముందే ఆమెను ఎత్తి అవతల పడేశాడు రెండోవాడు.

ఊహించని ఆ సంఘటనకి చుట్టూ వున్న జనం హాహాకారాలు చేశారు. అంత ఎత్తున గాల్లోకి లేచిన ఆ బిడ్డ నేలమీదపడితే ప్రాణాలు దక్కవు.

ఎవరికి వాళ్ళు చేష్టలుదక్కి చూస్తూండగా జరిగిన మరో అనూహ్యమైన సంఘటన అది. చీకట్ల మాటునుంచి పక్షిలా గాల్లో దూసుకొస్తున్న ఆకారాన్ని చూసి గొల్లున అరిచారు కొందరు. వెలుగులోకి వచ్చిన తరువాత తెలిసింది ఆ ఆకారం పక్షికాదు , మనిషి అని.

బేనర్ క్లాత్ ఆధారంగా మెరుపు వేగంతో గాల్లోకి దూసుకొచ్చిన శ్యామ్ సుందర్ ఆ పసిబిడ్డ నేలకు జారకముందే గాల్లోనే భద్రంగా రెండోచేత్తో ఒడిసిపట్టుకున్నాడు. అదే వేగంలోపోయి గూండాలు ఇద్దరి గుండెల మీద దారుణంగా తన్ని , ఎగిరి బేలన్స్ నిలుపుకొంటూనే నేలను తాకాడు.

పెద్ద కాంక్రీట్ పిల్లర్ ఒకటి గుండెలమీద పడినంత బాధతో ఆ రౌడీలిద్దరూ గొంతు చించుకుని దారుణంగా అరుస్తూ ఎగిరి అవతలపడ్డారు. అదే క్షణంలో....

"నా బిడ్డ....నా బిడ్డ...." అంటూ ఆ మాతృమూర్తి చెంగున పరుగెత్తుకొచ్చి శ్యామ్ సుందర్ చేతుల్లోంచి తన బిడ్డను అందుకొని వాడ్ని గుండెలకు హత్తుకొని ముద్దులాడింది. ఆనందభాష్పాలతో శ్యామ్ సుందర్‌కి అంజలి ఘటించింది.

అవేమీ పట్టించుకోలేదు శ్యామ్. బిడ్డను అందించిన మరుక్షణం తిరిగి చూడకుండా ఎగువన పరుగుతీస్తున్న ఆ అజ్ఞాతసుందరివైపు కాలికొద్దీ పరుగెత్తాడు. ఈ లోపల వెనకవస్తున్న గూండాలు గుంపు కిందపడిన తమ వాళ్ళిద్దర్నీ లేపి, పట్టువదలని విక్రమార్కుల్లా ఆ పారిపోతున్న యువతికేసి పరుగులు ఆరంభించారు. వాళ్ళని చూసి జనం లేళ్ళగుంపులా పక్కలకు పరుగు తీయనారంభించారు.

అయితే ఇవేమీ పట్టించుకునే ఉద్దేశ్యంలో లేడు శ్యామ్ సుందర్. కన్ను మూసి తెరిచేలోగా జరిగిపోయిన ఆ సంఘటన నుంచి చుట్టూ జనం తేరుకోకముందే మెరుపులా పరుగుతీశాడు ముందుకు.

తన దృష్టి పథంలోంచి ఆమె మిస్ గాకూడదన్న లక్ష్యంతో శక్తి నంతా పాదాల్లో కేంద్రీకరించి రేసుగుర్రం మాదిరి ఆమెవై పుదూసుకుపోసాగాడు.

"పకడో సాలేకో.... మారో.... ఖతంకరో దోనోంకో...." అంటూ వెనుకనుంచి గూండాల అరుపులు, పరుగులు వినబడుతూనే వున్నా యి.

ఇంతవరకూ ఆ యువతి మాత్రమే వాళ్ళ టార్గెట్. ఇప్పుడు తనూ వాళ్ళకి టార్గెట్ అయ్యాడని అర్థమవుతూనే వుంది. అయినా అవేమీ పట్టించుకునే ఉద్దేశ్యం లేదు.

అటు ఆ యువతి తన వెనక ప్రపంచం భగ్గున మండిపోతున్నా తనకేమీ సంబంధం లేనట్టు ఒలింపిక్ రన్న ర్ లా ముందుకే దూసుకుపోతోంది.

ముప్పై సెకండ్లలోపే ఆమె పక్కకు చేరుకున్నాడు శ్యామ్ సుందర్. "హలో మేడం! మీరు కలుసుకోవాలనుకుంటున్న ముఖం ఇదేనేమో ఓసారి చూసి చెప్తారా ?" అంటూ ఆమె పక్కన పరుగుతీస్తూనే పలకరించాడు.

అతన్ని చూడగానే ఆమె ముఖంలో రిలీఫ్ కన్పించింది. చెమటలు కారుతున్న ముఖంతో అంత టెన్షన్ లో కూడా అతని మాటలకు చటుక్కున నవ్వేసింది.

"థాంక్ గాడ్! ఈ గొడవలో నిన్న కలుసుకోవడం సాధ్యపడదేమోనని భయపడ్డాను. నా మాట మన్నించి వచ్చినందుకు థాంక్స్ అంది.

"థాంక్స్ సంగతి దేవుడెరుగు. దొరికితే నీతోబాటు నన్నూ నరికి పోగులు పెట్టేలా వున్నారు. ఈ గూండాలేమిటి ? ఈ పరుగులేమిటి ?" పరుగు ఆపకుండా అడిగాడు.

ఇద్దరి సంభాషణ ఇంగ్లీష్ లోనే సాగుతోంది.

ఆమె ఏదో చెప్పేలోపలే–

కుడిపక్కగా దూసుకొస్తున్న మరో నలుగురు రౌడీలజట్టు ఇద్దరి మార్గానికి అడ్డు వచ్చేలా కనబడింది. వెనక తరుముతున్న వాళ్ళలో అరడజనుమంది తమ సమీపానికి వచ్చేస్తున్నారు. క్షణంకూడా ఆలస్యం చేయలేదు శ్యామ్ సుందర్.

"ఆగు బేబి.....ఒక్క క్షణం ఆగు వెళ్ళిపోదాం" అంటూ సమీపంలోని ఒక హోంగార్డ్ వైపువేగంగా దూకి అతడి చేతిలోని బాణాకర్రను లాక్కున్నాడు.

దాన్ని ఎత్తి మోకాలిమీద కొట్టగానే సగానికి విరిగి రెండు చేతుల్లోకి రెండు ముక్కలు వచ్చాయి. వాటిని ఆయుధాలుగా పట్టి విష్ణుచక్రాల్లా గిర్రున తిప్పుతూ వెనుతిరిగేసరికి వెనక నుంచి దూసుకొస్తున్న హీరోలు రానే వచ్చేశారు దగ్గరికి.

వచ్చీరాకముందే రాక్షసుడిలా వాళ్ళమీదకు విరుచుకుపడ్డాడు. శ్యామ్ సుందర్. దూసుకొచ్చిన హీరోలు ఎంతమాత్రం వూహించని సంఘటన అది. ఆయుధాలు ప్రయోగించటానికి, ఎదిరించటానికి అవకాశమే చిక్కలేదు వాళ్ళకి. ఏం జరుగుతుందో వూహించే లోపలే ఒక్కొక్కడి ముఖం పేలిపోయింది.

శ్యామ్ సుందర్ చేతిలోని కర్రలు కంటికి కనిపించనంత వేగంతో చేసిన దాడికి వెర్రికేకలు వేస్తూ ముఖాలు కప్పుకుని కూలబడిపోయారు. చుట్టూ జనం మరోసారి పక్కలకు పరుగుతీశారు భయంతో.

ఇదే సమయంలో తమకు అడ్డంగా వచ్చిన నలుగురు గూండాలమీదికి చిరుతపులిలా లంఘించింది ఆ యువతి. ఆమె నోటినుంచి వెలువడిన కుంగ్ ఫూ సౌండ్ విని తలతిప్పి ఆశ్చర్యంగా చూశాడు శ్యామ్ సుందర్.

ఆమె బొంగరంలా తిరిగి గాల్లోకి లేచి కుడికాలు విసిరింది. ఆమె పాదం పక్కటెముకల్ని తాకిన మరుక్షణం "చచ్చాను... నేను చచ్చిపోయాన్నాయనో" అనరిచాడు ఒకడు. అరుస్తూనే కాలు వెంబడి లేచి గింగరాలు తిరుగుతూపోయి జనం కాళ్ళ మధ్యలో పడ్డాడు. తొక్కిసలాటలో జనం కాళ్ళమధ్య వాడు పచ్చడైపోయాడంటేఆశ్చర్యంలేదు.

వాడు ఏమయ్యాడో చూళ్ళేదామె. మెరుపు వేగంతో మిగిలిన ముగ్గురి మీదకు బ్రహ్మరాక్షసి మాదిరి విరుచుకుపడింది. ఆ ముగ్గురి ఆర్తనాదాలతో ఆ ప్రాంతం దద్ధరిల్లిపోయింది. కరెంట్ షాక్ తిన్న కాకుల్లా తలోపక్కన పడిగిలగిలా తన్నుకోసాగారు.

ఆమె అసాధ్యురాలని అప్పటిగ్గాని శ్యామ్ సుందర్ కి అర్థంకాలేదు. క్షణం కూడా ఆలస్యం చేయకుండా పరుగెత్తి ఆమె చేయి పట్టుకున్నాడు. అవతల మూడు పక్కల నుంచి తమని కవర్ చేయటానికి పరుగులెత్తుకొస్తున్నారు రౌడీలు.

"మనం యిక్కడ ఫైటింగులు చేస్తూ కూర్చుంటే చిక్కుల్లో పడతాము. ఇక్కడ గొడవలు జరక్కుండా పోలీస్ బందోబస్తు పకడ్బందీగా చేసారు. పోలీసులు చుట్టుముట్టకముందే మనం ఈ నాస్టీ సిట్యుయేషన్ నుంచి

బయటపడాలి. కమాన్" అని హెచ్చరిస్తూ పరుగు ఆరంభించాడు. ఈసారి అతడి చేయి వదలకుండా గట్టిగా పట్టుకుని అతన్ని ఫాలో అయిందామె.

"నువ్వు బాగా ఫైట్ చేయగలవ్. అయినా పారిపోతున్నావు ఎందుకు ?" పరుగు ఆపకుండానే అడిగాడు. వెంటనే బదులిచ్చిందామె.

"అనువుగానిచోట ఎదురు తిరగటంకన్నా తప్పించుకుపోవటం మంచిది కదా. అందుకే" అంది. తిరిగి తనే చెప్పింది. "కరాటే, కుంగ్ ఫూ, మార్షల్ ఆర్ట్స్ లో హాంకాంగ్ లోని టాప్ రౌండ్ లేడీస్ పదిమందిలో నేనూ వున్నాను."

"బాప్ రే... అయితే నీ దగ్గర కాస్త జాగ్రత్త గావుండాల్సిందే."

"షిట్. జోక్ చేయటానికిది కాదు సమయం. వాళ్ళు దగ్గర పడుతున్నారు

"డోంట్ వర్రీ. ముందు మనం ఈ జనప్రవాహంలోంచి అవతలికి పోతే ఆ తర్వాత వాళ్ళ గురించి ఆలోచించవచ్చు." అంటూ ఆమెతో బాటు ఎడంపక్కకి తిరిగి ఇంతకుముందు తను పైకెక్కిన వాటర్ టాంక్ ప్రాంతం చీకట్లలోకి దూసుకుపోయాడు.

"సో... యూ కమ్ ఫ్రం హాంకాంగ్" పరుగు ఆపకుండానే ఇంగ్లీష్ లో అడిగాడు.

"యా" అంటూ తలెగరేసిందామె.

"డామిట్.....ఇలా పరుగులెత్తటానికి హాంకాంగ్ నుంచి ఇంత దూరం రావాలా ? అదేదో హాంకాంగ్ లోనే పరుగుతీయొచ్చుగా, ఇక్కడికొచ్చి నా ప్రాణం తీయకపోతే" తెలుగులో ఆమెకు వినపడేలా గొణిగాడు.

"నేనొచ్చింది నీ ప్రాణాలు తీయటానిక్కాదు. నా ప్రాణాలు కాపాడుకోడానికి" అంది స్వచ్ఛమైన తెలుగులో ఆమె.

అదిరిపడి ఆమె చేయి విదిలించుకుని, అక్కడే ఆగిపోయి ఆమె వంక చూసాడు. చీకట్ల మాటున ఒకరి ముఖం ఒకరికి సరిగ్గా తెలీటం లేదు.

"నువ్వు తెలుగు మాట్లాడుతున్నావ్" అన్నాడు ఎగ్జైటింగ్‌గా.

"అవును. హాంకాంగ్ అమ్మాయినని చెప్పానుగాని తెలుగు రాదని చెప్పలేదే" అంది మరింత స్వచ్ఛంగా.

"అవునవును. నీకు తెలుగు వచ్చున్న సంగతి ముందే తెలిసి పోయింది గాబట్టి నేను జాగ్రత్తగా వుండొచ్చు. లేదంటే పొరబాటున నోరు జారితే నా కాలో చెయ్యో కరాటే దెబ్బతో విరిచేసేదానివి."

"ఏయ్.... వాళ్ళు వచ్చేస్తున్నారు. జోకులేయక పదా" అంటూ హెచ్చరించిందామె.

ఆమె మాటల్లో అసత్యం ఏమీలేదు.

ఆ కాస్త వ్యవధిలోనే దరిదాపుల్లోకి వచ్చేస్తున్నారు వాళ్ళు. ఆమె చేయి పట్టుకుని రన్నింగ్ ఆరంభించాడు శ్యామ్. చీకట్లను దాటి అవతలి వైపు చేరుకోగానే అటుగా వస్తున్న గూండాల్లో ఒకడు గొంతు చించుకుని అరిచాడు.

అటువెళ్ళి ఆ అరిచినవాడు గొంతుమీద నాలుగు పంచ్ లు యిస్తే ఎలా వుంటుందా అన్న ఆలోచన క్షణకాలం కుదిపి వదిలింది శ్యామ్ ని. టోటల్ గా చూస్తే ఆ గూండాల సంఖ్య సుమారు ఏభై కితగ్గదనిపించింది. అదే సమయంలో ఎగువన పోలీసు విజిల్స్, అరుపులు విన్పిస్తున్నాయి. ఉన్నగోల చాలదని పోలీసులు కూడా రంగంలోకి దిగితే తన పని పెనం మీద నుంచి పొయ్యి మీద పడినట్లవుతుంది. అందుకే పరుగు తీయటంలో ఇక తిరిగి చూడలేదు. పల్చబడిన జనం మధ్యగా సుడిగాలి మాదిరి ఇద్దరూ హైవేమీదకుదూసుకు పోయారు. ఒకరొకరుగా గుంపుచేరి రోడ్డుమీద కొచ్చిన గూండాలు వేటకుక్కల్లా ఆ జంటను తరమసాగారు. ఇదే సమయంలో కాస్త ఎగువన___

రోడ్ కి అవతలి పక్కన చెట్టుకింద ఉంది నాన్ వెజ్ కాకా హోటల్ ఒకటి. రుచికరమైన చక్కని కబాబ్ లకు ఆ హోటల్ పెట్టిందిపేరు. హోటల్ ముందు బల్లమీద కూర్చున్నాడు డ్రైవర్ జలీల్ ఖాన్.

సాయంత్రం అయిదు గంటల ప్రాంతంలో శ్యామ్ సుందర్ ని దర్గా సమీపంలో దించివెళ్ళాక లోకల్ గా రెండు సవారీలు చూసుకుని రాత్రి ఏడు గంటలకి తిరిగి టాక్సీస్టాండ్ కి వచ్చేసాడు. ఇక ఇంటికి వెళ్ళిపోయే ఉద్దేశంతో సవారీల కోసం చూడలేదు. కోలాహలంగా ఉన్న ఆ ఉత్సవ ప్రాంతాలని వదిలిపోబుద్ధిగావటంలేదు.

దగ్గర్లోని బ్రాందీ షాపులో క్వార్టరు విస్కీ కొట్టి తీరిగ్గా బల్లమీద కూర్చుని, కబాబ్ లు తింటూ మిత్రులతో కబుర్లలో పడ్డాడు.

ఎంతసేపు గడిచిందో గుర్తులేదుగాని ఉన్నట్టుండి రోడ్ మీద చెలరేగిన కేకలు, అరుపులు విని అందరితో బాటు తనూ అటు చూసాడు ఖాన్. చూసిన మరుక్షణం కంగారుగా లేచాడు బల్ల మీంచి.

వీధిలైట్లకాంతిలో పారిపోయి వస్తున్న జంటను స్పష్టంగా చూసాడు. ఆమె పక్కన వున్న పెద్దమనిషిని పోల్చుకున్నాడు. వెనకనే ఇనపరాడ్‌లు, సైకిల్‌చైన్‌లు, పట్టాకత్తులతో ఒక పటాళమే ఆ జంటను తరుముకు రావటం కూడా చూసాడు. అతడి పెదవుల మీద అప్పటికప్పుడు విరిసిందో దరహాసం.

"అదన్న మాట సంగతి. గురువుగారు ఎందుకంత జరూరుగా ఇక్కడి కొచ్చాడో తెలిసిపోయింది. ఇది లవ్ కేసు. వాళ్ళని కాపాడాలి" అనుకుంటూ చెంగున ముందుకు దూకి నాలుగు అంగల్లో తన టాక్సీని చేరుకున్నాడు. కన్ను మూసి తెరిచే లోపల టాక్సీ స్టార్టయి థండర్ బర్డ్‌లా రోడ్ మీదకు దూసుకెళ్ళింది.

దారుణంగా హారన్ మోగించుకుంటూ గూండాల పక్క నుంచే ముందుకు పరుగుతీసింది. ముందు పరుగుతీస్తున్న జంటను దాటి కాస్త ముందుకెళ్ళి సడెన్ బ్రేక్‌తో ఆగింది.

"రండి గురువుగారూ! నేను ఖాన్ భాయ్ ని , మీకొచ్చిన భయం లేదు. అర్జంటుగా కార్లోకి వచ్చేయండి" అనరిచాడు క్లచ్ మీంచి కాలు తీయకుండానే.

ఆ సమయంలో ఆపద్భాంధవుడిలా తమ ముందుకొచ్చిన జలీల్ ఖాన్ ని అభినందించకుండా వుండలేకపోయాడు శ్యామ్ సుందర్. క్షణం కూడా ఆలస్యం చేయలేదు.

"థాంక్స్ ఖాన్ భాయ్" అంటూనే వెనక డోర్ తెరిచి ఆమెను బాక్ సీట్లోకి తోసి డోర్ మూశాడు.

అది చూసి గొల్లున అరిచారు వెనక గూండాలు.

రెట్టించిన పట్టుదలతో దూసుకొస్తూ కొందరు ఆయుధాల్ని కారువైపు విసిరారు.

ఫ్రంట్ డోర్ తీసి లోనకు జంప్ చేసి డోర్ మూశాడు శ్యామ్ సుందర్. మరుక్షణం క్లచ్ మీంచి కాలు తీశాడు ఖాన్. అంతే! కళ్ళెం విడిచిపెట్టిన గుర్రంలా ముందుకు దూసుకుపోయింది కారు.

అంతవరకూ తరుముకొచ్చిన రౌడీమూక ఎక్కడి వాళ్ళక్కడ ఆగిపోయారు. రెండే రెండు నిముషాల వ్యవధిలో అరడజను వేన్లు రివ్వు రివ్వున మెరుపు వేగంతో వచ్చి వాళ్ళ ముందు ఆగాయి. కోతుల మూకలా రౌడీలంతా వేన్ లో ఎగబడ్డారు. వచ్చినంత వేగంగానూ అవి తిరిగి బయలుదేరాయి అంబాసిడర్ కోసం.

"నాకు తెలుసు గురూగారూ! మీది లవ్ కేసని ముందే వూహించాను. రౌడీ యిజంతో ఎవరూ ప్రేమను నాశనం చేయలేరు సార్. మీ ప్రేమ విజయానికి నేను మీకు అండగా వుంటా" అనరిచాడు హుషారుగా ఖాన్.

సిటీ అవుటర్ కి దూసుకుపోతోంది కారు.

అతని మాటలకి వెనక సీట్లోని యువతి ఫక్కున నవ్వింది. శ్యామ్ సుందర్ విసుగ్గా చూశాడు ఖాన్ ని.

"కాస్త నోరు మూస్తావా ఖాన్. అనవసరంగా ఏవేవో వూహించుకోకు. ముందు మనం ఆ గూండాల కంటపడకుండా దూరంగా వెళ్ళిపోవాలి పోనీ" అన్నాడు ముఖం నిండా విసుగు నింపుకుంటూ.

"డోంట్ వర్రీ సాబ్. మన కారుని కేచ్ చేయటం వాళ్ళ ముత్తాతలకి కూడా సాధ్యం కాని పని" అన్నాడు ఉత్సాహంగా ఖాన్.

"ఆ మాటేదో ఓసారి వెనక్కి చూసి చెప్పు" అంటూ సిగరెట్ ముట్టించుకున్నాడు శ్యామ్ సుందర్.

తిరిగి చూసిన ఖాన్ ఉలిక్కిపడ్డాడు.

ఎగువన భుతాల్లా దూసుకొస్తున్న అరడజను వెహికిల్స్, హెడ్ లైట్ల కాంతి స్పష్టంగా కన్పించింది. పట్టుదలగా తలెగరేశాడు.

"రాలేరు సాబ్! వాళ్ళు మన దరిదాపులకి కూడా రాలేరు. ఈ ఖాన్ భాయ్ మీకు మాటిస్తున్నాడు" అంటూ మరింతగా అదిమాడు ఆక్సిలేటర్‌ని కిందికి.

లాగిపెట్టి వదిలిన బాణంలా హైవేలో దూసుకుపోనారంభించింది కారు. చూస్తుండగానే సిటీ లిమిట్స్ దాటేశారు. మరో పది కిలోమీటర్ల దూరం ముందుకు పోగానే హైవే నుంచి కుడిపక్కగా చీలిపోతోంది మరో రోడ్డు. ఆ రోడ్డున ట్రాఫిక్ చాలా తక్కువ. ఏజన్సీ ప్రాంతంగుండా పోయే ఘాట్ రోడ్ గాబట్టి గూండాల కంట్లో దుమ్ముకొట్టి సులువుగా వెళ్ళిపోవచ్చన్న ఆలోచనతో కారుని ఆ రూట్‌కి మళ్ళించాడు ఖాన్.

వెనక దూరంలో వస్తున్న వెహికల్స్ లోని ప్రత్యర్థులు తమ కారుని గమనించి వుండరు. స్ట్రెయిట్‌గా వెళ్ళిపోతారనే శ్యామ్ కూడా వూహించాడు. కానీ అతని అంచనాని కూడా తల్లకిందులు చేస్తూ ఆ వేన్‌లన్నీ కారుని ఫాలో అవుతూ అదే రోడ్‌కి తిరిగి దూసుకురానారంభించాయి.

అంత తొందరగా వాళ్ళు తమ కారుని చేరుకోలేరు గాబట్టి ఇప్పటికిప్పుడు వచ్చిన ప్రమాదం ఏమీలేదు. ఈలోపల ఆమె వివరాలు తెలుసుకోవచ్చనే ఉద్దేశంతో ఫ్రష్‌గా మరో సిగరెట్ ముట్టించుకుని, "హలో మిస్! ఇప్పటికయినా నీ పేరేమిటో చెప్తావా ?" అంటూ వెనక్కి తిరిగి చూశాడు.

ఆమె మెలుకువగా వుంటేగా సమాధానం చెప్పటానకి! పరుగులెత్తి పరుగులెత్తి డస్సిపోయిన శరీరం, జివ్వున కొడుతున్న చల్లటిగాలికి అలుపు తీరేలా వెనక సీట్లో ముడుచుకు పడుకుని గాఢనిద్రలోకి జారిపోయిందామె.

ఒక పక్క ఇంత టెంషన్‌లో వుంటే ఆమె నిశ్చింతగా తన పాటుకి నిద్రపోతుందా ? అతనికొస్తున్న కోపానికి ఆమెను ఎత్తి కుదేసి కూర్చోబెట్టి ఆమె పేరు, వివరాలు మొత్తం అడిగి తెలుసుకోవాలనుంది. కాని అంతలో చప్పున చల్లారిపోయిందా కోపం. ప్రస్తుతం తన రక్షణ వుందన్న ధైర్యంతో ఆమె నిశ్చింతగా రిలాక్సవుతోంది. లేచాక ఎలాగూ చెప్తుంది. ఆమె నమ్మకాన్ని ఎందుకు పాడుచేయటం ? అందుకే ఇక ఆమెను డిస్టర్బ్ చేయకుండా హైవేమీదకు దృష్టి సారించాడు.

క్రమంగా దట్టమైన అటవీప్రాంతం. కొండ కోనలు ఎదురవుతున్నాయి. హెడ్ లైట్ల కాంతిలో చీకట్లను చీల్చుకొంటూ నిర్మానుష్యంగా వున్న రోడ్ వెంట రాకెట్ వేగంతో దూసుకెళుతోంది. కారు. జలీల్ ఖాన్ డ్రైవింగ్ నైపుణ్యాన్ని మెచ్చుకోకుండా వుండలేకపోయాడు శ్యామ్ సుందర్.

వెనక వాహనాలు కూడా పట్టువదలని విక్రమార్కుల్లా తమకు నాలుగు ఫర్లాంగుల వెనక తరుముకుంటూనే రావటం మాత్రం కాస్త కంగారు పుట్టిస్తోంది.

"ఏమిటి గురూగారూ! కాస్త మందుకొడతారా ?" అడిగాడు ఖాన్.

"ఉందా ? ఈ చలికి కాస్త పుచ్చుకుంటేనే బెటర్ లా వుంది."

"పుచ్చుకోవాలి సాబ్! తప్పదు. అటు చూశారా ? ఆకాశంలో మబ్బులు ముసురుకుంటున్నాయి. వర్షం పడిందంటే మన పని మరింత చెండాలంగా వుంటుంది" అంటూ డాష్ బోర్డు లాగి ఆఫ్ బాటిల్ విస్కీ తీసి ఇచ్చాడు ఖాన్. మూతతీసి శ్యామ్ నాలుగు గుక్కలు రా తాగి యిచ్చాడు. ఖాన్ తనో రెండు గుక్కలు తాగి మూత బిగించి పక్కన పెట్టాడు.

"ఏమిటి సాబ్! లవ్ ఎఫైర్ కాదంటున్నారు. ఇంతకీ మేడం గారిపేరేమిటి ? మీకేమవుతారు ?" కుతూహలం ఆపుకోలేక అడిగేశాడు.

వాడికి అసలు విషయం చెప్పేయటం బెటరనిపించింది శ్యామ్ కి. లేకపోతే ప్రశ్నలతో వేధిస్తూనే వుంటాడు.

"చూడు ఖాన్! ఆమె వివరాలు నాకూ తెలీదు. ఆశ్చర్యపోకు. డైనమిక్ సెక్యూరిటీ సర్వీసెస్ అనే ప్రయివేటు డిటెక్టివ్ ఏజన్సీకి చెందిన మనిషిని నేను. ఈ అమ్మాయి మధ్యాహ్నం మా ఆఫీసుకు ఫోన్ చేసి నాతో మాట్లాడింది. వెంటనే తనను కలవాలంది. అనుకున్న చోట కలవటం శత్రువుల మూలంగా వీలుకాలేదు. దాంతో గురుదాస్ పూర్ లో రాత్రి ఏడుగంటలకి దర్గా దగ్గర కలుస్తాను రమ్మంది. తీరా చూస్తే అనేకమంది గూండాలు

ఈమెను వేటాడుతూ కన్పించారు. రక్షించి తీసుకొస్తున్నాను. సో! విషయం అర్థమైందా ? ఇకమీద తెలుసుకోవాలి ఆమె వివరాలు" అంటూ క్లుప్తంగావివరించాడు.

ఆ మాటలు విని తెరిచిన నోరు మూయటం మర్చిపోయాడు జలీల్ ఖాన్. ఇంకో ప్రశ్న అడిగే ఛాన్స్ అతనికి లేకపోయింది.

అప్పటికే రెండు గంటలు సాగిందా ఛేజింగ్.

"ఏమైంది ?" అడిగాడు శ్యామ్ సుందర్.

"కొంప మునిగింది గురూ! కారులో డీసెల్ ఎంప్టీ కావస్తోంది" అంటూ అసలు విషయం చల్లగా బయట పెట్టాడు ఖాన్.

## 6

రిసీవర్ చెవికానించుకుని కాసేపు అలాగే నిలబడ్డాడు వాత్సవ. అవతల ఫోన్ రింగవుతోన్న శబ్దం వినబడుతోంది.

పది సెకన్ల తర్వాత ఎవరో ఫోన్ లిఫ్ట్ చేశారు "హలో ఎవరు ? ఎవరు కావాలి ?" అంటూ వినవచ్చింది లేడీ వాయిస్.

"రిజ్జూ నాయక్ తో మాట్లాడాలి" చెప్పాడు.

"రిజ్జూ భయ్యా ఇంతక్రితమే బయటికెళ్ళాడు. ఫోర్త్ క్రాస్ వీధిలో ఏదో గొడవ జరిగిందని తెలిసి అటు వెళ్ళాడు. రావటానికి కాస్త టైమ్‌పడుతుందనుకుంటూ...." చెప్పిందామె.

ఆ తర్వాత ఆమె అడగబోయే ప్రశ్న ఏమిటో వాత్సవకి తెలుసు. తన వివరాలు చెప్పటం ఇష్టంలేదు. అందుకే ఆమె సంభాషణని మధ్యలోనే అడ్డుకున్నాడు.

"ఎంత టైమైనా ఫరవాలేదు. వెయిట్ చేస్తాను. రాగానే ఇప్పుడు నేను చెప్పే నంబర్‌కి ఫోన్ చేయమని చెప్పు" అంటూ తను మాట్లాడుతున్న బూత్ ఫోన్ నంబర్ చెప్పి లైన్‌కట్ చేసాడు.

బూత్ ఆపరేటర్ తో ఫోన్ వస్తుంది పిలవమని చెప్పి , బయటికొచ్చి సిగరెట్ ముట్టించుకున్నాడు.

సరిగ్గా ఇరవై నిముషాల తర్వాత రిజ్జూనాయక్ నుంచి ఫోన్ వచ్చింది.

"హలో రిజ్జూభాయ్! నేను వాత్సవని. ఎలా వున్నావ్ ?" అంటూ పలకరించాడు.

అవతలి వ్యక్తి లోచెప్పరాని ఆశ్చర్యం. ఆ విషయం అతని కంఠంలో స్పష్టంగా ధ్వనించింది.

"వాత్సవసాబ్! ఇది కల కాదుగదా ? కాకితో కబురంపితే నేనే వచ్చేవాడ్ని గదా" అన్నాడు.

"నేనే మీ ఇంటికి రావాలని వచ్చి సుల్తాన్ బజార్ లో అడుగుపెట్టాను. కాని పరిస్థితులు అనుకూలించలేదు. నువ్వు నా దగ్గరికి రాగలవా ? అర్జంట్ సమాచారం."

"వచ్చేస్తాను. ఎక్కడికి రమ్మంటారు ?"

చెప్పాడు వాత్సవ.

"టెలిఫోన్ బూత్ కి సరిగ్గా అయిదుగజాల దూరంలో ఆటో కన్పిస్తుంది. నేను ఆటోలో వుంటాను."

"ఓ.కె. సాబ్! ఇప్పుడే బయల్దేరుతున్నాను."

ఫోన్ పెట్టేసి ఇవతలకి వచ్చాడు వత్సవ. ఆటో డ్రైవర్ రహీం సోడా బంక్ నుంచి వెనక్కి వస్తూ కన్పించాడు.

"చెప్పండి సాబ్! వెళ్ళిపోదామా ?" దగ్గరకు రాగానే అడిగాడు.

"చెప్తా. నే పిలిచేవరకూ రాకు. సోడాబంక్ దగ్గరే నిలబడు...." అంటూ అతన్ని వెనక్కి పంపించి, తను ఆటోలో కూర్చుని ఫ్రెష్ గా మరో సిగరెట్ ముట్టించుకున్నాడు.

సరిగ్గా పావుగంట తర్వాత—

కాస్త పొడవుగా, సన్నగా వున్న బట్టతల నడివయస్కుడు సైలెంట్ గావచ్చి ఆటో ఎక్కి వాత్సవ పక్కన కూర్చున్నాడు. అతనే రిజ్జూనాయక్. అతనొక మూవింగ్ ఇన్ఫర్మేషన్ సెంటర్ అంటే ఆశ్చర్యం లేదు. డబ్బులిస్తే ఎలాంటి సమాచారమైనా చేరవేయటంలో ఘటికుడు. సిటీలోని క్రిమినల్స్ కి సంబంధించిన సమాచారం ఎంతో అతడి దగ్గర వుంటుంది.

"చెప్పండి సాబ్ ! ఏం కావాలి ?...." వాత్సవ అందించిన సిగరెట్ ముట్టించుకుని మృదువుగా అడిగాడు రిజ్జూ.

"ఖాద్రి.... ప్రస్తుతం వాడు ఎక్కడ వున్నాడు ? వివరాలు కావాలి" సూటిగా విషయానికొస్తూ అడిగాడు వాత్సవ.

పెదవి విరిచాడు రిజ్జూ.

"ప్రస్తుతం వాడు తన అడ్డాలో లేడు. సిటీలోనో సిటీ అవుటర్ లోనో మొత్తానికి వాడు యిక్కడే వున్నాడు. రెండు హత్యలు వాడి పీకల మీదికి తెచ్చాయి. మరో పక్క మాన్సూర్ ఆలీ మూలంగా మాల్యాద్రితో శతృత్వం పెరిగింది. ఆవకాశం కోసం చూస్తున్నాడు మాల్యాద్రి. దొరికితే ఆలీని ముక్కలుగా నరకాలని ఖాద్రీ చూస్తున్నాడు. అయితే అటు పోలీసులు, ఇటు మాల్యాద్రిల నుంచి తాత్కాలికంగా తప్పించుకోవటానికి తన అడ్డాని వదిలి బయట వుంటున్నాడు వాడు. వాడ్ని బయటికి రప్పించటం అంత తేలిక కాదు" వివరించాడు.

అయిదు నిముషాలు రిజ్జూ నాయక్ తో చర్చించాడు వాత్సవ. చివరికి తనకు కావలసింది అడిగాడు.

"మీరడిగిన ఫోన్ నంబర్లు సంపాదించటం కష్టమేగాని, అసాధ్యం ఏమికాదు. కాదంటే కాస్త ఎక్కువగా ఖర్చవుతుంది" చెప్పాడు రిజ్జూ.

"ఎంత ?"

ఒక ఫిగరు చెప్పాడు రిజ్జూ.

వాత్సవ వాలెట్ తీసి, అతను అడిగినంత ఇచ్చేశాడు.

"ఓ.కె. సాబ్! ఈ రాత్రికి ఎలాగో నా తంటాలు నేను పడి, మీకు కావలసిన సమాచారం, పోన్ నంబర్లు సంపాదిస్తాను. మీరు ఉదయం అయిదు గంటలకి హిందీ ప్రచారసభ కట్టడం వెనక సందులోకి రండి. అక్కడ చెత్త కుండీ పక్కనున్న మండపంలో మీకోసం రెడీగా వుంటా" రిజ్జూనాయక్ ఆటో దిగిపోయాడు.

తనను ఎవరూ గమనించటంలేదని నిర్ధారణ కాగానే పెద్ద పెద్ద అంగలతో రోడ్ క్రాస్ చేసి అటుగా వస్తున్న ఆటో ఎక్కేసాడు.

సోడాబంక్ ముందు నిలబడిన రహీంని వెనక్కి రమ్మని చేయి వూపాడు వాత్సవ. రహీం వచ్చి ఆటో స్టార్ట్ చేసాడు.

తమ డైనమిక్ సెక్యూరిటీ సర్వీసెస్ ఆఫీసు ముందు వాత్సవ ఆటో దిగేసరికి రాత్రి ఎనిమిది దాటింది సమయం.

అప్పటికింకా కాలేషావలీ తన బడ్డీ కొట్టులో బిజీగానే వున్నాడు. ఆటో ఆగటం చూడగానే కష్టమర్లని కూడా పట్టించుకోకుండా, చెంగున బయటకు దూకి, రోడ్ క్రాస్ చేసి పరుగెత్తుకు వచ్చేసాడు ఆటో వద్దకు.

"ఏరా రహీం! సాబ్ కి ఏమన్నా ట్రబులిచ్చావా ? నీ ఆటో సరిగ్గానే నడుస్తోందా ? ఇబ్బందేమీ కలగలేదు కదా ?" అంటూ వస్తూనే కురిపించాడు ప్రశ్నల వర్షం.

"వలీ.... అలాంటిదేమీ లేదు. మీవాడు చాలా భద్రంగా నన్ను తిప్పి తీసుకొచ్చాడు. వెళ్ళి నీ పని చూసుకో. వెళ్ళమంటున్నా గా..." అంటూ వలీని తిరిగి రోడ్ దాటించాడు వాత్సవ. వాలెట్ తీసి రహీంకి ఆటో ఫేర్ గాక అదనంగా మరికొంత డబ్బు ముట్టచెప్పాడు.

"రహీం! ఉదయం నాలుగున్నరకి.... సరిగ్గా నాలుగున్నరకి ఇక్కడికి రాగలవా ? మనం ఒకచోటికి వెళ్ళాలి" అడిగాడు.

"వస్తాను సాబ్! మీరు చెప్పిన టైంకి ఇక్కడ ఉంటాను" అంటూ సలాం చేసి ఆటోని ముందుకు దూకించాడు రహీం.

అప్పటికింకా సెకండ్ ఫ్లోర్ లోని తమ ఆఫీసులో లైట్లు వెలుగుతూనే ఉండటాన్ని బట్టి వాసంతి ఆఫీస్ లోనే వుందని అర్థమైంది. అతను పైకి వెళ్ళేసరికి ఆమె కంప్యూటర్ మీద ఇంకా వర్క్ చేస్తూనే వుంది.

"శ్యామ్ సుందర్ ఫోన్ చేసాడా ?" లోన అడుగుపెడుతూనే ఆమె నడిగిన మొదటి ప్రశ్న అది.

"లేదు.... అదే అర్థం కావటంలేదు" అంది వర్క్ ఆపి లేచివస్తూ.

"ఓ.కె! నువ్విక ఇంటికెళ్ళిపో. వాడు ఫోన్ చేస్తే నేను మాట్లాడతాను."

వాసంతి వెళ్ళిపోయింది.

ఆ రాత్రికి శ్యామ్ సుందర్ నుంచి మెసెజ్ లేదు.

తెల్లవారుజామున నాలుగు గంటలకే లేచి తను రెడీ అయి, ఆఫీస్ లాక్ చేసి కిందకు వచ్చేసరికి తన ఆటోతో రెడీగా వున్నాడు రహీంభాయ్. వాత్సవ ఆటో ఎక్కగానే ముందుకు దూకించాడు.

అర్థగంట తర్వాత, సరిగ్గా అయిదు గంటలకి హిందీ ప్రచారసభ కట్టడం ముందు ఆటో దిగాడు వాత్సవ. రహీంని అక్కడే వుండమని సిగరెట్ దమ్ము కొడుతూ కట్టడం వెనక సందులోకి అడుగుపెట్టాడు.

ఆ సందులో అడుగుపెట్టిన మరుక్షణమే—

జరుగకూడనిదేదో జరిగిపోయిన ఫీలింగ్ ఒకటి వాత్సవ మనసులోకి అడుగుపెట్టింది. ఆకారణంగా తన మనసు కీడును శంకించదని వాత్సవకు తెలుసు.

అడుగులు ముందుకు వేస్తున్నాడుగాని, తీవ్రంగా ఆలోచిస్తున్నాడు వాత్సవ. ఏం జరిగి వుంటుంది ? రిజ్జూనాయక్ డబుల్ క్రాస్ చేసుంటాడా ? ఖాద్రి గురించి తను వెదుకుతున్నట్లు బయట పెట్టేసి వుంటాడా ?

మనసు అంగీకరించటం లేదు. గతంలో రిజ్జూనాయక్ నుంచి అనేకసార్లు తను సమాచారం తీసుకున్నాడు. కాబట్టి ఈసారి అతను వంచిస్తాడనుకోడానికి వీల్లేదు. మరయితే ఏం జరిగి వుంటుంది ?

పరిసరాల మీద ఓ కన్నేసి వుంచి, జాగ్రత్తగా ముందుకు సాగాడు వాత్సవ. వీధి మొత్తం నిర్మానుష్యంగా వుంది. క్రమంగా రిజ్జూ చెప్పిన చెత్త కుండీని సమీపించాడు. ఆ ప్రక్కనే వుంది తను వెయిట్ చేస్తానని చెప్పిన మండపం.

దూరంగా వున్న వీధిలైటు కాంతి స్పష్టంగా పడుతోంది నాలుగు స్థంభాల ఆ మండపంలోకి. మెట్లు ఎక్కుతూండగానే మండపంలో ఎవరో బోర్లా పడుకొని వుండటం గమనించాడు వాత్సవ. మండపంలో అడుగుపెట్టగానే ఈడ్చి ఎవరో ముఖం మీద గుద్దినట్టు ఉలిక్కి పడ్డాడు.

అప్రయత్నంగా బయటికి తీసాడు జేబులోంచి రివాల్వర్ ని. తన డేగకళ్ళతో మరోసారి నిశితంగా ఆ పరిసరాల్ని గమనించాడు. ఎటు నుంచీ కదలిక కనబడకపోవటంతో ఆ వ్యక్తి కి మరికాస్త దగ్గరగా వెళ్ళాడు.

అప్పటికే అతనిలో చలనం లేదు.

అతడి వీపునుంచి గుండెల్లోకి దిగబడిన పొడవు కత్తి అతడి వీపు మీద జెండా కొయ్యలా అలాగే నిలబడుంది. ఆ ప్రాంతం నెత్తురు మడుగు కట్టి గడ్డకడుతోంది. ఇప్పుడిప్పుడే ఈగలు ముసురుకుంటున్నాయి.

అతను ఎవరో కాదు. మండపం వద్దకు తనను రమ్మని చెప్పిన అదే రిజ్జూనాయక్. రాత్రి ధరించిన అదే పైజమాకుర్తాలో వున్నాడు. ఒక చెయ్యి ముడుచుకుంది. రెండో చెయ్యి పొడవుగా సాచి వుంది. ఆ చేతి చూపుడు వేలు ఏదో చూపిస్తున్నట్టుంది.

భారంగా నిట్టూర్చాడు వాత్సవ.

"సారీ మైడియర్ ఫ్రండ్! ఈ కేసులో తొలి బలిపశువు నువ్వే అవుతావని వూహించలేదు" అంటూ నేలమీదకు వంగి అతడి చేతి వేలు చూపిస్తున్న వైపు నిశితంగా గమనించాడు.

ఆ వేలుకి సమీపంగా రెండు నాపరాళ్ళ మధ్యగా పగులు ఏర్పడి వుంది.

ఆ పగులులో ఏదో మడతపెట్టిన కాగితం ఉన్నట్టనిపించింది. జాగ్రత్తగా దాన్ని బయటకు తీసాడు. చిన్న స్లిప్ అది. అయితేనేం ? తనకు కావలసిన ఫోన్ నంబర్లు, సమాచారం అందులో వుంది. దాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాడు. ప్రాణాలమీదికి వచ్చినా, తన వృత్తి ధర్మాన్ని విడిచిపెట్టలేదు రిజ్జూనాయక్. చనిపోయి కూడా తనకిచ్చిన మాట నిలబెట్టుకున్నాడు.

"థాంక్యూ నాయక్! థాంక్స్ చెప్పటంకన్నా ప్రస్తుతం నీకేమీ చేయలేను. క్షమించు భాయ్" అంటూ వెనుతిరిగాడు.

తను ఎక్కువసేపు అక్కడ వుండటం ప్రమాదమని తెలుసు. హత్య జరిగి రెండు గంటలు కూడా కాదు. అవతల తెల్లవారబోతోంది. ఎవరూచూడకముందే ఈ ప్రాంతాలనుంచి బయటికిపోవాలి.

వచ్చిన దారినే వడివడిగా వెనక్కి వచ్చేసాడు. ఆ సందులోంచి రోడ్ మీదికి వస్తుండగా అవతల పోలీస్ వెహికిల్ ఒకటి దూసుకొస్తున్న సైరన్వినిపించింది. ఆదిరిపడి మరింతగా నడక వేగం పెంచాడు.

అతను ఆటోను సమీపిస్తుండగా పోలీస్ జీప్ వచ్చి సరిగ్గా అదే సందు ముందు ఆగింది. పోలీసులు దిగి సందులోకి పరుగులు తీసారు. జీప్ దిగిన యస్సైరమేష్ దృష్టి ఆటో ఎక్కుతున్న వాత్సవమీద పడింది.

బిగ్గరగా అరుస్తూ ఆటోవైపు పరుగెత్తాడు. అప్పటికే ఆలస్యమైంది. కన్ను మూసి తెరిచేలోన ఆ ప్రాంతాలకు దూరంగా వెళ్ళిపోయింది ఆటో.

## 7

జలీల్ ఖాన్ మాటలు వింటూనే అదిరిపడ్డాడు శ్యామ్ సుందర్. ఈ టైంలో కారులో డీసెల్ అయిపోవటం అంటే అంతకుమించిన నరకం మరొకటిలేదు. వెనక చూస్తే భూతాల్లా వచ్చి పడుతున్నాయి ప్రత్యర్థుల వాహనాలు. అవతల చూస్తే వర్షం వచ్చేలా వుంది.

"ఏమిటి ఖాన్ ఇలా చేసావ్ ? బయల్దేరే ముందు ఆయిలు చూసుకోలేదా ?" అన్నాడు. అన్న తర్వాత ఫీలయ్యాడు అలా అనకుండా వుండాల్సిందని.

అప్పటి పరిస్థితిలో అవన్నీ గమనించే అవకాశం ఎక్కడుంది ? అదే చెప్పాడు ఖాన్.

"సారీ గురూ....మిమ్మల్ని సేవ్ చేయాలన్న కంగారులో ఆ విషయం పట్టించుకోలేదు. వూహించని విధంగా లాంగ్ జర్నీలో పడ్డాం మనం. ఏం చేయాలో అర్థంగావటంలేదు."

"ఇప్పుడు కావలసింది అర్థాలు కాదు బ్రదర్. పరిష్కారాలు. ఉన్న ఆయిల్ తో ఇంకెంత దూరం పోగలం ?"

"ఎంతోనా..... మహా అయితే రెండు మూడు కిలోమీటర్లకు మించి ముందుకు పోలేం."

"మరో దారిలేదు. మనం తప్పించుకోవాలంటే అడవిలోకి వెళ్ళిపోవాలి."

"మరి నా కారు...."

"డోంట్ వర్రీ. నీ కారుకి నేను గ్యారంటీ. నేను చెప్పగానే హెడ్ లైట్లు ఆఫ్ చేసి, నేను చూపించిన దిశలో కారు పోనీ."

"ఓ.కె. సాబ్. చెప్పండి. కారు ఆగిపోయేలోపల మనం ఆ గూండాల కంటబడకుండా తప్పించుకోవాలి. అంతే"

బాటిల్ ఎత్తి మరో మూడు పెగ్గులు రా విస్కీ తాగాడు శ్యామ్ సుందర్. బాటిల్ ని ఖాన్ కి అందించాడు. వాడో మూడు గుక్కలు తాగి పక్కన పెట్టాడు.

ఫ్రెష్ గా సిగరెట్ ముట్టించుకుని, గుండెలనిండా పొగపీల్చి వదులుతూ హెడ్ లైట్ల కాంతిలో అడవిని నిశితంగా పరికించసాగాడు శ్యామ్ సుందర్.

ఒక కొండగుట్ట స్లోపు ఎక్కిన కారు డౌన్ కి దిగుతోంది. అలా దిగుతూండగా కన్పించింది ఎడం పక్కగా అడవిలోకి కాలిబాట ఒకటి. కారు వెళ్ళిపోగలిగినంత అనువుగానే కనబడుతోంది అది. పైగా గుట్ట పైకి వచ్చే వెహికిల్స్ కి తమ కారు కన్పించే అవకాశం లేదు.

"లైట్లు ఆఫ్ చేసి అటు మళ్ళించు. క్విక్" అంటూ సూచించాడు శ్యామ్ సుందర్.

అది విన్న మరుక్షణం కారు లైట్లు ఆఫ్ చేసాడు ఖాన్. కారుని శ్యామ్ చూపించిన మార్గంలోకి మళ్ళించాడు.

అంతవరకు చక్కటి రోడ్ మీద చిన్న జర్క్ కూడా లేకుండా విమానంలా పరుగెత్తిన కారు ఒక్కసారిగా గతుకుల బాటమీదకు తిరగ్గానే ఎత్తి కుదేసినట్టయి వైల్డ్ గా వూగిపోయింది.

వెనుకసీట్లో గాఢనిద్రలో వున్న భామామణి ఒక్క అదటున సీట్లో నుంచి ఎగిరి కిందపడి, కెవ్వున అరుస్తూ లేచి కూర్చుంది.

"ఏమైంది ? ఏం జరుగుతోంది ?" అంటూ గాభరాగా అరిచింది.

"మన కారు అడవిలోకి పోతోంది. చేతనయితే ఇంకో నిద్రతియ్యి, అరవకు" అన్నాడు శ్యామ్ సుందర్.

"ఎందుకు అడవిలోకి పోతున్నారు ?" అడగనే అడిగిందామె రెండో ప్రశ్న.

ఓపిగ్గా పరిస్థితి వివరించాడు శ్యామ్ సుందర్.

"అక్కడే మనం ఎలాగో వాళ్ళ నుంచి తప్పించుకోవాల్సింది. ఛ, ఈ టాక్సీ డ్రైవర్లని నమ్ముకుంటే పరిస్థితి ఇలాగే ఉంటుంది" అంది విసుగ్గా.

"హలో.... నిన్ను నమ్ముకుని వచ్చి అనవసరంగా నేను ఇరుక్కుపోలా ? ఇదీ అంతే. అనవసరంగా టాక్సీ డ్రైవర్లమీద నోరు పారేసుకోకు."

"పారేసుకోను.... కాని ఇప్పుడెలా ? అడవంటే నాకు వచ్చేంత భయం."

"ఆ గూండాలకన్నా ఈ అడవి ఎంతో బెటర్ బేబీ. ఊరికే హైరాన పడక కామ్‌గా కూర్చో" అంటూ వెనుతిరిగి తాము వచ్చిన మార్గంవైపు చూశాడు శ్యామ్ సుందర్.

అప్పటికే తమ కారు ఫర్లాంగు దూరం అడవి లోపలికి వచ్చేసింది. అక్కడ గుట్ట దిగుతున్న ప్రత్యర్థుల వాహనాల హెడ్ లైట్లకాంతి కనబడుతోంది. అవి ముందుకు వెళ్ళినట్టే వెళ్ళి ఆగిపోయాయి. తర్వాత వెనక్కి వచ్చి తమ కారు వస్తున్న మార్గంలోకి జొరబడ్డాయి.

"అయ్యబాబోయ్. వాళ్ళు మనుషులా, పిశాచాలా గురువుగారూ ? మనం వచ్చినదారి వాళ్ళకెలా తెలిసిపోయింది ?" అనరిచాడు కంగారుగా జలీల్ ఖాన్.

"వెరీ సింపుల్, వాళ్ళు డౌన్ దిగుతూండగా మన కారు లైట్లు వాళ్ళకి కన్పించలేదు. దాంతో ఏం జరిగి వుంటుందో వూహించేసారు తెలివైనగూండాలు" అంటూ కామెంట్ చేసాడు శ్యామ్ సుందర్.

"అదేమిటి గురూ! అంత మాటనేసారు.... ? అంటే మనం తెలివి తక్కువ వాళ్ళమా ?" అనడిగాడు ఖాన్.

"ఆ సంగతి మనం తప్పించుకున్నాక తేల్చుకోవాలి. మనం ఏ క్షణంలోనయినా కారు వదిలిపోవాల్సి రావచ్చు. నీ దగ్గర పనికొచ్చేవి ఏమున్నాయ్ ఖాన్ ?" అంటూ డాష్ బోర్డ్ లాగాడు.

లోన ఒక టార్చిలైటు, ఒక బటన్ నైఫ్, ఒక రొట్టెల పాకెట్ వున్నాయి. పాకెట్‌ని ఆ యువతి మీదకు విసిరాడు. టార్చిలైటు, నైఫ్‌ను తీసుకున్నాడు.

కారు క్రమంగా పొదల్ని , మొక్కల్ని , విరగదోసుకుంటూ డౌన్ లోకి పోతున్న సంగతి గుర్తించారంతా. ఆలోచించే లోపలే వూహించిందానికన్నా ముందే కారులో డీజిలు ఖతం అయిపోయి ఇంజన్ ఆగిపోయింది.

వేగంగా డౌన్ లోకి దూసుకొచ్చిన కారు—

చిక్కటి గుబురు పొదల మధ్యకు చొరబడి చిక్కుకుని ఆగిపోయింది. కారు లోనకెళ్ళిన మార్గం కూడా తిరిగి మూసుకుపోయింది. అంతవరకూ ఆ పొదల్లో ఒదిగివున్న అరడజను కుందేళ్ళు చెంగున బయటకు దూకి, దూరంగా పరుగులు తీసాయి. ఆ సమీపంలోకి ఎవరైనావచ్చినా లోన కారు వున్న సంగతి కనిపెట్టడం కష్టం.

"నాకు పాములంటే చచ్చేంత భయం. అద్దాలు..... అర్జంటుగా అద్దాలు పైకి లేపండి" అనరుస్తూ తనపక్క గ్లాస్ నిపైకిలేపాడు ఖాన్.

అతడి మాటలతో అలర్టయిన శ్యామ్ సుందర్, వెనక సీట్లోని ఆ హాంకాంగ్ సుందరి కూడా కారు అద్దాల్ని పైకిలేపేసారు.

" హలో మేడం! ఇంతకీ నీ పేరు చెప్పలేదు" వెనక సీట్లోని యువతి నుద్దేశించి అడిగాడు. అప్పటికే బ్రడ్ పాకెట్ ఖాళీచేసి మంచినీళ్ళు తాగిందామె.

"నా పేరుమిస్ అంగసాని సూకీ! ముద్దుగా అంతా సూకీ అని పిలుస్తారు" చెప్పింది.

" అంగసాని సూకీ... ఈ పేరు బర్మా ప్రజా ఉద్యమ నాయకురాలి పేరు కదా! నువ్వు పెట్టుకున్నావా ? నీ పేరెంట్స్ పెట్టారా ?" కుతూహలంగా అడిగాడు.

"హలో శ్యామ్ సుందర్ జీ! ఆవిడ గొప్ప నాయకురాలయినంత మాత్రం చేత ఇంకెవరికీ ఆ పేరు వుండకూడదా ? ఒక్క బర్మాలోనే ఐదు లక్షల ముప్పై తొమ్మిదివేల రెండువందల నలభై మంది అమ్మాయిల పేర్లు అదే! అర్థమైందా ? మా పూర్వీకులు కూడా బర్మా నుంచి హాంకాంగ్ కి వలస వెళ్ళారు. అంచేత ఆ పేరు నాకు పెట్టారు. నాకు మరో చక్కని పేరు కూడా ఉంది. సుధ. మా డాడీ నన్ను ముద్దుగా పిలిచిన పేరు అది. ఆయన ఇండియన్."

అంతవరకూ మౌనంగా వింటున్న జలీల్ ఖాన్ నోరు విప్పాడు.

"అర్థమైంది మేడమ్! టోటల్ గా మీ బాడీలో బర్మా, ఇండియన్ బ్లడ్ లు రెండూ మిక్స్ డ్ గా ప్రవహిస్తున్నాయన్న మాట. ఇంతకీ మేం మిమ్మల్ని ఏ పేరుతో పిలవాలి ?" అన్నాడు.

"సూకీ....నాకు ఇష్టమైన పేరు" చెప్పింది.

"వెయిటెమినిట్" చెవులు రిక్కిస్తూ వున్నట్టుండి హెచ్చరించాడు శ్యామ్ సుందర్.

వేన్‌లు వస్తున్న ఇంజన్‌ల సౌండ్స్ క్రమంగా దగ్గరవుతోంది.

తమ కారు దిగిన స్లోపు పై భాగానహెడ్ లైట్లకాంతి పరుచుకుంటోంది.

"వర్షం.... ఇప్పుడు వర్షం వస్తే చాలా బాగుండేది" తనలో తాను గొణిగాడు శ్యామ్ సుందర్.

"ఏమైంది సాబ్..... వాళ్ళు వచ్చేస్తున్నారా ?" గాభరాగా అడిగాడు ఖాన్.

"స్లోపు పైకి వస్తున్నారు. వర్షం వస్తే మన కారు వచ్చిన జాడలు మూసుకుపోయేవి. ఇప్పుడు మనం కారు విడిచిపెట్టక తప్పదు" అన్నాడు.

"మీది ఒట్టి అనుమానం సాబ్! మన కారుని వాళ్ళు చూడలేదు" అన్నాడు ఖాన్.

"చూసాక ఏమీ చేయలేవు. కలుగులో ఎలకలా వాళ్ళ ఎత్తులకు బలై పోగలం. కమాన్! హెడ్ లైట్లుఆన్ చెయ్యి" అంటూ కారు దిగటానికి రెడీగా టార్చిలైటుఅందుకున్నాడు.

"అయ్యబాబోయ్! లైట్లు ఆన్ చేస్తే ఎలా గురూ! మన చావు మనమే కొని తెచ్చుకున్నట్టు కాదా ? వాళ్ళంతా వచ్చి మీదపడతారు" లబలబలాడాడు ఖాన్.

"భయపడకు. వాళ్ళు వచ్చే లోపల మనం ఇక్కడ్నుంచి వెళ్ళిపోతాం. లైట్లు ఆన్‌లో వుంచటం చేత వాళ్ళ దృష్టి ఈ పొదలమీదే వుంటుంది. లేదంటే చీకట్లలో మన కదలికల్ని వాళ్ళు పసిగట్టే ప్రమాదం వుంది. లెటజ్ గో" అంటూ తనే కారు లైట్లుఆన్ చేసాడు.

పొదల్లోంచి చీల్చుకుంటూ కారు హెడ్ లైట్ల కాంతి బయటకు దూసుకెళ్ళింది. అదే సమయంలో స్లోపుపైన, వేన్ ముందు నిలబడిన ఓ ఆకారంగొంతు పిడుగులా ప్రతిధ్వనించింది ఆ ప్రాంతంలో.

"అదిగో కారు..... డౌన్ లో ఆ పొదలో వుంది వెళ్ళండి. ఆ కారుని చుట్టుముట్టండి. వాళ్ళందర్నీ బంధించండి."

"ఎవడు వాడు ?" కారు దిగుతూ సూకీనుద్దేశించి అడిగాడు శ్యామ్ సుందర్.

"వాడి పేరు భగవాన్ దాదా! లోకల్ రౌడీ. పిచ్చుకగూడులా జుత్తు, పీచు మిఠాయిలాంటి గడ్డంతో, తారుడబ్బాలా వుంటాడు వెధవ. వాడిపక్కన బోడి గుండుతో సీమపందిలాంటి మరో శాల్తీ వుంటుంది చూడు. వాడి పేరు మియాచీ. నా వెనకే ఇండియా వచ్చి, నన్ను ఖతం చేయాలని చూస్తున్న కిరాయి హంతకుడు. తనవల్ల కాకనే భగవాన్ దాదా హెల్ప్ తీసుకున్నాడు" కారు దిగి స్లోపుపైకి చూస్తూ చెప్పింది సూకీ.

వేన్ హెడ్ లైట్ల కాంతిలో వాళ్ళిద్దర్నీ స్పష్టంగా చూసాడు శ్యామ్ సుందర్. దాదా ఆర్డర్ తో గూండా గుంపు ఆయుధాలు ఝుళిపిస్తూ చీకట్లలో తమ కారువైపు పుదూసుకొస్తున్నారు.

"జస్ట్ వన్ మినిట్ సాబ్! వన్ మినిట్. ఇప్పుడే వచ్చేస్తాను...." అంటూ పొదల్ని నెట్టుకుంటూ కారు వెనక్కి దూకాడు ఖాన్.

డిక్కీ తెరిచి రెండు ఇనపరాడ్ లు , ఒక పొడవు కత్తి తో తిరిగి వచ్చాడు.

"ఎందుకైనా మంచిది వీటిని వుంచండి. ఈ పొదల సంగతి నేను చూస్తాను" అంటూ చెరో ఇనపరాడ్ అందించి , తను కత్తి తో చకచక కొమ్మలు నరికిపారేస్తూ పొదల్లోంచి బయటికి దారివేస్తూ ముందుకు కదిలాడు ఖాన్.

"పొరబాటున కూడా హెడ్ లైట్ల కాంతిలోకి పోవద్దు. ఇటు చీకట్లలోకి కదలండి" హెచ్చరించాడు శ్యామ్ సుందర్.

పదిగజాల దూరం పొదల్ని ఒకేఒక్క నిముషంలో నరికి బయటకొచ్చేసాడు జలీల్ ఖాన్.

అటుపక్క భగవాన్ దాదా మనుషులు అడవి మృగాల్లా అరుస్తూ స్లోపు దిగి, తమ కారు దిశగా పరుగులెత్తుకొస్తున్నారు.

స్లోపు పంచన మియాచీ పక్కన నిలబడిన భగవాన్ దాదా లోయలోని చీకట్లలోకి చూస్తూ తమవాళ్ళకి ఆర్డర్స్ వేస్తున్నాడు.

"వచ్చేసాం గురూ.... పొదల్లోంచి బయటికొచ్చేసాం" అంటూ జలీల్ ఖాన్ ఆఖరి పొదల్ని కూడా అడ్డంగా నరికి బయటికి అడుగు పెట్టాడు. అలా బయటికి వచ్చీరాగానే–

ఎదురుగా వున్న దృశ్యం చూసి అదిరిపడి , ఎక్కడివాడక్కడ అలాగే నిలబడి పోయాడు బొమ్మలా.

"ఏమైంది ఖాన్.... ?" అంటూ ముందుకొచ్చిన శ్యామ్ సుందర్ అప్పుడు గమనించాడు అక్కడ తమకోసం పొంచివున్న ప్రమాదాన్ని.

ఎదురుగా రెండు గజాల దూరంలో బెడ్ లైటుబల్బుల్లా రెండు వెలుగుతున్న చిన్న గోళాలు. చీకట్లలో కూడా అంత ప్రకాశవంతంగా వెలిగేవి అడవి మృగాల కళ్ళని తెలుసు. చూసిన రెండో క్షణమే అదేమిటో గ్రహించగానే అరచేతులు చెమటలు పట్టేసాయి.

అది ఎలుగ్గొడ్డు. ఏ పొదలో నిద్రపోతోందోగానీ ఖాన్ కొమ్మల్ని నరికిన చప్పుడుకి మెలుకువ వచ్చినట్టుంది. తన ఏకాంతానికి భంగం కలిగించిన వాళ్ళ మీద ప్రతీకారం తీర్చుకునే ఉద్దేశంతో అక్కడ నిలబడుంది.

అడవుల్లోని అతి ప్రమాదకరమైన మృగాల్లో ఎలుగ్గొడ్డు ఒకటి. అతి క్రూరంగా దాడిచేసి చంపటమో, గాయపరచటమో దాని స్పెషాలిటీ. చీకట్లో చీకటిగా కలిసిపోతూ దూకడానికి సిద్ధంగా వుందా భల్లూకం.

ప్రమాదం గుర్తించగానే క్షణం కూడా ఆలస్యం చేయలేదు శ్యామ్ సుందర్. తన చేతిలోని టార్చ్ లైటుని చటుక్కున ఆన్ చేసి, సూటిగా దాని కళ్ళలోకి ఫోకస్ చేసాడు. ఒక్కసారిగా వెలుగు కళ్ళలో జొరబడగానే కళ్ళు జిగేల్ మని అప్పటికప్పుడు దాడిచేసే ప్రయత్నాన్ని విరమించుకుని, ఉన్నచోటే బొమ్మలా నిలబడిపోయి "గుర్ ర్....గుర్ ర్" మంది కోపంగా.

"పట్టుకో....టార్చిలైటుని ఇలాగే పట్టుకో. దాని సంగతి నేను చూసుకుంటాను" అంటూ భయంతో బిగుసుకుపోయిన ఖాన్ చేతిలో టార్చ్ లైటుపెట్టాడు శ్యామ్ సుందర్.

ఆ మృగం ఎక్కడ మీదపడుతుందోనని కంగారులో వున్న ఖాన్ చేతులు వణికి టార్చ్ లైటు జారవిడుచుకున్నాడు.

టార్చ్ కిందపడగానే భల్లూకం ఒక్కసారి తొడకొట్టి గుర్ ర్ మంటూ ఎగబడబోయింది.

అయితే ప్రమాదాన్ని ముందే వూహించిన శ్యామ్ సుందర్ దానికా ఛాన్స్ ఇవ్వలేదు. బొంగరంలా తిరిగి చివ్వున ఎగిరాడు గాల్లోకి. అతడి కుడిపాదం అతి దారుణంగా తాకింది ఆ భల్లూకం కణతమీద.

అదే మనిషి తల అయితే పుచ్చకాయలా రెండుగా విడిపోయే అతి ప్రమాదకరమైన కిక్ అది. కాని ఆ భల్లూకం తల పగిలిందో లేదో గాని పగిలినంత దారుణంగా అరిచి పక్కకు తిరిగింది. అదే క్షణంలో ఇటు నుంచి ఆడ చిరుతలా అరుస్తూ సూకీ గాల్లోకి లేచి భల్లూకం పక్కటెముకల మీద తన్నింది అంతే.

కాలు వెంబడే గాల్లోకి లేచిన భల్లూకం గింగిరాలు తిరుగుతూ ఐదు గజాల దూరం ఎగిరి చీకట్లలో పొదల మధ్య పడిపోయింది. పడింది పడినట్టే వుండిపోయింది. అరవలేదు, లేవలేదు. ఇంతలో—

పొదలను సమీపిస్తున్న గూండాల్లో ఒకడు గొంతు చించుకుని అరిచాడు.

"అటు - ఆ పొదల పక్కన ఎవరో వున్నారు. వాళ్ళు పారిపోతున్నట్టున్నారు. అటు కవర్ చేయండి బే త్వరగా!" అంటూ.

"వాళ్ళు మనల్ని చూసేశారు. హరియప్!" అంటూ ఖాన్ చేయి అందుకుని చీకట్ల వెంట దిగువకు పరుగుతీశాడు శ్యామ్ సుందర్.

ఆ ఇద్దర్నీ అనుసరించింది సూకీ.

"గూండాలు కారువద్దకు చేరుకునే సమయానికి నూట ఏభై గజాల దిగువకు వెళ్ళిపోయారు ముగ్గురూ.

"ఎలుగ్గొడు చచ్చిపోయి వుంటుందా ?" అప్పటికి కాస్త తేరుకుంటూ శ్యామ్ నుంచి చేయి విడిపించుకుని అడిగాడు ఖాన్.

"అది దాని అదృష్టం మీద ఆధారపడిన విషయం" అన్నాడు శ్యామ్ సుందర్.

"అది బతకదు , చచ్చిపోతుంది. ఎందుకంటే నువ్వు అప్లయ్ చేసింది చాలా ప్రమాదకరమైన సైడ్ కిక్. ఖచ్చితంగా మెడ విరిగి వుంటుంది" అంది సూకీ.

అంతలో ఒకటి రెండు చినుకులు వాళ్ళ ముఖాల మీద పడ్డాయి . చలిగాలి జివ్వుమంది. వాతావరణం పూర్తిగా మారిపోతోంది. పైన చుక్కలు కన్పించటం లేదు. అదే సమయంలో ఎగువన కొండ చరియల వెంట కొమ్ము బూరలు , డప్పుల శబ్దం లీలగా వినవస్తోంది.

"నట్టడవిలో ఆ గోలేమిటి..... ?" ఆశ్చర్యాన్ని అణచుకుంటూ అడిగాడు ఖాన్.

"ఏదో గిరిజన తండా కొండదేవతకి కొలుపులు జరుపుకుంటున్నట్టుంది. కమాన్, మూవ్!" చకచక పరుగుతీస్తూ హెచ్చరించాడు శ్యామ్ సుందర్.

అదృష్టం బాగుండి మెరుపులు , ఉరుములు లేవు. ఆకాశం మెరిస్తే ప్రత్యర్థుల కంట్లో దుమ్ము కొట్టడం అస్సలు సాధ్యంకాదు.

ఆ దిగువ ప్రాంతం నుంచి ఏటవాలుగా ఒక కొండ చరియ వుంది. బల్లపరుపుగా వున్న ఆ ప్రాంతంలోని చెట్టు , పుట్టల్ని దాటుకుంటూ గుడ్డిగా పైకి పోతున్నారు ముగ్గురూ. వెనక తమ కారు దగ్గర్నుంచి గూండాల అరుపులు , కేకలు వినబడుతూనే వున్నాయి. అక్కడ ప్రతి అంగుళం గాలిస్తున్నారు వాళ్ళు.

అయితే అయిదు నిముషాల్లో సుమారు రెండు ఫర్లాంగుల దూరం స్లోపు వెంట పైకి వచ్చేశారు ముగ్గురూ. అక్కడితో చెట్టు పుట్టలు , పొదలు అంతమయ్యాయి. అక్కడి నుంచి కేవలం రాతి ప్రదేశం

మైదానంలా కనబడుతోంది. మరికాస్త ముందుకెళ్ళి తిరిగి చూసిన ముగ్గురికి దిగువన లోయలో తాము వదిలివచ్చిన కారు హెడ్ లైట్ల కాంతి స్పష్టంగా కనబడుతోంది. అటుపక్క స్లోపుమీద వరుసగా నిలబడిన వేన్‌లు ఆరూ హెడ్ లైట్లు ఆన్ చేసి అలాగే వున్నాయి . ఆ పరిసరాల్లోనే వాళ్ళంతా గమనిస్తున్నారని అర్థమైంది.

జాగ్రత్తగా లైటర్‌తో సిగరెట్ ముట్టించుకున్నాడు శ్యామ్ సుందర్. చలికి తట్టుకోలేక తనూ సిగరెట్ ముట్టించాడు ఖాన్. తాగిన విస్కీ చక్కగా పనిచేయటం వలన స్లోపు ఎక్కటంలో అలుపు, సొలుపు తెలీలేదు యిద్దరకీ. కానీ సూకీ పరిస్థితి మాత్రం దారుణంగా వుంది. ఉదయం నుంచి శత్రువుల నుంచి తప్పించుకోవడంతోనే ఆమెకు సరిపోయింది. భోంచేయలేదు. కొంతసేపటి క్రితం తిన్న రొట్టెముక్కతో సరి.

"వాళ్ళిటు రారనుకుంటాను. ఇక్కడే సెటిలవుదామా ?" అడిగింది సూకీ.

నిజానికి శ్యామ్ సుందర్ మదిలో కూడా ఇలాంటి ఆలోచనే వుంది. తెల్లవారేలోగా భగవాన్ దాదా మనుషులు ఇటు వచ్చే అవకాశం లేదు గాబట్టి అక్కడే సెటిలయితే సూకీ వివరాలు పూర్తిగా తెలుసుకోవచ్చు. కానీ ఆమె పరిస్థితి అర్థమవుతోంది గాబట్టి ఓ.కె. చెప్పలేకపోయాడు.

"లేదు....మనం ఇంకా ముందుకే పోతున్నాం. ఎలాగో గిరిజన తండాను చేరుకుంటే భోజనం చేయొచ్చు. తర్వాత తీరిగ్గా మాట్లాడుకుందాం. పాపం ఖాన్ కూడా మనతో చిక్కబడిపోయాడు ఏమీ తినకుండా!" నడుస్తూనే తన అభిప్రాయం చెప్పాడు శ్యామ్ సుందర్.

"అవును గురూ....ఆకలిగానే వుంది. నాకన్నా పాపం ఈ అమ్మాయి అస్సలు ఏమి తినలేనట్టుంది. మనం ఎలాగోలా ఆ తండాను చేరుకోడమే మంచిది...." అంటూ శ్యామ్ సుందర్ మాటల్ని సమర్థించాడు ఖాన్.

ఆకాశం నుంచి ఒక్కో చినుకు రాలుతోంది.

ఆ రాతి మైదానం వెంట మరో ఫర్లాంగు దూరం పైకి వెళ్ళారు ముగ్గురు. అక్కడితో ఆ స్లోపు అంతమైపోయింది. ఇప్పుడు దిగువ నుంచి కొమ్ము బూరలు, డప్పుల హోరు ఫెళ్ళున వినబడుతోంది.

పంచకు వచ్చి కిందకు చూశారు.

ఆ కొండ పంచ కత్తితో నరికినట్టుండి స్ట్రెయిట్ గా పెద్ద గోడలా నిలబడుంది. వందగజాల దిగువన పచ్చిక మైదానం.... ఆ మైదానంలో అనేక ఎడ్లబళ్ళు, గాడిదలు కనబడుతున్నాయి. ఎటు చూసినా దివిటీలు, మండుతున్న నెగళ్ళ కాంతితో ఆ ప్రాంతం పట్టపగల్లా వుంది.

కొండ పాదంలోని గుహలో కొండదేవత ఎత్తయిన విగ్రహం వుండి వుండాలి. గుహకి అటు ఇటు వెలుగుతున్నాయి అఖండ జ్యోతులు.

గుహ ముందు లోతు ఎంత వుంటుందో తెలీదుగాని, చాలా పెద్ద నీటితొట్టి వుంది. నిండుగా వుంది నీరు. బలియిచ్చిన జంతువుల నెత్తురు, పసుపు కుంకుమలు, పూలతో నిండి వుందా నీరు.

ఎదురుగా మైదానంలో అయిదుగురు గణాచారులు, తాగిన విప్పసారా నిషాలో వేపమండలు పుచ్చుకొని శివమెత్తి గంతులేస్తున్నారు. కొమ్ము బూరలు, డప్పుల ఘోష వాళ్ళని మరింత హుషారు చేస్తోంది. చుట్టూ గిరిజనులు దండాలు పెడుతూ జేజేలు పలుకుతూ కొలుపులు తీర్చుకోవడంలో బిజీగా వున్నారు.

ఇక అవతల అక్కడక్కడా నెగళ్ళమీద కోళ్ళు, మేకల మాంసాన్ని కాలుస్తూ కొందరు, వంటలు చేస్తూ కొందరు బిజీగా వున్నారు. చిన్నా, పెద్దా, పిల్ల, పీచుతో కొలుపులు తీర్చుకొనేందుకు ఏదో గూడెం మొత్తం అక్కడికి కదిలి వచ్చినట్టుంది.

ఇక ఆ ప్రదేశానికి ఎడం పక్కగా దిగువన ఒక పెద్ద కొండవాగు ప్రవహిస్తోంది. ఎగువన కురిసిన వర్షాలకి వాగు ఉధృతంగా దూకుతూ గలగల చప్పుళ్ళు స్పష్టంగా వినబడుతున్నాయి.

"గురూ.... మనం ఊహించినట్టు ఇక్కడ గిరిజన తండా ఏదీ వున్నట్టు లేదు. గుడిశెలు గాని, ఇళ్ళుగాని మచ్చుకి ఒక్కటి కూడా లేదు. వీళ్ళంతా మొక్కలు తీర్చుకోడానికి వచ్చినట్టున్నారు" అంటూ కామెంట్ చేశాడు ఖాన్.

"నీ ఊహ కరక్ట్ ఖాన్ భాయ్. మనం ఎలాగోలా కిందకు చేరుకుంటే చక్కటి విందు భోజనమే పెడతారు వాళ్ళు. ఖచ్చితంగా సమీపంలో ఎక్కడో కిందకు వెళ్ళే దారి వుంటుంది. జాగ్రత్తగా గమనించు....అన్నాడు శ్యామ్ సుందర్.

అలాంటి దారివున్న జాడ ఏదీ కన్పించలేదు.

సూకీ మరికాస్త పంచకు జరిగి దిగువకు పరిశీలిస్తోంది. జలీల్ ఖాన్ లేచి ఎడంపక్క మరో దిశగా ఏమన్నా దారి వుందేమో గమనించే ప్రయత్నం చేశాడు.

ఇంతలో ఒక్కసారిగా వర్షం ఆరంభించింది. గాలి విసురుతోబాటు కుండ పోతగా సడెన్ గా మొదలయిన వానతో అప్పటిగ్గాని తాము చేసిన పొరబాటు ఏమిటో అర్థంకాలేదు ముగ్గురికీ.

అది పాకుడు బండలతో కూడిన ప్రాంతం . రాతినేల వెంట ఎండిన నాచు, వర్షం పడగానే నీళ్ళు తీసుకుని పురివిప్పినట్టవుతోంది. దాంతో కాలు పడగానే జర్రున జారిపడక తప్పదు. ముందుగా ఆ సంగతి గ్రహించి సూకీ అదిరిపడి కొండ పంచనుంచి వెనక్కి జరిగే ప్రయత్నం చేసింది. అలా చేయటమే ఆమెను మరింత ప్రమాదంలోకి నెట్టింది.

హోరున కురుస్తోన్న వర్షంలో ఆమె తను ఉన్న చోటునుంచి జరిగిన మరుక్షణం జర్రున జారింది దిగువకు. అలా జరుతూనే కెవ్వున అరిచింది. ఆమె చేతికి ఆధారం ఏదీ దొరకలేదు. శ్యామ్ సుందర్ తన చేయి అందించే లోపలే కొండ పంచనుంచి జారిపోయింది. అంత ఎత్తునుండి ఆమె గింగిరాలు తిరుగుతూ జారిపోయి దబ్బున దిగువనున్న నీళ్ళతొట్టిలో పడ్డ పెద్ద శబ్దం వినిపించింది.

సూకీ జారిపోవడం గమనించగానే అవతలున్న జలీల్ ఖాన్ కంగారుగా అరుస్తూ ముందుకు రాబోయాడు. సూకీ చేసిన అదే పొరబాటు అతనూ చేసాడు. ఫలితంగా పాకుడు నేలమీద పాదాలు జారిపోయి దబ్బున బోర్లాపడ్డాడు. పడ్డవాడు వాననీళ్ళతోబాటు పల్లానికి జారిపోతూ కెవ్వుమన్నాడు.

సూకీ పడిపోయిన షాక్ నుంచి బయటపడుతూ కంగారుగా యిటు తిరిగి బోర్లాపడి ఖాన్ చేతిని బలంగా పట్టుకున్నాడు శ్యామ్ సుందర్. అతడి చేయి పట్టుకోగలిగాడేగాని కాళ్ళకు పట్టుదొరకలేదు. దాంతో ఖాన్ తో బాటు తనూ అటుపక్క పల్లానికి జారిపోయాడు.

జారుడుబల్లమీద జారుతున్నట్టు పాకుడు రాళ్ళమీద పదిహేను గజాల దూరం జారుకుంటూ పోయి అక్కడి నుంచి గాల్లోకి విసిరివేయబడిన యిద్దరూ చీకట్లను చీల్చుకుంటూ గిరికీలు కొడుతూ పోయి దిగువన ప్రవహిస్తున్న కొండవాగులో పడిపోయారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగునీరు ఆ యిద్దర్నీ తనతో లాక్కుపోయింది.

## 8

ఉదయం పదిగంటలు.

డైనమిక్ సెక్యూరిటీ కన్సల్టింగ్ సర్వీస్ ఆఫీసు.

వాసంతి అందించిన పేపర్సును చకచక వెరిఫై చేసి సంతకాలు చేస్తున్నాడు వాత్సవ. ఖాద్రిని ఎలాగయినాసరే ఈ రోజు బయటకు రప్పించే పని మీద బిజీగా వున్నాడు వాత్సవ.

వాసంతి ముఖంలో చోటు చేసుకునుంది కొద్దిపాటి ఆందోళన. వాత్సవ ఆ విషయాన్ని గమనించాడు. ఆమె శ్యామ్ సుందర్ గురించి కంగారుపడుతూందని తెలుసు.

"శ్యామ్ సుందర్ నుంచి మెస్సేజి ఏమీ లేదుకదూ ?" ఫైలుమూసి తిరిగిస్తూ అడిగాడు.

మెస్సేజి లేదని తనకీ తెలుసు. అయినా ఏదో ఒకటి అడగాలి గాబట్టి అడిగాడు. కాని అడిగిన తర్వాత అనవసరంగా నోరు జారినట్లు అర్థమైపోయింది.

"ఎందుకుంటుంది ? ఇక్కడ వున్నంతసేపే ఆఫీస్ గుర్తుంటుంది. బయటికి పోతే ఆఫీస్ మర్చిపోతారు. మీకు లేని అలవాటు అతనికెలా వస్తుంది ?" అంటూ ముక్కూ ముఖం చూడకుండా దులిపేసింది వాసంతి.

"ఓ.కె! ఓ.కె! ఈ విషయం మరోసారి డిస్కస్ చేయటం బెటర్ కదూ ?" అన్నాడు టాపిక్ మళ్ళించాలని. కాని వాసంతి వదల్లేదు.

"నిన్న సాయంత్రం అయిదు గంటలకి గురుదాస్ పూర్ నుంచి ఫోన్ చేసి మళ్ళీ ఫోన్ చేస్తానని చెప్పిన మనిషి ఇంతవరకు ఫోన్ చేయలేదు" అంటూ గుర్తుచేసింది.

"అవును. ఎందుకు వెళ్ళాడు ? ఏం జరుగుతోందో ఏమీ తెలీదు. ఓ పనిచెయ్యి. ఈసారి ఫోన్ చేయగానే అది ఎలాంటి పని అయినాసరే విడిచిపెట్టి అర్జంటుగా వెనక్కి వచ్చేయమని చెప్పు."

"చెప్పను. ఎందుకంటే నేను చెప్పినా మీరు వినరని నాకు బాగా తెలుసు" అంటూ అక్కడ్నుంచి వాసంతి తన టేబిల్ కేసి వెళ్ళిపోబోతుండగా వాత్సవ టేబిల్ మీద ఫోన్ రింగయింది.

రిసీవర్ లిఫ్ట్ చేసింది వాసంతి.

"హలో....డైనమిక్ సెక్యూరిటీ సర్వీస్...." అంది.

"హలో వాసంతి. నేను ఎస్. ఐ. రమేష్ ను మాట్లాడుతున్నాను" అవతలి నుంచి చాలా సీరియస్ గా వినిపించింది రమేష్ గొంతు.

"హలో....ఎస్. ఐ. రమేష్ గారా.....ఏమిటి సార్ అనుకోకుండా ఫోన్ చేసారు ?" వాత్సవకి అవతలి వ్యక్తి తెలీటం కోసమే అలా అడిగింది వాసంతి.

తను లేనట్టు చెప్పమని సిగ్న లిచ్చాడు వాత్సవ.

ఆమె ప్రశ్న విన్న రమేష్ అవతల గ(యి మన్నాడు.

"నాకు తెలుసు వాసంతీ! అక్కడ ఆ పెద్దమనిషికి నేను ఫోన్ చేసానని తెలీటం కోసమే నువ్వా అర్థంలేని ప్రశ్న అడిగావని. ఇవ్వు , అర్జంటుగా ఫోన్ వాత్సవకివ్వు" పోలీసు గొంతుతో దబాయించాడు రమేష్.

"వాత్సవ లేరు. మళ్ళీ ఫోన్ చేయండి" అంటూ ఫోన్ టక్కున పెట్టేసింది వాసంతి.

ఆమె వెనుతిరిగే లోపలే మళ్ళీ రింగయింది.

తనే రిసీవర్ లిఫ్ట్ చేసింది.

"అసలేమనుకుంటున్నావ్ నువ్వు వాసంతీ ? మాట్లాడుతున్నాను కదా. ఫోన్ ఎందుకు పెట్టేసావ్ ?" గ(యి న అవతలి నుంచి వినిపించింది రమేష్ గొంతు.

"చెప్పాగా. వాత్సవ లేరని" తనూ దబాయించింది.

"నేన్న మ్మను. ఆ పెద్దమనిషి అక్కడే వుండి నీచేత లేడనిపిస్తున్నాడు."

"అలాగని వూహించుకొంటున్నారా ?"

"ఊహకాదు. నిజం. అక్కడ చూస్తే గురుదాస్ పూర్ లో శ్యామ్ సుందర్ ఒక అమ్మాయి మూలంగా కొందరు గూండాలతో గొడవలు పడుతున్నట్లు తెలిసింది. ఇక్కడ వాత్సవ కనబడకూడనిచోట్ల కనబడుతున్నాడు. ఈ విషయాలు మా సుపీరియర్స్ నోటీస్ కి వచ్చి నేను బదులు చెప్పుకోవాల్సిన పరిస్థితి వచ్చింది."

"ఎందుకొచ్చింది ? ఆ పరిస్థితి ఎందుకొచ్చింది మీకు ? మీ డ్యూటీ మీరు చేస్తే ఆ పరిస్థితి రాదు. మీ సుపీరియర్స్ మెప్పుకోసం ఫ్రండ్‌షిప్ కూడా మర్చిపోయి మా డైనమిక్ సెక్యూరిటీ సర్వీస్ వాళ్ళు ఏం చేస్తున్నారో తెలుసుకుని వాళ్ళకి చెప్పటమే పనిగా పెట్టుకున్నారు. మా డ్యూటీ మేం సక్రమంగా చేస్తున్నాం. మీ డ్యూటీ మీరు సక్రమంగా చేయండి" అంటూ ముక్కూముఖం చూడకుండా నాలుగు మాటలూ దులిపేసింది వాసంతి.

వింటున్న వాత్సవకి అవతల రమేష్ ముఖం ఎలా వుంటుందో వూహించుకుంటే నవ్వాగందికాదు.

"క్లాస్ పీకడం అయిందా ఇంకా ఏమన్నా మిగిలి వుందా ? నాకు బి.పి పెరిగి జుత్తు పీక్కుని అరిచే లోపల నువ్వు ఫోన్‌ని వాత్సవకివ్వటం మంచిది" అవతల నుండి రమేష్ అర్థింపు వినగానే చిన్నగా నవ్వేసింది వాసంతి.

"ఓ.కె. మాట్లాడు" అంటూ రిసీవర్ వాత్సవకి అందించింది.

"హలో రమేష్! ఇప్పుడే వచ్చాను. ఏమిటి వాసంతితో గొడవపడుతున్నట్టున్నావ్ ?" కాజువల్‌గా అడిగాడు వాత్సవ.

"అబద్ధం చెప్పకు. నువ్వు అక్కడే వున్నావని నాకు బాగా తెలుసు. నా ప్రశ్నలకి సూటిగా సమాధానం చెప్పు. అది నీకే మంచిది. నిన్న సాయంత్రం నువ్వు సుల్తాన్ బజారుకి ఎందుకొచ్చావ్ ?"

"సారీ! సుల్తాన్ బజార్లో నేను అడుగుపెట్టకూడదని నా మీద ఎవరూ ఆంక్షలు విధించలేదు."

"లాజిక్కు మాట్లాడి తప్పించుకోలేవు వాత్సవా! రాత్రి నువ్వు రిజ్జూనాయక్‌ని కలుసుకున్నావ్."

"వాడెవడు ?"

"ఈ తెల్లవారుజామున హిందీ ప్రచారసభ కట్టడం వెనక సందులోని మండపంలో హత్యకు గురయిన లోకల్ ఇన్‌ఫార్మర్."

"ఇదంతా ఇప్పుడు నువ్వు చెప్తుంటేనేవింటున్నాను. నిజానికి రిజ్జూనాయక్ ఎవరో నాకు తెలీదు."

"బుకాయించి తప్పించుకోవాలని చూడకు. తెల్లవారుజామున హిందీ ప్రచారసభ రోడ్‌లో నిన్ను నేను చూసాను. నువ్వు ఆటోలో వెళ్ళిపోవటం స్పష్టంగా చూసాను."

"షిట్. ఇంకా నయం. నేను రిజ్జూనాయక్ ని హత్యచేసాననలేదు. నువ్వు చూసింది నన్ను కాదు. ఉదయం తొమ్మిది గంటలవరకు నేను లేవనేలేదు."

"శ్యామ్ సుందర్‌ని గురుదాస్‌పూర్ ఎందుకు పంపించావ్ ?"

"తెలీదు. అస్సలు నాకేం తెలీదు. ఏం పనిమీద వెళ్ళాడో ఏం జరిగిందో అతను తిరిగివస్తే గానితెలీదు."

"సో....తెలియదని చెప్పి తప్పించుకోవాలని చూస్తున్నావన్న మాట. కొత్తగావచ్చిన మా ఎస్. పి. సాబ్ సంగతి నీకు తెలీదు. తర్వాత మీరు రిస్క్ లో పడకూడదనే ఇంతగా చెప్తున్నాను. తర్వాత నీ ఇష్టం. మేం మీ ఆఫీస్ మెట్లెక్కే పరిస్థితి మీరు తీసుకురారని ఆశిస్తాను. సీయు."

"థాంక్స్ రమేష్! మా రిస్క్‌లు తప్పించాలని చూస్తున్న నీ సానుభూతికి మెనీమెనీ థాంక్స్" అంటూ మరో మాటకి అవకాశం ఇవ్వకుండా లైన్‌కట్ చేసాడు వాత్సవ.

సాలోచనగా అతని ముఖంలోకి చూసింది వాసంతి. వాత్సవ సిగిరెట్ ముట్టించుకున్నాడు.

"శ్యామ్ సుందర్ ఎక్కడున్నాడు ?" తనలో తను అనుకుంటున్నట్టు పైకే అనేశాడు.

"రమేష్ ఇప్పుడు ఫోన్ చేయటం ఒక విధంగా మనకు మంచిదే. శ్యామ్ సుందర్ గురించి కొంత ఇన్ఫర్మేషన్ యిచ్చాడు. గురుదాస్ పూర్ లో శ్యామ్ సుందర్ లోకల్ గుండాలతో గొడవపడ్డాడు. అదీ ఓ అమ్మాయి మూలంగా. ఎవరా అమ్మాయి ? అక్కడ ఏం జరుగుతుంది ? ఒకసారి అక్కడికి వెళ్ళి వస్తే బాగుంటుందనుకుంటున్నాను" తన అభిప్రాయం చెప్పింది వాసంతి.

"ప్రస్తుతం నాకు అంత టైం లేదు. అలాగని నువ్వు ఆఫీసు మూసి వెళ్ళి రావటం అస్సలు బాగుండదు. నేను బయటికి వెళుతున్నాను. వచ్చేప్పటికి రాత్రి అవుతుంది. ఓ పని చెయ్యి. మన కాలేషావలీ ఆ ప్రాంతం నుంచి వచ్చినవాడే కాబట్టి తెలిసినవాళ్ళు చాలామంది వుంటారు. ఫోన్ చేసి వివరాలు తెలుసుకోమను. నేను బయలుదేరుతున్నాను" అంటూ సూచనలిచ్చి బయటికెళ్ళిపోయాడు వాత్సవ. అతను రోడ్డు మీదకు వచ్చి ఆటోలో వెళ్ళిపోవడం కిటికీగుండా చూసింది వాసంతి.

వెనక్కి వచ్చి తన సీట్లో కూర్చుని సోడా బంక్ లోని కాలేషావలీకి ఫోన్ చేసి అర్జంటుగా ఆఫీసులోకి రమ్మని చెప్పింది.

వాసంతి ఫోన్ చేసిన సరిగ్గా రెండో నిముషంలోనే ఆమె ముందు కొచ్చేసాడు కాలేషావలీ.

"చెప్పండమ్మా....ఏమైంది ?" వస్తూనే చేతులు కట్టుకుంటూ వినయంగా అడిగాడు.

"నీతో చిన్న పని బడింది వలీభాయ్! అలా కూర్చో" అంటూ ఎదురుగా ఛైర్ చూపించింది వాసంతి. అయినా అతను కూర్చోలేదు.

"ఫరవాలేదు.... చెప్పండమ్మా" అనడిగాడు అదే వినయ విధేయతలతో.

"నీకు గురుదాస్ పూర్ ప్రాంతం బాగా తెలుసుకదూ ?"

"తెలుసమ్మా! కొంతకాలం అక్కడ వున్నాను కూడా."

"ప్రస్తుతం శ్యామ్ సుందర్ అక్కడ వున్నాడు. చెప్పా పెట్టకుండా మధ్యాహ్నం రెండు గంటలకి బయటికి వెళ్ళినవాడు సాయంత్రం ఐదుగంటలకి ఫోన్ చేసి తను గురుదాస్ పూర్ లో వున్నట్టు రిపోర్ట్ చేశాడు.

తిరిగి ఫోన్ చేస్తానన్నాడు. ఇంతవరకూ మెస్సేజిలేదు. అక్కడ ఆయన ఓ యువతి కారణంగా గూండాలతో గొడవలు పడుతున్నట్టు తెలిసింది. నీకు తెలిసినవాళ్ళకి ఫోన్ చేసి ఎంతో కొంత సమాచారం సేకరించగలవా ?" క్లుప్తంగా, చాలా సింపుల్ గా మేటర్ ని వివరించింది వాసంతి.

"తగిన కారణం లేకుండా శ్యామ్ సుందర్ సాబ్ ఇలా చేయరు. మీరు కంగారుపడకండి, ఒక్క అర్థగంట వెయిట్ చేయండి. మనకు కావలసిన వాళ్ళు గురుదాస్ పూర్ లో వున్నారు. వాళ్ళకి ఫోన్ చేసి ఏం జరిగిందో తెలుసుకుని వస్తాను" అంటూ వచ్చినంత వేగంగానూ కిందకు వెళ్ళిపోయాడు వలీ.

"ఇక్కడి నుంచే ఫోన్ చేయొచ్చు" అని నోటి చివరకు వచ్చిన మాటను మింగేసింది వాసంతి. ఎందుకంటే చెప్పినా అనతు ఆఫీసు ఫోను ఉపయోగించడు. తనకు వప్పగించిన పనుల్లో అంత జాగ్రత్త వహిస్తాడతను. ఆ సంగతి తనకి బాగా తెలుసు.

చెప్పినట్టే సరిగ్గా అర్థగంట తర్వాత తిరిగి ఆఫీసులోకి వచ్చాడు కాలేషావలీ భాయ్.

"ఏమైంది ?" ఆత్రంగా అడిగింది వాసంతి.

"పూర్తి వివరాలు లభించలేదమ్మా. మూడు రోజులుగా అక్కడ ప్రసిద్ధి చెందిన దర్గావద్ద ఉరుసు ఉత్సవములు జరుగుతున్నాయట. నిన్న సాయంత్రం ఏడుగంటల ప్రాంతంలో భగవాన్ దాదా అనే లోకల్ గూండా మనుషులు సుమారు నలభై మందికి పైగా వచ్చారట. మారణాయుధాలతో ఓ చైనా అమ్మాయిని తరుముకురావటం పబ్లిక్ గానే అంతా చూశారట. జన ప్రవాహంలా ఉన్న ఉరుసు ఉత్సవంలో కలిసిపోయి ఆ పిల్ల పరుగులు తీస్తుంటే వేటకుక్కల్లా తరిమారట. అంతలో ఓ యువకుడు ఆకాశం నుంచి వూడిపడ్డట్టు రంగప్రవేశం చేసి ఓ పసివాడ్ని కాపాడ్డమేకాదు, ఆ పిల్లకి అండగా నిలబడి తనతో తీసుకుపోయాడట. జలీల్ ఖాన్ అనే లోకల్ టాక్సీ డ్రైవరు వాళ్ళకి సాయం చేసినట్టు, తన టాక్సీలో ఇద్దర్నీ దూరంగా తీసుకుపోయినట్టు తెలిసింది. కారువెంటే ఆరు వేన్ లలో ఆ గూండామూక కూడా వాళ్ళని వెదుకుతూ వెళ్ళిందట. వాళ్ళెవరూ ఇంతవరకూ వూళ్ళోకి తిరిగొచ్చినట్టు సమాచారం లేదంటున్నారు. ఇంతకుమించి ఏమన్నా తెలుసుకోవాలంటే గురుదాస్ పూర్ వెళ్ళిరావాల్సిందే" అంటూ తను విన్న సమాచారం వివరించాడు కాలేషావలీ.

ఇది సాధారణ విషయం కాదని, ఆ అజ్ఞాత యువతి వెనక పెద్ద కథే వుండి వుంటుందని, లేదంటే శ్యామ్ సుందర్ ఇన్వాల్వ్ అయి వుండడనీ వాసంతికి అర్థమైంది. ప్రస్తుతం చేయగలిగిందేమీ లేదు. శ్యామ్ సుందర్ ఫోన్ చేస్తే గానీ వివరాలు తెలీవు.

అతను ఏ పరిస్థితిలో వున్నాడో ఏమిటో తెలీదు.

"ఓ.కె. వలీభాయ్! రేపటి వరకూ వేచి చూద్దాం. అప్పటికీ ఏ సమాచారం లేదంటే నువ్వోసారి గురుదాస్ పూర్ వెళ్ళి రావాల్సి వుంటుంది. బడ్డీకొట్టు చూసుకోడానికి ఎవరినన్నా తాత్కాలికంగా ఏర్పాటు చేసుకో. నేను వాత్సవ సాబ్ తో ఈ విషయం చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటాను" అంది వాసంతి.

"తప్పకుండా వెళతానమ్మా. నా పాన్ షాపు గురించి అదో సమస్యే కాదు నాకు. ఎందుకంటే మా చిన్న బామ్మర్దికి ఈమధ్య ట్రయినింగ్ ఇచ్చాను. అంతా వాడు చూసుకుంటాడు. వస్తానమ్మా" అంటూ శలవు తీసుకుని వెళ్ళిపోయాడు కాలేషావలీ.

అతను వెళ్ళిన అర్థగంట తర్వాత వాత్సవ కోసం భానుమతి ఫోన్ చేసింది. వాత్సవ ఆఫీసులో లేడని తెలిసి , వాసంతిని ఎంక్వయిరీ చేసింది.

"ఏమైంది , మా తమ్ముడి జాడ ఏమన్నా తెలిసిందా ?" అంటూ.

"అప్పుడే తెలిసిపోతుందని ఎలా అనుకున్నారు ?" సూటిగా నిలదీసింది వాసంతి.

"ఒకటి కాదు , రెండుకాదు , మూడు సంవత్సరాలయింది. పోలీసులు చేతులు ఎత్తేసిన కేసు. మూడు రోజులయినా గడవకముందే మీ తమ్ముడి జాడ ఎలా తెలుస్తుందనుకున్నారు ? పోలీసులు దగ్గరలేని దివ్యశక్తులేమన్నా డిటెక్టివ్ల దగ్గర వుంటాయనా మీ అభిప్రాయం ? ప్రస్తుతం ఆ పనిమీదే వున్నాం. జాడ తెలియగానే మేమే మీకు తెలియచేస్తాం. మీరు అనవసరంగా ఫోన్ లు చేసి ఎంక్వయిరీ చేయటం ఆపటం మంచిది. బై" అంటూ కట్టె విరిచినట్టు చెప్పాల్సింది చెప్పి ఫోన్ పెట్టేసింది వాసంతి.

అదేరోజు సాయంత్రం సిటీలో చాలా పెద్ద వర్షం పడింది. వాత్సవ ప్లే చేసిన ట్రిక్స్ వర్కవుట్ కావటంతో అసలు విషయం తెలీని ఖాద్రి , మాల్యాద్రి రెండు వర్గాలు ఆ వర్షంలోనే మైదానంలో కలబడి కొట్టుకు చచ్చారు.

ఆ సందట్లోనే వాత్సవ ఖాద్రిని కార్నర్ చేసి తనకు కావలసిన ఇన్ఫర్మేషన్ రాబట్టుకున్నాడు. కానీ తమ మాటలు వాహనాల పక్క నుంచి ఎవరో పొంచి వింటున్న అనుమానంతో తన పేరు డిటెక్టివ్ విశ్వనాథ్ అని తప్పుడు సమాచారం ఇచ్చి అక్కడ్నుంచి తప్పుకున్నాడు. మాల్యాద్రి ఖచ్చితంగా ఖాద్రి ని చంపేసి వుంటాడని వూహించాడు.

అయితే మరునాడు ఉదయం పేపర్ వార్త చూసిన వాత్సవ ఆశ్చర్యపోకుండా వుండలేకపోయాడు.

"నగరంలో ఘోరకలి" అనే పతాక శీర్షికతో న్యూస్ పేపర్ ఫ్రంట్ పేజీలోనే ప్రముఖంగా ప్రచురించబడిన వార్త అది. ఇంచుమించు అన్ని వార్తాపత్రికలు ఆ సంఘటనకి ప్రాధాన్యతనిస్తూ రాశాయి. వాటి సారాంశం ఏమంటే ?

నగరంలోని రెండు ప్రముఖ వర్గాలుగా పేరుపొందిన ఖాద్రి వర్గం, మాల్యాద్రి వర్గం కలిసి సుమారు వందమంది గత సాయంత్రం వర్షం సమయంలో సీతానగరం మైదానంలో తలపడి, మారణాయుధాలతో ఒకరిమీద ఒకరు ఎగబడ్డారు. ఖాద్రీ చేతిలో మాల్యాద్రి హతమయ్యాడు. తీవ్రగాయాలతో ఆస్పత్రిలో వున్న ఖాద్రి కోమాలో వున్నాడు. ఎప్పుడు కోమా నుండి బయటపడతాడో డాక్టర్లు చెప్పలేకపోతున్నారు.

కాగా దారుణ పోరాటంలో ఇరు వర్గాలలోనూ సుమారు ముప్పై మంది హతమయ్యారు. ముప్పై మంది కాళ్ళు, చేతులు పోగొట్టుకొని, కొందరు తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలు కాగా మిగిలినవాళ్ళు పోలీసుల రాకతో పరారయ్యారు.

వర్షం మూలంగా సకాలంలో పోలీసులకు మెస్సేజి అందకపోవటం చేతనే సీతానగరం మైదానంలో నెత్తురు ప్రవహించిందని అధికార్లు వూహిస్తుండగా, నగర ప్రజలు మాత్రం ప్రముఖ గూండాలు హతం గావటంతో తేలిగ్గా వూపిరి తీసుకుంటున్నారు. పోతే ఈ గొడవకి అసలు కారణం ఈ వర్గాల్ని రెచ్చగొట్టి మైదానంలోకి రప్పించిన వ్యక్తి ఆర్. డి.ఎక్స్. అనబడే విశ్వనాథ్ అని, అతనో ప్రయివేట్ డిటెక్టివ్ అనీ తెలుస్తోంది. ప్రస్తుతం డిటెక్టివ్ విశ్వనాథ్ ఆచూకీ తీయటంలో పోలీసులు బిజీగా వున్నారు.

ఇంచుమించు అన్ని పత్రికల్లోనూ ఇలాంటి సమాచారమే వుంది. వాటిని పక్కన పడేసి నుదురు రుద్దుకున్నాడు వాత్సవ.

తను ఊహించినది ఒకటి, జరిగింది ఒకటి. ఎందుకిలా జరిగిందని తను విశ్లేషించి ఆలోచిస్తూ కూర్చునే సమయం లేదు. ఏ క్షణంలోనయినా పోలీసు వర్గాలు తమ ఆఫీసు మెట్లెక్కే అవకాశం వుంది.

ఖాద్రిని కార్నర్ చేసిన సమయంలో తను వూహించింది కరక్టే! వాహనాల మాటున ఖాద్రి మనిషి ఎవడో వున్నాడు. వాడు అన్నీ గాకున్నా తమ మాటలు కొన్ని విన్నాడు. నిజానికి ఆ క్షణంలో మాల్యాది చేతిలో ఖాద్రి ఖతం అయిపోవాలి. కానీ చివరి క్షణంలో పొంచివున్న ఖాద్రి మనిషి మాల్యాద్రిని దెబ్బతీసి వుంటాడు. ఫలితంగా మాల్యాద్రి అంతమయిపోయాడు.

ఖాద్రి తీవ్ర గాయలాతో ఆస్పత్రిలో కోమాలో వున్నాడు. ఆ అజ్ఞాత వ్యక్తే పోలీసులకు డిటెక్టివ్ విశ్వనాథ్ పేరు చెప్పి వుంటాడు.

ఇప్పుడున్న సమస్య ఏమిటో కళ్ళ ముందు కనబడుతూనే వుంది. డొంక కదిలించటానికి తను తీగ లాగాడు.

ఆ తీగ ఖాద్రి! వాడు కోమాలోంచి బయటపడ్డ మరుక్షణం డొంక అదృశ్యమయ్యే ప్రమాదం వుంది. ఖాద్రి మిగిలినవాళ్ళని అలర్ట్ చేస్తాడు. కాబట్టి ఖాద్రి కోమా నుంచి బయటపడేలోపల తను మిగిలినవాళ్ళ జాడ తీయటం అత్యవసరం..... తను త్వరగా ఆగ్రా చేరుకోవటం చాలా అవసరం.

"ఏమిటి ఆలోచన ? సీతానగరం మైదానంలో వాళ్ళంతా ఎందుకు నరుక్కు చచ్చారనా ?" వేడివేడిగా పొగలు చిమ్ముతున్న చాయ్ ని అందమైన కప్పులో తెచ్చి వాత్సవ ముందుంచుతూ అడిగింది వాసంతి.

"దానికి ఆలోచించాల్సిన అవసరం లేదు వాసంతీ....! ఎందుకంటే వాళ్ళకా పరిస్థితి కల్పించింది నేనేగా!" అంటూ కప్పు అందుకున్నాడు వాత్సవ.

ఆ మాటలు వినగానే వాసంతి కళ్ళు విశాలమయ్యాయి. చిన్నగా నవ్వాడు వాత్సవ.

"మరీ ఆశ్చర్యపోవద్దు. ఛైల్డ్ కిడ్నాప్ కేసులో మనకున్న ఆధారం ఖాద్రి అని నీకూ తెలుసు. సో... డిటైల్స్ నీకు వివరించే టైం ఇప్పుడు లేదు. శ్యామ్ సుందర్ ఫోన్ చేస్తే వెంటనే ఆఫీసుకు తిరిగిరమ్మని చెప్పు. లేదా తన పరిస్థితిని, వివరాలు తెలుసుకో....ఒకవేళ ఫోన్ చేయలేదంటే కాలేషావలీని ఒకసారి గురుదాస్ పూర్ పంపించి వివరాలు సేకరించుకు రమ్మను. మరో ముఖ్య విషయం..... పోలీసులు రావచ్చు. వాళ్ళను నువ్వు మేనేజ్ చేసి పంపించు. అనవసర విషయాల్లో యస్. ఐ. రమేష్ ఇన్‌వాల్వ్ అవుతున్నాడు. ఆ విషయం అతనికి అర్థమయ్యేలా చెప్పు. ఓ.కె. నేను అర్జంటుగా ఆగ్రా వెళుతున్నాను. ఇది టాప్ సీక్రెట్. నేను రేపు ఈవెనింగ్ ఫోన్ చేస్తాను. ఓ.కె!" అంటూ వాసంతికి ఇవ్వవలసిన సూచనలు చెప్పి, తన ఏర్ బ్యాగ్ భుజాన వేసుకుని ఆఫీసు మెట్లు దిగి వచ్చేసాడు వాత్సవ.

వాసంతి పైనుంచి అతను ఆటో ఎక్కి వెళ్ళిపోవడం చూస్తూనే వుంది.

వాత్సవ వెళ్ళిన ఐదో నిముషంలో డైనమిక్ సెక్యూరిటీ ఆఫీసు ముందు పోలీస్ వెహికల్ దూసుకొచ్చి ఆగింది.

వాత్సవ ముందు చూపుకి ఆశ్చర్యపోకుండా వుండలేకపోయింది వాసంతి. యస్. ఐ. రమేష్ తో బాటు యస్. పి మరో ఇద్దరు పోలీసు అధికారులు లోనకు వచ్చారు.

"మీరంతా యిలా మా ఆఫీసుకు రావటం చాలా హేపీగా ఫీలవుతున్నాను. వాట్ కెన్ ఐడూ ఫర్ యూ సర్ ?" అందర్నీ కూర్చుండజేశాక చాలా పొలైట్ గాఅడిగింది వాసంతి.

"యుకెన్ డూ వన్ థింగ్ మిస్ వాసంతీ! అడిగిన ప్రశ్నలకి కరక్ట్‌గా ఆన్సరిస్తే మేం హేపీ ఫీలవుతాం" అన్నాడు తీవిగా రమేష్.

తను సుపీరియర్స్ ముందు ఎప్పుడూ ఎలా ప్రవర్తిస్తాడో ఇప్పుడూ అలాగే వున్నాడతను. వాసంతి ఉత్సాహంగా కళ్ళెగరేసింది.

"విత్ ప్లజర్. అడగండి చెప్తాను" అంది.

"వాత్సవ ఎక్కడ ?"

"తెలీదు."

"శ్యామ్ సుందర్ ఎక్కడ ?"

"తెలీదు."

"తెలీదు అనేమాట తప్ప మరోమాట నీకు తెలీదా ?"

"తెలీని విషయాన్ని తెలుసు అని ఎలా చెప్పమంటారు యస్.ఐ. రమేష్ గారూ ? అదీ స్నేహధర్మాన్ని కూడా పాటించని మీవంటి స్ట్రిక్ట్ ఆఫీసర్ ముందు అబద్ధాలు ఎలా చెప్పమంటారు ? శ్యామ్ సుందర్ అవుటాఫ్ సిటీ, మూడు రోజులయింది. ఎక్కడుందీ తెలీదు. గురుదాస్ పూర్ లో ఎవరితోనో గొడవపడిన సంగతి అదీ నిన్న మీరు చెప్తేనే తెలిసింది. ఇక వాత్సవ కూడా అవుటాఫ్ సిటీ. ఒక రోజుయింది. ఎక్కడికి వెళ్ళిందీ తెలీదు."

"ఈ విషయాన్ని నువ్వు చాలా తేలిగ్గా తీసుకుంటున్నావ్ వాసంతీ! నిన్న సాయంత్రం సీతానగరం మైదానంలో జరిగిన ఘర్షణల వెనక డిటెక్టివ్ విశ్వనాథ్ అనే వ్యక్తి హస్తం వున్నట్లు దగ్గర సమాచారం వుంది. ఆ విశ్వనాథ్ పోలికలు వాత్సవకూ సరిపోతున్నాయి...."

"సో.... పోలికలున్నాయంటున్నారు గాబట్టి అరెస్ట్ చేయాలని వచ్చారా.... ? నిన్న చూస్తే రిజ్జూనాయక్ హత్య జరిగిన ప్రాంతంలో ఎవర్నో చూసి వాత్సవ ఆటోలో వెళ్ళటం చూశానన్నారు. ఇప్పుడేమో ఎవరో చెప్పిన పోలికలు వాత్సవకు దగ్గరగా వున్నాయంటున్నారు. ఏం చేస్తున్నారు మీరు ? మీ డిపార్ట్‌మెంట్ వూహల్లో కొట్టుమిట్టాడుతోందా ? వూహల్లోంచి బయటికొచ్చి వాస్తవాల గురించి

పరిశోధించండి సార్! మా చేతిలో ప్రస్తుతం అరడజను కేసులున్నాయి. వాళ్ళు ఏ కేసుల్ని పరిశోధిస్తున్నారో నాకే తెలీదు. మీకేం చెప్పమంటారు ? మీ సుపీరియర్స్ తో సహా శ్రమ తీసుకుని వచ్చినందుకు థాంక్స్. ఇంతకుమించి ఏమీ చెప్పలేను" అంటూ తెగేసి చెప్పింది వాసంతి.

ఆమె మాటలతో మాసిపూసినట్టు మాడిపోయింది యస్సై రమేష్ ముఖం. వాసంతి అసాధ్యురాలని అర్థంగావటంతో వచ్చిన యస్.పి. గాని, మిగిలిన వాళ్ళుగాని పెదవి విప్పే సాహసం చెయ్యలేదు. వాళ్ళు వెళ్ళిపోగానే కాలేషావలీ బడ్డీకొట్టుకు ఫోన్ చేసింది వాసంతి అతడ్ని గురుదాస్ పూర్ పంపించే ఉద్దేశంతో.

## 9

గతం తాలూకు ఆలోచనలనుంచి బయటపడ్డాడు వాత్సవ. శ్యామ్ సుందర్ నుంచి మెస్సేజి లేకపోవడం తనకూ ఆశ్చర్యమేకాదు, ఆందోళనగా కూడా వుంది. అలాగని ప్రస్తుతం తను ఏమీ చేయలేని పరిస్థితిలో వున్నాడు. ఖాద్రి కోమానుంచి బయటపడేలోపల తను బడేభాయ్ ని కార్నర్ చేసి మిగిలిన ముగ్గురి వివరాలు రాబట్టాలి. చైల్డ్ కిడ్నాప్ ఎందుకు జరిగింది ? ఆ కుర్రాడ్ని ఎవరికి అప్పగించారు ? ఏం చేశారనే విషయాలు ఎంత త్వరగా తెలుసుకోగలిగితే అంత మంచిది.

ఆగ్రా సిటీలో బడేభాయ్‌ని ఫైండవుట్ చేయాలంటే తను ఉదయం ఎర్లీగా బయల్దేరటం చాలా మంచిది. టైంపదకొండు దాటడంతో ఇక భోంచేసి నిద్రపోయే ఉద్దేశంతో లేచి మీల్స్ టేబిల్ వైపు అడుగులేశాడు వాత్సవ.

* * *

నెమ్మదిగా.... చాలా నెమ్మదిగా ఆ పొదలోంచి తల బయటకు పెట్టి తొంగి చూసింది అడవి కోడి.

దానికన్నా నెమ్మదిగా మరికాస్త ముందుకు జరిగి చప్పుడుగాకుండా చూస్తున్నాడు దాని ఉనికిని కనిపెట్టిన ఆగంతకుడు.

ఆ విషయం తెలీని అమాయక జీవి పొదలను వదిలి పచ్చికమీద కొచ్చింది. పచ్చికలోని పురుగుల్ని తినటం కోసం పొదనుంచి అయిదడుగుల దూరం ఇవతలికి వచ్చేసిందా కోడి. ఇంతలో ప్రమాదాన్ని గుర్తించిన కొమ్మమీద కాకి ఒకటి ప్రమాద సూచికగా కావుకావుమని గొంతు విప్పి అరిచింది.

ఆ అరుపువిన్న మరుక్షణం గిరుక్కున వెనుతిరిగి తను వచ్చిన పొదలవైపు పరుగుతీసింది కోడి. దానికన్నా వేగంగా కదిలాడు ఆగంతకుడు. అతడి చేతిలోని డాగర్ సూటిగా దూసుకెళ్ళి కోడి రెక్కల మధ్య నిర్దాక్షిణ్యంగా దిగబడి పోయింది. వెంటనే ఎగిరిపోయాయి దాని ప్రాణాలు. దాన్ని పడగొట్టిన ఆగంతుకుడు చెంగున లేచి దూసుకొచ్చి కాళ్ళు పుచ్చుకుని లేపేశాడా అడవి కోడిని.

ఓ పట్టాన దెబ్బకు దొరకని పక్షి అడవికోడి. అటువంటి కోడిని కొట్టిన ఆనందంలో.... "దొరికింది. అడవి కోడి పుంజును చంపేశా" అని కేకలేస్తూ అంత దూరంలోని వేన్ ల వద్దకు పరుగుతీశాడు వాడు.

వాడు ఒక్కడే కాదు. భగవాన్ దాదా అనుచరులంతా తెల్లవారగానే ఆరంభించేసారు వేట. ఎందుకంటే, రాత్రి ఉన్న పళంగా బయలుదేరి రావటంతో వెంట లిక్కర్ బాటిల్స్ తప్ప వాళ్ళ దగ్గర ఏమీలేవు తినటానికి.

రాత్రి తెల్లవార్లు వాన పడుతూనే వుంది. ఆ వర్షానికి వేన్లలోనే కాలక్షేపం చేశారంతా. తెల్లవారేసరికి వర్షం నిలిచిపోయిందిగాని ఆకాశంలో మబ్బులు ఇంకా అలాగే నిలిచి వున్నాయి. కాదంటే ఇసుకనేల గాబట్టి ఎక్కడా వాన నీరు నిలిచిన జాడ కన్పించడంలేదు.

అప్పటికి ఇరవై కుందేళ్ళు, అరడజను అడవికోళ్ళు, పది అడవి పావురాలు గూండాల చురకత్తులకు ఒరిగిపోయి నిప్పుల మీద వేగుతున్నాయి.

చుట్టుపక్కల పొదల వెంట తిరిగి దొరికిన వాటిని చంపి తెచ్చి నెగళ్ళ మీద దోరగా కాల్చి రెడీ చేస్తున్నారు వాళ్ళు.

ఆ సమయంలో ఒక పెద్ద చూతవృక్షం మానుకు ఆనుకొని నిలబడి ఒక చేతిలో మందుబాటిలు, రెండో చేతివేళ్ళ మధ్య సిగరెట్ తో సీరియస్ గా వున్నాడు హంకాంగ్ వాలా మియాచీ.

ఎదురుగా ఇవతలగా వున్న ఒక వేన్ కి జేరబడి తమవాళ్ళు చేస్తున్న వంట పనుల్ని గమనిస్తూ మందుకొడుతున్నాడు భగవాన్ దాదా.

"నెమలి మాంసం నాకు చాలా యిష్టం. ఇక్కడి ఫారెస్ట్ లో నెమళ్ళు దొరకవా ?" అంటూ తన కోరిక బయట పెట్టాడు మియాచీ.

"దొరకవు. ఒకప్పుడు వుండేవి. వేటగాళ్ళు తమ జాతిని చంపి తినేస్తున్నారు అని లోతట్టు అడవులకి వలస పోయాయి. మా దేశంలో నెమలిని చంపటం, అమ్మటం, తినటం అంతా పెద్ద నేరం తెలుసా ?" చెప్పాడు దాదా.

"మనం నేరగాళ్ళం. చట్టానికి భయపడతామా ?" అంటూ అదేదో పెద్ద జోక్ అయినట్టు పెద్దగా నవ్వాడు మియాచీ.

"నేనో సీక్రెట్ చెప్పనా! మీ ఇండియన్స్ ఎంత గొప్ప క్రిమినల్స్ అయినా సెంటిమెంట్స్ కి లొంగిపోతారు. మీలోని గొప్ప వీక్ పాయింట్ అది కాదంటావా ?" అనడిగాడు తిరిగి తనే.

వాడి బోడిగుండును చూస్తే గొప్ప చిరాకు భగవాన్ దాదాకి. తనలా పిచ్చుక గూడులా జుత్తు, పిచ్చిగడ్డంతో ఉన్న వాళ్ళకే తెలివి అధికమని అతడి ప్రగాఢ విశ్వాసం. మరీ నున్నగా, గుమ్మడికాయ సైజులో తళ తళ మెరిసే మియాచీ గుండు మీద టైంబాంబు పెట్టి పేల్చేస్తే ఎలా వుంటుందని చాలాసార్లు జోక్‌గా అనుకునేవాడు.

"నీకు తెలివితేటలు ఎక్కువ మిష్టర్ మియాచీ. కాదని వాదించటం శుద్ధ దండగ అని నాకు తెలుసు" అన్నాడు.

"మరి తెలిసి ఎందుకు తప్పు చేస్తావ్ ? నా మాటలు మీరు ఎందుకు వినటం లేదు ? అందుకే ఈ ట్రబుల్సన్నీ , సెర్చింగ్ ఆపకు కంటిన్యూ చేయమని రాత్రి అరిచి చెప్పాను. అలా చేసుంటే సూకీ రాత్రి మనకు ఖచ్చితంగా పట్టుబడి పోయేది."

"వర్షంలో సెర్చింగా.... ఎక్కడ వెదకమంటావ్ మై ఫ్రెండ్ ? అలా చేసివుంటే చీకట్లలో కొండవాగుల్లో కొట్టుకుపోయి సగం మంది చచ్చుండేవాళ్ళు నా మనుషులు. ఇప్పటికే పదిమంది వాళ్ళ చేతుల్లో చావు దెబ్బలు తిని ఆస్పత్రి పాలయ్యారు. అయినా ఆ పిల్ల విషయంలో నువ్వు చాలా దాచావ్!"

"నన్ను సందేహిస్తున్నావా ?"

"సందేహం కాదు. వాస్తవం.నీ మాటలు నమ్మి రంగంలోకి దిగినందుకు ఇదో...నట్టడవిలో పడ్డాం. ఆపిల్ల గొప్ప ఫైటింగ్ మాష్టరని నాతో ఎందుకు చెప్పలేదు ?"

అలాగున భగవాన్ దాదా సూటిగా ప్రశ్నించేసరికి మియాచీకి పచ్చివెలగకాయ గొంతుకి అడ్డం పడ్డట్టయింది. బోడిగుండు రుద్దుకుంటూ ఏదో చెప్పాలని నోరు తెరిచాడు. కానీ గొంతు దాటి మాట బయటకు రాలేదు.

మెరుపు వేగంతో భగవాన్ దాదా చురకత్తి విసరటం చూసి కెవ్వుమంటూ పక్కకు దూకాడు. చురుకత్తి చక్ న చప్పుడు చేస్తూ చెట్టు మానుకు దిగబడింది అతడి భుజం పక్కనే.

"మైగాడ్! నీకు బుద్ధుందా ? నన్ను చంపాలని చూస్తావా ఇడియట్!" అంటూ ఇంత లావున నోరు తెరిచి అరిచాడు మియాచీ.

ఆ మాటలకి చిద్విలాసంగా నవ్వుతూ మరో సిగరెట్ ముట్టించుకున్నాడు దాదా.

"ఊరికే అరవక. ఓసారి వెనక్కి చూసి అప్పుడు చెప్పు" అన్నాడు కేర్ లెస్ గా.

తిరిగి చూస్తూనే షాక్ తో ఎగిరి నాలుగడుగుల దూరం ఇవతలకు దూకాడు మియాచీ. సుమారు నాలుగు అడుగుల పొడవుంటే కట్లపాము ఒకటి చెట్టు మానుకు టపటప కొట్టుకుంటోంది. దాని తల మధ్యలోంచి చెట్టు మానులోకి పిడివరకు దిగబడి వుంది చురకత్తి.

"ఇది హాంకాంగ్ సిటీకాదు మిష్టర్ మియాచీ. అడుగడుగునా ప్రమాదాలతో కూడిన ఘూనాపూర్ అడవులు. చెట్టుకింద నిలబడితే కొండచిలువ మీద పడొచ్చు. చెట్టుకు జేరపడితే మండ్రకప్పలు, పాములు కాటువేయొచ్చు. నేను గమనించకపోతే నీ ప్రాణాలు ఎగిరిపోయేవి. అతి ప్రమాదకరమైన కట్లపాము అది. దాని విషానికి విరుగుడు లేదు. కాటు పడిందంటే పావు గంటలో నరకం అనుభవిస్తూ, వెక్కిళ్ళుపడి చావాల్సిందే. బి కేర్ ఫుల్!" అంటూ వివరించాడు దాదా.

చురకత్తి పిడికి చుట్టలు చుట్టుకుంటూ విడిపించుకోవాలని గింజుకొంటున్న ఆ క్రూర సర్పాన్ని చూస్తుంటే మియాచీకి వెన్నులోంచి పుట్టుకొచ్చింది చలి.

"థాంక్యూ దాదా...." అన్నాడు కృతజ్ఞతగా.

"ఇట్సాల్ రైట్ ఫ్రండ్. కమాన్. మనవాళ్ళు పిలుస్తున్నారు" అంటూ చివరి వేన్ వైపు దారితీశాడు దాదా.

వేన్ బాయ్ నెట్ మీద ఆకుల్లో చక్కగా కాల్చిన నాలుగు అడవి కోళ్ళ మాంసం వుంచి మందుబాటిల్, మంచినీళ్ళు కూడా వుంచారు దాదా మనుషులు.

అంతా తిని, తాగి ఆకలి తీర్చుకొని ప్రయాణమయ్యేసరికి ఉదయం ఎనిమిది గంటలు అయింది సమయం. ఆకాశంలో పొద్దు కన్పించటం లేదు. వాతావరణం బాగుంది.

"వాళ్ళు డీజిల్ తెచ్చుకుని కారు స్టార్ట్ చేసుకుని మన కళ్ళలో దుమ్ము కొట్టి వెళ్ళిపోయే ప్రమాదం వుంది. మీరు ఈ ప్రాంతంలోనే వుండి ఒళ్ళు దగ్గర పెట్టుకుని కాపలా వుండండి. వాళ్ళు కన్పించగానే నా సెల్ కి ఫోన్ చేయండి" అంటూ హెచ్చరించి, తన మనుషులు ఆరుగుర్ని అక్కడే కారు దగ్గర వదిలి బయలుదేరాడు భగవాన్ దాదా.

సుమారు గంట ప్రయాణంలో మూడు కిలోమీటర్ల దూరం మించి ముందుకుపోవటం సాధ్యం కాలేదు. ఎలాగో తంటాలుపడి లోయలోని ఆ కొండ పాదం వద్దకి వాహనాలు చేరుకునేసరికి పదకొండు గంటలు దైం.

"అదిగో గుహ. లోన కొండదేవత విగ్రహం వుంది. రాత్రి జాతర జరిగిన చోటు ఇదే. ఖచ్చితంగా వాళ్ళు ముగ్గురూ గిరిజన తండాతో కలిసి తప్పించుకు వెళ్ళిపోయి వుంటారు" అన్నాడు మియాచీకి ఆ ప్రాంతాన్ని చూపిస్తూ భగవాన్ దాదా.

రాత్రి వర్షం కారణంగా జాతర మధ్యలోనే నిలిచిపోయిన జాడలు అక్కడ స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఎక్కడివక్కడ ఆరిపోయిన నెగళ్ళు, కొయ్యలకు కట్టిన దివిటీలు కన్పిస్తున్నాయి. పచ్చిక మైదానంలో చిందరవందరగా పడున్నాయి పనికిరాని వస్తువులు.

"ఎమేజింగ్.... ఈ కొండ కత్తితో నరికినట్టు ఇలా నిట్టనిలువుగా ఎలా ఏర్పడింది ? ఆ విగ్రహం అంత భీకరంగా వుందేమిటి ? ఇంత పెద్ద నీళ్ళ తొట్టి ఇక్కడ ఎలా నిర్మించారు ?" అంటూ ఆ ప్రాంతాన్ని విస్మయంగా చూస్తూ కామెంట్ చేసాడు మియాచీ.

దాదాకి వళ్ళు భగ్గుమంది ఆ ప్రశ్నలకి.

"నువ్వు వచ్చింది సూకీ కోసం. ఇక్కడ సోకులు చూడ్డానిక్కాదు మియాచీ. వాళ్ళు ఏమయ్యారో ఆలోచించు. నా అంచనా ప్రకారం అయితే వర్షానికి ముందే వాళ్ళు ఈ గిరిజన తండాని చేరుకోవటం కష్టం. అలాగని వర్షంలో ఇటు రావటమూ సాధ్యంకాదు. ఏం జరిగిందో తెలుసుకుంటేగాని మనం ముందుకు సాగలేం. ఆలోచించు....ఆలోచించి నీ అభిప్రాయం కూడా చెప్పు" అంటూ హెచ్చరించాడు మియాచీని.

అంతలో ఉరుకులు పరుగులమీద వచ్చి వాళ్ళని చేరుకున్నాడు దాదా అనుచరుడు ఒకడు. వాడి పేరు కాశి. వాడికి విప్పపువ్వుతో కాచిన సారా అంటే చాలా యిష్టం. ఈ ప్రాంతం గిరిజన తండాల దగ్గర విప్ప సారా పుష్కలంగా లభిస్తుంది. తియ్యని విప్ప పూలను అందించే విప్ప చెట్లు కొండగుట్టల వెంట అనేకం కన్పిస్తాయి.

చీకటితోనే విప్పసారా కోసం వాడు అయిదు కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్ళి, ఒక బోయగూడెం చేరుకున్నాడు. రెండు సొరకాయల నిండుగా విప్పసారా పర్చేజ్ చేసి భుజాన వేసుకుని తిరిగి రావటానికి ఈ టైంపట్టింది.

"అన్నా.... తెలిసిపోయిందన్నా! రాత్రి ఇక్కడ ఏం జరిగిందో అంతా తెలిసిపోయిందన్నా" అనరిచాడు దగ్గరకొస్తూనే వాడు.

"రాత్రి ఇక్కడ జాతర జరిగింది. అది అందరికీ తెలిసిందే. ఇంతకీ ఏరాకాశీ - తెల్లారి కనబడలేదు. ఎక్కడికి పోయావ్ ? ఆ సొరకాయలేమిటి ?" పిచ్చిగడ్డం దువ్వుకొంటూ సీరియస్ గా అడిగాడు భగవాన్ దాదా.

"అన్నా....ఇది విప్పసారా అన్నా! దీని కోసం బోయగూడెం పోయి వస్తున్నా, మన వేన్ లు ఇటు రావటం దూరం నుంచే గమనించి నేరుగా ఇక్కడి కొచ్చినా" చెప్పాడు వాడు.

"విప్పసారా అంటే నాకూ ఇష్టమేరా. కాని మనం వచ్చిన పనేమిటి ? నువ్వు చేసేదేమిటి ?"

"అంతా మన మంచికే అన్నా! ఆ గూడెంలో బోయలు కొందరు రాత్రి జాతరకి వచ్చారట. వర్షం పడ్డంతో అర్థంతరంగా జాతర నిలిచిపోయిందట. దివిటీలు ఆరిపోయి, వంటకాలు పాడయి చాలా ఇబ్బందిపడ్డారట. ఆ సమయంలోనే ఉన్నట్టుండి కొండపై నుంచి జారి ఎవరో దబ్బున ఆ నీళ్ళ తొట్టిలో పడ్డం చూసి భయపడ్డారట. కొందరు తొట్టిలో దిగి, బయటికితీసి చూస్తే వయసులోవున్న ఆడపిల్ల తెలివితప్పి వుందట. ఆ పిల్ల చారల ఫాంటు, చారల షర్టుతో వుంది."

"మైగాడ్.... ఆ పిల్ల ఖచ్చితంగా సూకీ అయి వుంటుంది."

"అవునన్నా! కొండపైన అంతా జారుడు రాతినేలట. వానపడితే ఎవరూ వుండలేరట. కాని భైరన్న గూడెం వాళ్ళు

కొండదేవత ఆ పిల్ల రూపంలో ప్రత్యక్షమైందనుకుని, సంబరపడుతూ తమ వెంట తీసుకుపోయారట."

ఏం జరిగి వుంటుందో కాశి మాటల్ని బట్టి వూహించేశాడు దాదా. ఆ ముగ్గురూ లోయలోకి రాకుండా మిట్ట పైకి చేరుకుని వుండాలి . వర్షానికి ఆ పిల్లజారి కిందపడితే, మరి మిగిలిన యిద్దరి సంగతేమిటి ? అదే అడిగాడు.

"ఆ పిల్లవెంట మరో ఇద్దరు వుండాలి. ఏమైనట్టు ?

"వాళ్ళ సంగతే తెలీలేదన్నా."

"భైరన్న గూడెం ఎక్కడ వుందట ?"

"ఇక్కడికి ఇరవై కిలోమీటర్ల దూరం వుంటుందట. పది కిలోమీటర్ల దూరం వరకు వేన్ లలో పోవచ్చు. ఆపైన కాలినడక తప్పదు. గువ్వలకొండ వెనక మైదానంలో వుందట భైరన్న గూడెం. రాత్రి ఇక్కడ జాతర చేసుకుంది ఆ గూడెం వాళ్ళేనట."

"షిట్.... పై నుంచి పడింది చస్తే పని సులువు అయి వుండేది. ఖచ్చితంగా అది బతికే వుందని చెప్పారా వాళ్ళు.... ?" అంతా వింటున్న మియాచీ అసహనంగా అడిగాడు.

"ప్రాణాలతోనే వుందన్నారు వాళ్ళు" చెప్పాడు కాశి.

"ఓ.కె. మియాచీ! కంగారుపడకు. మన పని సులువయిపోయింది. పదండి, మనం వెంటనే భైరన్న గూడెం పోతున్నాం" అంటూ అనౌన్స్ చేసాడు భగవాన్ దాదా.

మరుక్షణం వేన్ లు అక్కడి నుంచి శరవేగంతో కదిలాయి.

## 10

ఉన్న చోటునుంచి మరొక్క అడుగు ముందుకొచ్చి, చప్పుడు కాకుండా వెనక కాళ్ళమీద కూర్చుందా అడవి నక్క.

బలిష్టమైన ఆ నక్క చూపులు వాగునీటి వైపే చూస్తున్నాయి. నాలుక తడుపుకుంటూ మరీ అది గుచ్చి గుచ్చి చూస్తోందా ఆకారంవైపు.

సరిగ్గా ఆ నక్క కూర్చున్న ప్లేస్ కి పదడుగుల ఎడంలో ఇసక బొరియలో తీరిగ్గా పడుకుని వుందొక అడవి పంది. అటు ఇటూ జానపొడవున కోరలతో బలిష్టంగా, క్రూరంగా వుందా శూకరం. దాని చూపులు తనకు సమీపంలోని నక్క మీదే వున్నాయి. అది ఏమన్నా కాస్త పొరబాటున తనవైపు తిరిగితే వెళ్ళి మీదపడి కుమ్మేయటానికి అది సిద్ధంగా వుంది.

ఆ వరాహం ఉనికిని ఎంతమాత్రం గమనించని ఆ నక్క చూపులు మాత్రం తను చూస్తున్న ఆబ్జెక్ట్ మీదే కేంద్రీకృతమై వున్నాయి.

ఇతర క్రూరజంతువుల్లా నక్కలు వేటాడలేవు. తనకన్నా చిన్న జంతువుల మీద గుంపుగా దాడిచేసి చంపుతాయి. ఒకటి రెండు నక్కలయితే తమకన్నా పెద్దజంతువు మీద దాడికి జంకుతాయి. సాధారణంగా చిరుతలు, పులులు తినగా వదిలేసిన మాంసం మీద ఆధారపడతాయి అడవి నక్కలు, కాబట్టి -

ప్రస్తుతం వాగు చేరువలో వున్న ఆ నక్క కూడా ఆ కన్పిస్తున్న ఆకారం మీద దాడి చేయాలా వద్దా తేల్చుకోలేని సందిగ్ధంలో ఎదురు చూస్తోంది.

సరిగ్గా ఆ నక్కకు పదిహేను అడుగుల దూరంలో ప్రవహిస్తోందా కొండవాగు. చాలా విశాలంగా వుంది. తీరాన అనేక వృక్షజాతులు వున్నాయి.

ఒక మద్దిచెట్టు వేళ్ళకు తగులుకొని తీరాన నిలిచి వుంది చిలువలు పలవలుగా పెద్ద ఎండుకొమ్మ....ఆ కొమ్మల మధ్య అడ్డంగా పడుందొక మానవ ఆకారం.

అతను చచ్చివుంటే పీక్కు తినొచ్చు. ప్రాణాలతో వుంటే తన గొంతు పట్టుకుంటాడన్న సందిగ్ధంలో ఆ నక్క వెయిట్ చేస్తోంది. రుచికరమైన మనిషి మాంసం అందుబాటులో వుందన్న ఆశతో తన పక్కన తిరుగుతున్న పీతల్ని కూడా అది పట్టించుకోవటంలేదు.

నిజానికి అలా ఎండు కొమ్మ మీద స్పృహలేని స్థితిలో పడున్నది ఎవరో కాదు.

అతను శ్యామ్ సుందర్!

రాత్రి వర్షంలో జలీల్ ఖాన్ ని రక్షించబోయి, అతనితోబాటుగా తనూ కొండపై నుంచి వాగులో పడిపోయాడు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగునీరు. అదృష్టం కొద్దీ పడ్డచోటు లోతయిన ప్రాంతం. నీటిమీదికి వచ్చి చూస్తే చిమ్మ చీకటి, హోరున వర్షంలో కంటి ముందు ఏముందీ కన్పించటం లేదు.

ప్రవాహవేగంలో మునుగుతూ తేలుతూ చాలాదూరం కొట్టుకు వచ్చేశాడు. అంతలో ఒక పెద్ద ఎండుకొమ్మ చేతికి దొరికింది. శక్తినంతా కూడదీసుకుని, దాని మీదకు ఎగబాకి కొమ్మలమీద అడ్డంగా పడిపోయాడు. అంతటితో అతడి స్టెమినా అయిపోయి స్పృహతప్పి తల వాల్చేసాడు.

ఆ ఎండు కొమ్మ తీరానికొచ్చి, తెల్లవారేసరికి మద్దివృక్షం వేళ్ళకు తగులుకొని నిలిచిపోయి వుంది. అప్పటికే తూర్పున పొద్దుపొడిచింది. కాని మబ్బులు దట్టంగా వుండి. పొద్దు కన్పించటం లేదు. వాన ఎప్పుడో నిలిచిపోయింది.

ఆ సమయంలో అతనొక కలగంటున్నాడు.

తన శరీరాన్ని ఎవరో తాళ్ళతో బంధిస్తున్న కల. శీరీరం మీద గాయాలు నరకం చూపిస్తున్నాయి. తలంతా సూదులతో పొడుస్తున్నంత బాధ. ఆ బాధలోనే చిన్నగా మూలుగుతూ కొమ్మలమీద కదిలాడు.

అంతవరకూ శవం అనుకున్న ఆకారంలో చలనం చూసిన సదరు నక్కగారు అదిరిపడి చటుక్కున లేచి ఒక అడుగు వెనక్కి వేసి, కుచ్చు తోకను బలంగా దులిపింది. దాని తోక నుంచి లేచిన ఇసుక గుప్పిళ్ళతో చల్లినట్టు వెళ్ళి తీరిగ్గా విశ్రాంతి తీసుకుంటున్న వరాహం ముఖం మీద పడింది. పడిన తక్షణం చెంగున లేచి నిలబడింది ఆ అడవి పంది.

అప్పుడు కూడా ఆ అడవినక్క వరాహాన్ని గమనించలేదనే చెప్పాలి. ఇప్పుడది చెవులు రిక్కించి మద్దివృక్షం శాఖల్లోకి చూస్తోంది. ఆకులు గలగలమని అలికిడి చేస్తూ కొమ్మనుండి జారటానికి సిద్ధంగా వుందో కొండచిలువ.

పది అడుగులకు తక్కువకాని పొడవుతో, బలిష్టమైన శరీరంతో వంటి నిండా మచ్చలతో వున్న ఆ కొండచిలువను చూడగానే మరో రెండు అడుగులు వెనక్కి వేసింది నక్క. అది చూసి తనమీదికి దాడికి సిద్ధపడుతోందనుకుని పొరబాటుపడుతూ మోరచాపి, కోరగా చూసి ఇసక బొరియలోంచి చెంగున బయటకు దూకిందా శూకరం.

అంతలో—

కొమ్మనుంచి జారిన కొండచిలువ సూటిగా శ్యామ్ సుందర్ పక్కన పడి, అతన్ని చుట్టుకునే ప్రయత్నాలు ఆరంభించింది. ఆ దృశ్యం చూసీ చూడగానే చెంగున ఎగిరి వెనక్కి దూకిన ఆ అడవినక్క భయంతో తిరిగి చూడకుండా పొదల మీదుగా దూకుతూ అర్జంటుగా ఆ ప్రాంతాల నుంచి అదృశ్యమైంది.

అదే క్షణంలో—

కొండచిలువ బరువుకి నీటిమీద తేలుతున్న ఎండుకొమ్మ వైల్డ్ గా వూగుటంతో చటుక్కున స్పృహలోకి వచ్చేశాడు శ్యామ్ సుందర్.

క్షణకాలం తను ఎక్కడున్నాడు ? ఏం జరిగిందీ ? ఏదీ గుర్తు రాకుండాపోయింది. గుర్తుకొచ్చే లోపలే తన కాళ్ళను ఏదో చుట్టుకొంటూండగా, మరేదో తన శరీరాన్ని వేగంగా అల్లుకుంటున్న స్పర్శతో అదిరిపడి పక్కకు దొర్లాడు.

అతని కదలికతో ఆ కొండచిలువ మరింత వేగంగా అతన్ని చుట్టుకోబోయింది. ప్రమాదం గ్రహించిన మరుక్షణం రియాక్టయిపోయాడు శ్యామ్ సుందర్.

చాలా వేగంగా, పెద్దపులి పంజా విసిరినట్టు చేయి విసిరి కొండచిలువ మెడభాగాన్ని ఒడిసిపట్టేసాడు. రెండోచేత్తో దాని తోకను పట్టుకున్నాడు. శక్తినంతా చేతుల్లో కేంద్రీకరించి, దాని వేగాన్ని నిలువరిస్తూ అతి ప్రయత్నం మీద దాని చుట్టల మధ్య నుంచి కాళ్ళను లాక్కున్నాడు.

ఆ ప్రయత్నంలో కొమ్మ పైనుంచి జారి, వాగునీటిలో పడిపోయాడు. అయిదు నిముషాల పాటు ఫైట్ చేసి, దాన్నుంచి పూర్తిగా బయటపడి నీటిలోంచి తీరం ఎక్కి, గిరగిరా తిప్పి బలం కొద్దీ గాల్లోకి విసిరేసాడా కొండచిలువని దూరంగా.

నక్క పారిపోయినా, ఉన్న చోటునుంచి అంగుళం కూడా కదలకుండా మోరచాపి శ్యామ్ సుందర్, కొండచిలువల ఫైటింగ్ ని విడ్డూరంగా చూస్తోంది అడవి పంది. అతడు విసిరేసిన కొండచిలువ వూహించని విధంగా గింగిరాలు తిరుగుతూ వచ్చి అడవి పంది మీద పడింది.

విరుచుకుపడిన ప్రమాదాన్ని సకాలంలో గుర్తించి , చెంగున పక్కకు దూకి కొండచిలువ బారినుంచి తప్పించుకుంది పంది. కాని దాన్ని తనమీద పడేసిన మనిషిమీద మాత్రం మండిపడింది. ఒక్కసారిగా ఘీంకరిస్తూ అతడివై పుదూకింది.

జరిగిన పొరపాటు మరుక్షణమే గ్రహించేశాడు శ్యామ్ సుందర్. అడవి పంది ఎంతటి ప్రమాదకరమో అతడికి తెలీందికాదు. అందుకే లేని ఓపిక తెచ్చుకున్నాడు. ఆ వరాహం తనను సమీపించే లోపలే మెరుపు వేగంతో చకచకా పైకిమద్దిచెట్టు శాఖలమీదికి చేరిపోయాడు.

టార్గెట్ మిస్ కావటంతో ముందుకి దూసుకొచ్చి చివరి క్షణంలో దుమ్ము తెరలు రేపుతూ చెట్టుకింద ఆగిపోయింది అడవిపంది. చెట్టు దిగిరా నీ సంగతి చూస్తా అని బెదిస్తున్నట్టు, మోరచాపి కొమ్మల్లోకి చూస్తూ పగబట్టి అక్కడే తిరగటం మొదలుపెట్టింది.

తాత్కాలికంగా ప్రమాదం తప్పినందుకు హేపీగా ఫీలవుతూ మరో రెండు కొమ్మలు పైకి ఎక్కి రిలాక్స్ గా కూర్చున్నాడు శ్యామ్ సుందర్. అలవాటు ప్రకారం జేబులో చేయిపెట్టాడు సిగిరెట్ పాకెట్ కోసం. తన దుస్తులతోబాటు తడిసి ముద్దయి ఎందుకూ పనికిరాకుండా పోయిన సిగిరెట్ పాకెట్ చేతిలోకొచ్చింది. విసుగ్గా దాన్ని కింద పడేసాడు.

జరిగిన సంఘటనలన్నీ సినిమారీళ్ళ మాదిరి గిర్రున తిరిగనారంభించాయి మనసులో. ఏమయ్యారు వాళ్ళిద్దరు ? ఉన్నట్టుండి ఆందోళనకి గురయ్యింది అతడి అంతరంగం.

అం త ఎత్తునుంచి నేలకు జారిపోయిన సూకీ ఖచ్చితంగా నీళ్ళతొట్టిలోనే పడిందని తన నమ్మకం. అయినా బ్రతికి వుండేందుకు ఛాన్స్ తక్కువే. నీళ్ళ తొట్టి పంచ తగిలినా, అడుగు భాగం తలను తాకినా ఆమె ప్రాణాలు ఆగవు. తనను నమ్మి ఇంతదూరం వచ్చిన యువతిని కాపాడ లేకపోయాడు. ఇంత జరిగినా తనకి ఆ పిల్ల వూరు , పేరు తప్ప మిగిలిన సంగతులేమీ తెలీదు. తెలుసుకునే సమయం కూడా చిక్కలేదు.

రాత్రి పాడువాన పడకుండా వున్నట్టయితే పరిస్థితి మరోలా వుండేది. ఊహించని సంఘటనలు అనూహ్యంగానే జరిగిపోయాయి రాత్రి. సూకీ సంగతి అలా వుంచితే తనతోబాటు వాగులో పడిపోయిన జలీల్ ఖాన్ పరిస్థితి ఏమిటో అర్థం గావటంలేదు. అదృష్టం బాగుంటే తనలాగే ఎక్కడో అతనూ బ్రతికే వుండాలి.

తనను కాపాడాలని వచ్చి అనుకోకుండా ఈ రొంపిలో తనూ ఇరుక్కుపోయాడు పాపం ఖాన్, ముందు అతను ఏమయ్యాడో చూడాలి. తర్వాత సూకీ గురించి ఆలోచించాలి.

ఉన్నట్టుండి ఎదురు తిరిగింది అతడి అంతరంగం.

"ఏంబే! ఇంకా ఎందుకు ఆ పిల్లని గురించి ఆలోచనలు ? పడ్డ కష్టాలు చాలవా ? పైసా అడ్వాన్స్ ఇవ్వలేదు. ఫోన్ చేయగానే చెప్పాపెట్టకుండా తగుదునమ్మా అని ఆఫీసునుంచి బయలుదేరి వచ్చేసావ్. అటు చూస్తే పెద్ద గూండా గుంపే ఆమె ప్రాణాలు తీయటానికి వెంటాడుతోంది. ఆ పిల్ల చూస్తే కొండ పైనుంచి జారిపడింది. బ్రతికి వుంటుందన్న గ్యారెంటీ లేదు. ఈ పరిస్థితి లో ఇంకా ఈ తలా తోకాలేని కేసులతో నువ్వు పని చేయాలా ?"

విసుగ్గా తల విదిలించాడు శ్యామ్ సుందర్.

అంతరాత్మ ప్రబోధంతో అణువయినా ఇక్కడి నుంచి అవతలకు పోయే మార్గం చూడాలిగా.... తన మీద దాడిచేసిన కొండచిలువలా తన దారిన ఎటో పోయింది. కాని పగబడిన అడవిపంది తనని చెట్టు దిగనిచ్చేలా లేదు.

రాత్రి రాళ్ళమీంచి జారి వాగులో పడ్డంతో కాళ్ళూ చేతులు డోక్కుపోయి చిమచిమలాడుతోంది చర్మం. తలంతా భారంగా పలుగులతో పొడుస్తున్నంత పెయిన్.

ఏదో ఒకటి చేయాలి!

ఏం చేయాలి ?

తన దగ్గర ఆయుధాలు.....అవయినా భద్రంగా వున్నాయా ?

గబగబా జేబులు తడిమి చూసుకున్నాడు. తన వేలట్ భద్రంగా వుంది. పాంటుజేబులో ఎప్పుడూ వుండే రివాల్వరు అడ్రస్ లేదు. వాగులో ఎక్కడో జారిపోయి వుండాలి.

కాని జలీల్ ఖాన్ కారు డాష్ బోర్డులోంచి తీసుకున్న వాటిలో బటన్ నైఫ్ మాత్రం భద్రంగా పాంటుజేబులోనే వుంది. తన కుడి మోకాలు కింద ఎప్పుడూ పాంటులోపల దాగుండే లెదర్ హోల్డర్ లోని డాగర్ కూడా భద్రంగా వుంది. కనీసం ఇవయినా మిగిలివున్నాయి. సంతోషించాల్సిందే.

మొరాయిస్తున్న కాళ్ళు చేతుల్ని కూడదీసుకుంటూ లెదర్ హోల్డర్ నుంచి డాగర్ అందుకున్నాడు.

క్రూరంగా చెట్టుమీదికి చూస్తూ చెట్టుకిందే బిచాణం వేసిన అడవి పంది తనని వదిలేలా లేదని అర్థమైపోయింది. కాలు కిందపెట్టిన మరుక్షణం దాడి చేయటానికి అది సిద్ధంగా వుంది. దాంతో వాదం పెట్టుకుని ఇక్కడ కూర్చునే తీరికా, సమయం తనకు లేదు. ముఖ్యంగా ఆకలి చంపేస్తోంది. నిన్న మధ్యాహ్నం ఎప్పుడో చేసిన బోజనం. ఏదో ఒకటి అర్జంటుగా తినకపోతే నట్టడవిలో ఆకలి చావుకి తను గురి అయినట్టే.

పందిని చంపందే తను చెట్టు దిగలేడని అర్థమైపోయింది కాబట్టి వెంటనే యాక్షన్ లోకి దిగాడు.

అటు యిటు చూసి గుప్పెడు లావున పొడవుగా వున్న ఒక కొమ్మను ఎంచుకుని డాగర్ తో నరికి తీశాడు. ఆకులు, చిన్న చిన్న కొమ్మలు నరికి దాన్ని ఆరడుగుల కర్రగా తయారుచేసాడు. దాని చివరి భాగాన్ని శూలంగా చక్కగా చెక్కి తయారుచేశాడు.

మద్దికర్ర బరువుగా వుంటుంది, కాబట్టి గురితప్పే ఛాన్సే వుండదు. లేదంటే పెద్దపులి అయినా దెబ్బతినగానే తిరగబడిపోతుంది గాని అడవి పంది అలా కాదు. దెబ్బతిని మరింత రోషంతో మీదకు దూకి హతమార్చాలని చూస్తుంది. ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా ప్రాణాలో, కాళ్ళూ చేతులో ఏదో ఒకటి పోగొట్టుకోవటం ఖాయం. ఈ సంగతి తెలీని ఎందరో వేటగాళ్ళు అడవి పందిని వేటాడబోయి ప్రాణాలమీదకి తెచ్చుకున్న సంఘటనలు వున్నాయి.

చేతిలో కర్రని రెడీగా వుంచుకుని అయిదు నిముషాలపాటు ఆ పందిని క్లోజ్‌గా అబ్జర్వ్ చేసాడు శ్యామ్ సుందర్.

టార్గెట్ చెట్టుదిగని కారణంగా ఆ మృగం మరింత కోపంతో రెచ్చిపోయి కాళ్ళతో నేలను దువ్వుతూ, ముట్టితో ఇసుకను పొదల్ని పెళ్ళగించి తన సత్తా చూపిస్తూ చెట్టుకింద బీభత్సం సృష్టిస్తోంది.

తను వున్న కొమ్మమీద నిలబడి ఎడంచేత్తో తన తలమీద కొమ్మను బలంగా పట్టుకున్నాడు శ్యామ్ సుందర్. ఎడం చేతిలోని కర్రను వాటంగా పట్టుకొని ఎటాక్ కి రెడీ అయిపోతూ, అవకాశం కోసం వెయిట్ చేయసాగాడు. మరో రెండు నిముషాల తర్వాత అతడి నిరీక్షణ ఫలించింది. గురికి అనువైన చోటులోకి వచ్చిందది. అంతే—

బలమంతా కుడిచేతిలో కేంద్రీకరించి జావెలిన్ త్రోలా చేతిలోని కర్రను సూటిగా ఆ పంది పొట్టభాగానికి గురిచూసి విసిరేసాడు.

అతని గురి తప్పలేదు.

బరిసెలా దూసుకెళ్ళిన ఆ మద్దికర్ర దాని పొట్టభాగంలోంచి రెండోవైపు శూలంలా దిగబడిపోయింది.

దెబ్బతిన్న మరుక్షణం భీకరంగా ఘీంకరించిందా పంది. చెంగున చెట్టువైపు తిరిగి ఒక్క పెట్టున లేచింది గాల్లోకి.

అది అలాంటి పాడుపని తప్పక చేస్తుందని ముందే తెలుసుగాబట్టి చటుక్కున తనున్న కొమ్మను పట్టుకొని కిందకు జారిపోయాడు శ్యామ్ సుందర్.

అతను కిందకు జారటం, ఆ శూకరం ఉగ్రరూపంతో కొమ్మమీద అతనున్న వైపు కుప్పించి ఎగిరి తుపాకి తూటాలా దూసుకురావటం ఏకకాలంలో జరిగిపోయింది.

కొమ్మనుంచి వేలాడుతూనే పెనువేగంతో చివ్వున పాదాలులేపి దూసుకొచ్చిన ఆ అడవి పందిని ఈడ్చి తన్నాడు పొట్టమీద.

మరోసారి కర్ణభేరీలు పగిలిపోయినంత బిగ్గరగా బాధాపూరితంగా అరిచిందా పంది.

అతడి కాళ్ళ వెంటనే గింగిరాలు తిరుగుతూ గాల్లోంచి ఫుట్ బాల్ లా ఎగురుతూ పోయి ఇరవై గజాల దూరంలోని పొదల మధ్య పడిపోయింది. అలా పడుతుండగానే దాని ప్రాణాలు ఎగిరిపోయాయి.

శ్యామ్ సుందర్ ఆ మృగాన్ని ఎంత బలంగా తన్నాడూ అంటే.... ఆ బలానికి కొమ్మను పట్టిన అతడి చేతులు పట్టుజారిపోయి చివ్వున జారి చెట్టుకింద ఇసుకలో ఉప్పుమూటలా జారి దబ్బున పడిపోయాడు. మరోసారి గాయాలు రేగి కీచుగా అరిచాడు.

"ఓసి నీయవ్వ పంది. పొద్దుటే ఎక్కడ దాపురించావే నా ప్రాణానికి, అబ్బ....ఎన్ని ఎముకలు విరిగాయో ఏమిటో..." అని తిట్టుకుంటూ జాగ్రత్తగా.... అతి జాగ్రత్తగా లేచి కూర్చున్నాడు. ఆ అడవిపంది మరో సారి అటాక్ కి వస్తే తిరిగి చెక్కేయటానికి రెడీగా వున్నాడు. కాని.... ఒకటి.... రెండు.... మూడు.... నాలుగు.... నిముషాలు గడిచినా అది వస్తున్న సూచన కన్పించలేదు. అప్పుడు లేచి నిలబడ్డాడు.

అలాగని తొందరపడలేదతను.

కొనప్రాణంతో వున్నా చాలు, శత్రువు కంటపడగానే ఎగిరి గొంతుపట్టే పగ అడవిపందికి. దాంతో వ్యవహారం ఎంత డేంజరో బాగా తెలిసిన వాడు కాబట్టి ఆచితూచి అడుగు ముందుకు వేస్తూ పొదల్లోకి వెళ్ళాడు.

పొదలమధ్య వెల్లకిలా పడుంది అది.

నేలమీద నెత్తురు మడుగు కట్టింది.

దాని ప్రాణాలు పోయాయి. కాని దాని చూపు మాత్రం యింకా తనని క్రూరంగా చూస్తున్నట్టే ఉంది.

"బ్లడీ ఇడియట్.... నీదారినపోతే ఎవరేమంటారు ? కొండచిలువ మీద కోపం నామీద చూపిస్తే వూరుకుంటానా.... ? కోపం వచ్చిందంటే నీకన్నా మృగాన్ని నేను. నీ చావు నా చేతిలో రాసిపెట్టివుంటే ఏం చేస్తాం చెప్పు ? సారీ మిష్టర్ పంది" అంటూ కాలితో దాని బాడీని తొక్కిపట్టి మద్ది కర్రను బయటకు లాగాడు.

ప్రస్తుతం తనున్న పరిస్థితిలో కనీసం చేతిలో కర్రయినా లేకపోతే ఘనాపూర్ అడవుల్లో అడుగు ముందుకు వేయలేడు. వాగునీళ్ళలో నెత్తురు పోయేలా కర్రను శుభ్రంగా కడిగి భుజాన వేసుకున్నాడు.

దిగువకు పోతున్న నీటివాలును బట్టి తను వాగు రెండో తీరంలో వున్నాడు. సూకీ ఆచూకీ తెలియాలన్నా, జలీల్ ఖాన్ జాడ తెలియాలన్నా తను కొండ దేవత విగ్రహం వున్న గుహకి చేరుకోవాల్సిందే. వాగును అనుసరించి ప్రయాణం సాధ్యం కాదు. ఎగువన వాగు తీరం వెంట చాలా దట్టమైన అడవి కన్పిస్తోంది.

ఇక ఎక్కువ ఆలోచించకుండా వాగు నీళ్ళలో అడుగుపెట్టాడు శ్యామ్ సుందర్. అదే సమయంలో మబ్బులు తొలగి సూర్యుడు తొంగి చూశాడు.

వాగునీళ్ళు లోతుగానే వున్నాయి. కొంతదూరం నడిచి, కొంత దూరం ఈదుకొని ఆవలితీరంలోని బండల మధ్యగా పైకి ఎక్కాడు.

బట్టలు తడిసి బరువుగా వున్నాయి. పాదాలకున్న ఆక్షన్ షూస్ కూడా నీళ్ళతో బరువెక్కాయి. వంటిమీద అండర్ వేర్ మాత్రం వుంచుకుని మిగిలిన దుస్తులన్ని విప్పి వాగు నీటిలో గుంజి బాగా పిండి బండల మీద ఆరబెట్టుకున్నాడు. షూస్ సాక్స్ లను కూడా ఉతికి పిండేశాడు.

దగ్గరలోని పొదలవెంట తిరిగి ఒక జాతి మొక్క ఆకులు కోసి తెచ్చి రసం పిండి గాయాలకు పట్టించాడు. భగ్గున మండుతూంటే పళ్ళ బిగువున బాధను భరించాడు. అలా ట్రీట్ మెంట్ పూర్తి కాగానే ఆకలి గుర్తొచ్చింది. దాంతోబాటు సిగరెట్ల ధ్యాస. నట్టడవిలో ఎక్కడ్నించి వస్తాయి సిగరెట్లు ? ముందు ఆకలి తీర్చుకోవాలి. అది కనీస అవసరం.

మద్దికర్ర భుజాన వేసుకుని చెట్లలోకి వెళ్ళాడు. చక్కగా ముగ్గిన బొప్పాయి, జామపళ్ళు దొరికాయి. వాటిని కోసుకు తింటూండగా అనుకోకుండా అతని కంటపడింది చెట్టు.

ఎలా పెరిగిందోగాని బీడీల తయారీకి ఉపయోగించే తునుకాకు చెట్టు ఒకటి వుందక్కడ. ఆ చెట్టును చూడగానే అతనికి లేచివచ్చాయి ప్రాణాలు.

బీడీలు చుట్టుకునేందుకు అనువుగావున్న తునుకాకుల్ని చించుకుని వాటిని తీసుకొని అర్జంటుగా వచ్చేశాడు వెనక్కి.

ఒక బండమీద కూర్చుని తీరిగ్గా ఒక బీడీని శాంపిల్ కి రెడీ చేసుకున్నాడు. దాన్ని పెదవుల మధ్య వుంచి వెలిగించుకున్నాడు లైటర్ తో.

వగరుతో కూడిన రుచితో ఘాటుగా, దట్టమైన పొగ. ఖరీదయిన సిగరెట్లు కాల్చే తనలాంటి వాళ్ళకి ఇది ఇబ్బంది. తప్పదు. కాని మరో మార్గం లేదు. నాలుగు దమ్ములు ఓపిగ్గా పీల్చి వదిలేసరికి అద్భుతమైన ఫలితం కనిపించింది. అంతవరకు వున్న మొత్తం అలసటని చేత్తో తీసి పారేసినంత రిలీఫ్ ఏర్పడింది. ఆ హుషారులో చకచకా బీడీలు తయారు చేసేశాడు.

ఈ లోపల బట్టలు ఆరిపోయాయి.

దుస్తులు ధరించి, షూస్ వేసుకున్నాడు. జేబులనిండా పట్టినన్ని బీడీలు వేసుకున్నాడు. మద్దికర్రను గదలా భుజంమీద వేసుకుని రెడీ అయ్యాడు ప్రయాణానికి.

పొద్దునుబట్టి తను వెళ్ళాల్సిన దిశను అంచనా వేసుకుంటూ, అడవికి అడ్డంపడి ముందుకు పోసాగాడు . దారిలో దొరికిన పళ్ళు, కాయలు తిని ఆకలి తగ్గించుకొంటూ అలా ముందుకు సాగుతూనే వున్నాడు. అదృష్టం కొద్దీ ప్రమాదకరమైన సంఘటనలుగాని, క్రూరజంతువులుగాని ఎదురు కాలేదు. అయితే –

అదేమిటోగాని అడవి దారులవెంట ఎంత నడిచినా మనిషన్నవాడు ఒక్కడూ కనబడలేదు. చూస్తుండగానే సాయంకాలమైపోయింది.

తన అంచనా తప్పిందా ? తను వెళ్ళాల్సిన మార్గం ఇది కాదా.... ? అసలు తను ఎటు పోతున్నాడు ? తనలో తను తీవ్రంగా చర్చించుకుంటూనే చిన్న చిన్న కొండగుట్టల మధ్యగా ఒక పచ్చిక బీడులోకి అడుగుపెట్టాడు.

అలా అడుగు పెడుతుండగానే—

అతని పాము చెవులు పసిగట్టాయి ఒక్క పెట్టున చేస్తున్న అనేక మంది రోదనలు, ఆర్తనాదాలనూ. అదిరిపడి తలెత్తి ఎగువకు చూశాడు శ్యామ్ సుందర్.

అలా చూసిన అతని కళ్ళకు తనున్న చోటుకు సరిగ్గా రెండు ఫర్లాంగుల దూరంలో కన్పించింది ఒక అడవిగూడెం. ఆ రోదనలు వినవస్తోంది అక్కడి నుంచే, అదికూడా కాదు.

ఆ గూడెం మధ్య నుంచి నిట్టనిలువుగా గగన వీధిని తాకుతూ కన్పిస్తోంది నల్లటి ధూప స్తంభం. చాలా దట్టమైన పొగలు నిట్టనిలువుగా పైకి పోతున్నాయి. ఏం జరుగుతోందక్కడ ? గూడెం తగలబడుతోందా ?

సందేహం లేదు. ఘోర ప్రమాదం ఏదో అక్కడ సంభవించి వుండాలి. గిరిజనుల ఆర్తనాదాలు అతడి పాదాలను ఒక్కక్షణం కూడా అక్కడ నిలువనీయలేదు.

ఫెంగున దూకి గాలితో పోటీపడుతూ ఆ గూడెం దిశగా ఆఫ్రికా ఎడారి చిరుతలా పరుగుతీశాడు శ్యామ్ సుందర్.

## 11

అక్కడి ప్రశాంతతను భగ్నంచేస్తూ వినిపించిన అలికిడికి చిన్నగా కళ్ళు తెరిచింది సూకీ.

సుమారుగా మధ్యాహ్నం ఒంటిగంట సమయం అది. విశాలమైన గుడిశెలో నులకమంచంమీద బలహీనంగా పడుకునుంది సూకీ. ఆమె వంటి మీద చిన్న గాయం కూడా లేదు. కాని వళ్ళంతా పులిసి, పలుగులతో పొడుస్తున్నంతగా పెయిన్స్.

అసలు రాత్రి జరిగిన సంఘటన తలచుకుంటే ఇప్పటికీ తనకి ఆశ్చర్యంగానే వుంది. కొండ పైనుంచి జారుతున్న క్షణంలో తను అయిపోయాననే అనుకుంది. అంత ఎత్తునుంచి జారిపడితే బ్రతికే ఛాన్సేలేదన్నది పచ్చి నిజం. కాని తను బ్రతికే వుంది.

ఏ మూలనో తనకి అదృష్టం వుంది. పడ్డం పడ్డం సరాసరి నీళ్ళ తొట్టిలో పడింది. అలా పడ్డంలో కూడా నిలువుగాగాని, తల్లకిందులుగాగాని పడి వుంటే తొట్టి అడుగుభాగంలోని రాతినేలను తాకి, తల పగిలి చచ్చివుండేది. కాని తను పడింది అలా కాదు. సరిగ్గా తొట్టి మధ్యలో వెల్లకిలా వచ్చి పడింది నీళ్ళలో. దాంతో ఛెళ్ళున తాకిన నీళ్ళదెబ్బ తిని నీటిలో మునుగుతూనే తెలివి తప్పిపోయింది. సమయానికి ఆటవికులు నీటిలో నుంచి తీయటంతో, ప్రాణాపాయం తప్పిందిగాని, ఉదయం ఏడు గంటలవరకు స్పృహ రాలేదు.

గూడెం జనం మాటల్ని బట్టి వర్షం ఆరంభం గావటంతో కొలువులు మధ్యలోనే నిలిచిపోయాయి. పైగా తనని చూసి ఆ అమాయకులు కొండ దేవత అమ్మాయి రూపంలో తమకు దొరికిందని సంబరపడిపోయారు.

ఆ గాలివానలోనే వాళ్ళంతా బళ్ళమీద తిరుగు ప్రయాణమయి, అర్థరాత్రి దాటుతూండగా భైరన్న గూడెం చేరుకున్నాడు.

సూకీని అమ్మవారిగా భావిస్తున్నారు గాబట్టి ఆమెను ఊరి మధ్యకు తీసుకెళ్ళటం అరిష్టంగా భావించారు గూడెం జనం. దాంతో గూడెం దొర శింగన్న గూడెం చివర పెద్ద గుడిశెను సూకీకి కేటాయించాడు. గుడిశెలో నులకమంచం వేసి, వేపమండలు పరచి, పసుపు నీళ్ళు చల్లి సూకీని లోన పడుకోబెట్టారు . ఈ విషయం సూకీకి తెలియదు.

తెల్లవారగానే గూడెం జనమంతా సూకీ గుడిశె ముందు చేరిపోయారు. ఆమెకు స్పృహ వచ్చి కళ్ళు తెరిచిన మరుక్షణం సాగిలపడి పోయారంతా.

ఒకటే జయఘోష.

టపటప పగిలాయి కొబ్బరికాయలు.

కస కస తెగిపడ్డాయి కోళ్ళ తలకాయలు.

తమ పిల్లాపాపల్ని , చల్లగా చూడమని ఒకటే వేడుకోళ్ళు.

ఆ గిరిజనుల అమాయకత్వానికి నవ్వాలో, ఏడవాలో కూడా అర్థం కాలేదు సూకీకి. తెరిచిన కళ్ళు అర్జంటుగా మూసుకొని, తిరిగి తెలివి తప్పినట్టు తల వాల్చేసింది. అది చూసి కొండ దేవత తిరిగి యోగ సమాధిలోకి వెళ్ళిపోయిందనుకొంటూ అక్కడి నుంచి అప్పుడుకాని యిళ్ళకు కదల్లేదు జనం.

కళ్ళు మూసుకుందేకాని రాత్రి సంఘటనమీదే వున్నాయి ఆమె ఆలోచనలు శ్యామ్ సుందర్ ఏమయ్యాడు ? టాక్సీ డ్రైవరు జలీల్ ఖాన్ పరిస్థితి ఏమిటి ? వాళ్ళు కూడా తనలాగే జారి కింద పడిపోయారా ? లేక సురక్షితంగా వున్నారా ? వుండి వుంటే, తను ఏమైందో తెలుసుకోడానికి రాకుండా వుంటారా ? అదృష్టం కొద్ది తను నీటితొట్టిలో పడి బ్రతికింది. కాని వాళ్ళిద్దరూ రాతి నేలమీద పడి ప్రాణాలు పోగొట్టుకొని వుంటారా ?

సూకీ మనసు ఆందోళనకు గురవుతోంది.

అటుచూస్తే మియాచీ. ఆ పిచ్చికగూడు జుత్తు భగవాన్ దాదా, వాడి మనుషులు.... అంతా ఇక్కడే వున్నారు. రాత్రిగాకున్నా తెల్లవారయినా తన గురించి తెలుసుకుని ఈ గూడెంమీద దాడిచేసే ప్రమాదం వుంది.

తన మూలంగా ఈ అమాయక ప్రజలు ఇబ్బందుల్లో చిక్కకూడదు. ముందు ఇక్కడి నుంచి తను అవతలికి వెళ్ళిపోవాలి.... కాని ఎలా ?

అవకాశం వచ్చినప్పుడు ఎవరో ఒకర్ని అడిగి, రాత్రి జరిగింది వివరంగా తెలుసుకోవాలని చూస్తోంది సూకీ. కాని అంత తొందరగా ఆ అవకాశం రాలేదు.

ఆలోచనల నుంచి తేరుకొని మరోసారి చెవులు రిక్కించింది. బయట కాపలా వున్న యువకులతో గూడెం దొర శింగన్న వాదులాడుతున్నాడు.

"ఇక్కడ ఎవరూ కాపలా వుండాల్సిన అవసరంలేదు. మీ పది మంది వెంటనే ఇక్కడ్నుంచి వెళ్ళిపోవాలి" హెచ్చరిస్తున్నాడు వాళ్ళని.

"ఎలా వెళ్ళమంటారు దొరా! ఆ పిల్ల పారిపోకుండా మల్లన్న దొర మమ్మల్ని కాపలాకి వుంచాడు. ఆ పిల్ల కొండదేవత కాదట, ఆ పిల్ల తనకు కావాలట...."

"నోరు ముయ్యండిబే. ఆ పిల్ల కొండదేవత కాదంటున్నందుకు గూడెం జనం వింటే మల్లన్నను నరికి పోగులు పెడతారు. చెప్పటానికి వాడెవడు ? కాపలా వుండేందుకు మీరెవరు ? గూడెం దొరని నేను చెప్పేశాగా వెళ్ళిపొండి."

"కాబోయే దొర తనే అంటున్నాడు మల్లన్న."

"నాకు మగపిల్లలు లేనంత మాత్రాన అడ్డమైన ఎదవనీ దొరను చేయను. వాడు మర్యాదగా వుండకపోతే వాడికే ప్రమాదం. వెళ్ళి వాడితో చెప్పండి" ఉరుములాంటి గొంతుకతో ఆజ్ఞాపించాడు శింగన్న దొర.

వాళ్ళు వెళ్ళిపోతున్న అలికిడయింది.

మూడు నిముషాలు నిశ్శబ్దం.

శింగన్న దొర కూడా వెళ్ళిపోయి వుంటాడా అని సూకీ ఆలోచిస్తుండగా తలుపు తెరుచుకొంటున్న చప్పుడయింది. ఒక చేతి సంచిలో శింగన్న లోనకొచ్చి తలుపు దగ్గరగా మూయటం గమనించి కూడా స్పృహ లేనట్టు అలాగే పడుకుంది ఆమె.

సుమారు అరవై అయిదు సంవత్సరాల వయసులో కూడా బలమైన మనిషి శింగన్న. జుత్తు ముగ్గుబుట్టలా తెల్లబడింది. గిరిజన సంప్రదాయ దుస్తులు, ఆభరణాలతో చాలా హుందాగా వున్నాడతను. దగ్గరకొచ్చి ఒక కుర్చీని నులకమంచం పక్కకు లాక్కుని కూర్చున్నాడు.

"నువ్వు స్పృహలో వున్నావని నాకు తెలుసు. లేచి కూర్చో" అన్నాడు చేతి సంచిలోంచి ఒక సొరకాయ బుర్ర, ఆకులతో చుట్టిన ఒక పొట్లం బయటకు తీస్తూ.

చాలా బుద్ధిమంతురాలిలా అతను చెప్పిన వెంటనే లేచి నులకమంచం మీద బాసిపట్టు వేసుకు కూర్చుంది సూకీ.

"నువ్వు కొండ దేవత అవతారమని మా వాళ్ళంతా అనుకుంటున్నారు. కాని నువ్వు అందరిలా మామూలు ఆడపిల్లవేనని నాకు తెలుసు. రాత్రి నువ్వు కొండమీదికి ఎలా వెళ్ళావ్, ఎందుకు జారిపడ్డావ్ అని నేను అడగను. కాని అదృష్టం బాగుండి బ్రతికి బయటపడ్డావని మాత్రం చెప్పగలను. నీ శరీరంలో నొప్పులు, నీ కడుపులో ఆకలి నిన్ను వేధిస్తుంటాయని నాకు తెలుసు. ఈ సొరకాయలో విప్పసారా వుంది. కాస్త పుచ్చుకుని ఈ జొన్న రొట్టెలు, కోడికూర తిను. కాస్త బలం వస్తుంది. తర్వాత మాట్లాడుకుందాం" అంటూ వాటిని ఆమె ముందుంచాడు.

ఆ వృద్ధుడి ఆప్యాయతకి సూకీ కళ్ళలో నీళ్ళు నిలిచాయి. రెండు చేతులు ఎత్తి నమస్కరించింది.

"ఒక తండ్రి కూతురి కష్టాన్ని అర్థం చేసుకున్నట్టు మీరు నా కష్టాన్ని అర్థం చేసుకుని సాయం చేస్తున్నారు. కృతజ్ఞురాల్ని" అంది.

"బాధపడకు తల్లీ! కష్టాలు ఎప్పుడూ వుండవు. నాకూ ఇద్దరు కూతుళ్ళు వున్నారు. నీకేం భయంలేదు. ముందు ఇవి తీసుకో" అంటూ ధైర్యంచెప్పాడు.

సంకోచించకుండా సొరకాయ ఎత్తి రుచికరమైన విప్పసారా నాలుగు గుక్కలు తాగేసింది. జొన్న రొట్టెలో కోడికూర నంజుకు తింటుంటే ప్రాణం లేచి వచ్చినట్టయింది.

"దొరా! కొండమీద నాతోబాటు మా ఫ్రెండు ఒకడు, డ్రైవరు ఒకడు ఇద్దరు యువకులు వుండాలి. శత్రువులు తరుముకొస్తుంటే మేం ఆ కొండ మీదికి పారిపోయి వచ్చాం. ప్రమాదవశాత్తూ వానలో నేను పైనుంచి పడి పోయాను. మిగిలిన ఇద్దరి గురించి మీకు ఏమన్నా తెలుసా ? వాళ్ళు కూడా కింద పడిపోయారా ?" అనడిగింది.

పడివుంటే ఖచ్చితంగా చస్తారని ఆమెకు తెలుసు. ఆమె ప్రశ్న విని తల అడ్డంగా వూపాడు సింగన్న దొర.

"లేదమ్మా. నువ్వు తప్ప ఎవరూ కింద పడలేదని ఖచ్చితంగా చెప్పగలను. కొండపైన వాళ్ళిద్దరూ ఏమయ్యారో తెలీదు , నువ్వు దొరికిన కొద్ది సేపట్లోనే బళ్ళను సిద్ధంచేసి మేమంతా తిరుగు ప్రయాణంమయ్యాం" అంటూ వివరించాడు.

"నా పేరు సూకీ....హాంకాంగ్ నుంచి ఇక్కడికొచ్చాను" చెప్పింది.

"అలాగా..." అని ఆశ్చర్యపోయాడా పెద్దాయన. అంతకుమించి ఆమె వివరాలు తెలుసుకోడానికి కొంచెం కూడా ఆసక్తి చూపలేదు.

మాంచి ఆకలిమీద వున్నందున కోడికూర మొత్తం లాగించేసింది సూకీ. విప్పసారా కాస్త లేటుగానే తన పని ఆరంభిస్తుంది. కానీ ఆమె విషయంలో మాత్రం తాగిన క్షణం నుంచే నిషా ఆరంభించింది. చేత్తోతీసి పడేసినట్టు ఒంటి నొప్పులు సర్దుకుని ఉత్సాహం పుట్టుకొచ్చింది. అందుకే భోజనం పూర్తయినా సారకాయను ఆమె వదల్లేదు.

"చూడమ్మా! ఇక్కడ నీకు భద్రత లేదు. నువ్వు వెళ్ళిపోవడానికి ఇది మంచి సమయం. నేనీ నిర్ణయం తీసుకోడానికి తగిన కారణం వుంది. అది కూడా చెప్తాను. మల్లన్న అని మా దూరపు బంధువు ఒకడున్నాడు. నా చిన్న కూతుర్ని మనువాడిన తర్వాత ఈ గూడెం దొర కావాలని వాడు కలలు కంటున్నాడు. నాకు తెలుసు, వాడో అడవిదున్న , మూర్ఖుడు. వాడికి నా కూతుర్ని ఇచ్చే ఉద్దేశం నాకు లేదు. మా సమస్య అలా వుంచితే, ఆ దుర్మార్గుడి కన్ను ఇప్పుడు నీమీద వుంది. నిన్నిక్కడ వుంచి, వాడికి బలి చేయటం నాకిష్టం లేదు. అందుకే చెపుతున్నాను. వెంటనే వెళ్ళిపోతల్లి. ఇక నుంచయినా జాగ్రత్తగా వుండి, నిన్ను నువ్వు రక్షించుకో. తక్షణం వెళ్ళిపో" అంటూ ఆమెకు సలహా యిచ్చాడు.

అతడి సలహా విని, తన అభిప్రాయం ఏదో చెప్పడానికి నోరు తెరిచింది సూకీ. కాని అంతలోనే ధడాలున గుడిశె తలుపు తెరుచుకోవటంతో ఆమె మాటలు ఆమె గొంతులోనే ఆగిపోయాయి. చివ్వున తలతిప్పి చూసింది డోర్ వంక.

తుమ్మ మొద్దులా నల్లగా, బలిష్టంగా వున్న యువకుడొకడు బుల్ డోజర్ లా లోనకు దూసుకొస్తూ కన్పించాడు. వాడ్ని చూడగానే చటుక్కున కుర్చీలోంచి లేచి ముందుకెళ్ళాడు సింగన్న దొర.

"ఏమిట్రా మల్లన్నా ? ఎందుకొచ్చావిక్కడికి ?" అంటూ కళ్ళెర్రజేసి అడిగాడు.

అంతక్రితమే మల్లన్న గురించి అతను చెప్పగా వినివుంది సూకీ. అందుకే చూసింది ఆసక్తిగాఅతడివైపు.

వాడు చాలా కోపంలో వున్నాడు.

"సలహా ఇస్తున్నావా ? ఆ పిల్లని వెళ్ళిపొమ్మని సలహా ఇస్తున్నావా ? ఆ పిల్లను ఇష్టపడ్డానని తెలిసీ పంపించే సాహసం ఎందుకు చేస్తున్నావ్ ?" అంటూ దొరమీద కాట్ల కుక్కలా అరిచాడు వాడు.

"సాహసం నువ్వు చేస్తున్నావ్ రా కుక్కా.... నేను ఈ భైరన్న గూడెం పెద్దను. నా నిర్ణయం తిరుగులేనిది. ప్రశ్నించే హక్కు నీకు లేదు. ముందు బయటికి వెళ్ళిపో!" తనూ ఫోర్స్ గానే ఆర్డర్ వేసాడు దొర.

"ఏమిట్రా ముసలోడు రెచ్చిపోతున్నాడు ? నన్ను గూడెం పెద్దని చేయనని, నీ చిన్న కూతుర్ని నాకిచ్చి పెళ్ళి చేయమని తెగేసి చెప్పావట నా మనుషులతో, నాగురించి ఏమనుకుంటున్నావ్ రా ? ఇక్కడే నిన్ను నరికి చంపుతా, గూడెంకి దొరనవుతా. ఎవడు అడ్డం వస్తాడో చూస్తా!" అంటూ దుస్తులు చాటు నుంచి సర్రున బయటికి లాగాడు బరువైనపొడవు కత్తిని.

వాడు ఒక నిర్ణయంతోనే వచ్చాడని అర్థం కాగానే అదిరిపడి నాలుగడుగులు వెనక్కి వేసాడు సింగన్న. తన చేతిలో ఆయుధం లేదు. ఏం చేయాలో అర్థంగాక కంగారుపడిపోయాడు. అదే సమయంలో నిర్దాక్షిణ్యంగా దొరను తెగనరకడానికి కత్తి నిలేపేసాడు మల్లన్న.

క్షణం ఆలస్యమైనా సింగన్న తలతెగి నేలమీద పడి దొర్లుతుంది. ఆ చివరి క్షణంలోనే మెరుపులా కదిలింది సూకీ.

ఆమె చేతిలోని సారకాయబుర్ర వడిసేలతో విసిరిన రాయిలా సూటిగా వెళ్ళి మల్లన్న ముఖాన్ని తాకి ముక్కలు చెక్కలయింది. అందులో మిగిలిన సారా ముక్కు, మొహం వెంట చింది కళ్ళలో పడి కళ్ళు భగ్గుమన్నాయి.

ఆ షాక్ నుంచి వాడు తేరుకునే లోపలే చెంగున ఎగిరింది సూకీ. బొంగరంలా తిరిగి ఏటువాలుగా పైకి లేపింది ఎడంకాలుని. ఆమె పాదం సూటిగా వాడి కుడి భుజానికి కనెక్టయింది.

కెవ్వుమన్నాడు మల్లన్న.

కరెంట్ షాక్ తిన్న కాకిలా విలవిల్లాడుతూ చేతిలోని కత్తిని వదిలేసాడు. ఏం జరుగుతుందో వాడికి అర్థమయ్యేలోపలే మరోసారి గాల్లోకి ఎగిరింది సూకీ.

ఈసారి ఆమె కుడిపాదం సూటిగా మల్లన్న తల వెనక భాగానికి కనెక్టయింది. అంతే–

కత్తితో చీల్చినట్టు తల సగం వరకు పుచ్చకాయలా విడిపోగా ఫెళ్ళున నెత్తురు చిమ్ముతూండగా బిగ్గరగా అరిచేందుకు ఇంత లావున తెరిచాడు నోరు. కాని అరుపు గొంతుదాటి బయటకు రాలేదు. ఎలా వున్న వాడు అలాగే కట్టెలా విరుచుకుపడిపోయాడు. వాడి ప్రాణాలు ఎగిరిపోయాయి.

తన కళ్ళని తనే నమ్మలేక రెప్పవేయటం మర్చిపోయి చూస్తున్నాడు సింగన్న దొర. తన కళ్ళముందు ఒక అద్భుతం జరిగినంత ఆశ్చర్యం అతడి ముఖంలో నాట్యం చేస్తోంది. చేతిలో ఆయుధం లేకుండా బలమైన ఒక మగాడ్ని ఒక ఆడపిల్ల చంపగలదు అనే నిజాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నాడతను.

కానీ విప్పసారా కిక్ లో హుషారుగా వున్న సూకీ మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా అతిడి ముందుకొస్తూ చెప్పింది.

"సారీ సింగన్న దొరా! నీ వంటి మంచి మనిషిని చంపాలనుకున్న పశువును ప్రాణాలతో వదలటం నాకిష్టంలేదు. ఇవాళ గాకపోతే రేపు వాడు ఖచ్చితంగా నిన్ను చంపేస్తాడు. అందుకే చంపేసాను. దీనికి నువ్వు ఏ శిక్ష వేసినా నేను రెడీ. కానీ ఒక్క విషయం, నువ్విచ్చిన విప్పసారా సూపర్. ఇంకొంచెం ఇస్తే సంతోషిస్తాను" అంది విప్పసారా నిషాతో తూగుతూ.

ఆమె మాటలకి చిరునవ్వు నవ్వాడు సింగన్న.

"ఈ కుక్కని చంపి నన్ను, మా గూడెం జనాన్ని రక్షించావు తల్లీ. ఆ తల్లి కొండదేవత వీడ్ని చంపించటం కోసమే నిన్ను మాతో పంపించింది అనుకుంటున్నాను. నిన్ను చూసి సాధారణ ఆడపిల్లవనుకున్నాను. ఇప్పుడు అర్థమైందమ్మా నీ సత్తా ఏందో....కానీ ఇక నువ్విక్కడ వుండకూడదు. బయటివాళ్ళు మా జాతివాళ్ళని చంపితే మా గూడెం జనం ఊరుకోరు. కాబట్టి వెంటనే బయల్దేరు వెళ్తా. ముందు నిన్ను ఎవరూ గుర్తుపట్టకుండా బట్టలు మార్చుకో" అంటూ తాను తెచ్చిన సంచిలోంచి లంగా, జాకెట్టు, ఓణీ తీసిచ్చాడు. కొన్ని వెండి నగలు కూడా ఇచ్చాడు.

వాటిని ధరించి తన ముందుకొచ్చిన సూకీని చూసి తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు సింగన్న. రంగు రంగుల ఆ దుస్తుల్లో అచ్చం తమ గూడెపు అడుపడుచులాగే వుందామె.

"ఇక నువ్వు వెళ్ళిపో తల్లీ త్వరగా!" అంటూ గడిశె వెనకపక్క చిన్న తలుపు తెరిచాడు.

మల్లన్న తెచ్చిన కత్తి అక్కడే కింద పడుంది. ఆ కత్తిని అందుకుని, నులక మంచంమీది కంబళి తీసి దానికి చుట్టి భుజాన వేసుకుంది సూకీ. సింగన్న దగ్గర శలవు తీసుకుని గుడిశెలోంచి బయటపడి పొదలకు అడ్డంపడి క్షణంలో చెట్ల వెనక అదృశ్యమైంది.

ఆ విధంగా సూకీని పంపించిన వెంటనే గుడిశెకు నిప్పుపెట్టి తనూ అక్కడి నుంచి తప్పుకున్నాడు సింగన్న దొర. గుడిశెతోబాటు కాలిపోతున్న మల్లన్న శవం గురించి గూడెం వాసులకు తెలీనే తెలీదు.

అయితే–

సూకీని వెదుకుతున్న బలమైన శత్రువర్గం ఒకటి తమ గూడెం దిశగా వస్తున్న సంగతి సింగన్న ఎంతమాత్రం వూహించని విషయం. అలా వూహించగలిగి వుంటే బహుశా గూడెం నుంచి ఆమెను పంపించి వుండేవాడు కాదేమో!

సూకీ భైరన్న గూడెం వదిలిన రెండు గంటల తర్వాత దుమ్ము తెరలు రేపుతూ గూడెంలోకి ప్రవేశించాయి భగవాన్ దాదా వేన్ లు.

## 12

ఉదయం వాత్సవ నిద్రలేచేసరికి సమయం ఏడుగంటలు. రాత్రి లేట్ గా నిద్రపోవటం మూలంగా ఉదయం లేవటం లేటయింది. బయటకి బయల్దేరే ఉద్దేశంతో త్వరత్వరగా రెడీకానారంభించాడు.

తనకు తెలిసినవాళ్ళు ఆగ్రాలో చాలామంది వున్నారు. కాని ప్రస్తుతం వాళ్ళలో తనకు ఉపయోగపడేవాళ్ళు కేవలం ఇద్దరే. ఆ ఇద్దరిలో ఒకడు కరీముల్లా.

ఆగ్రా అనగానే అందమైన గాజులకు ప్రసిద్ధి అని వేరే చెప్పక్కర్లేదు. సాధారణ మట్టిగాజులనుండి అతి ఖరీదైన బంగారు గాజుల వరకు అన్ని రకాల గాజులు తయారు చేసే ఎన్నో గాజుల పరిశ్రమలు అక్కడ వున్నాయి. అటువంటి వాటిలో ఓ గాజుల పరిశ్రమ ఓనరు కరీముల్లా.

మెయిన్ బజార్లో పెద్ద హోల్ సేల్ బేంగిల్స్ షాపు వుంది అతనికి. ఆ షాపులో అమ్మకానికి వుంచే అన్ని రకాల గాజులూ అతని గాజుల పరిశ్రమలో తయారయినవే. ముఖ్యంగా రాళ్ళు పొదిగిన లక్క గాజుల తయారీలో కరీముల్లా కంపెనీకి మంచి పేరు. గాజుల తయారీ వ్యవహారం మొత్తం అతని బ్రదర్స్ చూసుకుంటారు. కరీముల్లా మాత్రం పెద్ద బజారులోని తమ షాపులో రిటైల్, హోల్ సేల్ వ్యాపారాలు చూసుకుంటాడు.

గతంలో తన నుంచి ఒక కేసు విషయంలో సాయం పొందిన వ్యక్తి కరీముల్లా. ఆ విశ్వాసం ఇంకా అతనిలో అలాగే వుంది. లోకల్ క్రిమినల్స్ తో ఎంతో కొంత సంబంధం వున్న మనిషి గాబట్టి బడేభాయి అడ్డా సమాచారం అతడి నుంచి లభించే అవకాశం వుంది.

పోతే ఇక రెండో వాడి పేరు నరహరి. వాడు లోకల్ పోలీసు ఇన్ ఫార్మర్. పోలీసులకే కాదు, డబ్బు పారేస్తే ఎవరికి ఏ సమాచారం కావాలన్నా, అది ఎలాంటి రిస్క్ తో కూడుకున్నా తెచ్చి అందించగలడు. రిజ్జూనాయక్ లాగే ఖచ్చితంగా నమ్మదగిన ఇన్ ఫార్మర్ నరహరి. అయితే అతడ్ని కలిసి చాలాకాలమైంది. ప్రస్తుతం ఎక్కడ వుంటున్నాడో తెలుసుకోవాలంటే హైకోర్టు ఎదురుగా కాకా హోటల్ ఓనర్ రాఘవ పాండేని ఆశ్రయించక తప్పదు. వాళ్ళిద్దరూ క్లోజ్ ఫ్రెండ్స్. ముందుగా నరహరిని కలిసే అవకాశం చూసుకుని ఆ తర్వాత అవసరమైతే కరీముల్లాని కాంటాక్ట్ చేయాలని నిర్ణయించుకున్నాడు వాత్సవ.

చకచకా రెడీ అయి బయటకు రాబోతుండగా ఇంతలోనే తలుపు తట్టిన చప్పుడైంది.

ఈ టైంలో ఎవరై వుంటారు ?

బహుశా రూం సర్వీస్ కావచ్చు అనుకుంటూ యధాలాపంగా డోర్ తెరిచాడు. ఎదురుగా డోర్ లో నిలబడున్న అతిథుల్ని చూడగానే వాత్సవ ముఖం ఆశ్చర్యంతో నిండిపోయింది. ఎందుకంటే వచ్చిన ముగ్గురూ పోలీసు అధికారులు.

వాళ్ళలో ఎ.ఎస్. పి. చంద్రశేఖర్ తనకు గతంలో తెలిసినవారే. మిగిలిన ఇద్దరిలో ఒకడు సర్కిలు, రెండోవాడు యస్.ఐ గా గుర్తించాడు వాత్సవ. ఎ.ఎస్.పి. తో సహా ఇంత పొద్దున్నే తరలి వచ్చారంటే విషయం అసాధారణమై వుంటుంది. బయట పోలీసుల బలగాల్ని మొహరించినా ఆశ్చర్యం లేదు.

అసలు వీళ్ళు తనకోసమే వచ్చారా ? లేక హోటల్ మీద రైడింగ్కు రావటంలో అనుకోని సంఘటనా ? అంచనా వేయలేకపోయాడు వాత్సవ. ఎందుకంటే తను ఆగ్రా వస్తున్న సంగతి సెక్రటరీ వాసంతికి తప్ప ఎవ్వరికీ తెలీదు. అలాంటప్పుడు పోలీసులు తనకోసం వచ్చే ఛాన్సే కన్పించటం లేదు. అయినా ఆగ్రా పోలీసులకు తనతో పనేమిటి ?

"హలో మిష్టర్ వాత్సవ! ఏమిటి మమ్మల్ని చూసి షాకయినట్టున్నారు ?" ఎ.ఎస్.పి. కాస్త వ్యంగ్యం కలిపి అడిగిన ప్రశ్నతో ఆలోచనల నుంచి బయట పడ్డాడు వాత్సవ.

"సారీ మిష్టర్ చంద్రశేఖర్! ఇది షాక్ కాదు. సర్ప్రయిజ్!" అంటూ అతని మాటల్ని సరిదిద్దాడు వాత్సవ.

"దట్స్ రైట్. కొన్ని సంఘటనలు ఆశ్చర్యంగానే జరుగుతుంటాయి. మనం యిలా కలుసుకుంటామని నేనూ వూహించలేదు. ఎనీవే! ఇతను సర్కిలు ధనుంజయ్.... ఇతను ఈ ఏరియా యస్.ఐ మదన్!" అంటూ పరిచయం చేశాడు చంద్రశేఖర్. తిరిగి తనే అడిగాడు.

"మనం లోనకూర్చుని మాట్లాడుకోవచ్చా ?" అంటూ.

"ఓ.కె. లోపలికి రండి!" అంటూ పక్కకు తప్పుకున్నాడు వాత్సవ.

అంతా లోనకొచ్చి కూర్చున్నారు.

"చెప్పండి ఎ.ఎస్. పి. గారూ! మీరు ఈ మధ్యనే ఆగ్రా వచ్చినట్టున్నారు ?" అడిగాడు వాత్సవ.

"ఇక్కడకు ట్రాన్స్ ఫరై ఆరుమాసాలయింది. అవునూ, మీరు ఎక్కడికో వెళుతున్నట్టున్నారు ?"

"అవును వెళ్ళాలి."

"సో... మేం రైట్‌టైంకే మిమ్మల్ని కేచ్ చేయగలిగామన్న మాట. థాంక్ గాడ్. మీరు ఏ హోటల్లో దిగారో తెలీదు. ట్రేసవుట్ చేసి రావటంలో కాస్త లేటయింది. విషయం ఏమంటే, మీరు ఆగ్రాలో స్టేచేయటానికి పర్మిషన్ లేదు. వెంటనే మీరు సిటీ వదిలి వెళ్ళిపోవాలి. మాతో సహకరిస్తారని ఆశిస్తాను!" అంటూ ఆర్డర్ పేపర్‌ని వాత్సవ చేతిలో పెట్టాడు ఎ.ఎస్.పి.

వాత్సవ పెద్దగా ఆశ్చర్యపోలేదు. ఇలాంటిదేదో లేనిదే పనిగట్టుకొని డిపార్ట్‌మెంట్ పెద్దలు తనకోసం రారని తెలుసు. కానీ ఆగ్రా పోలీసుల్ని అలర్ట్ చేసిన అదృశ్య శక్తి ఎవరనేది బుర్ర బింముకున్నా అర్థం కాలేదు. తన ఫీలింగ్స్ తెలీకుండా జాగ్రత్త పడుతూ "ఇది చాలా అన్యాయం!" అన్నాడు.

"పర్సనల్ పనిమీద వచ్చా ఇక్కడికి. ఒకటి రెండురోజుల్లో వెళ్ళిపోతాను నన్ను సిటీ వదిలి పొమ్మనే పరిస్థితులు ఏమున్నాయి ఇక్కడ ?" అమాయకత్వం నటిస్తూ అడిగాడు.

"ఇది ముందు జాగ్రత్త చర్య. సీతానగరం మైదానంలో రెండు వర్గాల ఘర్షణల వెనక మీ హస్తంవుందని, మీరు ఆగ్రా వచ్చింది కూడా అలాంటి గొడవలు ఏవో ఇక్కడ సృష్టించటానికేనని మా సూపీరియర్స్‌కి ఎవరో మెస్సేజి ఇచ్చారు. సో.... మీరు ఏ కారణంతో ఇక్కడికి వచ్చినా ప్రస్తుతం మీరు వెనక్కి వెళ్ళిపోవటం తప్ప మరో మార్గం లేదు. ఇప్పుడే ఈ క్షణమే మీరు రూం వెకేట్ చేసి బయలుదేరుతున్నారు. మా యస్.ఐ. మదన్ స్వయంగా మీతో వస్తారు. మిమ్మల్ని రైలుఎక్కించాకే వెనక్కి వస్తారు. బయల్దేరండి!" అంటూ మరో మాటకి అవకాశం ఇవ్వకుండా లేచాడు చంద్రశేఖర్.

ఇక వాళ్ళతో వాదించి ప్రయోజనం లేదని వాత్సవకి అర్థమైపోయింది. అప్పటికప్పుడు ఏర్ బేగ్ భుజాన వేసుకుని రూం వెకేట్ చేసి కిందకు వచ్చేశాడు. రిసెప్షన్‌లో బిల్లు క్లియర్ చేసుకుని బయటికొచ్చాడు.

అక్కడ హోటల్ పార్కింగ్ లో పోలీస్ వెహికల్స్ మూడు నిలబడున్నాయి. పదిమంది కానిస్టేబుల్స్ వున్నారు. ఒక జీప్‌లో వాత్సవని ఎక్కించారు. యస్.ఐ. మదన్, ముగ్గురు కానిస్టేబుల్స్ అతని వెంట జీప్ ఎక్కారు. జీప్ కదిలే ముందు ఎ.ఎస్.పి. ని దగ్గరకు పిలిచాడు వాత్సవ.

"మీ మాట ప్రకారం నేను వెళ్ళిపోతున్నాను. కానీ దారిలో నేను పర్చేజ్ చేయాల్సిన అయిటమ్స్ కొన్ని వున్నాయి నేను చెప్పినచోట కొద్ది సేపు జీప్ ఆపమని మీవాళ్ళకి చెప్పండి" అన్నాడు.

"ఓ.కె....బట్ నో ట్రిక్స్. తప్పించుకొని తిరిగి సిటీలోకి రావాలనుకుంటే మీకే ప్రమాదం. ఓ.కే ?.... మదన్, విన్నావ్ గా బి కేర్ ఫుల్. వెంట వుండి కావలసినవి కొనివ్వండి . దగ్గరుండి రైలుఎక్కించి రావాలి. బికేర్ ఫుల్" అంటూ పర్మిషనిచ్చాడాయన.

జీపు కదిలింది.

అలా కదులుతుండగానే వాత్సవ పెదవుల మీద మెదిలింది క్రూరమైన చిరునవ్వు ఒకటి. ఆ నవ్వుకి అర్థం తెలిసినవాడు ఎ.ఎస్. పి. చంద్రశేఖర్ ఒక్కడే. సర్కిలుగాని కానిస్టేబుల్స్ గాని వాళ్ళకి వాత్సవ తెలీదు గాబట్టి ఆ నవ్వు గురించి అస్సలు పట్టించుకోలేదు.

జీప్ లో కూర్చున్నాడేగాని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు వాత్సవ. ఆగ్రా పోలీసుల్ని అలర్ట్ చేసింది ఎవరు ? ఈ ప్రశ్న సుడులు తిరుగుతోంది అతని మస్తిష్కంలో.

ఎస్.ఐ రమేష్ మొదట నుంచి తనని సందేహించిన మాట నిజం. కాని ఈ పని చేసింది అతనే అనుకోడానికి లేదు. ఎందుకంటే, తను ఆగ్రా వస్తాడని గాని, వచ్చిన విషయంగాని అతని వూహకి అందని విషయం. పోతే తన ఆగ్రా ప్రోగ్రాం వాసంతికి తెలిసినా ఆమె చెప్పదు. వీళ్ళిద్దరూ గాక మూడో మనిషి ఎవరు ?

అలా ఎవరని ఆలోచిస్తున్నప్పుడు అతని కళ్ళముందు ఖాద్రి రూపం కన్పిస్తోంది. తను చూడని ఖాద్రికి సాయం చేసిన అతని అనుచరుడు మెదలుతున్నాడు.

ఆ సాయంత్రం హోరున వర్షంలో ఎంతగా జీప్ వెనక నక్కినా ఖాద్రితో తన సంభాషణ మొత్తం వాడు విని వుంటాడు. పైగా ఖాద్రి చేతి కింద పనిచేసే గుంట నక్కకి ఇంతటి తెలివితేటలు అసాధ్యం. కాబట్టి వాడూ కాదనుకుంటే మిగిలింది ఖాద్రి.

ఖాద్రి కోమాలో ఉన్నట్టు వార్తాపత్రికల్లో వచ్చిన న్యూస్ లో ఎంత వరకూ వాస్తవంవుంది ? తొలిసారిగా వాత్సవ మదిలో అంకురించిన అనుమానం అది.

సిగరెట్ వేళ్ళని చురుక్కుమనిపించటంతో దాన్ని అవతల పారేసి "జీప్ ని మెయిన్ బజార్ లోకి పోనివ్వండి" అన్నాడు మదన్ తో.

జీప్ మెయిన్ బజార్ రూట్ కి తిరిగింది.

యస్.ఐ. మదన్ వాత్సవను చూసి ఫ్రండ్లీగా నవ్వుతూ సిగరెట్ ముట్టించుకున్నాడు.

"డోన్ట్ వర్రీ మిష్టర్ వాత్సవ్. మీ ట్రయిన్‌కి ఇంకా గంట టైమ్ వుంది కాబట్టి మీకేం కావాలో నిదానంగా పర్చేజ్ చేసుకోండి. అలా చూడండి. మా ఆగ్రా సిటీని చూస్తున్నారుగా. ఎక్కడన్నా గొడవలు, కొట్లాటలు, ఘర్షణలు ఏ ఒక్కటి.... ఒక్కటయినా కనబడుతోందా ? ప్రజలు ఎవరి పనుల్లో వాళ్ళు ప్రశాంతంగా వున్నారు. మీరు ఏదో చేస్తారని ఎవడో ఫూల్ మెస్సేజియిస్తే మావాళ్ళకెందుకు కంగారు ? ఐ డోన్ట్ అండర్ స్టాండ్. అసలు మీరేం చేయగలరు సార్ ? గంగిగోవులా వున్నారు. మీ వల్ల ఏమవుతుంది ? మా ఎ.ఎస్.పి. గారు మీ గురించి ఎందుకు ఎక్కువగా వూహించుకుంటున్నారో అర్థంగావటం లేదు" అంటూ తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్పాడు యస్.ఐ. మదన్.

ఆ మాటలకు కూల్ గా.... చాలా కూల్ గా నవ్వాడు వాత్సవ.

"మీకు అర్థంకాదు మిష్టర్ మదన్, మీ ఎ.యస్.పి. సాబ్‌కి నా గురించి తెలుసు. నేనేమీ చేయలేననీ తెలుసు. మీ ముందు కావాలని చేస్తున్న ఎగస్త్రాలివన్నీ. తను చాలా తెలివైనవాడనిమీరు చెప్పుకోవాలని తపన. ఆయన గురించి నాకు బాగా తెలుసుగా. మీరు వెనక్కి వెళ్ళాక ఆయనతో చెప్పండి. వాత్సవ తన పని చూసుకుని వెళ్ళిపోయాడని" అన్నాడు.

"తప్పకుండా మిష్టర్ వాత్సవ. మీరు మా ఎ.యస్.పి. సాబ్ గురించి చాలా కరక్ట్‌గా చెప్పారు. మెయిన్ బజార్ లోకి వచ్చేశాం. ఎక్కడ ఆపమంటారు ?" అడిగాడు మదన్.

కరీముల్లా బేంగిల్స్ షాపు పార్కింగ్ లో జీప్ ఆపించాడు వాత్సవ. అంతా జీప్ దిగి మెట్ల వెంట పైకి వెళ్ళారు. చాలా పెద్దషాపు. మెట్లు ఎక్కగానే పెద్ద వరండా వుంది. షాపు ముందుభాగంలో చక్కగా గ్లాస్ లు బిగించి వున్నాయి. షాపులోవాళ్ళు బయటికి కన్పించరు.

"అందమైన రాళ్ళు పొదిగిన గాజులంటే మా వాళ్ళకి చాలా యిష్టం. తీసుకుని వచ్చేస్తాను. మీరు బయట వెయిట్ చేస్తారా లోనకొస్తారా ?" లోనకు పోబోతూ అడిగాడు వాత్సవ.

"ఈ మాత్రానికి మేం దేనికిలెండి ? ఇక్కడ వరండాలో వెయిట్ చేస్తాం. త్వరగా రండి" అంటూ అక్కడే తన స్టాఫ్ తో ఆగిపోయాడు యస్సైమదన్.

వాత్సవని తక్కువగా అంచనావేసి తను ఎంత పొరబాటు చేశాడో ఆ క్షణంలో మదన్‌కి తెలీదు. తెలిసివుంటే తనూ లోనకి వెన్నంటి వచ్చేవాడేమో.

వాత్సవ లోనకు వెళ్ళేసరికి కేష్ కౌంటర్‌లో కన్పించాడు కరీముల్లా. వాత్సవను చూసిన మరుక్షణం చెంగున సీట్లోంచి దూకి పరుగెత్తుకు వచ్చేశాడు.

"అరే అల్లా....వాత్సవసాబ్, ఇవాళ ఎంత సుదినం! ఆగ్రా ఎప్పుడు వచ్చారు ? రండి సాబ్ కూర్చోండి. అరే, అర్జంట్ గా కూల్ డ్రింక్ పట్రండ్రా" అంటూ తనను చూడగానే హడావిడి చేస్తున్న కరీముల్లాని బలవంతంగా ఆపాడు వాత్సవ.

"అరే కరీంభాయ్, మర్యాదలకిది సమయంకాదు. బయట పోలీసులున్నారు. నన్ను వెనక్కి పంపించేయాలని వాళ్ళ ప్రయత్నం. నా పనులు అవకుండా నేను వెళ్ళలేను. అర్థమైందా ? నేను వెనక డోర్ నుంచి తప్పించుకుని మన గాజుల ఫ్యాక్టరీకి వెళ్ళిపోతాను. నువ్వు ఏం చేస్తావో ఎలా చేస్తావో నాకు తెలీదు. నాకు బడేభాయ్ వివరాలు కావాలి. ఇన్ ఫార్మర్ నరహరిని కాంటాక్ట్ చేసి ఫ్యాక్టరీకి పంపించు. ఓ.కె ?" అంటూ తన అవసరాలు ఏమిటో క్లుప్తంగావివరించాడు వాత్సవ.

" అర్థమైంది సాబ్, మీరు అర్జంటుగా వెళ్ళిపొండి. నరహరిని తీసుకుని స్వయంగా నేనే మన ఫ్యాక్టరీకి వస్తాను. సరేనా ? వెళ్ళిపొండి" అంటూ స్వయంగా తనే వెంటబెట్టుకుని వెనక డోర్ గుండా అవతలి వీధిలోకి వాత్సవని పంపించేశాడు కరీముల్లా. అటుగా వచ్చిన ఆటో ఎక్కి ఆ ప్రాంతానికి దూరంగా వెళ్ళిపోయాడు వాత్సవ.

పావుగంట తర్వాత బయట వరండాలో వెయిట్ చేస్తున్న యస్సైమదన్ కి అనుమానం వచ్చింది. స్టాఫ్ తో సహా లోపలికి వచ్చేశాడు. లోపల కష్టమర్లతో చాలా బిజీగా వున్నాడు కరీముల్లా. ఆ చుట్టుపక్కల ఎక్కడా వాత్సవ జాడలేదు.

"ఏమిటి. సాబ్. ఏం కావాలి ? లేటెస్ట్ డిజైన్ గాజులు చాలా వచ్చాయి. చూపించమంటారా ?" ఏమీ తెలియనట్టు గబగబా యస్సైవద్దకొచ్చి అడిగాడు కరీముల్లా.

"మేం గాజులకోసం రాలేదు భాయ్. ఒక పెద్దమనిషి గాజులు పర్చేజ్ చేయాలని లోనకొచ్చాడు. ఇప్పుడు కన్పించడంలేదు. ఏమయ్యాడు ?" కంగారుగా అడిగాడు మదన్.

"ఏమిటి సాబ్ ? మా షాపు ఎప్పుడూ బిజీగా వుంటుంది. ఎందరో వస్తుంటారు. ఎందరో పోతూంటారు. మాకెవరు గుర్తుంటారు చెప్పండి ? అతను ఇక్కడలేడూ అంటే ఖచ్చితంగా వెళ్ళిపోయి వుంటాడు. మీరు చూళ్ళేదా ? మా షాపులోకి వచ్చిపోవాలంటే యిదేదారి. మరో దారిలేదు" అంటూ వినయం వుట్టిపడేలా చెప్పాడు కరీముల్లా.

అప్పటిగ్గాని తను మోసపోయిన సంగతి యస్సైకి అర్థంకాలేదు. వాత్సవని తక్కువగా అంచనా వేసి ఘోరంగా దెబ్బతిన్నాడు. ఈ సంగతి తెలిస్తే ఎ.యస్. పి తనమీద విరుచుకుపడుతాడు. కందగడ్డలా మారిన ముఖంతో షాపులోంచి బయటకు వేగంగా అడుగులు వేశాడు మదన్.

"సందేహంలేదు. గాజులషాపులోకి వెళ్ళొస్తానని చెప్పి మన యస్సై చేతులకే గాజులు తొడిగేశాడా పెద్దాయన" మదన్ ని అనుసరిస్తూ పక్క కానిస్టేబుల్ చెవిలో గొణిగాడు రెండో కానిస్టేబుల్.

* * *

లోకల్ ఇన్ ఫర్మర్ నరహరిని వెంటబెట్టుకొని ఒక గంటలో గాజుల ఫ్యాక్టరీకి వస్తానని వాత్సవకి మాటిచ్చాడు కరీముల్లా. కాని గంటలో రాలేదు.

వాత్సవ అక్కడే ఓపిగ్గా వెయిట్ చేయసాగాడు.

సుమారు ఒంటిగంట ప్రాంతంలో కరీముల్లా కారు ఫ్యాక్టరీలో కొచ్చింది.

"క్షమించాలి వాత్సవ సాబ్. లేట్ గా రాకతప్పలేదు. మీ కోసం మా ఇంటి నుంచి కేరియర్ తీసుకొచ్చాను. మీరు భోజనం చేయండి. కాసేపట్లో నరహరి యిక్కడికొస్తాడు" అంటూ కేరియర్ ని టేబుల్ మీద వుంచాడు.

"ఏమైంది ?" రిలాక్స్ గా సిగరెట్ పొగ వదులుతూ అడిగాడు వాత్సవ.

"మీరు వచ్చేశాక యస్సైలోనకొచ్చి అడిగాడు. వాళ్ళని మేనేజ్ చేసి పంపించేశాను. నరహరిని ఫోన్ లో కాంటాక్ట్ చేశాను. గంట తర్వాత నేను బయలుదేరుతుండగా ఎ.యస్. పి. చంద్రశేఖర్ వచ్చాడు. ప్రశ్నలతో చంపుకు తిన్నాడు. ఎలాగో మేనేజ్ చేశాను. కాని అతను నన్ను అనుమానిస్తున్నాడని డౌటు. ఎందుకంటే షాపు ముందు మఫ్టీలో ఇద్దరు పోలీసుల్ని నిలబెట్టి వెళ్ళాడాయన. నేను వెనక వీధిలోంచి తప్పించుకుని వచ్చేశాడు. బస్టాండు, రైల్వేస్టేషను, ఏర్ పోర్టు అన్నిచోట్లా నిఘా వుంచాడు ఎ.యస్.పి. మీ కోసం పోలీసులు సిటీ అంతా గాలిస్తున్నారు. పగటిపూట మీరు బయటికెళ్ళటం మంచిదికాదు. అందుకే మీకు భోజనం ఇక్కడికే తీసుకొచ్చాను" అంటూ పరిస్థితి వివరించాడు కరీముల్లా.

ఇంకేమీ ప్రశ్నించలేదు వాత్సవ.

భోంచేశాడు. ఇంటి నుంచి స్పెషల్ గా చికెన్ బిర్యానీతో విందుభోజనమే తీసుకొచ్చాడు కరీముల్లా. భోంచేసి రిలాక్స్ గా కూర్చున్నాక అప్పుడు ఒక విషయం చెప్పాడు కరీం.

"చాలా ఆశ్చర్యంగా వుంది వాత్సవ సాబ్! మొన్నటివరకు అచ్చు గుద్ది వదిలిన ఆంబోతుల్లా ఆగ్రా వీధుల్లో తిరిగేవాళ్ళు బడేభాయి మనుషులు. కాని నిన్నటి నుంచి ఒక్కడు కూడా వీధుల్లో కన్పించటంలేదు. మీ రాకకు , వాళ్ళు అడ్డా వదిలి బయటకి రాకపోవడానికి బలమైన కారణమే ఏదో వుందని నా అనుమానం."

కరీంభాయ్ మాటలు వినగానే ఉలికిపడకుండా వుండలేకపోయాడు వాత్సవ. ఎక్కడో మైండ్ లో వెలుగుతోంది డేంజర్ బల్బు ఒకటి. ఆగ్రా పోలీసుల్ని అలర్ట్ చేసి అంతటితో వూరుకోలేదా అజ్ఞాత వ్యక్తి. బడేభాయ్ని కూడా అలర్ట్ మనుషులు కూడా వెంటపడే పరిస్థితులు క్రియేట్ చేశాడు. అంతేకాదు. ఏ క్షణంలోనయినా పోలీసులుగాని , బడేభాయ్ మనుషులుగాని ఇక్కడికి వచ్చే ప్రమాదం లేకపోలేదు.

ఆలోచిస్తుండగానే కరీముల్లా సెల్ రింగయింది. అవతలి వ్యక్తి మాటలు విని సెల్ ఆఫ్ చేశాడు కరీముల్లా.

"నరహరి ఫోన్ చేశాడు. తన ఆటోని ఎవరో ఫాలో చేస్తున్నారట. అందుకే రాలేకపోతున్నానని చెప్పమన్నాడు" ముఖంలో విషాదం నింపుకుంటూ చెప్పాడు కరీముల్లా.

"డోంట్ వర్రీ కరీంభాయ్! ఇంకేం చెప్పాడో చెప్పు" అడిగాడు వాత్సవ.

"నిన్నటి నుంచే బడేభాయ్ అడ్డాలో హడావిడి మొదలయిందిట. అందుకే అడ్డా వదిలి వాడి మనుషులెవరూ బయటికి రాలేదట. అందుకే అడ్డా వదిలి వాడి మనుషులెవరూ బయటికి రాలేదట. ఇప్పుడు పన్నెండు గంటల నుంచి సిటీలో వాళ్ళ కదలికలు ఆరంభిమయ్యాయట. వాళ్ళు ఎవరికోసమో గాలిస్తున్నారు. బహుశ వాత్సవ సాబ్ కోసం కావచ్చు అని డౌటు పడుతున్నాడు. తన ఆటోని షాడో చేస్తోంది కూడా బడేభాయి ప్రస్తుతం అడ్డాలో లేడట. ఎక్కడికో అజ్ఞాతంలోకి వెళ్ళిపోయాట్ట. వాడి కుడి భుజం లాంటి ఛోటాభాయ్ ప్రస్తుతం అడ్డాలో వుండి కార్యక్రమం నడిపిస్తున్నాట్ట. ఛోటాభాయ్ ని కార్నర్ చేయగలిగితేనే బడేభాయ్ అడ్రస్ సాధ్యపడుతుందంటున్నాడు" అంటూ పరిస్థితిని వివరించాడు కరీముల్లా.

ఆ మాటలు వినగానే రాకూడని డౌట్ వచ్చేసింది వాత్సవకి. తను తెలిసిన వాళ్ళెవరూ బడేభాయి అడ్డాలోగాని , ఇలాకాలోగాని ఎవరూ లేరు. కాని తన గురించి వాడి మనుషులు సిటీలో గాలిస్తున్నారు అంటే ఖచ్చితంగా ఖాద్రి తాలూకు మనిషి ఎవడో ఇక్కడికి వచ్చి వుండాలి. తనకన్నా వాడు చాలా అడ్వాన్సయ్యే

పరిస్థితిలో వున్నాడు. ఎక్కడా తను తలదాచుకోకుండా పోలీసుల్ని రెచ్చగొట్టేలా చేసి వాళ్ళు వీధుల్లో తనకోసం గాలింపు ఆరంభించారు. ఇదేదో డైరక్ట్‌గా వెళ్ళి బడేభాయ్ అడ్డామీద పడి తేల్చుకుంటే గాని తేలే సమస్య కాదు.

ఇక ఎక్కువసేపు ఆలోచించలేదు వాత్సవ.

"ఓ.కె. కరీంభాయ్! నీ సాయానికి థాంక్స్. నేనింకా ఇక్కడ వుండటం నీకూ మంచిదికాదు. నే వెళ్తున్నాను. మనకి నరహరితో పనిలేదిక. వాడికి నువ్వు అమౌంట్ పే చెయ్యి. నేను నీకు పంపిస్తాను. నే వెళతాను" అంటూ లేచి ఏర్ బేగ్ భుజాన వేసుకున్నాడు.

వాత్సవ పనులు ఎలా వుంటాయో బాగా తెలిసినవాడు గాబట్టి అతడ్ని వారించలేదు కరీముల్లా. "ఓ.కె. సాబ్! బి కేర్ ఫుల్" అంటూ హెచ్చరించాడు.

అతని భుజంతట్టి నవ్వాడు వాత్సవ.

"డోన్ట్ వర్రీ!" అంటూ ఫ్యాక్టరీలోంచి బయటకొచ్చేశాడు. అటుగా వస్తున్న ఆటో ఎక్కి బడేభాయి అడ్డా వున్న ఏరియాకు పోనిమ్మన్నాడు.

ఆటో శరవేగంతో ముందుకు దూకింది.

వాత్సవ వెళ్ళిపోయిన సరిగ్గా ఇరవై నిముషాల తర్వాత ఎ.యస్.పి. చంద్రశేఖర్ తన పోలీసు బలగంతో గాజుల ఫ్యాక్టరీ ఆవరణలోకి దూసుకొచ్చాడు. ఆ సమయంలో కరీముల్లా ఇంకా అక్కడే వున్నాడు. మొత్తం గాలించినా వాత్సవ జాడ తెలీకపోవడంతో రిక్త హస్తాలతో వెనుతిరగక తప్పలేదు చంద్రశేఖర్‌కి.

## 13

సుడిగాలి మాదిరి దూసుకొస్తూ గూడెంని సమీపించాడు శ్యామ్ సుందర్. అక్కడికి మరింత బిగ్గరగా గూడెం వాసుల ఆక్రందనలు, రోదనలు వినిపిస్తున్నాయి.

శక్తినంతా పాదాల్లో కేంద్రీకరించి పరుగు వేగం మరింతగా పెంచాడు. గడిశెలకు అడ్డంపడి రోదనలు వినవస్తున్న వైపుసాగిపోయాడు.

ఎక్కువ దూరం పోనక్కరలేకుండానే గూడెం మధ్యలోనే విశాలమైన ప్రదేశాన్ని చేరుకున్నాడు. గూడెం జనమంతా అక్కడే గుంపుకట్టి వున్నారంటే ఆశ్చర్యంలేదు. వాళ్ళంతా దట్టంగా లేస్తున్న పొగల్లోకి చూస్తూ గుండెలు బాదుకొని గోలుగోలున విలపిస్తున్నారు.

శ్యామ్ సుందర్ ఆశ్చర్యానికి అంతులేదు.

ఏం జరుగుతోందిక్కడ ?

కేవలం పది సెకన్ల లోపలే అక్కడి పరిస్థితి అర్థమైపోయింది శ్యామ్ సుందర్ కి.

అక్కడ ఉసిరి, మద్దిటేకుచెట్లు అరడజనుకు పైగా ఆ ప్రదేశంలో వున్నాయి. ఒక టేకుచెట్టు మూడు మీటర్లకై వారవుంటుంది. ఆ చెట్టుకి పై కొమ్మల్లో అరపతో కూడిన ఒక పెద్ద గుడిశె వుంది. ఎక్కడానికి కిందకు తాళ్ళనిచ్చెన వుంది.

ఆ చెట్టుచుట్టూ అనేక కట్టెలు, కంపలు పేర్చబడి నిప్పు ముట్టించబడుంది. చెట్టు చుట్టూ ఎగసిపడుతున్నాయి భగభగ మంటలు. సుడులు తిరుగుతూ లేస్తున్న దట్టమైన పొగల మధ్య చెట్టు పైన అరప స్పష్టంగా కనబడుతోంది. ఆ అరపమీద కొందరు వున్నట్టు గ్రహించగానే చలిగాలి వీచినట్టు జలదరించింది శ్యామ్ సుందర్ శరీరం.

సందేహంలేదు. వాళ్ళని సజీవంగా దహనం చేసే ఉద్దేశంతోనే యిలా చేశారు. మంటలు చెట్టును ఆక్రమించుకోబోతున్నాయి. కొద్దిసేపు ఆగితే ఆ పొగలకే అరపమీది మనుషులు ప్రాణాలు వదిలే ప్రమాదం వుంది.

మంటలు ఆర్పలేక, దాటి వెళ్ళి తమ వాళ్ళను రక్షించుకోలేక ఆ అమాయక జనం గుండెలు బాదుకొని ఏడుస్తూ రోదనల్లో మునిగి వున్నారు.

పరిస్థితి అర్థం కాగానే క్షణం కూడా ఆలస్యం చేయలేదు శ్యామ్ సుందర్.

"తప్పుకోండి....తప్పుకోండి" అంటూ జనాన్ని తోసుకుని ముందుకు వెళ్ళిపోయాడు. అలా వెళుతూనే –

"ఏం చేస్తున్నారు మీరంతా ? పగ్గాలు....పగ్గాలు పట్టండి. చిక్కం....పెద్ద చిక్కం అర్జంటుగా కావాలి. త్వరగా తీసుకురండి" అంటూ అందర్నీ అలర్ట్ చేస్తూ గొంతు చించుకుని అరిచాడు.

అతడి అరుపులు ఒక్కసారిగా గూడెం జనానికి కొరడా ఝుళిపించి నట్టయింది. అనుకోకుండా తమ మధ్యకు వచ్చిన అపరిచిత యువకుడ్ని అదిరిపడి చూశారు. అంతలోనే మరోసారి శ్యామ్ సుందర్ వాళ్ళని హెచ్చరించే సరికి అక్కడ వున్న యువకుల్లో చలనం ఏర్పడింది. ఎందుకు ఏమిటని అడక్కుండా తలోపక్కకి పరుగులు తీసి అరనిముషంలో కొన్ని పగ్గాలు, జంతువుల్ని పట్టే బలమైన తాళ్ళతో కూడిన పెద్ద చిక్కంతో తిరిగి వచ్చారు.

ఆలస్యం చేయలేదు శ్యామ్ సుందర్.

బలమైన రెండు పగ్గాల్ని కలిపి ముడివేశాడు. ఒక కొసని తన దగ్గరున్న మద్దికర్రకు మధ్యన గట్టిగా ముడివేశాడు. ఆ కర్రను పైకిపట్టుకున్నాడు.

బలమంతా కుడిచేతిలో కేంద్రీకరించి పక్కనున్న నేల ఉసిరిచెట్టు పైకొమ్మల్లోకివిసిరాడు.

బరిసెలా నిటారుగా దూసుకెళ్ళిన ఆ మద్దికర్ర సూటిగా వెళ్ళి ఆ చెట్టు కొమ్మల్లో చిక్కుకుంది. ఓసారి దాన్ని బలంగా లాగిచూశాక సంతృప్తి చెందాడు.

ఆ పగ్గం రెండో కొసని చేతికి చుట్టుకొని చిక్కాన్ని భుజాన వేసుకుంటూ "ఊపండి....నన్ను బలంగా వూపండి. నేను అరపమీదకు చేరుకునేంత ఎత్తుగా ఊపాలి త్వరగా....." అనరుస్తూ లేచాడు గాల్లోకి.

అంతే....

అతడి ఉద్దేశం అర్ధమైనట్టు యువకులంతా చేయివేసి వూపారు. ఎత్తుగా....ఇంకా ఎత్తుగా.

ఒకటోసారి.... రెండోసారి.... మూడోసారి.... నాలుగోసారి వూపాల్సిన అవసరం లేకపోయింది. ఒళ్ళు భగ్గుమనే వేడి మంటలమీదుగా దట్టమైన పొగల్ని చీల్చుకొంటూ దూసుకెళ్ళి, టేకు చెట్టుమీది అరపమీద నిలుచున్నాడు శ్యామ్ సుందర్.

దిగువనుంచి భగ్గున పైకివస్తోంది సెగ.

పొగలకు గుండెలు మండుతున్నాయి.

ఊపిరి తీసుకోవటం కష్టంగా వుంది. కళ్ళు చించుకుని అరపమీది శాల్తీలను చూశాడు. ఒక మగాడు. ముగ్గురు స్త్రీలు కన్పిస్తున్నారు. భార్యా భర్త, వాళ్ళ కూతుళ్ళు ఇద్దరూ అని వూహించుకున్నాడు. అప్పటికే ఆ నలుగురూ అపస్మారక స్థితిలోకి చేరుకోంటున్నారు.

మంటల చుట్టూ గూడెం జనం వూపిరి బిగబట్టి పైకి చూస్తున్నారు ఏం జరుగుతుందోనని ఆందోళనగా.

సుడులు తిరుగుతూ ఎగసివస్తున్న మంటల వేడిమి పొగలకు ఉక్కిరి బిక్కిరవుతున్నాడు. అయినా లెక్కచేయలేదు.

చిక్కం విడదీశాడు శ్యామ్ సుందర్.

ముందుగా పెద్దాయన్ని ఎత్తి చిక్కం మధ్యలో పడుకోబెట్టాడు. ఆ వెనకే భార్యను, కూతుళ్ళను వేసి చిక్కం పైకి లాగాడు. ఇప్పుడు మూటలా చిక్కంలో పడున్నారు వాళ్ళంతా. వాళ్ళని అలాగే చిక్కంతో సహా అరపపంచకు దొర్లిస్తూతాడు బలంగా పట్టుకొని అరపను ఒక్క తన్ను తన్ని దూకేశాడు గాల్లోకి.

మరుక్షణం మంటలమీదుగా పొగలను చీల్చుకుంటూ యివతలకు దూసుకువచ్చేసింది చిక్కం.

శ్యామ్ సుందర్ అరిచి చెప్పాల్సిన అవసరం లేకపోయింది. రివ్వున కిందకు దూసుకు రాగానే యువకులంతా చేతులతో పట్టి చిక్కాన్ని ఆపేశారు. కన్ను మూసి తెరిచేలోపు అంతా జరిగిపోయింది. శ్యామ్ సుందర్ పక్కకు దూకేశాడు. యువకులంతా చిక్కంని తెరిచి అందులోంచి నలుగుర్నీ పక్కకు తీసుకెళ్ళి పచ్చికమీద పరుండజేసారు.

"వాళ్ళకేమీ ఫరవాలేదు. ముఖాన కాస్త నీళ్ళు కొట్టండి. దాహానికి మంచి నీళ్ళు అందించండి. గాలి తగలాలి. గుంపు చేరకుండా తప్పుకోండి" అనరుస్తూ తనే జనాన్ని పక్కలకు తరిమాడు శ్యామ్.

మంటల్లో చిక్కిన ఆ నలుగుర్ని ఇంత సులువుగా తీసుకురావచ్చని ఆ క్షణం వరకు తమలో ఎవరికీ తోచనందుకు సిగ్గుపడ్డారు గూడెం యువకులు. ఇక మిగిలిన జనం దృష్టిలో అయితే శ్యామ్ సుందర్ దేవుడే.

"బాబు.... ఎవరివో, ఎక్కడి నుంచి వచ్చావో తెలీదు. మా కొండ దేవతే నిన్నక్కడికి పంపించి, మా దొర సింగన్నను, ఆయన కుటుంబాన్ని కాపాడేలా చేసింది" అంటూ కొందరయితే ఆనందం పట్టలేక శ్యామ్ సుందర్ ముందు సాగిలపడిపోయారు.

వాళ్ళు ప్రయత్నాన్ని అడ్డుకున్నాడు శ్యామ్.

"ఇంతమంది వుండి ఏం చేస్తున్నారు ? ఎవరో వస్తారు, ఏదో చేస్తారని గాకుండా మిమ్మల్ని మీరు రక్షించుకోగలగాలి. చూడండి... మంటలు మరింత ఉధృతమయ్యాయి. గాలికి నిప్పులు ఎగిరి మీ గుడిశెల్ని తగల బెట్టకముందే, ఆ మంటల్ని ఆర్పండి" అంటూ కర్తవ్యంబోధించాడు.

అందుకు ఒక వృద్ధుడు తమ నిస్సహాయతను తెలియజేశాడు.

"ఎలా ఆర్పగలం బాబూ! వాగు నీరు ఆ మిట్ట దిగువన వుంది. నీళ్ళు తెచ్చి ఆర్పటం జరిగేపని కాదు" అన్నాడు.

"ఎవరు చెప్పారు ఇది జరిగేపని కాదని" అంటూ కోపంతో షౌట్ చేశాడు శ్యామ్ సుందర్.

"రండి....కదలిరండి. గూడెం జనమంతా తలో కడవ తీసుకుని రండి. వాగువరకు రెండు వరసలుగా నిలబడండి. క్షణంలో నీరు వస్తుంది. త్వరగా..." అంటూ అక్కడున్న కడవ పుచ్చుకుని అక్కడికి రెండు ఫర్లాంగుల దూరం డౌన్ లో వున్న వాగువైపు పరుగెత్తాడు శ్యామ్ సుందర్.

క్షణం క్రితమే అతడి సాహసం ఏమిటో కళ్ళారా చూసి ఉన్నారు గాబట్టి జనంలో ఒక్క పెట్టున చైతన్యం ఏర్పడింది. ముఖ్యంగా స్త్రీలు , యువతులు ముందుకు దూకారు. మొగుళ్ళని, పిల్లల్ని హెచ్చరిస్తూ కడవల కోసం పరుగులు తీశారు.

వాగు తీరంలోకి పరుగెత్తి తిరిగి చూసిన శ్యామ్ సుందర్ కి గూడెం వాసులు కడవలతో రెండు వరుసలుగా పోటీపడి వుత్సాహంగా బారులు తీరి రావటం కన్పించింది.

కేవలం మూడే మూడు నిముషాల్లో వాగు నుండి మంటలవరకు కడవలతో మనవ హారం రెడీ అయిపోయింది. వాళ్ళలో వచ్చిన చైతన్యానికి ముగ్ధుడయ్యాడు శ్యామ్ సుందర్. పక్కనున్న వృద్ధుడి తల తుండు తీసి తన నడుంకి కట్టుకుని, పాంటు షర్టుతీసి గట్టున పడేశాడు. నడుం లోతు వాగు నీళ్ళలోకి దిగి స్వయంగా కడవలతో నీళ్ళు ముంచి అందివ్వ నారంభించాడు.

రెండో వరసకు ముగ్గురు యువకులు వాగులో దూకి పోటీపడి కడవలు ముంచుతున్నారు. క్షణాలమీద చేతులు మారుతూ వాగునీరు మంటల వద్దకు పరుగుతీస్తోంది. అక్కడ సిద్ధంగా వున్న యువకులు మంటల మీద నీళ్ళు కుమ్మరిస్తున్నారు. నిండు కుండలు పైకి వెళుతుంటే, కాళీ కుండలు వెనక్కి వస్తున్నాయి. అరుపులు , కేకలతో ఒకరినొకరు హెచ్చరిచుకుంటూ చకచకా పని చేస్తున్నారంతా. శ్యామ్ సుందర్ మార్గదర్శి అయ్యాడు. వాళ్ళు అతన్ని అనుసరించారు.

అర్ధగంట లోపలే వచ్చేశాయి మంటలు అదుపులోకి. ఈ లోపల ఒకటి రెండు గుడిశెలకు మంటలు వ్యాపించినా వెంటనే ఆర్పగలిగారు.

మరొక్క అర్ధగంట కష్టపడ్డారంతా.

వాగు నీరు వరదగా కడవలగుండా చేతులు మారి ప్రవహించింది. మంటలు పూర్తిగా చల్లారిపోయాయి. చెట్టు పైన అరపగుడిశెతో సహా కాలి బూడిదయింది. టేకు చెట్టు చాలా వరకు కాలిపోయింది.

ఘోర ప్రమాదం తప్పినందుకు గూడెం వాసులు తేలిగ్గా వూపిరి తీసుకున్నారు. కడవలతో నీరు తీసుకుని ఇళ్ళకు మరలిపోసాగారు. అప్పటికి పొద్దు అస్తమించింది. వాగులో స్నానంచేసి తన దుస్తులు ధరించాడు శ్యామ్ సుందర్. జేబులోని స్టాకులోంచి ఒక బీడీ తీసి ముట్టించుకున్నాడు.

చాలా అలసిపోయాడతను.

ఉదయం నుంచి ప్రమాదాల పుట్టగావున్న అడవి దారుల్లోంచి నడచి, నడచి కాళ్ళు పులిసిపోయాయి. ఆకలితో కడుపు దారుణంగా మారుతోంది. నీరసం నిలువునా ఆవరించి అడుగువేయటం కష్టంగా వుంది.

"ప్రమాదం ఎలా జరిగింది ?" బీడీ దమ్ముకొడుతూ అప్పటికప్పుడు తన ఫాన్స్‌గా మారిపోయి, తనని అనుసరించి వస్తున్న యువకుల్లో ఒకడిని అడిగాడు శ్యామ్ సుందర్.

"ఆ పెద్దాయన కుటుంబం అరపమీద ఎలా చిక్కుబడింది ? చూస్తే కావాలనే ఎవరో మంట పెట్టినట్టుంది. ఏం జరిగిందసలు ?" అంటూ ప్రశ్నించాడు మళ్ళీ తనే.

"మీ అంచనా అక్షరాలా నిజం సాబ్. ఇదంతా కావాలనే చేశారు. మా కళ్ళముందే చేశారు. మేం చేతకాని వాళ్ళలా వుండిపోయాం...." అన్నాడు ఆ యువకుడు బాధగా.

"అదెలా మై ఫ్రెండ్ ? ఇంతమంది మీరంతా వుండగా ఎలా జరిగిందిది ?" ఆశ్చర్యాన్ని అణచుకొంటూ అడిగాడు శ్యామ్.

"రండి సాబ్! మీరు కాపాడింది ఎవర్నో కాదు. మా అందరికీ దేవుడితో సమానమైన మా గూడెం నాయకుడు సింగన్న దొరని, ఆయన కుటుంబాన్ని. మమ్మల్ని కాపాడినందుకు మా భైరన్న గూడెం జనం మీకెప్పుడూ రుణపడి వుంటారు. అదో.... మిమ్మల్ని చూడ్డం కోసం మా దొర ఇటే వస్తున్నాడు. జరిగింది ఏమిటో ఆయనే మీకు చెప్తాడు" అన్నాడు ఉద్వేగంతో ఆ యువకుడు.

అంతలో శ్యామ్ సుందర్‌కి తన భార్యా, ఇద్దరు కూతుళ్ళతో ఎదురు వచ్చేశాడు సింగన్న దొర. వస్తూ సాగిలబడి తన పాదాలు పట్టుకోబోయే ప్రయత్నం చేస్తుంటే వాళ్ళందర్నీ వారించాడు శ్యామ్ సుందర్.

"ఏమిటి పెద్దాయనా యిది! నావల్ల అయిన సాయం ఏదో చేశానంతే. దీనికే నన్ను గొప్పవాడ్ని చేయకండి. ఏం జరిగిందో చెపితే వింటాను. ఆకలవుతోంది. కాస్త అన్నం పెడితే సంతోషిస్తాను" అన్నాడు నవ్వుతూ.

అతడి మాటలకు కన్నీళ్ళు తుడుచుకొని తనూ నవ్వేశాడు సింగన్న దొర.

"మీలాంటి గొప్ప మనసున్న వాళ్ళు ఇలాగే మాట్లాడతారు బాబు! గొప్పతనాన్ని అంగీకరించరు. కానీ ఇలా నీతో మాట్లాడలుగుతున్నానంటే, నా భార్యబిడ్డల్ని చూడగలుగుతున్నానంటే ఇది నువ్వు పెట్టిన భిక్ష. సూర్యుడ్ని అరచేతిలో పట్టుకోగల తెంపరితనం, సాహసం నీలో వున్నాయి. సమయస్ఫూర్తి వుంది. మా వాళ్ళ దగ్గర బలం వుందిగానీ ఇవేమీలేవు. రా బాబు.....మా ఇంటికి పోదాం. తీరిగ్గా మాట్లాడుకుందాం" అంటూ శ్యామ్ సుందర్‌ని వెంట బెట్టుకుని ఆ సమీపంలోనే వున్న తన ఇంటికి తీసుకెళ్ళాడు దొర.

గూడెం వాసులు ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. అప్పటికప్పుడు వంటపని ఆరంభం చేసింది దొర భార్య. పెద్ద కూతురు ఇంటా బయటా దీపాలు వెలిగించింది. చిన్న కూతురు తల్లికి సాయం చేస్తోంది.

ఆరుబయట మంచం వేశాడు దొర.

తూర్పున చంద్రుడు ఉదయించే దృశ్యం అద్భుతంగా వుంది. అడవి అంతటా చీకట్లు తొలిగి వెన్నెల పరుచుకుంటోంది. చల్లని గాలులు వీస్తున్నాయి. నిద్ర తోసుకువస్తోంది శ్యామ్ సుందర్‌కి.

"నీ పరిస్థితి నాకు అర్థమవుతోంది బాబూ! భోజనం సిద్ధంచేసే లోపల విప్పసారా తాగుతూ కాస్త తీరిగ్గా కూర్చుని కబుర్లు చెప్పుకుందాం. నీ వొంటి నొప్పులు చెత్తో తీసినట్టు మాయమవుతాయి" అంటూ ఒక సొరకాయలో తెచ్చిన విప్పసారాను శ్యామ్ సుందర్ కి అందించాడు దొర. అతనొక సొరకాయ తెచ్చుకున్నాడు. టచింగ్‌కి ఒక మూకుడులో పండుమిరపకాయ పచ్చడి, అరటి పళ్ళు ఇద్దరి మధ్యన వుంచాడు.

ఆ ఏర్పాటు చూడగానే ప్రాణం లేచి వచ్చినట్టయింది శ్యామ్ కి. సొరకాయ ఎత్తి గటగట నాలుగు గుక్కలు తాగేశాడు.

గొంతు భగ్గుమంటూండగా లోనకు దిగింది విప్పసారాయి. కాస్త పచ్చడి నాలుక్కి రాసుకోగానే స్వర్గం కన్పించింది.

"పెద్దాయనా.... ఇప్పుడు చెప్పు....ఏం జరిగింది ?" రిలాక్స్ గా కూర్చుంటూ అడిగాడు.

సింగన్న దొర తనూ కాస్త విప్పసారా పుచ్చుకుని, మీసాలు తుడుచుకుంటూ గొంతు విప్పాడు.

"అడవి తల్లిని నమ్ముకుని బతికే అమాయక జీవులం బాబూ! కల్లాకపటం తెలీదు. ఇది భైరన్న గూడెం. నేను ఈ గూడెంకి దొరని. గతంలో మా పూర్వీకులున్నది ఇక్కడ కాదు. ఎగువ వాగు అవతల వుండేదట గూడెం. కొండరాళ్ళు అడ్డంపడి వాగునీరు గూడెం మీదికి రావటంతో వూరు ఖాళీ చేసి కొత్తచోటు

వెదుక్కోవాల్సి వచ్చింది. దాంతో వాళ్ళంతా అక్కడ్నుంచి వలస వచ్చేసి ఇక్కడ గూడెం కట్టుకున్నారు. తమ నాయకుడు భైరన్న ఎవరోకాదు, మా ముత్తాత."

చెప్పటం ఆపి మరికాస్త విప్పసారా పుచ్చుకున్నాడు సింగన్నదొర. కొద్దిగా కొరివి పచ్చడి నాలుకమీద పూసుకుని ఉత్సాహంగా చూశాడు. కానీ శ్యామ్ సుందర్ మాత్రం చికాగ్గా చూశాడు.

"ఏంటి పెద్దాయనా! జరిగింది చెప్పమంటే మీ వూరి చరిత్ర చెప్పమంటే మీ వూరి చరిత్ర చెప్తావేంది ?" అన్నాడు.

"ఆడకే వస్తున్నా బాబూ! ఇంతకీ మీ పేరేంది బాబూ ?"

"శ్యామ్ సుందర్!"

"అట్టనా! బాగుంది....అసలేం జరిగిందంటే బాబూ! అదిగదిగో వెన్నెల్లో నల్లంగ నిలబడుండే కొండ. దాన్ని గువ్వలకొండ అంటారు."

"కొంపదీసి ఆ గువ్వలకొండ చరిత్ర చెప్పబోతున్నావా ఏమిటి ?"

"లేదు బాబూ! సరిత్ర సెప్పనులే. ఆ కొండకి ఆ తట్టున దూరంగా ఓ జారుడు కొండ, దానిపాదులో ఓ గుహ. మా కులదైవం, మా ఇలవేలుపు, మా కొండదేవత వెలిసింది ఆ గుహలోనే.

ప్రతిఏటా పున్నమిరోజున అమ్మోరికి జాతర జరుపుకుంటాం. ఈ అడవిలో ఉండే సాన కొండజాతులకి ఆ దేవతే కులదైవం. నిన్నటి రోజు పొద్దు గుంకకముందే మా గూడెపోళ్ళు అంత బళ్ళమీద అక్కడ చేరుకుని జాతర ఆరంభించాం. కోళ్ళు, మేకలు , దున్నలు బలులిచ్చాం. పూజలు చేశాం. జాతరసాగుతోంది. రేతిరంతా సాగాలె....కాని వానదేవుడికి ఏం కోపం వచ్చిందోకగాని కుండపోతగా వాన పడ్డంతో జాతర నిలిచిపోయింది" అంటూ కాసేపు చెప్పటం ఆపాడు సింగన్నదొర.

వింటున్న శ్యామ్ సుందర్ లో -

ఉన్నట్టుండి బల్బు వెలిగింది.

కథ ఎటుపోతుందో అర్థంకాగానే నిటారుగా కూర్చుంటూ ఆసక్తిగా చూశాడు. అతడి కళ్ళముందు సూకీ మెదిలింది.

వెదకబోయిన తీగె కాళ్ళకు తగలటం అంటే యిదేమరి. సూకీ ఏమైంది ? అటు ట్యాక్సీ డ్రైవరు జలీల్ ఖాన్ ఏమైయ్యాడు ? ఏమీ తెలీక తను టెన్షన్ గా వున్నాడు. రాత్రి కొండదేవతకి జాతర చేసింది భైరన్న గూడెం వాళ్ళని తెలీగానే సూకీ సమాచారం తెలిసిపోతుంది.

"అర్థమైంది పెద్దాయనా..... ఆ వర్షంలోనే కొండపై నుంచి జారి ఓ అమ్మాయి కొండ దేవత ముందున్న నీటి తొట్టిలో పడింది. అవునా ?" అనడిగాడు ఉత్సహంగా.

ఈసారి ఆశ్చర్యపోవటం సింగన్న దొర వంతు అయింది. నమ్మలేనట్లు చూసాడు. "నువ్వు చెప్పింది నిజం బాబూ! ఆ సంగతి నీ కెలాతెలుసు ?" అంటూ ఎదురు ప్రశ్నించాడు.

"చెప్తాగాని ఆ పిల్ల ఏమైంది ? ప్రాణాలతో వుందా ? చచ్చిపోయిందా ?"

"కంగారుపడకు బాబూ! కొండదేవత దయవల్ల ఆ పిల్లకి ఏమీ కాలేదు.నీళ్ళలో పడ్డం ఆమె ప్రాణాలు కాపాడింది. తెలివితప్పిన ఆ పిల్లని మాతోబాటే ఇక్కడికి తీసుకొచ్చాం.

సూకీ బ్రతికే వుందని తెలీగానే శ్యామ్ సుందర్ లో ఉత్సాహం ఉరకలేసింది. ఆ రోజంతా పడిన శ్రమను మర్చిపోయాడు.

"పెద్దాయనా! నిన్న రాత్రి ఆ కొండమీద అమ్మాయితోబాటు నేను, జలీల్ ఖాన్ అనే ట్యాక్సీ డ్రైవరూ ముగ్గురం వున్నాం. శత్రువుల నుంచి తప్పించుకొంటూ ఆ కొండమీదకు చేరాం. వర్షం పడ్డంతో పాకుడురాళ్ళ మీద ప్రమాదంలో చిక్కుకున్నాం. ఆ అమ్మాయి కిందకు జారి నీళ్ళతొట్టిలో పడ్డం చూసాను. జలీల్ ఖాన్ని రక్షించబోయి , అతనితో బాటు కొండపక్క వాగులో పడిపోయాను. అదృష్టవశాత్తూ నేను బ్రతికే ఉన్నాను. జలీల్ ఖాన్ ఏమైయ్యాడో అతని సమాచారం తెలీలేదు. చెప్పు పెద్దాయనా ఎక్కడ.... ఆ పిల్ల ఎక్కడ ?" అనడిగాడు.

"ప్రస్తుతం ఇక్కడ లేదు బాబూ! మధ్యాహ్నం పొద్దు నెత్తి మీద వున్న సమయంలో ఆ పిల్ల గూడెం వదిలి వెళ్ళిపోయింది" అంటూ జరిగిన సంఘటన వివరించాడు.

"మల్లన్న చేతిలో అప్పుడే ఎగిరిపోవాలి నా ప్రాణాలు. కాని ఆడ చిరుతలా ఎగబడి ఒక్క తన్నుతో మల్లన్న తల పగలగొట్టి చంపి , నన్ను కాపాడింది. ఈ విషయం మా వాళ్ళకు తెలిస్తే ప్రమాదమని నేనే ఆ పిల్లని పంపించేసాను.

ఆ పిల్ల వెళ్ళిపోయిన రెండు గంటల తర్వాత ఆరు మోటారు బళ్ళమీద సొనామంది గూండాలు ఇక్కడికి వచ్చారు. నాఇంటిని చుట్టుముట్టారు. మా వాళ్ళు ఎవరినీ దగ్గరకు రానియలేదు. కత్తులు, కటారులు అయితే మావాళ్ళు వాళ్ళని ఎదిరించేవాళ్ళు. కాని వాళ్ళ దగ్గర పిస్తోళ్ళు , తుపాకులు వున్నాయి.

ఆ పిల్ల సూకీని మా గూడెం తీసుకొచ్చి కాపాడినట్టు వాళ్ళకి ఎవరో చెప్పారట. మాకేం తెలీదన్నాను, నాకు ఉపకారం చేసి వెళ్ళిన పిల్ల గురించి ఆ రాక్షసులకు చెప్పి, ఆమెను ప్రమాదంలోకి నెట్టడం ఇష్టంలేకనే అలా అబద్ధం చెప్పాను. కానీ వాళ్ళు నన్ను కొట్టారు. చివరికి తట్టుకోలేక జరిగింది చెప్పాను. ఆ పిల్ల అడవిలోకి వెళ్ళి పోయిందన్నాను. అడగానే చెప్పలేదన్న కోపంతో నన్ను నా భార్య పిల్లల్ని అరపమీదకు పంపించి, చెట్టుచుట్టూ కట్టెలు పేర్చి, చుట్టూ మంటలు పెట్టి వెళ్ళిపోయారు. తర్వాత జరిగింది నీకు తెలుసు!" అంటూ అంతా వివరంగా చెప్పాడు సింగన్న దొర.

శ్యామ్ సుందర్ అతని మాటలు విని భారంగా నిట్టూర్చాడు. అదేమిటోగాని సూకీ వ్యవహారం ఆరంభం నుంచీ తలనొప్పిగానే తయారయింది. ఇంత జరిగినా ఆమె గురించి తనకు తెలిసింది చాలా తక్కువే. ఆమె పేరు సూకీ. హాంకాంగ్ నుంచి వచ్చింది. ఆమెను వెన్నటి వచ్చిన మియాచీ అనే బోడిగుండు శాల్తీ భగవాన్ దాదా అనే గూండాతో కలిసి ఆమెను హతమార్చే ప్రయత్నంలో చాలా పట్టుదలగా వున్నాడు.

ఇంతకుమించి ఆమె వివరాలేమీ తనకు తెలీదు. ఆమె ఇండియా ఎందుకొచ్చింది ? తన నుంచి ఏ సహాయం ఆశిస్తోంది ? అసలు హాంకాంగ్ లో ఏం జరిగింది ? ఏవీ..... ఇవేవీ తనకు తెలీదు. తెలుసుకునే లోపే చెరో దారి అయిపోయారు. తిరిగి ఆమెను వెదకి పట్టుకుంటే గానీ ఆమె మిష్టరీ వీడదు.

పరిచయం లేని ఈ ఘనాపూర్ అడవుల్లో రాత్రిపూట ఆమె ఎక్కడుందో ? ఏం కష్టాలు పడుతుందో తెలీదు. కాని ఒక్కటి మాత్రం నిజం. ఆమె చాలా తెలివైనఅమ్మాయి. సాహసం వుంది. ఫైటింగ్ వచ్చు. సో! ఆమె అంత తొందరగా భగవాన్ దాదా చేతికి చిక్కుతుందని భయపడాల్సిందేమీ లేదు.

మరో విషయం ఏమంటే ఇప్పటికిప్పుడు ప్రయాణమయ్యే స్థితిలో తనూ లేడు. ఆ రాత్రికి విశ్రాంతి తీసుకుంటే కాని అడుగు ముందుకు పడేలా లేదు.

విప్పసారా మరికాస్తా పుచ్చుకొంటూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. శ్యామ్ సుందర్.

"ఏమిటి బాబూ! వెళ్ళిపోదామనా ? వీల్లేదు. ఈ రాత్రి వుండి వెళ్ళాల్సిందే!" అతడి మనసులో మాట గ్రహించినట్టు అభ్యర్థించాడు సింగన్న దొర.

"వెళ్ళనులే పెద్దాయనా! రాత్రికి విశ్రాంతి తీసుకుని , ఉదయం చీకటితోనే బయల్దేరుతా!" అంటూ హామీ ఇచ్చాడు శ్యామ్ సుందర్.

ఆ రాత్రికి సింగన్న దొర ఇంట్లో విందు భోజనం ఆరగించి, ఆరు బయట వెన్నెల్లో అలుపుతీరా నిద్రపోయాడతను. తెలతెలవారే వేళకి లేచి ముఖం కడుక్కొని, జొన్న రొట్టె తిని వేడిపాలు తాగి ప్రయాణమయ్యాడు.

శ్యామ్ సుందర్ వెంట గూడెం బయటివరకూ వచ్చాడు సింగన్న దొర. ఒక బరిశెను, ఒక పొడవు కత్తిని రక్షణకోసం అతడికి బహుకరించి సాగనంపాడు. సూకీ వెళ్ళిన దిశలో చెట్ల మాటున శ్యామ్ సుందర్ అదృశ్యమయ్యే వరకూ నిలబడి తర్వాత గూడెంలోకి వెనుతిరిగాడు సింగన్న దొర.

## 14

నాలుగురోడ్ల కూడలికి చేరుకునేసరికి ట్రాఫిక్ పోల్ మీద రెడ్ సిగ్నల్ పడింది.

సడెన్ బ్రేక్‌తో ఆగింది ఆటో.

తూలి ముందుకు పడబోయి చివరి క్షణంలో నిలదొక్కుకున్నాడు వాత్సవ. "క్షమించాలి సాబ్! రెడ్ సిగ్నల్ పడిపోయింది" జరిగిందానికి నొచ్చుకుంటూ విన్నవించుకున్నాడు ఆటో డ్రైవర్.

"ఇట్సాల్ రైట్.చూసి పోనీ!" అంటూ ఫ్రెష్‌గా మరో సిగరెట్ ముట్టించుకున్నాడు వాత్సవ.

ఇంతలో వెనక నుంచి చిన్న కలకలం.

"నేను చూసాను. వాడు ఆటోలో రావటం నేను చూసాను. వెతకండి. ఆటోలు గాలించండి. గ్రీన్ సిగ్నల్ పడేలోపలే వాడ్ని పట్టుకోవాలి. త్వరగా!" అంటూ ఎవడో గొంతు చించుకుని అరుస్తున్నాడు.

ఆ అరుపులు వినగానే వాత్సవలో డేంజర్ బెల్స్ మ్రోగాయి. ప్రమాదాలు ముందే పసిగట్టే సిక్త్ సెన్స్ అదే పనిగా హెచ్చరికలు జారీ చేయనారంభించింది.

ఆటోలోంచి తల బయటకు పెట్టి వెనక్కి చూసాడు. వాత్సవ. ట్రాఫిక్ లో నిలిచిపోయిన వాహనాల మధ్యగా కోతుల మూకలా దూసుకొస్తున్న ఒక గుంపు అతని కంటపడింది.

అంతలోనే వాళ్ళలో ఒకడు చూడనే చూశాడు వాత్సవని. చూసిన మరుక్షణం గొంతు చించుకుని అరిచాడు వాడు, "రండ్రోయ్! రండి. వాడు ఇక్కడే వున్నాడు. ఆటోలో వున్నాడు త్వరగా రండి బే!" అంటూ.

భుజాలమీద పడుతున్న జుత్తుతో సన్నగా, పొడవుగా వున్నాడు వాడు. వాడ్ని ఇంతకుముందు ఎపప్పుడూ చూసిన గుర్తులేదు వాత్సవకి. కానీ వాడు తనని గుర్తుపట్టాడంటే ఖచ్చితంగా వాడు పనిగట్టుకొని ఇక్కడికి వచ్చిన ఖాద్రి మనిషి అయి వుండాలి. తమాషా ఏమంటే–

చెవికోసిన నక్కలా వాడు మిగిలినవాళ్ళని అరిచి హెచ్చరిస్తున్నాడు గానీ తను మాత్రం ముందుకు రావటంలేదు. ఇనపరాడ్ లు, సైకిల్ చైన్లతో పదిమంది గూండాలు సెంటర్ ని భయోత్పాతానికి గురిచేస్తూ దూసుకొచ్చేస్తున్నారు తనున్న ఆటోవైపు.

"ప్రస్తుతం తనున్న పరిస్థితిలో వాళ్ళతో గొడవపడ్డం అంటే కొరివితో తల బరుక్కున్నట్టేనని వాత్సవకి తెలుసు. పట్టపగలు గొడవ ఆరంభమైన మరుక్షణం పోలీసులు వచ్చిపడే ప్రమాదం వుంది.

"అయినా తను రిస్క్ తీసుకోక తప్పదు. ఒకే ఒక్క క్షణం నిర్ణయం తీసుకుంటూ "నేను దిగిపోతున్నాను బ్రదర్!" అంటూ డ్రైవర్ చేతిలో కరెన్సీ నోటుపెట్టి ఆటో దిగిపోయాడు వాత్సవ. అతను దిగీ దిగక ముందే బుల్ డోజర్ మాదిరి దూసుకొచ్చిన మొదటి గూండా చేతిలోని ఇనపరాడ్ని బలంగా విసిరాడు. తగిలితే వాత్సవ ముఖం పేలిపోయి వుండేది. కానీ చివరిక్షణం తల వెనక్కి తీసుకుని ఎడంచేత్తో రాడ్ని ఒడిసిపట్టుకుంటూ కుడికాలు పైకిలేపాడు వాత్సవ.

ఏం జరుగుతుందో వాడికి అర్థమయ్యేలోపలే దయాదాక్షిణ్యం చూడకుండా ఈడ్చితన్నాడు వాడి గుండెలమీద.

కాంక్రీట్ పిల్లర్ ఏదో గుండెలమీద విరుచుకుపడినంత పెయిన్తో గొంతు చించుకొని కెవ్వున అరిచాడు వాడు. కాలు వెంబడే ఎగిరి అవతలి కారుమీద పడి కిందకు దొర్లిపోయాడు.

వాడు ఏమయ్యాడో చూళ్ళేదు వాత్సవ.

ఏర్ బేగ్ భుజాన వేసుకుని, ఇనపరాడ్ తో రాక్షసుడిలా మిగిలిన గూండాలకు ఎదురు పరుగెత్తాడు. దొరికినవాడ్ని దొరికినట్టు విరగదీస్తూ విజృంభించాడు.

ఇంతలో గ్రీన్ సిగ్నల్ పడింది.

ట్రాఫిక్ ముందుకు కదిలింది.

వాహనాలకి అడ్డదిడ్డంగా పరుగులు తీస్తూ వాత్సవని ఒక్కసారిగా చుట్టు ముట్టాలని వస్తున్నారు గూండాలు. కాని వత్సవ దృష్టి వాళ్ళమీద లేదు. ఫుట్ పాత్ మీద నిలబడి అరిచి గోలచేస్తూ, గూండాలని తనమీదకు ఉసిగొలుపుతున్న జులపాలజుత్తు వాడిమీదే వుంది.

అటు యిటు నలుగురి ముఖాలు పగలగొట్టి ఫుట్ పాత్ మీదకు జంప్ చేసాడు. బొంగరంలా తిరిగి తన మీదకు బుల్ డోజర్స్ లా వచ్చిపడుతున్న యిద్దరు గూండాల మీద బ్రహ్మరాక్షసుడిలా విరుచుకుపడ్డాడు. ఇనపరాడ్ తాకిడికి గావుకేకలు వేస్తూ ఫుట్ పాత్ కి అడ్డంగా పడిపోయి పొర్లిగింతలుపెట్టారు వాళ్ళిద్దరూ.

అప్పటికే అయిదుగురు కుప్పకూలిపోగానే మిగిలిన అయిదుగురూ వాత్సవ ముందుకు పోవడానికి జంకారు. ఫుట్ పాత్ మీద అడుగుపెట్టి ఆలోచనలో పడ్డారు వాళ్ళు.

ఆ సెంటర్ లోని జనం ఈ గొడవని ఆశ్చర్య సంభ్రమాలతో చూస్తున్నారు. వచ్చినవాళ్ళు బడేభాయ్ మనుషులని తెలుసు. కాని వాళ్ళని ఎదిరించిన మొనగాడు వాత్సవ ఎవరో వాళ్ళకి తెలీదు. ట్రాఫిక్ గొడవలో కాస్త ఆలస్యంగానే ఈ గొడవని గుర్తించారు వాళ్ళు. వాళ్ళతోబాటు ఆ చివర షోడా బంకుదగ్గర షోడా తాగుతున్న కానిస్టేబుల్ కూడా చూశాడు. వెంటనే పరుగెత్తి కంట్రోల్ రూంకి ఫోన్ చేసి మెస్సేజి యిచ్చాడు.

ఆ సెంటర్ లో ఎక్కువసేపు ఆగటం తనకి మంచిది కాదని వాత్సవకి బాగా తెలుసు. అందుకే వాళ్ళు తన మీదకు రావటానికి సందేహిస్తున్నా తను ముందుకు దూకటానికి సందేహించలేదు. ఐరన్ రాడ్ని వాటంగా పట్టుకుని ఆ ఐదుగురివైపు దూకాడు. అతని ఫోర్స్ ని చూడగానే తమకు మూడిందని అర్థమైపోయింది వాళ్ళకి. కూడబలుక్కున్నట్టు ఒక్కసారిగా వెను తిరిగి పరుగు ఆరంభించారు.

వాళ్ళని ఆపే ప్రయత్నం చేయలేదు వాత్సవ. తనకు కావలసిన శాల్తీ కోసం వెను తిరిగాడు.

అంతవరకు ఎడంగా వుండి గొంతు చించుకు అరిచిన జులపాల జుత్తువాడు అప్పుడే అర్జంటు పని ఏదో గుర్తువచ్చినవాడిలా అక్కడి నుంచి వెళ్ళిపోయే ప్రయత్నంలో వున్నాడు. వాడ్ని వదిలే ఉద్దేశం ఎంతమాత్రం లేదు వాత్సవకి. సుడిగాలి మాదిరి పరుగుతీసాడు వాడివైపు.

వాత్సవ తన వెంటపడ్డాడని గమనించిన మరుక్షణం వాడు పిక్కబలం చూపించనారంభించాడు. “ఆగరా బద్మాష్! ఆగుబే” అనరుస్తూ వెన్నంటి తరమనారంభించాడు వత్సవ.

ఫుట్ పాత్ నుంచి ట్రాఫిక్ కి అడ్డంపడి రోడ్ క్రాస్ చేసి అవతల ఒక గల్లీలోకి దూసుకుపోయాడు వాడు. వాత్సవ కూడా రోడ్ క్రాస్ చేసి అదే సందులోకి ఎంటరయ్యాడు. అలా ఎంటరవుతుండగానే అతడి చెవులకు సోకాయి పోలీసు జీపులు ఆ సెంటర్ కి దూసుకొస్తున్న సైరన్‌మోతలు.

ఇప్పుడున్న పరిస్థితిలో పోలీసులు రంగప్రవేశం చేస్తే ఏమవుతుందో వాత్సవకి బాగా తెలుసు. వాళ్ళమాట ఖాతరు చేయకుండా తప్పించుకుని సిటీలో తిరుగుతున్నందుకు కడుపుమంటతో వుంది ఆగ్రా సిటీ పోలీసు. తను దొరికితే చాలు కుక్కను తరిమినట్టు తరిమి పట్టుకొని తీసుకెళ్ళి సిటీ బోర్డర్ లో విసిరేస్తారు.

ఎదర పారిపోతున్న జులపాలజుత్తు వాడు దృష్టిపథంలో నుంచి తప్పించుకు పోకుండా పరుగు వేగంతోనే తీవ్రంగా ఆలోచిస్తున్నాడు వాత్సవ. పోలీసులు తమవెంట పడేలోపల తన పని ముగించుకుని అవతలికి పోవాలి. లేదంటే చిక్కులు తప్పవు.

ఆలోచించే లోపలే వాడు మూడు సందులు క్రాస్ చేసేశాడు. ఆ సందు చివర మెయిన్ రోడ్ వుంది. ఆ రోడ్ ఎక్కితే వాడ్ని ఆపటం కష్టమే.

ఇక ఆలోచించలేదు వాత్సవ.

చేతిలోని ఇనపరాడ్ ని చేతికొద్ది గురిచూసి విసిరాడు వాడి కాళ్ళ మీదకు. అతని గురి తప్పలేదు.

గింగిరాలు తిరుగుతూ గాలిని చీల్చుకొని దూసుకెళ్ళిన ఐరన్ రాడ్ దారుణంగా వాడి కాళ్ళను తాకటమే కాదు , కాళ్ళకు అడ్డంపడి కెవ్వున అరుస్తూ అంత ఎత్తుకు ఎగిరి బొక్కబోర్లా పడిపోయాడు. పడిలేచే లోపలే బ్రహ్మ రాక్షసుడి మాదిరి దూసుకొచ్చి వాడ్ని ఫుట్ బాల్ ఆడేశాడు వాత్సవ. వాడి జుత్తు పుచ్చుకుని నెట్టుకుంటూ , ఆ సమీపంలోని ఒక పాడుపడిన ఇంట్లోకి తీసుకెళ్ళి ఎత్తి గోడకు విసిరికొట్టాడు.

ఎముకలు పిండిపిండి అయినంత బాధతో పెద్దగా అరుస్తూ, కింద పడిపోయాడు వాడు. తాపీగా సిగరెట్ ముట్టించుకుని గుండెలనిండా పొగపీల్చి వదులుతూ, వాడిపక్కన కూర్చుని కళ్ళముందు ఐరన్ రాడ్ ని ఆడించాడు.

"చెప్పరా.... ఎప్పుడొచ్చావ్ ఇక్కడికి ?" తన తొలి ప్రశ్నను కూల్ గా అడిగాడు.

వాడు అమాయకంగా ముఖం పెట్టి ఏమీ తెలీనట్టు చూశాడు. "నేను ఆగ్రావాడినే....నేను రావటం ఏమిటి ? మీరు పొరబడుతున్నారు సాబ్" అన్నాడు నీరసంగా.

వాడి మాటలు పూర్తి గాకముందే వాత్సవ పిడికిలి దారుణంగా తాకింది వాడి ముఖాన్ని. ముఖం పచ్చడయినంత బాధతో మరోసారి కెవ్వుమన్నాడు.

"నీ పేరేమిట్రా ?" అడిగాడు.

"రసూల్.... నా పేరు రసూల్" కంగారుగా చెప్పాడు వాడు.

"చూడు బ్రదర్! నాకు అట్టే టైంలేదు. నిజం చెపితే బ్రతికిపోతావ్. అతి తెలివి చూపిస్తే ఇక్కడే ఖతం అయిపోతావ్. నాకంతా తెలుసు. నేను బడేభాయ్‌ని కలవకుండా ఆపటం కోసం ఖాద్రి నిన్ను పంపించాడు. అవునా ?"క్రూరంగా చూస్తూ అడిగాడు వాత్సవ.

ఆ ప్రశ్న తో రసూల్ నోటికి తాళం వూడిపోయింది.

"నన్నింకేం చేయకండి సాబ్. ఇక నా ఒంటిమీద ఒక్క దెబ్బపడినా చచ్చిపోతాను. ఖాద్రి నన్ను పంపించిన మాట నిజమే" అన్నాడు.

"అంటే ఖాద్రి ఆస్పత్రిలో కోమాలో వున్న మాట అబద్ధం. అవునా ?"

అవునన్నట్టు తలవూపాడు వాడు.

"మాల్యాద్రిని హతమార్చటంతో వాడి మనుషులు పగబట్టి అవకాశం కోసం చూస్తున్నారు. బయటవుంటే వాళ్లు చంపుతారన్న భయంతో ఆస్పత్రిలో వున్నాడు. డబ్బులు లంచం పెట్టి కోమాలో వున్నట్టు ప్రచారం చేయించుకున్నాడు. బడేభాయ్‌కి మీ గురించి మెస్సేజి ఇప్పించాడు. ఆగ్రాలోనే మిమ్మల్ని ఖతం చేయించమని నన్ను ఇక్కడికి పంపించాడు. ఎందుకంటే, మీరు నాకు తెలుసు గాబట్టి" అన్నాడు.

"ఎలా తెలుసు ?" అడిగాడు వాత్సవ.

"
ఆ రోజు వర్షంలో మీరు ఖాద్రితో మాట్లాడుతున్నప్పుడు మా జీప్ ల వెనక దాగి వుండి చూశాను. మీ మాటలు కూడా కొన్ని విన్నాను. మాల్యాద్రి రాగానే మీరు వెళ్ళిపోయారు. ఖాద్రిని మాల్యాద్రి గాయపర్చాడు. చంపబోతున్న చివరి క్షణంలో నేను దొంగదెబ్బతీసి మాల్యాద్రిని ఖతంచేసి, మా బాస్ ఖాద్రిని కాపాడుకున్నాను."

"సో.... నేను ఏదయితే వూహించానో అదే జరిగిందన్న మాట. ఓ.కె. ఇప్పుడు బడేభాయి అడ్డాలో లేడని విన్నాను. ఎక్కడ వున్నాడు ?"

"ఆ సంగతి నిజంగా నాకు తెలీదు. ఛోటా భాయ్‌కి మాత్రమే తెలుసు. మీ గురించి భయపడి అండర్ గ్రౌండ్ లోకి వెళ్ళిపోయాడు."

"వాడు వెళ్ళలేదు. వెళ్ళేలా మీరు చేశారు. ఆగ్రా పోలీసులకు నా గురించి ఉప్పందించిన బద్మాష్ గాడివి కూడా నువ్వేకదూ ?"

తల దించుకున్నాడు రసూల్.

"ఇప్పుడు ఏం చేయాలనుకుంటున్నావ్ ?" ఆఖరి దమ్ము లాగి సిగరెట్ అవతల పారేస్తూ అడిగాడు వాత్సవ.

"వెళ్ళిపోతాను సాబ్! ఇక మీ పనులకి అడ్డంరాను. ఓ నెలరోజుల వరకు ఎవరికీ కనబడకుండా అజ్ఞాతంలోకి వెళ్ళిపోతాను. నన్ను వదిలేయండి. ప్లీజ్" ఏడుపు ముఖంతో అర్థించాడు వాడు.

"ఓ.కె.... జాలిపడి వదిలేస్తున్నాను. మాట నిలబెట్టుకో. పొరబాటున రెండోసారి నా కంటబడినా, తెరవెనుక కథ నడిపినట్టు తెలిసినా ఖచ్చితంగా నిన్ను చంపేస్తాను. వెళ్ళిపో."

వాత్సవ ఎంత కూల్ గా హెచ్చరించినా, రసూల్ కి ఆ మాటలు కొరడా దెబ్బల్లా వినిపించాయి. వదిలిందే చాలన్నట్టు శక్తినంతా కూడగట్టుకొని లేచి వంగివంగి సలాంలు చేస్తూ బయటకెళ్ళిపోయాడు. వాడి వెనకే ఆ పాడుపడిన కొంపలోంచి బయటకొచ్చిన వాత్సవకి రసూల్ అప్పటికే వీధి చివర కన్పించాడు.

ఇక వాడి గురించి ఆలోచించలేదు వాత్సవ.

మెయిల్ వీధుల్లో పోలీసు గాలింపు ఆరంభమైంది.

ఎ.యస్.పి. చంద్రశేఖర్ గురించి తనకు బాగా తెలుసు. పట్టుదల మనిషి. ఎలాగయినా తనని పట్టుకుని ఆగ్రా నుంచి బయటికి పంపించే ఉద్దేశంతో సిటీలో గాలింపు ముమ్మరం చేశాడు. ఇప్పుడు జరిగిన గొడవతో ఈ ప్రాంతాన్ని కార్నర్ చేసినా ఆశ్చర్యంలేదు.

అందుకే మెయిన్ వీధులవైపు కన్నెత్తి చూళ్ళేదు వాత్సవ. సందు గొందులకు అడ్డంపడి కిలోమీటరు దూరం నడుచుకుంటూనే వెళ్ళాడు. అక్కడ ఒక రిక్షా ఎక్కి పక్కవీధిలోని బడేభాయ్ అడ్డాను చేరుకున్నాడు. అంత దూరంలో కట్టడం ఉందనగానే కంగారుగా చూశాడు రిక్షావాలా. "ఏందిసాబ్....మీరు బడేభాయ్ అడ్డాలోకి పోవాలనుకుంటున్నారా ? వద్దుసాబ్. పులినోట్లో తల పెట్టయినా ప్రాణాలతో బయటకు

రావచ్చేమో గాని బడేభాయ్ అడ్డాలోకి వెళ్ళి తిరిగి రాలేమంటారు. వెనక్కి వెళ్ళిపోదాం సాబ్" అంటూ హితవు చెప్పాడు.

"ఓ.కె. భాయ్! నాకు పనుండి లోనకు పోతున్నా. కంగారుపడాల్సిందేమీ లేదు. నీకు భయంగా ఉంటే రిక్షా ఆపు దిగిపోతాను" అన్నాడు వాత్సవ.

ఆ మాటకి చాలా సంతోషపడిపోయాడు రిక్షావాలా. రిక్షాని ఆపి పక్కకు తీసి నిలిపాడు.

వాత్సవ రిక్షా దిగి తన ఏర్ బేగ్ ని రిక్షా సీటుమీద వుంచాడు. "చూడు బ్రదర్! ఈ బేగ్ లో బాంబులున్నాయి. నువ్వు దీన్ని తాకినా, కదిపినా, లోపల ఏముందో చూడాలని ప్రయత్నించినా బాంబులు బద్ధలై రిక్షాతో సహా నాశనమైపోతావ్. అర్థమైందా ? నేను వచ్చేవరకు ఇక్కడే వుండు. అడ్డాలో ఏం జరిగినా నువ్వు పారిపోవాలని చూడకు. నీకే ప్రమాదం" అంటూ హెచ్చరించి మరో మాటకు అవకాశం యివ్వకుండా సిగిరెట్ ముట్టించుకుని బడేభాయ్ కట్టడం దిశగా వీధిలో ముందుకు సాగిపోయాడు వాత్సవ.

వెళుతున్న వాత్సవని చూస్తూ "ఊహు! ఇతనెవరో సాధారణ మనిషిలా లేడు . ఇతనికి సవారీకట్టి అనవసరంగా ఇరుక్కునట్టున్నాను. ఏమవుతుందో ఏమిటో" అనుకుంటూ తన రిక్షాని తాకటానికి కూడా భయపడి దగ్గరలోని కాకాహోటల్ వైపుఅడుగులేశాడు చాయ్ తాగటానికి.

## 15

గురుదాస్ పూర్ నుంచి డెబ్బయ్యవ మైలురాయి దగ్గర కాలేషా వలీ బస్ దిగేసరికి ఉదయం పదిగంటలు కావస్తోంది సమయం. హైవేకి అటు యిటు ఎటు చూసినా దట్టమైన ఘనాపూర్ అడవి. హైవేలో ఇప్పుడొకటి. అప్పుడొకటిగా లారీలు , వేన్ లు దూసుకెళుతున్నాయి.

తేలిగ్గా మైలురాయి మీద కూర్చుని జేబులోంచి సెల్ ఫోన్ తీశాడు. డైనమిక్ సెక్యూరిటీ సర్వీస్ ఆఫీస్ కి నంబర్ నొక్కాడు. క్షణం తర్వాత లైన్ లోకొచ్చింది వాసంతి.

"ఏమిటి వలీభాయ్. నిన్ననగా వెళ్ళినవాడివి ఇప్పుడా ఫోన్ చేసేది ? ఏమైపోయావ్ ? ఎక్కడున్నావ్ ? పైగా సెల్ ఆఫ్ చేసి కూర్చుంటే నిన్నెలా కాంటాక్ట్ చేస్తాననుకున్నవ్ ?" సున్నితంగానే దబాయించింది వాసంతి.

విషయం ఏమంటే, శ్యామ్ సుందర్ నుంచి మెస్సేజి లేకపోవటంతో కాలేషా వలీని గురుదాస్ పూర్ పంపించింది వాసంతి. నిన్న మధ్యాహ్నం వచ్చినవాడు ఇప్పుడు ఫోన్ చేశాడు.

"వాసంతి మేడం! వలీభాయ్ రంగంలోకి దిగాడు. దిగితే సాధించుకురాకుండా వదలడు. ప్రస్తుతం నేను గురుదాస్ పూర్ కి డెబ్బయ్ కిలోమీటర్ల దూరంలో ఘనాపూర్ అడవుల మధ్య వున్నాను. రోడ్డుపక్క రాయి మీద కూర్చుని మాట్లాడుతున్నాను" చెప్పాడు.

"మైగాడ్! నువ్వు అక్కడికెందుకు వెళ్ళావ్ వలీభాయ్ ? ఏమైంది అసలు ?"

"గురుదాస్ పూర్ లో నా ఎంక్వయిరీ పూర్తయిందమ్మా. నేను తెలుసుకున్నంత వరకు విషయం ఏమంటే, భగవాన్ దాదా అనే లోకల్ గూండా మనుష్యులు ఒక చైనా పిల్లను చంపటానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. దాదా వెంట మియాచీ అనే బోడిగుండు వెధవ ఒకడున్నాట్ట, వాడికీ, ఆ పిల్లకీ గొడవలేమిటో తెలీదుగాని శ్యామ్ సుందర్ సాబ్ ఆ పిల్లను కాపాడ్డానికే గురుదాస్ పూర్ వచ్చాడు. జలీల్ ఖాన్ అనే లోకల్ టాక్సీ డ్రైవర్ టాక్సీలో శ్యామ్ సాబ్ ఆ పిల్లతోబాటు మన శ్యామ్ సుందర్ సాబ్ ఇక్కడ అడవుల్లోకి పారిపోయారట. గూండాలు కూడా అడవుల్లోకి వెళ్ళారు. కాబట్టి అడవిలో ఏం జరిగిందో తెలుసుకోవాలంటే నేను కూడా వెళ్ళాలిగదా" అంటూ క్లుప్తంగామేటర్ వివరించాడు.

"నువ్వు మరీ రిస్క్ తీసుకుంటున్నట్లున్నావ్ వలీభాయ్. వచ్చేయ్, నువ్వు వెనక్కి వచ్చెయ్యి. నిన్ను పంపించినట్లు తెలిస్తే శ్యామ్ సుందర్ కోప్పడతాడు. కమ్ బాక్."

"ఏమిటి తల్లీ! నాకామాత్రం తెలీదా ? ఈ అడవులు నాకు కొట్టిన పిండి. నా గురించి భయపడకండి. ఇక్కడ ఏం జరుగుతుందో తెలీకుండా నేను వెనక్కి వచ్చే ప్రసక్తే లేదు. వీలు చూసుకుని నేనే ఫోన్ చేస్తాను. వుంటానమ్మా" అంటూ వాసంతికి మరో మాటకి అవకాశం యివ్వకుండా సెల్ ఆఫ్ చేశాడు కాలేషావలీ.

రాయి దిగి బీడీ ముట్టించుకుని స్లోపు దిగువకు నడక ఆరంభించాడు. అతడ్ని చూసి చెట్ల మీదకు పరుగుతీశాయి అంతవరకు రోడ్డుమీద ఆడుకుంటున్న అరడజను కోతులు.

తను విన్నది ఖచ్చితమైన సమాచారం అని వలీకి తెలుసు. దాదా మనుషుల్లో కొందరు గురుదాస్ పూర్ లోని తమ మిత్రులతో సెల్ ఫోన్ లో మాట్లాడినప్పుడు ఇక్కడ ఏం జరిగిందో వివరించటం జరిగింది. ఆ ఇన్ఫర్మేషన్ కలెక్ట్ చేసుకున్నాడు వలీ. అదేప్రకారం స్లోపు దిగుతుండగా ఎడం పక్కగా అడవిలోకి కన్పించిందొక నాటుదారి. జలీల్ ఖాన్ టాక్సీతో బాటు దాదాకి చెందిన ఆరు వేన్‌లు అడవిలోకి దూసుకెళ్ళింది ఆ మార్గంగానే. ఆ గుర్తులింకా అక్కడక్కడా కన్పిస్తూనే వున్నాయి.

వెంట తెచ్చుకున్న కత్తితో ఒక గుగ్గిలం చెట్టు నుంచి గుప్పెడు లావున్న కొమ్మను నరికి దాన్ని చేతికర్రగా తయారు చేసుకున్నాడు. చేతిలో కర్ర లేకుండా అడవి దారుల్లో ప్రయాణం కష్టమని అతనికి బాగా తెలుసు.

సుమారు గంట ప్రయాణం తర్వాత దగ్గరలో ఎక్కడో మాటలు విన్పించాయి. అటు అడుగులు వేశాడు.

మరికాస్త ముందుకెళ్ళగానే ఒక స్లోపు పంచకు చేరుకున్నాడు. దిగువకు ఏటవాలుగా చిన్న లోయలోకి పోతోంది. అక్కడ డౌన్ లో పొదల మధ్య ఆకుపచ్చని అంబాసిడర్ కారు ఒకటి కనబడుతోంది. ఇటుపక్కన కాస్త దిగువలో ఒక ఎత్తయిన గంగరావి చెట్టుకింద ఆరుగురు వ్యక్తులు తీరిగ్గా కూర్చుని పేకాడుకుంటూ నవ్వులు, కేరింతలుగా వున్నారు. వాళ్ళ మాటలే తనకు వినిపించాయి.

దూరంగా ఉండటంతో వాళ్ళని పోల్చుకోవటం కాస్త కష్టంగానే వుంది. కాని దిగువన కనబడుతున్న ఆ కారునిబట్టి చూస్తే వీళ్ళంతా భగవాన్ దాదా మనుషులని వూహించుకోవచ్చు. తను వాళ్ళ ముందుకు వెళ్ళాలా వద్దాని కొద్దిసేపు సందిగ్ధంలో కొట్టుమిట్టాడాడు వలీ. చివరికి వెళ్లటానికే నిశ్చయించుకుని ముందుకు కదిలాడు.

గంగారావిచెట్టును సమీపిస్తుండగానే అక్కడున్న శాల్తీల్లో ఒకణ్ని గుర్తుపట్టేశాడు కాలేషావలీ. వాడు తనకు తెలిసినవాడే. కాని తన గురించి వాడికేమీ తెలీదు.

చక్కగా విప్పసారా తాగుతూ, కాల్చుకున్న అడవి జంతువుల మాంసం తింటూ పేకాటతో కాలక్షేపం చేస్తున్నారు వాళ్ళంతా. అడుగులు చప్పుడు విని తిరిగి చూశారు. చూసిన తక్షణం—

"ఏయ్.....ఎవర్నువ్వు ?" అంటూ వాళ్ళలో ఒకడు పేకముక్కలు కిందపడేసి చివ్వున లేచాడు పైకి.

వలీభాయ్ కంగారుపడకుండా చిన్నగా నవ్వాడు.

"నేనెవరో నీకు తెలీకపోవచ్చు భాయ్. నీ పక్కనున్న పట్వారీ నడుగుచెప్తాడు" అన్నాడు.

అప్పటికే పట్వారీ అనేవాడు కాలేషావలీని గుర్తుపట్టాడు. "అరరె, వలీభాయ్, రారా...వీడు మనవాడేలే రాఘవా, కంగారుపడాల్సిందేమీ లేదు. కూర్చో" అంటూ తమ వాళ్ళని వారించాడు వాడు. కాలేషావలీ వాళ్ళ పక్కన కూర్చున్నాడు.

"ఏమిట్రా వలీ....ఈ మధ్య అస్సలు కనబడ్డంలేదు. ఎక్కడికో వెళ్ళినట్టు తెలిసింది. ఉన్నట్టుండి ఇక్కడ ప్రత్యక్షమయ్యావ్ ? ఈ అడవిలో నీకేం పని ?" అంటూ పలకరించాడు పట్వారీ.

"అదేం అడుగుతావ్ లే పట్వారీ. నాలుక ఎండుకుపోతోంది. విప్పసారా వాసన ఘుమఘుమలాడి పోతోంది. మొత్తంలాగించేశారా ఇంకా ఉందా ?" అన్నాడు వలీ.

"ఉందిలే తీసుకో" అంటూ బాటిల్ అందించాడు పట్వారీ.

ఎత్తిన బాటిల్ దించకుండా అయిదు గుక్కలు సారా తాగి బాటిలు పక్కన పెట్టి ఒక మాంసం ముక్క నోట్లో వేసుకున్నాడు.

"యింతకీ యిక్కడికెలా వచ్చావ్ వలీభాయ్ ?" ఆతృత ఆపుకోలేక అడిగాడు పట్వారీ.

"అదేమడుగుతావ్ లే భయ్. నా ఖర్మ యిలా కాలింది. నాకో తాత వున్నాడు. లోకంలో లేని జబ్బులన్నీ వాడి వంట్లోనే వున్నాయి. ఇంగ్లీషు వైద్యం పనికి రాలేదు. నాటువైద్యం చేయిస్తున్నాం. అయిదు వస్తువులు తేగలిగితే మా తాతని ఎప్పటిలా నడిపిస్తామని మటిచ్చారు వైద్యులు. వాటి కోసం ఈ అడవిలో వెదుకులాడుతున్నాను" చెప్పాడు వలీ.

"ఏమిటా వస్తువులు భాయ్ ?" పట్వారీ పక్కవాడు ఉత్సాహంగా అడిగాడు.

"అబ్బో! అవన్నీ చాలా విచిత్రమైన దినుసుల్లే. తెల్లగోరింకలు బ్రతికే వుండాలట. చిరుబురు చెట్టు వేళ్ళు, కొండజిల్లేడు వేళ్ళు, గురుగురు పాదు కాయలు, పచ్చమాలచెట్టు ఆకులు, ఇవన్నీ ఈ ఘనాపూర్ అడవుల్లోనే దొరుకుతాయట. వీటిని సేకరించాలంటే కనీసం పక్షం రోజులు అడవుల్లో తిరగాలని ముందే చెప్పారు వైద్యులు' అంటూ తన కట్టుకథ వినిపించాడు.

"మరి ఒక్కటయినా దొరికిందా లేదా ?" అడిగాడు పట్వారీ.

"అప్పుడేనా.... వచ్చి ఇంకా ఒకరోజు కాలేదు. మరి మీ సంగతేమిటో ? అక్కడేదో కారు కనబడుతోంది. మీరిక్కడ ఉన్నారు. కొంపతీసి పోలీసులకి భయపడి ఇలా అడవిలో దాక్కున్నారా ఏమిటి ?" అమాయకంగా ముఖం పెట్టి అడిగాడు.

ఆ మాటలు విని అదేదో గొప్ప జోక్ అయినట్టు పగలబడి నవ్వారు వాళ్ళంతా. పట్వారీ నవ్వాపుకొని చెప్పాడు.

"భలేవాడివే వలీభాయ్. మమ్మల్ని చూస్తే పోలీసులు భయపడతారు. మాకు భయమేంది ? మేం భగవాన్ దాదా మనుషులం. అదో....ఆ కారు చూశావా ? మా కష్టాలకి కారణం అదే. ఆ కారు డ్రైవర్,

అందులో వచ్చిన యువతి, యువకుడు ముగ్గురూ తప్పించుకుని పారిపోయారు. కారు కోసం వాళ్ళిక్కడికి రావచ్చని మా ఆరుగుర్ని ఇక్కడ ఆరుగుర్ని ఇక్కడ కాపలా వుంచిపోయాడు దాదా" అన్నాడు.

"పారిపోయినవాళ్ళు దొరకరా ?" కుతూహలంగా అడిగాడు వలీ.

"ఆ రాత్రి వర్షం మా పనులు చెడగొట్టింది. ఆ పిల్ల కొండ పై నుంచి జారి అదృష్టవశాత్తూ కొండదేవర గుహ ముందు నీళ్ళతొట్టిలో పడిందట. భైరన్న గూడెం గిరిజనులు ఆ పిల్లను తమ గూడెం తీసుకుపోయినట్టు తెలిసింది. మా వాళ్ళతో ఆ గూడెం వెళ్ళారు. పోతే ఆ యువకుడు, టాక్సీ డ్రైవరు వాళ్ళిద్దరి జాడ తెలీలేదు. అసలు ఆ యువకుడు ఎలా వచ్చాడో కూడా మాకు అర్థం కాలేదు. సరి సరి. మా గొడవ నీకెందుకుగ్గాని కాస్త సారాయి పుచ్చుకొని, నీ పనిమీద బయలుదేరు" అన్నాడు పట్వారీ.

భారంగా నిట్టూర్చాడు కాలేషావలీ.

ఇక్కడికి వచ్చినందుకు కొద్దిపాటి సమాచారం లభించిందిగాని, శ్యామ్ సుందర్ ఏమయ్యాడన్నదే అర్థంగావటంలేదు. మరికొంచెం విప్పసారా పుచ్చుకుని వాళ్ళందరి దగ్గర శలవు తీసుకుని ఇవతలకి వచ్చేశాడు.

ఏం జరిగి వుంటుంది ?

ఆ పిల్లకోసం భగవాన్ దాదా తన మనుషులతో భైరన్న గూడెం వెళ్ళి వుంటే, ఆ అమ్మాయి బ్రతికివున్నా చిక్కుల్లో వున్నట్లే. అదలా వుంటితే శ్యామ్ సుందర్ ఏమైనట్టు ? ఆ టాక్సీ డ్రైవరు ఎక్కడికి పోయాడు ? వీళ్ళు కూడా జారి కొండ మీద నుంచి కిందపడిపోయి వుంటారా ? అలా జరిగినట్టు సమాచారం ఏదీలేదు.

తీవ్రంగా ఆలోచిస్తూనే పొదలమధ్య వున్న కారును చూసుకుంటూ మరికాస్త దిగువకు వెళ్ళి కుడిపక్కగా ఇరుకు దారుల్లోంచి దిగువకు సాగాడు.

గంట ప్రయాణం తర్వాత కొండదేవత గుహవున్న ప్రదేశంలోని పచ్చిక బయలులో అడుగుపెట్టాడు. ఆ ప్రదేశమంతా తిరిగి చూసినప్పుడు కాలేషావలీకి ఒక డౌటు వచ్చింది. ఆ గుహ నుంచి కేవలం ముప్పై అడుగుల దూరంలోనే ఒక పెద్ద కొండవాగు ప్రవహిస్తోంది. ఆ పిల్ల కొండపై నుంచి జారిపడితే శ్యామ్ సుందర్, టాక్సీ డ్రైవర్ మాత్రం పైన ఎందుకుంటారు ? జారుడు బండమీద వాళ్ళు కూడా జారిపోయి వుండాలి. ఆ పిల్ల ఇటుపక్కకు జారి నీళ్ళతొట్టిలో పడినట్టే, వాళ్ళిద్దరూ అటుపక్కకి జారి వాగులో పడిపోయి ఉంటారనుకోడంలో తప్పులేదు. అలా పడివుంటే వాగులో దిగువకు కొట్టుకుపోయి వుంటారుగాని, ప్రాణాలు

పోగొట్టుకునే ఛాన్సేలేదు. కాబట్టి వాగు వెంట దిగువ ప్రాంతాలకు వెళ్ళి చూస్తే మంచిది అనే అభిప్రాయానికొచ్చాడు.

అలా వూహించగానే ఇక క్షణం కూడా అక్కడ ఆలస్యం చేయలేదు. వలీ. కత్తి చేత్తో పుచ్చుకుని, కర్ర భుజాన వేసుకొని బీడీ దమ్ము కొడుతూ దట్టమైన అడవిలోకి ప్రవేశించి ముందుకు సాగాడు.

ఘనాపూర్ అడవుల్లో పులులు, సింహాలవంటి పెద్దజాతి క్రూర మృగాలు లేవు. కాని, అక్కడక్కడా చిరుతపులులు కన్పిస్తాయి. చిరుతలు, ఎలుగ్గొడ్లూ, అడవిపందుల నుంచే ముఖ్యమైన ప్రమాదం. ఇవిగాక కొండ చిలువలు, విషనాగులు, విషకీటకాల బెడద వున్నదే. ఏమాత్రం అజాగ్రత్తగా వున్నా ప్రమాదం విరుచుకుపడుతుందని కాలేషావలీకి బాగా తెలుసు. గతంలో అడవుల్లో తిరిగిన అనుభవం అతనికుంది.

కొంతదూరం ముందుకు వెళ్ళాక ఉన్నట్టుండి ఎవరో కెవ్వుమన్న కేక వినబడింది. అదిరిపడి అటు చూశాడు. కంటికి ఎవరూ కన్పించలేదు. తను భ్రమపడలేదు. ఎవరో మగాడి గొంతు అది. తను స్పష్టంగా విన్నాడు. ఏదో ప్రమాదంలో చిక్కి అరిచిన అరుపు అది.

అరుపు విన్పించిన దిశలో పరుగెత్తాడు. వందగజాల దూరం వెళ్ళగానే ముళ్ళపొదల పక్కన ఒక మనిషి కంటపడ్డాడు. అతను కిందపడి తన్నుకొంటున్నాడు. అతని నోటి నుండి నురగ మొదలయింది. అతడ్ని కాటువేసిన గోధుమత్రాచు పొదల్లోకి పోతూ కన్పించింది. చూస్తూ వుండగానే అది అదృశ్యమైంది.

అతను ఎవరో, ఏమిటో తెలీదుగాని పాము కాటుకు గురయ్యాడు. అలా వదిలేస్తే కొద్దిసేపట్లోనే అతని ప్రాణం పోవచ్చు. ఆ పరిస్థితిలో అతన్ని వదిలి పోబుద్ధికాలేదు వలీకి.

చప్పున అతని పాదాల దగ్గర కూర్చుని పరీక్షించాడు. కుడిపాదం మీద కన్పించింది పాముకాటు. రెండు పళ్ళు దిగినచోట రెండు నెత్తురు చుక్కలున్నాయి.

క్షణ కూడా ఆలస్యం చేయలేదు వలీ. డాగర్ అందుకున్నాడు. నీళ్ళ బాటిల్ మూతతీసి పక్కన పట్టాడు. ఆ వ్యక్తి పాదాన్ని తన కాలి మీద వుంచి, పాము కాటుపడిన చోట డాగర్ తో గాటు పెట్టాడు. పొంగుతున్న నెత్తురును నోటితో పట్టి లాగి వూసాడు. మధ్యమధ్యన నీళ్ళతో తన నోరు కడుగుతూ జాగ్రత్తగా అరడజనుసార్లు నెత్తురు లాగి ఊసాడు. తరువాత తన నోరు శుభ్రంగా కడుక్కుని లేచాడు.

దగ్గరలోని పొదల్లో వెదికి చిన్న చిన్న ఆకులతో కూడిన ఒక పాదును పెరికి తెచ్చాడు. దాని ఆకుల్ని అరచేతిలో వుంచి బాగా రుద్ది పది చుక్కల రసాన్ని అతడి నోట్లో పోసాడు. నలిపిన ముద్దను గాయాలమీద వేసి

కట్టుగట్టాడు. పనిలో పనిగా నాలుగు ఆకులు నోట్లో వేసుకుని తనూ నమిలి మింగేశాడు. విషాన్ని హరింపచేసే అద్భుతమైన తీగ అది.

"ఏందిబే...నువ్వేమన్నా మంత్రగాడివా, పెద్ద డాక్టర్ వా ?" ఎదురు తిరిగి ప్రశ్నించింది వలీ అంతరాత్మ.

"కాటు వేసింది బురదపాము కాదు. భయంకరమైన విషం కలిగిన గోధుమ వన్నెత్రాచు. ఇతను దురదృష్టవంతుడు. బ్రతకడు. ఎందుకొచ్చిన వృధాశ్రమ ? నీ దారిన నువ్వు వెళ్ళిపోవటం మంచిది" అంటూ హెచ్చరించింది.

"నువ్వేమీ హెచ్చరించనక్కర్లేదు. ఇతను బ్రతుకుతాడు. నాది నాటు వైద్యంకావచ్చు. కాని నాణ్యమైన పని. చిత్త శుద్ధితోఇతన్ని బ్రతికించాలని నేను చేసిన ప్రయత్నానికి అల్లా కృప తోడుగా వుంది. నా వైద్యంవిఫలం కాదు. ఇతను బ్రతుకుతాడు" ఆ యువకుడి ముఖం చూస్తూ పైకేఅనుకున్నాడు వలీ.

అతనికి ముప్పై లోపు వుంటుంది వయసు.

కాళ్ళకు చెప్పులు కూడా లేకుండా ఈ నట్టడవిలో ఎందుకు తిరుగుతున్నాడో అర్థం కాలేదు.

అదే సమయంలో వలీకి రాకూడని డౌటే వచ్చింది. ఎందుకంటే ఆ యువకుడి వంటిమీద నెత్తురు గడ్డకట్టిన గాయాల గుర్తులు కన్పిస్తున్నాయి. ఇతను శ్యామ్ సుందర్‌తో వున్న టాక్సీ డ్రైవర్ కాదుగదా ? అలాకాదు అనుకొంటేఖచ్చితంగా భగవాన్ దాదా మనిషయినా అయి వుండాలి. అతనికి తెలివి వస్తేగానే ఏ విషయాలూ తెలీవు.

అప్పటికి ఆ వ్యక్తి నోటి నుంచి నురగ రావటం నిలిచిపోయింది. అచేతనంగా పడున్నాడు. ఖచ్చితంగా మూడు నుంచి నాలుగు గంటలవరకూ అతను కోలుకోలేడని తెలుసు. ఈ లోపల తినటానికి ఏర్పాటు చూసుకోవాలి.

అతనికి స్పృహ వచ్చే వరకూ వుండిపోవాలనే నిశ్చయించుకున్నాడు కాలేషావలీ. వదిలివెళితే అతను బ్రతుకుతాడో లేదో తర్వాత సంగతి. అడవి నక్కలు పసిగడితే అతను బ్రతుకుతాడో లేదో తర్వాత సంగతి. అడవి నక్కలు పసిగడితే గుంపుగా మీదపడి పీక్కు తినేస్తాయి.

కొద్దిగా విప్పసారా పుచ్చుకున్నాడు. కర్రచేత్తో పుచ్చుకుని చెట్లలోకి బయల్దేరాడు.

అడవి కోళ్ళు అంటే కాలేషావలీకి చాలా యిష్టం.

క్లీన్ చేసిన అడవి కోడికి నూనె, ఉప్పు, కాపంపట్టించి, నిప్పులమీద కాల్చుకు తింటూ సారా తాగుతుంటే స్వర్గం కన్పిస్తుందన్నది అతడి గత అనుభవం.

సుమారు ఒక గంటకు పైగా తిరిగాక ఎలాగో శ్రమపడి రెండు అడవి కోళ్ళను పట్టుకోగలిగాడు. వాటితోబాటు కొన్ని పండ్లను కూడా సేకరించుకుని వెనక్కి వచ్చాడు.

చెట్టుకింద బండ దగ్గరకు రాగానే లాగిపెట్టి ముఖంమీద ఎవరో గుద్దినట్టు ఉలిక్కిపడ్డాడు వలీ. ఎందుకంటే, అక్కడ బండమీద శవంలా పడుండాల్సిన యువకుడు అక్కడ కన్పించలేదు.

ఏమయ్యాడు ? అడవిజంతువులు అతని బాడీని లాక్కుపోయాయా ? లేక స్పృహవచ్చి లేచి వెళ్ళిపోయాడా ? లేచి వెళ్ళటానికి ఛాన్సేలేదు. మరేమయ్యాడు ?

కంగారుగా అతడ్ని గాలిస్తూ బయల్దేరాడు కాలేషావలీ.

## 16

గేటు ముందు నిలబడి ఒకసారి ఆ కట్టడం పరిసరాల్ని పరిశీలించాడు వాత్సవ.

రెండంతస్థులున్న పురాతన కట్టడం అది. చుట్టూ విశాలమైన ఆవరణలో పిచ్చి మొక్కలు మొలిచి చిట్టడివిలా వుంది. కాంపౌండ్ వాల్ చాలా చోట్ల బీటలు తీసి కూలిపోడానికి సిద్ధంగా వుంది.

కట్టడం పోర్టికో సమీపంలో రెండు వేన్ లు, అరడజను మోటార్ బైక్ లు పార్క్ చేసున్నాయి. పోర్టికోలో అరడజనుమంది గూండాలు ఏదో విషయం గురించి తీవ్రంగా చర్చించుకుంటున్నారు. కట్టడం లోపల ఎంతమంది వున్నారో తెలీదు.

సిగరెట్ ఆఖరిదమ్ము లాగి అవతలికి విసిరిపారేస్తూ డెస్పరేట్ గా లోనకు అడుగుపెట్టాడు వాత్సవ. అతను పోర్టికోని సమీపించే వరకూ అతని రాకను అక్కడున్న వాళ్ళెవరూ గమనించనేలేదు.

పెద్దపెద్ద అంగలతో పెద్దపులిలా తమ ముందుకు వస్తున్న వాత్సవను చూసి ఎవరో అర్థంగాక నొసలు విరిచారు అక్కడున్న గూండాలు.

"ఎవర్నువు ? ఎవరు కావాలి ?" వాళ్ళలో ఒకడు గుప్పిళ్ళు బిగించి ముందు కొస్తూ వాత్సవని ప్రశ్నించాడు.

"ఛోటాభాయ్ ని చూడాలి బ్రదర్! ఎక్కడవాడు ?" చాలా కూల్ గా అడిగాడు వాత్సవ.

ఆ మాటలు వినగానే గూండాలలో ఆశ్చర్యం మరోమెట్టు పైకిపోయింది. ముక్కు ముఖం తెలీని మనిషి తమ అడ్డాలోకొచ్చి, తమ బాస్ తర్వాత అంతటి వాడయిన ఛోటాభాయ్ ని వాడు వీడనటం బొత్తిగా సహించలేకపోయారు.

"ఏందిబే! ఛోటాభాయ్ ని వాడు వీడనేంత గొప్పవాడివిరా నువ్వు ? ఎంత ధైర్యం నీకు ?" అంటూ వెనకా ముందు చూడకుండా పిడికిలి పైకిలేపాడు కొట్టటానికి.

కొట్టేఛాన్స్ వాడికివ్వలేదు వాత్సవ.

అతని పిడికిలి హేమర్ లా తాకింది గూండా ముఖాన్ని. కత్తితో ముఖాన్ని చీరేసినంత బాధతో కెవ్వున అరిచాడు వాడు.

రెండు చేతులతో ముఖాన్ని కప్పుకుని, అలాగే కూలబడిపోతూ "చంపేశాడు...నన్ను చంపేశాడు నాయనో" అంటూ అరిచాడు.

వాడి అరుపు పూర్తిగాక ముందే వాత్సవ కుడిపాదం వాడి పక్కటెముకల్ని దారుణంగా తాకింది. కాలువెంబడే ఎగిరి గింగిరాలు తిరుగుతూ పోయి మిగిలిన గూండాల మధ్యన పడ్డాడు వాడు.

"నేనెవర్నో ఇప్పుడు తెలిసిందా నీకు ? ఇప్పుడు వీళ్ళకి కూడా తెలుస్తుంది చూడు" అంటూ బ్రహ్మరాక్షసుడి మాదిరి మిగిలిన గూండాలమీదకు దూకాడు.

తమ అడ్డాలో చొరబడి తమమీద చేయి చేసుకున్న మొనగాడ్ని ఇంతవరకు వాళ్ళు చూళ్ళేదు. అందుకే కొద్దిక్షణాలు షాక్ తో నిలబడిపోయారు. ఆ అవకాశాన్ని ఉపయోగించుకున్నాడు వాత్సవ. బొంగరంలా గిర్రున తిరిగి ఇద్దర్ని ఎగిరి తన్నాడు.

ఒకడి ముఖాన్ని పచ్చడి చేశాడు. మరొకడ్ని ఎత్తి అవతలకు విసిరేశాడు. కన్నుమూసి తెరిచేలోపల కరెంట్ షాక్ తిన్న కాకుల్లా ఆరుగురూ తలోపక్కన పడి మూలుగుతున్నారు.

సరిగ్గా అదే సమయంలో–

లోపలినుంచి బయటకు రాబోతూ గుమ్మంలోనే ఆగిపోయాడు ఛోటాభాయ్. వాడి తలకు బ్యాండేజి చుట్టి వుంది. వాత్సవను చూడగానే పెద్దపులిని చూసినట్టు అదిరిపడి వెనక్కు దూకాడు.

"వచ్చేశాడు. వాడు మన అడ్డాలోకి వచ్చేశాడు. రండ్రోయ్...రండి వాడ్ని ఆపండి నాయనో.....నరికి ముక్కలు చేయండి....త్వరగా రండిబే" అని గావుకేకలేస్తూ వేగంగా లోనకు పరుగులు తీశాడు.

వాడి కేకలతో ఒక్కసారిగా చెలరేగింది అక్కడ కలకలం. లోపల ఎక్కడెక్కడో వున్న గూండాలు ఆయుధాలు ఝళిపిస్తూ పుట్టలోంచి వెలువడే చీమల్లా దూసుకురాసాగారు.

వాళ్ళు బయటకు వచ్చేవరకూ ఆగలేదు వాత్సవ.

బయట ఆరుగుర్నీ పడగొట్టిన తక్షణమే సుడిగాలి మాదిరి బిల్డింగ్ లోకి ఎంటరై పోయాడు.కొట్టడంలో ఇక వెనకా ముందూ చూళ్ళేదు. దొరికినవాడ్ని దొరికినట్టు విరగదీస్తూ విజృంభించాడు.

బిల్డింగ్ లోపల సుమారు ఇరవై మంది వున్నారు. తన వాళ్ళమీద అరిచి కేకలు వేస్తూ బాల్కానీలో తిరుగుతున్న ఛోటాభాయ్ ని గుర్చించాడు వాత్సవ. ఎట్టి పరిస్థితిలోనూ వాడ్ని వదిలిపెట్టే ఉద్దేశం వాత్సవకు లేదు. వాడు చేజారిపోతే బడేభాయి ఎక్కడున్నాడో తెలుసుకోవటం మరింత ఆలశ్యం కావచ్చు.

అందుకే ఫైటింగ్ ను త్వరగా ముగించి వాడ్ని పట్టుకునే ఉద్దేశంతో వున్నాడు వాత్సవ. ఎడా పెడా కమ్ముకొస్తూ ఆయుధాలు ఝళిపిస్తున్న గూండాలమీద రాక్షసుడి మాదిరి అటాక్ ఆరంభించాడు.

అరుపులు , కేకలు , ఆర్తనాదాలతో బిల్డింగ్ హోరెత్తిపోయింది. ఐదు నిముషాలు. ఆరో నిముషానికే ఎండ్ అయిపోయింది ఫైటింగ్. దారుణమైన గాయాలతో కిందపడి దొర్లుతున్న గూండాలను తొక్కుకుంటూ వేగంగా మేడ మీదకు పరుగుతీశాడు వాత్సవ.

మెట్ల క్రాస్ చేసి బాల్కానీలో అడుగుపెడుతుండగా "ధన్" మంటూ రివాల్వర్ మోత వినిపించింది.

ప్రమాదం గ్రహించి మెరుపులా నేలకు జారిపోయాడు గానీ లేకపోతే బుల్లెట్ అతని ఛాతీని చీల్చి వుండేది.

తలమీదుగా బుల్లెట్ దూసుకుపోయిన మరుక్షణం డాగర్ అందుకున్నాడు వాత్సవ. డోర్ లోంచి అడుగు బయటపెట్టి మరోసారి రివాల్వర్ ప్రయోగించటానికి సిద్ధంగా వున్నాడు ఛోటాభాయ్. వాత్సవ కుడి చేయి మెరుపులా కదిలింది.

అండర్ హేండ్ త్రోలో గాలిని చీల్చుకుంటూ దూసుకెళ్ళిన డాగర్ సూటిగా దిగబడింది ఛోటాభాయ్ రివాల్వర్ పట్టిన చేతి మణికట్టుమీద. అంతే.....

కెవ్వున అరిచాడు ఛోటాభాయ్.

చేతిలోంచి రివాల్వర్ జారిపోయింది.

గాయం నుంచి నెత్తురు పొంగుతుండగా గిరుక్కున తిరిగి లోనకు పారిపోయాడు. అయితే డాగర్ వెనకే చిరుతపులి మాదిరి దూసుకొచ్చిన వాత్సవ వాడ్ని పడగొట్టేసాడు. దయాదాక్షిణ్యం లేకుండా ముక్కూ, ముఖం పచ్చడయ్యేలా చితగ్గొట్టేసాడు.

"వద్దు....నన్ను చంపకు, ప్లీజ్" అంటూ వాడు రెండు చేతులూ ఎత్తి దండాలు పెట్టేదాకా కొట్టేసాడు వాత్సవ.

"ఓ.కె.....పిచ్చివేషాలు వేయకుండా నాక్కావల్సిన ఇన్ఫర్మేషనిస్తే బ్రతికిపోతావు. లేదంటే ఇక్కడే నిన్ను ఖతంచేసి వెళ్ళిపోతాను. కూర్చో" అంటూ వాడి జుత్తు పుచ్చుకుని లాగి కూర్చోబెట్టాడు.

"దాహం.... మంచినీళ్ళు...." అరిచాడు వాడు.

టేబిల్ మీద నీళ్ళ కూజాను తెచ్చి వాడి ముందుంచాడు వాత్సవ. వడి మణికట్టు నుంచి తన డాగర్ ని లాగి, వాడి దుస్తులకే నెత్తురు తుడిచి, దాన్ని యథాస్థానంలో భద్రపరిచాడు. జేబురుమాలుతీసి నెత్తురు రాకుండా కట్టు కట్టాడు.

కూజా ఎత్తి గటగటా మంచినీరు తాగాడు వాడు. వాడి పెదవుల మధ్య సిగరెట్ వుంచి, తనే లైటర్ తో సిగరెట్ ముట్టించాడు వాత్సవ.

"నీ గురించి తక్కువగా అంచనావేసి దెబ్బతిన్నాను" అన్నాడు బాధగా ఛోటాభాయ్.

"అది నీ ఖర్మ. నాకు నీ బాస్..... బడేభాయ్ ఎక్కడ వున్నాడో తెలియాలి. వాడు అజ్ఞాతంలోకి ఎందుకు వెళ్ళిపోయాడో, ప్రస్తుతం ఎక్కడ వున్నాడో ఆ విషయాలు నీకు మాత్రమే తెలుసని నాకు తెలుసు. కమాన్! ఎక్కడున్నాడు ?" సిగరెట్ పొగ తాపీగా వదులుతూ అడిగాడు వాత్సవ.

"ఎందుకు ? వాడ్ని చంపేస్తావా ?" అనుమానంగా అడిగాడు ఛోటా భాయ్.

"షటప్....జస్ట్ ఐ సే షటప్. అర్థమైందా ? పిచ్చి ప్రశ్నలు వేస్తే ముందు నిన్ను చంపేస్తాను. నీ క్వశ్చన్‌కి ఆన్సర్ చేయటం కోసం నేను ఇక్కడికి రాలేదు. అడిగిందానికి ఖచ్చితమైన సమాధానం చెప్పు. అతి తెలివి చూపిస్తే బ్రతికుండగానే నీకు నరకం ఎలా వుంటుందో చూపిస్తాను. బడేభాయ్ ఎక్కడున్నాడు ?" క్రూరంగా చూస్తూ హెచ్చరించాడు వాత్సవ.

"నిన్ను తక్కువగా అంచనా వేసి పొరపాటు చేసాను మిష్టర్ వాత్సవ. అందుకే దెబ్బతిన్నాను. అలాగే నా గురించి కూడా నువ్వు తక్కువగా అంచనా వేయకు. ఎందుకంటే మా గురించి కూడా నీకేమీ తెలీదు. దారుణంగా దెబ్బతింటావ్!"

ఛోటాభాయ్ మాటలు పూర్తవుతుండగా చాలా వేగంగా కదిలాడు వాత్సవ. అతడి పాముచెవులు అంతక్రితమే తన వెనక మెత్తని అడుగుల చప్పుడు పసిగట్టాయి. ఛోటాభాయ్ మాటలు దాన్ని బలపరిచాయి. తన మెడ నరకటం కోసం పొడవుకత్తితో పిల్లిలా అడుగులు వేస్తూ వస్తున్నాడొకడు. వాడి కత్తి కిందకు దిగేలోపలే వెల్లకిలా జారి కుడికాలు లేపాడు వాత్సవ. అంతే—

వంగినవాడు వంగినట్టే వాత్సవ కాలువెంబడే పైకి లేచాడు. గింగిరాలు తిరుగుతూ పోయి బాల్కనీ రెయిలింగ్ మీద పడి అక్కడి నుంచి కింద హాల్లోకి జరిపోయాడు.

దిగువ నుంచి దారుణంగా వినిపించింది వచ్చిన ఆగంతకుడి ఆర్తనాదం. వాడు చచ్చాడో బ్రతికాడో కూడా చూళ్ళేదు వాత్సవ. తిరిగి పొజిషన్ లోకి వస్తూనే "వాడ్ని చూశా నీ మాట మారిపోయింది ? వాడ్ని చూశా నీకంత ధైర్యం వచ్చింది ? నన్ను దెబ్బతీసే మొనగాళ్ళురా మీరు ? రమ్మనరా....దొంగ దెబ్బతీసే బద్మాష్ గాళ్ళు, మీదీ ఒక రోషమా...రమ్మనరా!" అంటూ కోపంతో రెచ్చిపోతూ రాక్షసుడిలా మరోసారి ఛోటాభాయ్ బాడీతో ఫుట్ బాల్ ఆడేసాడు వాత్సవ.

ఒళ్ళు హూనమైపోయింది వాడికి.

దెబ్బలకు తట్టుకోలేక తన పాదాలు పట్టుకొని ఏడ్చేవరకూ కొట్టాడు వాత్సవ.

"ఇక చాలు.....నీకేం కావాలన్నా చెప్తాను. నన్ను చంపకు, ప్లీజ్!" అంటూ భోరున ఏడ్చేశాడు వాడు. వాడ్ని లాగి కూర్చోబెట్టి—

క్రూరంగా కళ్ళలోకి చూసాడు.

"చెప్పు.....ఖచ్చితంగా సమాధానం చెప్పు. ఆవగింజంత అధిక ప్రసంగం చేసినా సహించను. బడేభాయ్ ఇప్పుడు ఎక్కడ వున్నాడు ?" అడిగాడు.

"నూర్ బంగ్లాలో వున్నాడు!" పెదవి విప్పి చెప్పాడు ఛోటాభాయ్.

"ఎక్కడ వుందది ?" రెండో ప్రశ్న అడిగాడు వాత్సవ.

"దక్షిణ ఆగ్రాలో తోటలో వుందా బంగ్లా!" అంటూ అడ్రస్ చెప్పాడు వాడు.

"ఖాద్రి మనిషి రసూల్ అనేవాడు మీ దగ్గరకొచ్చాడు. ఎప్పుడు ? ఖాద్రి బడేభాయ్‌తో ఏం చెప్పాడు ?"

"ఖాద్రి ఏం చెప్పాడో నాకు తెలీదు. రసూల్ మాత్రం నిన్న ఉదయం వచ్చాడు."

"వెరీగుడ్! పద.... ఈ కట్టడంలో ఏమున్నాయో తిప్పి చూపించు " అంటూ అక్కడే ఎడంగా పడున్న ఛోటాభాయ్ రివ్వాల్వర్‌ని అందుకుని , వాడ్ని జబ్బపుచ్చుకుని పైకిలేపాడు.

ఛోటాభాయ్ కి వాత్సవ చెప్పింది చేయటం తప్ప మరో దారి కన్పించలేదు. వాత్సవని తిప్పి చూపించాడు. అది చూసాక చాలా అక్రమ వ్యాపారులకు బడేభాయ్ అడ్డా కేంద్రబిందువని వాత్సవకి అర్థమైంది. పోలీసుల సహకారం లేకుండా ఇక్కడ ఇంత ధైర్యంగా వాడు చీకటి వ్యాపారం సాగించలేడని తెలుస్తోంది.

ఒక గదిలోని ప్రేలుడు వస్తువుల నుంచి రెండు బాంబులు అందుకున్నాడు వాత్సవ. అట్టపెట్టెల్లోంచి వాటిని బయటకు తీసి రిమోట్ బటన్స్ నొక్కి ఎప్పటిలా వుంచేసాడు. రిమోట్ కంట్రోలర్స్ రెంటినీ తీసుకుని ఇవతలికి వచ్చేశాడు.

"ఇది చాలా అన్యాయం!" ఏడుపు ముఖంతో అరిచాడు ఛోటాభాయ్.

"న్యాయా న్యాయాల గురించి నువ్వు మాట్లాడకూడదు. ఛోటాభాయ్. పోలీసులకు చేతకాని పని నేను చేసి చూపిస్తాను. ఆగ్రా పోలీసుల్ని నామీదకు మళ్ళిస్తే భయపడి పారిపోతాననుకున్నారా ? కమాన్! నీ వాళ్ళందరికీ చెప్పు. ఒక్కడూ కట్టడంలో వుండకుండా అందర్నీ బయటకు పారిపోయి ప్రాణాలు దక్కించుకోమను. పద, పారిపోవాలని చూడక. నా గురికి తిరుగులేదు. అలాంటి ప్రయత్నాలు నువ్వేం చేసినా కుక్కని కాల్చినట్లు కాల్చి పారేస్తాను. మూవ్!" అంటూ కరుగ్గా హెచ్చరించి ముందుకు తోశాడు వాత్సవ.

మెట్లు దిగుతుండగానే తన వాళ్ళందర్నీ హెచ్చరిస్తూ అరిచాడు పారిపొమ్మని ఛోటాభాయ్. గాయాలతో కదలలేని వాళ్ళని భుజాలకు ఎత్తుకొని మరీ బయటకు పరుగుతీసారు గూండాలు.

పోర్టికోలోకి రాగానే అక్కడున్న వాటిలో ఒక వేన్ స్టీరింగ్ ముందుకు ఛోటాభాయ్‌ని తోసి తను వెనకసీట్లో కూర్చుని డోర్ మూశాడు వాత్సవ. రివాల్వర్ వాడి తలకి గురిచేసి వుంచి సిగరెట్ ముట్టించుకున్నాడు.

"వేన్ పోనీ.... సరిగ్గా నువ్వు చెప్పిన అడ్రస్ కే తీసుకెళ్ళాలి. ట్రిక్స్ ప్లే చేస్తే పాయింట్ రేంజ్ లో బుల్లెట్ నీ బుర్రని చీల్చేస్తుంది!" అంటూ కరుగ్గా హెచ్చరించాడు.

బుద్ధిమంతుడిలా వేన్ ని ముందుకు దూకించాడు వాడు. గేటుదాటి వీధిలో కాస్త ముందుకు రాగానే వేన్ ఆపించాడు.

పక్కనే నిలబడుంది రిక్షా.

అందులో వాత్సవ ఏర్ బేగ్ నిక్షేపంగా అలాగే వుంది. నిజంగానే అందులో బాంబులు వున్నాయన్న భయంతో తాకటానికి భయపడి వాత్సవ కోసం ఎదురు చూస్తూ తచ్చాడుతున్నాడు రిక్షావాలా. వేన్ లో వాత్సవని చూసి కంగారుగా పరుగెత్తుకు వచ్చాడు.

"నా ఏర్ బాగ్ ఇలా ఇవ్వు!" వాత్సవ వాడితో చెప్పాడు.

"అయ్యబాబోయ్! బాంబులంటే నాకు భయం సార్. మీరే వచ్చి తీసుకోండి" అన్నాడు ఏడుపు ముఖంతో.

"బాంబులు ఇప్పుడు అందులో లేవు. పట్రా, ధైర్యంగాపట్రా!" హామీ ఇచ్చాడు.

వాడు బెదురుతూనే వెళ్ళి రిక్షా సీటుమీది బేగ్ ని తెచ్చి వాత్సవకి అందించాడు భద్రంగా. దాన్ని తన భుజాన వేసుకున్నాడు వాత్సవ.

వాలెట్ తీసి ఒక వందనోటును వాడి చేతిలో పెట్టి హెచ్చరించాడు. "వెళ్ళిపో.....తక్షణం ఈ ప్రాంతానికి దూరంగా పారిపో. కొద్దిక్షణాల్లో ఇక్కడ భూకంపం రావచ్చు."

వాత్సవ మాటలకు బెదిరిపోయాడు వాడు.

వెంటనే రిక్షా ఎక్కి ఫెడలింగ్ ప్రారంభించాడు.

"కారు పోనీ!" అంటూ ఛోటాభాయ్ కి సూచించాడు వాత్సవ.

వేన్ ఆ వీధి దాటగానే జేబులోంచి రిమోట్ కంట్రోలర్స్ రెంటిని తీశాడు. ఒకదాని తర్వాత ఒకటిగా రెండింటి బటన్స్ ప్రెస్ చేసి వేన్ లోంచి బయటకు విసిరేశాడు.

అదే క్షణంలో–

వెనక నుంచి 'గుభిల్లు' న దారుణ విస్ఫోటకం తాలూకు పెద్ద శబ్దం విన్పించింది. వెనువెంటనే మరో పెలుడు వరసగా పేలుళ్ళు ఏర్పడుతూనే వున్నాయి.

తిరిగి చూసిన వాత్సవకి,

ఆకాశంలోకి లేస్తున్న దట్టమైన పొగలు, మంటలు కన్పించాయి. ఏం జరుగుతుందో అర్థంగాక వీధుల్లో జనం భయభ్రాంతులతో పరుగులు తీస్తున్నారు.

"నాశనమైపోయాడు, బడేభాయ్ సర్వనాశనమైపోయాడు. నువ్వు రాక్షసుడివి, కిరాతకుడివి....." వేన్ ముందుకు పోనిస్తూనే ఏడురు ముఖంతో గొణిగాడు ఛోటాభాయ్.

"ఇది నా తప్పు కాదు బ్రదర్. నేనేమిటో తెలుసుకుని రంగంలోకి దిగాల్సింది. ఏమీ తెలీకుండానే పిచ్చి పథకాలు వేసి నన్ను దెబ్బ కొట్టాలని చూశారు మీరు. అందుకే ఫలితం దారుణంగా వుంది!" తాపీగా సిగరెట్ దమ్ము కొడుతూ చెప్పాడు వాత్సవ.

"బడేభాయ్ నిన్ను క్షమించడు. నూర్ బంగ్లానుంచి నువ్వు ప్రాణాలతో బయటకు రాలేవు."

"ఊరికే ఊహించుకుని మురిసిపోకు. నువ్వు తీసుకెళ్ళింది కరెక్ట్ అడ్రస్ కాకపోతే ముందు నీ ప్రాణం తీస్తాను. అది మర్చిపోకు."

ఇక పెదవి విప్పలేదు ఛోటాభాయి.

వరస ప్రేలుళ్ళతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లుతోంది. రాళ్ళకుప్ప తప్ప అక్కడ ఏమీ మిగలదని తెలుసు. పోలీస్ వేన్ లు, ఫైరింజన్ లు రంగంలోకి దిగుతున్న అలికిడవుతోంది. వేన్ వేగంగా దక్షిణ ఆగ్రావైపు పరుగులు తీసింది.

సుమారు ముప్పై నిముషాల ప్రయాణం తర్వాత యమునా నదీ తీర ప్రాంతం పల్లపు వీధుల్లోకి ప్రవేశించింది వేన్. అటుపక్క తోటలు, ఫాంహౌస్ లు, గెస్ట్ హౌస్ లు కన్పిస్తున్నాయి. ఇళ్ళపక్కన జనసంచారం కూడా తక్కువగానే వుంది.

ఒక వీధి చివరకు వెళ్ళి పెద్ద గేటు గుండా లోన ప్రవేశించింది వేన్.

అప్పటికి సరిగ్గా సాయంకాలం నాలుగు గంటలయింది సమయం. చుట్టూ చెట్లు, పొదలతో నిండిన విశాలమైన ఆవరణ మధ్యలో పెద్ద డాబా యిల్లు అది. అదే నూర్ బంగ్లా. సాధారణంగా ఇలాంటి పరిస్థితిలో తమ

వేన్ లోనకు రావటం చూడగానే బడేభాయిగాని, అతడి మనుషులుగాని బంగ్లాలోంచి పరుగులెత్తుకురావాలి బయటకి.

కాని అలాంటి సూచనలేవీ కనబడలేదు.

అసలు అక్కడ ఎవరూ వున్న జాడకూడా లేదు.

ఇంజన్ ఆఫ్ చేసి,

సైలెంట్ గాకూర్చున్నాడు ఛోటాభాయి.

"మనం రాంగ్ అడ్రస్ కి వచ్చామా ?" కూల్ గా అడిగాడు వాత్సవ.

"లేదు లేదు. నూర్ బంగ్లా అదే. బడేభాయి ఇక్కడే వున్నాడు" స్థిరంగా చెప్పాడు ఛోటాభాయి.

వాడి ఫీలింగ్ని వాచ్ చేస్తున్న వాత్సవకి వాడు చెప్పింది అబద్ధం కాదని అర్థమైంది.

"ఈసరికి నీ మనుషులు ఫోన్ చేసి అక్కడ ఏం జరిగిందో చెప్పి వుంటారనుకుంటున్నాను. బడేభాయి ఇక్కడి నుంచి పారిపోయి వుండొచ్చా ?" తిరిగి ప్రశ్నించాడు.

"ఆ విషయం లోకనకెళ్ళి చూస్తేనే అర్థమవుతుంది. నీతో వున్నాను గాబట్టి వాళ్ళ కదలికలు నాకు తెలీదు."

"బడేభాయి వెంట ఎంతమంది వున్నారు ?"

"ఇరవై.... ఇరవై కిమించరు."

"ఓ.కె. నేవెళ్ళి చూసొస్తాను. నువ్విక్కడే వుండు" అంటూ వాడు పారిపోకుండా ముందు జాగ్రత్త చర్యగా వేన్ తాళాలు తీసుకుని కిందకుదిగాడు. అద్దాలు లేపి డోర్స్ లాక్ చేశాడు. లోపలున్న ఛోటాభాయి ఏదో అరుస్తున్నాడు. ఇక వాడ్ని పట్టించుకోలేదు వాత్సవ. రివాల్వర్ రెడీగా పట్టుకుని పరిసరాల మీద ఓ కన్నేసి వుంచుతూ బంగ్లా దిశగా అడుగులు వేశాడు.

నడుస్తున్నాడేగాని వాత్సవ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అతని బుర్రలో డేంజర్ సిగ్నల్స్ మ్రోగుతున్నాయి. అంతరాత్మ అదే పనిగా హెచ్చరికలు జారీ చేస్తోంది.

తన అడ్డాను నాశనం చేసి కోట్లు నష్టం కలిగించాక బడేభాయ్ చేతులు ముడుచుక్కూర్చుంటాడనుకోవటం అవివేకమే అవుతుంది. అదే సమయంలో వాడు ఏ స్టెప్

తీసుకోబోతున్నాడో తెలీకుండా అడుగు ముందుకు వేయటం సాహసం అవుతుంది. రిస్క్ గురించి ఆలోచించే అలవాటు వాత్సవకు లేదు.

వేన్ నుంచి రెండు వందల అడుగుల దూరంలో ఉంది బంగ్లా. ఎక్కడా మనిషి జాడలేదు. వడివడిగా అడుగులేస్తూ ముందుకే సాగాడు వత్సవ.

పోర్టికో వద్దకు వచ్చేసరికి ఎంట్రన్స్ డోర్స్ బార్లా తెరిచే వుండడం గమనించాడు. ఇక వెనకా ముందూ ఆలోచించలేదు వాత్సవ. లోనకు దూసుకుపోయాడు.

అది పాడుబడ్డ కట్టడం కాదని చూడగానే అర్థమవుతుంది. అలాగని ఖరీదైన ఫర్నిచర్ కూడా లోన ఏమీ లేదు. సాదాసీదా సామాన్లతో సింపుల్ గా వుంది.

హాలు నిర్మానుష్యంగా వుంది. హాలు చాలా పొడవుగా వుండి అటు యిటు అనేక గదులున్నాయి. మూడు గదులు వెదికినా ఎవరూలేరు. నాలుగో గదిని చెక్ చేయటం కోసం తిరిగి హాల్లోకి వస్తుండగాచివరి గదిలోంచి ఎవరో వస్తున్న అలికిడయింది.

విన్న తక్షణం రియాక్టవుతూ చివ్వున వెనుతిరిగి రివాల్వర్ ఎయిమ్ చేశాడు వాత్సవ. కాని బయటకొస్తున్న ఆకారాన్ని చూడగానే తన కళ్ళను తను నమ్మలేకపోయాడు.

"మైగాడ్! మిస్ భానుమతి..... మీరేమిటి యిక్కడ ?" ఆశ్చర్యాన్ని అణచుకుంటూ అడిగాడు.

ఆమె చిరునవ్వుతో వీనస్‌లా ముందుకొచ్చింది.

"మరీ ఆశ్చర్యపోవద్దు మిష్టర్ వాత్సవ. మీరెందుకు వచ్చారో నేనూ అందుకే వచ్చాను. బట్ యూ ఆర్ సో లేట్. ఇక్కడ చిన్న పురుగు కూడా లేదు. అంతా హుష్ కాకి అయ్యారు" అంది.

స్కిన్ టైట్ జీన్స్ పాంటు లోన టీషర్ట్ పైన ఫుల్ హేండ్ షర్టుతో ఆమె వంపుసొంపులు మతిపోగొట్టేలా వున్నాయి. ఆమె తమ ఆఫీసుకు వచ్చినరోజు గెటప్ కి, ఇప్పటి గెటప్ కి సంబంధం లేదు.

"మీరు వచ్చి ఎంతసేపయింది ?" అడిగాడు.

"జస్ట్ అయిదు నిముషాల క్రితం బయట ఆటో దిగి లోనకొచ్చాను. బడేభాయ్ గాని, వాడి మనుషులగాని కన్పిస్తారేమోనని మొత్తం తిరిగి చూశాను. ప్చ్. వెకేట్ చేసి వెళ్ళిపోయారు" అంటూ భుజాలెగురవేసింది.

"డామిట్. వాళ్ళు వెకేట్ చేయలేదు. ముందు మనం బయటకు పోవాలి. హరియప్" అంటూ ఆమె చేయి పట్టుకుని బయటకు పరుగు తీశాడు వాత్సవ.

"ఇక్కడంత భయపడాల్సింది ఏం లేదే."

"బాంబులు పేలితేగాని నువ్వు నమ్మవా ? ఫాలోమి" అరిచాడు వాత్సవ.

"షిట్.... ఎక్కడున్నాయి బాంబులు ?" అరుస్తూనే చేయి విడిపించుకోబోయింది.

ఇద్దరూ బిల్డింగ్ లెఫ్ట్ దిశగా రెండు వందల అడుగుల దూరంపైనపరుగెత్తాక చెట్టు వెనక్కి చెరుతూ,

"గెట్ డౌన్....గెట్ డౌన్" అంటూ బోర్లా పరుండిపోయాడు వాత్సవ.

కాని ఆమె అతనిలా నేలమీద పడలేదు, నిటారుగా అక్కడే నిలబడి ఆ బిల్డింగ్ ని, వాత్సవని మార్చి మార్చి చూసి పగలబడి నవ్వింది.

"మిస్టర్ వత్సవా! మీరింత పిరికివాళ్ళని అనుకోలేదు. తాడును చూసి పాము అనుకుని భయపడ్డం అంటే ఇదే. నా తమ్ముడ్ని వెదికి పట్టుకోవడంలో మీకు సాయంగా వుందామని నేను వచ్చాను. మీ ధైర్యసాహసాలు ఏపాటివో ప్రత్యక్షంగా చూస్తున్నాను. అనవసరంగా మీరు భయపడి నన్ను భయపెట్టకండి. కావాలంటే చూడండి. మరోసారి ఆ బిల్డింగ్ లోకి వెళ్ళివస్తాను" అంది.

ఆమె మాటలు వినగానే వంటికి పచ్చికారం పూసుకున్నట్టు భగ్గుమంది వాత్సవకి. అయినా పెదవి విప్పలేదు. చిరునవ్వు నవ్వి వూరుకున్నాడు.

"ఆ నవ్వుకి అర్థం ఏమిటి ? వెళ్ళలేననా ? చూడు వెళ్ళివస్తా" అంటూ చకచకా కట్టడంవైపు అడుగులు వేసింది.

నాలుగు అడుగులు వేసింది. అయిదో అడుగు వేసేలోపలే ఒక్కసారిగా భూమి కంపించినట్టయింది. గుభిల్లున దారుణ విస్ఫోటకం. నూర్ బంగ్లా కళ్ళ ముందే తనాతునకలై ఎగురుతూంటే అదిరిపడింది. ఎగిరి వెనక్కి దూకి వాత్సవ పక్కన బోర్లా పడిపోయింది.

రెండు నిముషాలపాటు ఆ ప్రాంతం ప్రేలుడు శబ్దాలతో కంపించిపోయింది. పెద్ద పెద్ద సిమ్మెంట్ దిమ్మలు, ఇటుకలు గింగిరాలు తిరుగుతూ వచ్చి చెట్టును గుద్దుకొని కిందపడ్డాయి. గాల్లోకి లేచిన రాళ్ళురప్పలు ఆవరణ అంతటా వర్షం కురిసినట్టు కురిశాయి. చిన్నగా తలెత్తి చూసిన భానుమతికి నూర్

బంగ్లా స్థానంలో రాళ్ళకుప్ప కన్పించింది. ఆ శిథిలాలమీద పెద్ద పెద్ద మంటలు, నల్లటి పొగలు సుడులు తిరుగుతూ ఇంకా గాల్లోకి ఎగసిపోతున్నా యి.

తను పొరబాటున తిరిగి లోనకు అడుగుపెట్టి వుంటే ఏమై వుండేదో ఆలోచిస్తుంటే భానుమతికి వెన్ను జలదరించింది. అరచేతులు చెమటలు పట్టేశాయి.

అప్పుడే లేచి కూర్చుంటున్న వాత్సవ వంక పరమ ఆశ్చర్యంగా చూసింది.

"అక్కడ బాంబులు పెట్టారని ఎలా తెలిసింది నీకు ?" తనూ లేచి కూర్చుంటూ అడిగింది.

"మార్షల్ ఆర్ట్స్ తెలిసి వుంటే చాలదు మేడం! అనుభవం కావాలి. ప్రమాదాలతో ఆడుకోవటం మా ప్రొఫెషన్. ప్రమాదాలను ముందే పసిగట్టగల నేర్పు మా అనుభవం నేర్పిన విద్య.... అందుకే మా పనుల్లో ఎవరినీ వేలు పెట్టవద్దని హెచ్చరించేది. ఇప్పుడయినా మించిపోయిందిలేదు వెంటనే వెనక్కి వెళ్ళిపో. కాస్త ఆలస్యం చేసినా మరో ప్రమాదంలో నువ్వు కూడా చిక్కుకుంటావ్" అన్నా డు సిగరెట్ ముట్టించుకుంటూ వాత్సవ.

"మరో ప్రమాదమా.... ? ఎక్కడ ? బడేభాయ్ బంగ్లా ఖాళీచేసి వెళ్ళి పోయాడుగా" అంది అమాయకంగా భానుమతి.

"వెళ్ళలేదు. పొరపాటున నేను బతికి బయటకొస్తే ఖతం చేయటానికి ఇక్కడే ఎక్కడో తన మనుషులతో పొంచి వున్నా డు. తన అడ్డాని పేల్చిపారేసి కోట్లు నష్టం కలిగించాను. నా మీద ప్రతీకారం తీర్చుకోకుండా వుంటాడా ? అదృష్టవశాత్తు వాళ్ళు టైం బాంబ్స్ సెట్ చేసిన టైం కన్నా ముందుగానే మనం లోనకెళ్ళి బయటికొచ్చాం . లేదంటే ఫినిష్....కమాన్! వాళ్ళు వస్తున్నట్టున్నా రు. నీ చేతినిండా పని. ఎంత ఫాస్ట్ గా వాళ్ళని పడగొడతావో చూస్తాను. పోలీసులు రాకముందే మనం వెళ్ళిపోవాలి. జాగ్రత్త."

"అదిసరి.... వాళ్ళెవరూ రాకుండానే వస్తున్నా రంటూన్నావేమిటి నాన్సెన్స్! ఎవరూ రారు. పదపోదాం" అంది లేచి నిలబడుతూ.

"సరిగా చూడు.....వాళ్ళు వచ్చేశారు" అంటూ లేచి నిలబడ్డాడు వాత్సవ.

చుట్టూ తమని కమ్ముకుంటూ వస్తున్న బడేభాయ్ మనుషుల అడుగులచప్పుడు వాత్సవ పాము చెవులు అరనిముషం ముందే పసిగట్టాయి. చెట్టు, పుట్టల్ని కవర్ చేసుకుంటూ వస్తున్నా రు వాళ్ళు. ఆ విషయం తెలీని భానుమతి మరోసారి దెబ్బతింది.

వాత్సవ మాటలకు ఆశ్చర్యపోతూ చుట్టూ చూసిన భానుమతి అప్పుడర్థమైంది పరిస్థితి. ఒక్కొరొక్కరుగా పొదల చెట్ల మాటు నుండి బయటకొస్తున్నారు వాళ్ళు. వాళ్ళ చేతుల్లో పొడవు కత్తులు, ఇనపరాడ్ లు మొదలయిన మరణాయుధాలున్నాయి.

"హలో మేడం! ఇప్పుడేమంటారు ? ఫైటింగ్‌కి రెడీయా ?" అంటూ కళ్ళెగరేస్తూ అడిగాడు వాత్సవ.

"నేను రెడీ" అంది ఉత్సాహంగా భానుమతి.

"మీరు ఫైటింగులు చేసినా ఏమీ లాభంలేదు. మీ ఇద్దర్నీ కూడా ఖతంచేసి నా పగ చల్లార్చుకుంటాను" అంటూ తన గూండాల్ని దాటి ముందుకొచ్చాడొక వ్యక్తి.

వాడి చేతిలో నల్లగా నిగనిగా మెరుస్తోంది రివాల్వర్. తను విన్న వర్ణన వాడికి ఖచ్చితంగా సరిపోవడంతో బడేభాయి వాడేనని గుర్తించాడు వాత్సవ.

"పారిపోయి వచ్చి తలదాచుకున్న వాడివి. నామీద ప్రతీకారం ఏం తీర్చుకుంటావ్ బడేభాయ్ ? నీ అతి తెలివి నిన్ను నాశనం చేసింది. వీళ్ళందర్నీ పంపించేసి నువ్వు నాతో వస్తే బాగుపడతావు. మనం సెటిల్ చేసుకోవలసిన విషయం చాలా వుంది...." అంటూ కూల్ గా హెచ్చరించాడు వత్సవ.

"నా గురించి నీకు తెలీదు. ఇంత జరిగాక నిన్ను ప్రాణాలతో ఎలా వదులుతాననుకున్నావ్ ? అయిపోయింది నీ చరిత్ర" అంటూ రివాల్వర్ ని వాత్సవ మీదకు ప్రయోగించాడు వాత్సవ.

ఉన్న చోటు నుంచి అంగుళం కూడా కదలకుండా వెనక్కి వాలాడు. అతడి తలకి మూడంగుళాల దూరంలోంచి, గాల్లోకి దూసుకెళ్ళి చెట్టులో దిగబడింది బుల్లెట్. బడేభాయ్ మరోసారి రివాల్వర్ ప్రయోగించే లోపలే వాత్సవ చేతిలో రివాల్వర్ గర్జించింది. గాలిని చీల్చుకుంటూ వెళ్ళిన బుల్లెట్ బడేభాయ్ రివాల్వర్ పట్టిన చేతి భుజాన్ని అంగుళం లోతు గాయం చేస్తూ అవతలకు దూసుకుపోయింది.

ఎర్రగా కాల్చిన ఐరన్ రాడ్ తో భుజంమీద వాతపెట్టినంత బాధతో కెవ్వున అరిచి రివాల్వర్ వదిలేశాడు వాడు. కన్నుమూసి తెరిచేలోపల సుడిగాలి మాదిరి దూసుకెళ్ళి కిందపడిన రివాల్వర్ ని సొంతం చేసుకున్నాడు వాత్సవ.

అది చూసి కంగారుపడుతూ నెత్తురు ఓడుతున్న భుజాన్ని చేత్తో పట్టుకుని వెనక్కి పరుగెత్తాడు బడేభాయ్.

అలా పరుగెడుతూనే గొంతు చించుకుని అరిచాడు.

"వేసేయండి బే..... వాళ్ళిద్దర్నీ నరికిపారేయండి. వాళ్ళు ప్రాణాలతో వెళ్ళకూడదు. నరికి ముక్కలు చేయండి" అనరిచాడు.

వాడు అరుస్తుండగానే గూండాలు ఆయుధాలు ఝళిపిస్తూ ముందుకు దూకేశారు.

రివాల్వర్లు రెండూ జేబులో పడేసి పెద్దపులి మాదిరి వాళ్ళ మీదకు దూకాడు వాత్సవ. అతడు హెచ్చరించక ముందే గుప్పిళ్ళు బిగించి ముందుకురికింది భానుమతి.

దారుణమైన ఫైటింగ్ ఆరంభమైంది.

భానుమతి అబద్ధం చెప్పలేదని ఆమె ఫైటింగ్ తీరు చూడగానే అర్థమైంది వాత్సవకి. వాళ్ళ చేతుల్లోని ఆయుధాలు ఆమెను ఏమీ చేయలేకపోతున్నాయి. మెరుపులా కదులుతూ ఆయుధాలకు అందకుండా దెబ్బకు ఒకడ్ని పడగొడుతోంది. మార్షల్ ఆర్ట్స్ లో ఆమె ప్రతిభ ఏమిటో గమనించగానే ఇక ఆమె గురించి మర్చిపోయాడు వాత్సవ. బ్రహ్మరాక్షసుడి మాదిరి మిగిలిన వాళ్ళ మీద విరుచుకుపడ్డాడు.

వీధుల్లో జులుం చెలాయించే కరుడుగట్టిన గూండాలు, క్రిమినల్స్ వాళ్ళు. పద్ధతిగా ఫైట్ చేయటం ఎలా వుంటుందో వాళ్ళకి తెలీదు. వాత్సవ ధాటికి ఒక్కొక్కడు చావు దెబ్బ తింటున్నాడు.

బ్లాస్టింగ్ సౌండ్స్ కి చుట్టుపక్కల చాలాదూరం జనం భయభ్రాంతులయి వుంటారు. ఏ క్షణంలోనయినా పోలీసులు వచ్చిపడవచ్చు. ఈలోపలే ఫైటింగ్ ఎండ్ చేయాలనే ఉద్దేశంతో వాత్సవ వేగంగా కదులుతున్నాడు.

భుజాన గాయంతో రొప్పుతున్న బడేభాయ్ ఫైటింగ్ కి దూరంగా వుండి తనవాళ్ళ మీద అరుస్తున్నాడు. రోషం వచ్చేలా తడుతున్నాడు. పారిపోడానికి వాడు రెడీగా వున్నాడని వాత్సవకు తెలుసు. అందుకే వాడిమీద ఓ కన్ను వేసి వుంచాడు.

అయిదే అదు నిముషాలు..

ఫైటింగ్ ఎండయింది.

కరెంట్ షాక్ తిన్న కాకుల్లా తన మనుషులంతా నేలమీద పడిపోవడం చూడగానే పిక్కబలం చూపించటానికి వెనుతిరిగాడు బడేభాయ్. వాడికా ఛాన్స్ యివ్వలేదు వాత్సవ.

సుడిగాలిలా దూసుకెళ్ళి వాడ్ని వెనక్కిలాగి, ఈడ్చి గుద్దాడు మెడ నరం మీద. ఫినిష్!

దెబ్బ వెంబడే స్పృహ తప్పి తల వాల్చేశాడు వాడు. వాడ్ని అలాగే ఎత్తి భుజాన వేసుకున్నాడు.

"మనం ఎంత త్వరగా బయటకుపోతే అంత మంచిది. హరియప్" అంటూ భానుమతిని హెచ్చరించి అంత దూరంలోని వేన్ వద్దకు పరుగెత్తాడు.

వేన్ తాళం తీసి బడేభాయ్ ని వెనకసీట్లో పడేశాడు. తను డ్రైవింగ్ సీట్లో కూర్చుని అంతవరకూ లోపలున్న ఛోటాభాయ్ ని ఒక్క తన్ను తన్నాడు. కాలు వెంబడే ఎగిరి కిందపడి కెవ్వుమన్నాడు వాడు.

వాడు ఏమయ్యాడో కూడా చూడకుండా డోర్ మూసాడు వాత్సవ.

అతడి పక్కనే ఎక్కి కూర్చుని డోర్ మూసింది భానుమతి. వేన్ స్టర్ట్ చేసి రివర్స్ తీశాడు. ఆ వేన్ గేటుదాటి వెళ్ళిపోయిన ఐదో నిముషంలో శర వేగంతో లోనకు దూసుకొచ్చింది పోలీస్ జీప్.

జీప్ దిగిన ఎ.ఎస్.పి. చంద్రశేఖర్ అక్కడ పరిస్థితి చూసి అవాక్కయి పోయాడు. పారిపోబోతున్న గూండాల్ని పోలీసులు అడ్డుకుని పట్టుకున్నారు.

"అందుకే.... ఇలాంటి ఘోరాలు జరుక్కూడదనే ఆ పెద్దమనిషిని జాగ్రత్తగా రైలు ఎక్కించి రమ్మని చిలక్కి చెప్పినట్టు చెప్పి పంపించాను. అయినా అతన్ని వదిలేశారు. ఇప్పుడు చూడు. సిటీలో ఇంకెన్ని ఘోరాలు చూడాలో..." అనరిచాడు పక్కనున్న ఎస్.ఐ. మదన్ మీద.

"మనం చేయలేనిపని ఆ పెద్దమనిషి చేసాడు. అందుకు సంతోషించండి" అంటూ చురక అంటించాలని నోటి చివరివరకూ వచ్చిన మాటని గొంతులోనే మింగేశాడు ఎస్.ఐ . మదన్.

## 17

భైరన్న గూడెంనుంచి వేకువవేళ బయలుదేరిన శ్యామ్ సుందర్ అడవిదారిలో నడుస్తూనే వున్నాడు.

సూకీని కలుసుకోగలడా లేదాన్నది సందేహమే....! ఆమె గురించి అడవిలో వెదికి ప్రయోజనం లేదని తెలుసు. తాము విడిపోయింది కొండదేవత గుహ దగ్గర కాబట్టి తప్పకుండా అక్కడికే వస్తామన్న నమ్మకంతో ఆమె సరాసరి గువ్వలకొండ దాటి గుహవైపు ప్రయాణం చేసి వుండాలి. అందుకే ముందు గుహ వద్దకి చేరుకొని తర్వాత ఆలోచించే ఉద్దేశంతో వేగంగా నడక సాగించాడు శ్యామ్ సుందర్.

మరోపక్క భగవాన్ దాదా కూడా ఆమెకోసం పట్టుదలగా అడవిలో గాలిస్తుంటాడు గాబట్టి జాగ్రత్తగా ముందుకు సాగాలి తప్పదు.

పది గంటల వరకు నడుస్తూనే వున్నాడు శ్యామ్ సుందర్. పదకొండు గంటలయ్యేసరికి అర్థమైంది తను దారి తప్పాడని. ఆలోచనల్లో మునిగి తేలుతూ నడక సాగించటంలో దారి మారిపోవటం గుర్తించలేదు. ఒక స్టేజిలో అయితే తను ఎటు వచ్చాడో, ఎక్కడున్నాడు, ఎటు వెళ్ళాలి ఏదీ గుర్తులేకుండా పోయింది.

సుమారు సాయంకాలం మూడుగంటల ప్రాంతం వరకు అడవిలో పడి తిరిగాడు. ఎక్కడా సూకీ జాడలేదు. కానీ సమీపంలో ఎక్కడో మనుషుల అలికిడి విన్పించి అలర్టయ్యాడు. జాగ్రత్తగా చెట్ల చాటు నుంచి కదులుతూ మరికాస్త ముందుకెళ్ళి చూసాడు. అక్కడ ఖాళీస్థలంలో నిలబడున్న ఆరు వేన్ లను చూడగానే తను ఎక్కడికొచ్చాడో అర్థమైంది శ్యామ్ సుందర్ కి.

ఆ వేన్ లకు అవతల భగవాన్ దాదా మనుషులు వేటాడిన జంతువులు, పక్షులని నిప్పులమీద కాల్చి ఆహారం రెడీ చేసుకోనే పనుల్లో చాలా బిజీగా వున్నారు.

వాళ్ళకి దగ్గరలోనే ఒక బండమీద సిగరెట్ దమ్ము కొడుతూ కూర్చునున్నారు భగవాన్ దాదా, మియాచీలు. ఇద్దరూ ఏదో విషయాన్ని తీవ్రంగా చర్చిస్తున్నారు. బహుశా సూకీ గురించి కావచ్చు.

ఆ అమ్మాయి వీళ్ళకి పట్టుబడిందా ?

రానేవచ్చింది డౌటు శ్యామ్ సుందర్‌కి.

మరికాస్త ముందుకు జరిగి క్లోజ్ గా గమనించాడు. నిస్సందేహంగా ఆమెను పట్టుకోవడం వీళ్ళకి సాధ్యం కాలేదని అర్థమైంది.

అసలు ఈ గోలంతటికీ మూలకారణం తెలిసినవాళ్ళు ఇద్దరే ఇద్దరు. ఒకరు చైనా అమ్మయి సూకీ. రెండో వాడు చైనా నుంచి వచ్చిన మియాచీ. ప్రస్తుతం ఆ మియాచీని పట్టుకుని నాలుగు పీకితే మొత్తం కథ తెలిసిపోతుంది గాదా! వాడ్ని కార్నర్ చేయటానికి అవకాశం వుందా ?

తీవ్రంగా ఆలోచిస్తున్నాడు శ్యామ్ సుందర్ . వాళ్ళు తిరిగి ప్రయాణమయ్యే లోపలే మియాచీని తప్పించాలి. ఎలా ?

వేటకోసం మాటువేసిన పెద్దపులిలా అవకాశం కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు. అక్కడ చెట్ల కింద గూండాలంతా తిని తాగటంలో బిజీగా వున్నారు.

"మీరంతా త్వరగా కానివ్వాలి. ఈరోజు చీకటి పడేలోపల ఆ పిల్లని ఎలాగయినా పట్టుకుతీరాలి. జల్దీ!" అనరుస్తూ బండదిగి తన మనుషుల పై పుకదిలాడు భగవాన్ దాదా.

మరో మూడు నిముషాల తర్వాత దొరికింది శ్యామ్ సుందర్ కి చక్కని అవకాశం. తింటున్న చికెన్ లెగ్ ఫినిష్ చేసి తనూ బండ దిగాడు మియాచీ. కొద్దిగా విప్పసారా పుచ్చుకుని సిగరెట్ ముట్టించుకున్నాడు. చిటికెన వేలు పని కోసం బండను చుట్టి అవతలున్న పొదల మధ్యకు వెళ్ళాడు.

వచ్చిన అవకాశాన్ని వదులుకొనే ఉద్దేశం లేదు శ్యామ్ సుందర్‌కి. చప్పుడు గాకుండా పిల్లిలా అటు కదిలాడు. మూడు అడుగుల దూరంలో మియాచీ వెనక్కి చేరుకోగలిగాడు. అంతవరకు బాగానే వుంది. ఒక్క రెండు సెకన్లు ఆగితే మియాచీని పడగొట్టేసేవాడు. కానీ ఆ చివరి క్షణంలో శ్యామ్ సుందర్ అంచనా తప్పిపోయింది.

అతడి పాదం కింద ఎండుపుల్ల చిటుక్కు మనగానే అంతవరకూ తీరిగ్గా పొదలో వున్న కుందేలు ఒకటి చటుక్కున ఎగిరి మియాచీ కాళ్ళ మీదకు దూకింది. శ్యామ్ సుందర్ పొజిషన్ తీసుకునేలోపలే మియాచీ జిప్ పైకిలాక్కుని కంగారుగా తిరిగి చూసాడు.

ఎదురుగా శ్యామ్ సుందర్‌ని చూడగానే అతడి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. నిజానికి శ్యామ్ ఎవడో వాడికి తెలీదు. అయినా ప్రమాదం శంకించి, “రండ్రోయ్! రండి! వీడెవడో నామీద కొచ్చేస్తున్నాడు” అంటూ గొంతు చించుకుని అరిచాడు.

వాడి అరుపులు పూర్తిగా గొంతుదాటి బయటికి వచ్చేలోగానే కుడి చేయి పిడికిలి బిగించి బలంగా వాడి ముఖంమీద గుద్దాడు శ్యామ్ సుందర్.

అందీ అందని పొజిషన్‌లో ఇచ్చిన పంచ్. తెలివి తప్పించటం సాధ్యం కాలేదు గానీ ముఖం మాత్రం పచ్చడయినంత పెయిన్ తో కెవ్వుమంటూ గొంతు చించుకుని అరిచాడు.

రెండు చేతులతో ముఖం కప్పుకుని ఎక్కడివాడు అక్కడే కూలబడిపోయాడు.

వాడు ఏమయ్యాడో చూళ్ళేదు శ్యామ్ సుందర్. ఎందుకంటే మియాచీ అరుపు వినగానే ఒక్కసారిగా చెలరేగింది అవతల కలకలం. దాదా మనుషులు పరుగులెత్తుకు వస్తున్నారు. వాళ్ళ కంటపడ్డం శ్యామ్ సుందర్‌కి ఇష్టం లేదు.

మియాచీ మోకాళ్ళమీద కూలబడ్డ మరుక్షణమే ఎగిరి వాడి పైనుంచి అవతలకి దూకేశాడు. రేసుగుర్రం మాదిరి వంద అడుగుల దూరం పరుగెత్తి అక్కడున్న ఒక గుబురు విప్ప చెట్టు కొమ్మల్లోకి చకచకా ఎక్కేసి కూర్చున్నాడు.

ఈ లోపల భగవాన్ దాదాతో సహా గూండాలంతా మియాచీ దగ్గరికి పరుగులెత్తుకు వచ్చేశారు.

మియాచీ ముక్కు చితికి బొటబొటా నెత్తురు వస్తోంది. "ఏం జరిగింది ?" వస్తునే వాడ్ని రఫ్ గా అడిగాడు దాదా.

"ఇంకా ఏం కావాలి ? వాడెవడో నా ముక్కు, ముఖం పగలగొట్టి పారిపోయాడు. ఇక్కడో, అక్కడో వుంటాడు వెతికించు. నీ మనుషుల్ని పరుగులెత్తించు. వాడు దూరంగా పారిపోకముందే వాడ్ని లాక్కు రమ్మను" నెత్తురు రాకుండా జేబురుమాలుతో ముక్కును అదిమి పెట్టుకుంటూ తోక తెగిన నక్కలా అరిచాడు మియాచీ.

వాడి మాటలు వినగానే దాదా ఆర్డరు వేసేవరకు ఆగలేదు గూండాలు. ఆయుధాలు ఝళిపిస్తూ తలొక పక్కగా పరుగులు తీశారు.

దాదా ఆలోచనలో పడ్డాడు.

మియాచీ మీద అటాక్ చేసినవాడు ఎవడై వుంటాడు ? అంత బలమైన మనిషిని చిటికెలో దెబ్బతీసి పోయాడంటే వాడు ఏ గిరిజనుడో, మరొకడో అనుకోడానికి లేదు. ఖచ్చితంగా సూకీగానీ, ఆమె వెంటవున్న యువకుడి పనిగాని అయి వుండాలి ఇది.

"మిష్టర్ మియాచీ! వాడ్ని సరిగ్గా చూశావా ? నిన్ను కొట్టింది సూకీ కాదు గదా ?" అనుమానంగా అడిగాడు.

"కాదు. సూకీ కాదు. దానివెంట వున్న ఆ కుర్రాడేమోనని అనుమానంగా వుంది. వాడు దూరం పారిపోయి వుండడు. చూద్దాం పద!" అంటూ ముక్కు అదుముకొని బయల్దేరాడు.

దాదా మనుషులు కొందరు ఎగువ వరకు పరుగులు తీశారు. కొందరు చుట్టుపక్కల చెట్టు, పుట్టలు గాలిస్తున్నారు. మియాచీ, భగవాన్ దాదాలు కొంత దూరం ముందుకొచ్చి నిలబడి చూస్తున్నారు.

సరిగ్గా వాళ్ళు నిలబడినచోటుకు ఇరవై అడుగుల దూరంలోనే వుంది శ్యామ్ సుందర్ దాక్కున్న విప్పచెట్టు. విరగబూసిన విప్పపూల తీపి సువాసనలతో ఘుమఘుమలాడిపోతోంది ఆ ప్రాంతమంతా.

చెట్టుపైన గుబురు కొమ్మల్లో వున్న శ్యామ్ సుందర్ చెట్టు సమీపంలో నిలబడిన విలన్లు ఇద్దరినీ గమనిస్తూనే వున్నాడు. అయితే అతడికి చెట్టుపైన ఒక సమస్య ఎదురయింది. అది చెట్టు ఎక్కాక గానీ అతనికి తెలీలేదు. పైన కూర్చోలేడు, కిందకు దిగలేడు. ఆ పరిస్థితిలో వున్నాడు అతను. ఎందుకంటే ?

శ్యామ్ సుందర్ కూర్చున్న కొమ్మకి ఎడంగా వున్న మరో కొమ్మ మీద తీరిగ్గా కూర్చునుందో కుర్ర ఎలుగ్గొడ్డు. విప్ప పూల తీపిరుచులు చవి చూస్తూ అంతకుముందు ఎప్పట్నుంచో అది ఆ కొమ్మల్లో వుంది. తేనె రంగులో మగ్గిన పూలు కోసుకుతింటూ ఆనందిస్తోంది.

ఉన్నట్టుండి తనకు పోటీగా శ్యామ్ సుందర్ చెట్టెక్కడం చూసి దానికి వళ్ళు మండిపోయి ఫైటింగ్ కు రెడీ అవుతోంది. దాని మూలంగా తన ఉనికి బయటపడిందంటే తన పని అయిపోయినట్టే. అందుకే ఆ కుర్ర ఎలుగ్గొడ్డు కళ్ళెర్రజేసి బెదిరిస్తున్నా , కంగారుపడకుండా ఓపిగ్గా వెయిట్ చేస్తున్నాడు.

అది కొమ్మలమీద నెమ్మది నెమ్మదిగా జరుగుతూ శ్యామ్ సుందర్ వైపు వస్తోంది. కొమ్మలు కదులుతున్నాయి.

"నాకెందుకో డౌటుగా వుంది భగవాన్! వాడు ఖచ్చితంగా ఇక్కడే ఎక్కడో చెట్టుమీద వున్నాడు" అంటున్నాడు దాదాతో మియాంచీ.

ఆ మాటలు వినగానే ఎలుగ్గొడ్డును ఎత్తి ఆ పైనావాడి బోడిగుండు మీదకు విసిరేస్తే ఎలా వుంటుందని ఒక ఆలోచన శ్యామ్‌ని కుదిపి వదిలింది.

మియాంచీ మాటలు భగవాన్ దాదాని ఆలోచింపచేశాయి.

"మియాంచీ! అప్పుడప్పుడూ మీ బుర్ర మరుగ్గా పనిచేస్తుందోయ్. నాకూ అదే డౌటు. చెట్ల మీదకు ఓసారి గమనించు" అంటూ రివాల్వర్ తీశాడు.

తన పని అయిపోయిందనే అనుకున్నాడు శ్యామ్.

వాళ్ళిద్దరూ తనున్న చెట్టుమీదకు అనుమానంగా చూస్తున్నారు. ఎలుగ్గొడ్డు మూలంగా ఊగుతున్న కొమ్మలు వాళ్ళ చూపుల్ని అటు డైవర్ట్ చేశాయి.

వాళ్ళిద్దరూ మరో నాలుగు అడుగులు చెట్టుకిందకు వచ్చారంటే తనను పసిగట్టడం ఖాయం. వాళ్ళని డైవర్ట్ చేయకపోతే ప్రమాదమని అర్థమైపోయింది శ్యామ్ సుందర్‌కి. ఇక ఆలస్యం చేయలేదు. డెస్పరేట్ గా కదిలాడు.

తనున్న కొమ్మ నుంచి ఎలుగ్గొడ్డు వస్తున్న కొమ్మమీదకు ఎగిరి తన్నాడు దాన్ని. అతను అంత దారుణంగా అటాక్ చేస్తాడని పాపం ఆ అమాయక ప్రాణి వూహించలేదు. కాలు వెంబడే కొమ్మల్ని దాటి

ఆకుల్ని చీల్చుకొని ఎగిరి గింగిరాలు తిరుగుతూ పోయి సరిగ్గా మియాచీ బోడిగుండు మీద పడి అవతలకు దూకింది.

"వచ్చాను బాబోయ్" అనరుస్తూ వెల్లికిలాపడిపోయాడు వాడు.

ఉన్న పళంగా వచ్చిపడిన ఎలుగొడ్డును చూడగానే అది తనమీద పడి ఎక్కడ పీకుతుందోనన్న భయంతో ఎగిరి అవతలకు దూకి అక్కడికి దూరంగా పరుగుతీశాడు భగవాన్ దాదా.

కిందపడి లేచి చూసిన మియాచీకి పొదల వెంట పారిపోతూ కన్పించింది ఎలుగ్గొడ్డు.

"ఆ చెట్టుమీద ఇంకా ఎన్ని ఎలుగ్గొడ్లు వున్నాయో తెలీదు. అవన్నీ వచ్చి మీదపడి కండలు పీకేవరకూ లేచి రావా.... ఫూల్, ఇడియట్, వచ్చెయ్, త్వరగా ఇటు వచ్చెయ్" అనరిచాడు దూరంగా పోయి నిలబడిన దాదా.

దాంతో పడుతూ లేస్తూ అటు దౌడు తీశాడు మియాచీ. వస్తున్న నవ్వును బలవంతంగా ఆపుకొంటూ అక్కడే కొమ్మల్లో ఒదిగి కూర్చున్నాడు శ్యామ్ సుందర్.

వెళ్ళిన వీరులంతా కొద్దిసేపట్లో నే రిక్త హస్తాలతో తిరిగి వచ్చారు. మియాచీని కొట్టి పారిపోయినవాడ్ని పట్టుకోలేకపోయినందుకు తన మనుషుల్ని బండబూతులు తిట్టాడు భగవాన్ దాదా.

"నీ మనుషులు చేతికానివాళ్ళు, చవటలు, ఆ విషయం ఒప్పుకో!" అంటూ అక్కసునంతా వెళ్ళగక్కాడు మియాచీ.

"ఆ మాటే ఒద్దు. మావాళ్ళ సంగతి నీకు తెలీదు. నేను నిప్పుల్లో దూకమంటే చాలు, ఎందుకు, ఏమిటని అడక్కుండా దూకేస్తారు. అంతటి నమ్మకమైన వాళ్ళు. మనం ఇలా వెదుకులాడ్డం కన్నా కొండదేవత గుహ దగ్గర మాటు వేస్తే మంచిది. విడిపోయినవాళ్ళు ముగ్గురూ తిరిగి కలుసుకోడానికి అక్కడికే వస్తారని నా డౌటు" తన అభిప్రాయం చెప్పాడు దాదా.

"ఇదే సంగతి నీకు ఉదయమే చెప్పాను. అప్పుడు నా మాటల్ని కొట్టి పారేశావ్. ముందా పనిచెయ్యి" అన్నాడు విసుగ్గా మియాచీ.

వాళ్ళ మాటలు స్పష్టంగా విన్నాడు చెట్టుమీది శ్యామ్ సుందర్. వాళ్ళ మాటల్లో నిజం లేకపోలేదనిపించింది. సూకీ కొండగుహ దగ్గరకి చేరుకున్నా ఆశ్చర్యంలేదు. టాక్సీ డ్రైవరు జలీల్ ఖాన్

కూడా నిక్షేపంగా వుంటే తప్పకుండా అక్కడికే వస్తాడు. తనూ తొందరగా అక్కడికి చేరుకోవటం చాలా అవసరం.

ఇక ఆలస్యం చేయలేదు శ్యామ్.

వాళ్ళలో ఆఖరి గూండా కూడా ముందుకెళ్ళిపోగానే చకచకా చెట్టు దిగిపోయాడు. పొదలను చాటు చేసుకుంటూ తిరిగి దాదా వర్గం మకాం చేసిన చోటుకు చేరుకున్నాడు.

వాళ్ళంతా ప్రయాణ సన్నాహంలో వున్నారు. తమ బిలాంగింగ్స్‌ని వేన్ లలో పడేస్తూ ఒకరొకరే వేన్‌లు ఎక్కేస్తున్నారు. మొదటి వేన్ లో మియాచీ తోబాటు భగవాన్ దాదా ఎక్కి కుర్చున్నాడు. ఆ వేన్ కదలగానే ఒకటొకటిగా మిగిలిన వేన్ లు బయల్దేరుతున్నాయి.

చివరి వేన్ బయలుదేరేవరకూ ఓపిగ్గా వెయిట్ చేశాడు శ్యామ్ సుందర్. అది మూవ్ అయిన మరుక్షణం సుడిగాలి మాదిరి పరుగుతీశాడు. అది స్పీడ్ అందుకునేలోపే ఆ వేన్ వెనక్కు చేరి నిచ్చెనమెట్టు పట్టుకొని ఎక్కేశాడు.

## 18

ఆ రోజు చీకట్లు ముసురుకోడానికి కాస్త ముందుగానే తను అడవిలో దారితప్పినట్టు గుర్తించింది సూకీ.

తనకు బొత్తిగా పరిచయంలేని అడవులు ఇవి.

ఎక్కడికి వెళ్ళాలి అనే విషయానికి వస్తే ఇప్పుడు తను ముందు రెండు సమస్యలున్నాయి. ఒకటి భగవాన్ దాదా, మియాచీల కంటబడకుండా తను తప్పించుకోవటం. రెండోది శ్యామ్ సుందర్, జలీల్ ఖాన్, వాళ్ళిద్దరూ ఏమయ్యారో తెలుసుకోవటం. వాళ్ళ గురించి తెలియాలంటే తను తిరిగి ఆ కొండగుహ దగ్గరకే వెళ్ళాలి. ఖచ్చితంగా వాళ్ళిద్దరూ అక్కడికే వస్తారు కాబట్టి తను ఎంత తర్వాగా అక్కడికి చేరుకుంటే అంతమంచిది.

అలా అని ఆలోచించే ఆమె భైరన్న గూడెంనుంచి బయలుదేరింది. కాని దట్టమైన అడవిలో దారితప్పి ఎక్కడికో వెళ్ళిపోయింది. అడవిజంతువులు, విషకీటకాల నుంచి తనను రక్షించుకొంటూ ప్రయాణం సాగించింది. దొరికిన పళ్ళూ, కాయలు తిని ఆకలి తీర్చుకుంది. ఆ రాత్రికి సురక్షితమైన ప్రదేశం చూసుకుని తల దాచుకుంది.

మరునాడు ఉదయం తిరిగి ప్రయాణమయ్యేసరికి ఎనిమిది గంటలు. ఒక కొండ గుట్టపైకి చేరుకొని అడవిని పరిశీలించి తను వెళ్ళాల్సిన దిక్కును అంచనా వేసుకుంది. ఈసారి పొరబాటు జరక్కుండా జాగ్రత్త పడుతూ ముందుకు ప్రయాణం సాగించింది.

చాలాసేపటి తర్వాత ఒక పెద్ద బాటను చేరుకుంది. ఆ బాటను చూస్తే వాహనాలు ప్రయాణిస్తున్న సూచనలు కన్పిస్తున్నా యి. బహుశ ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ వాళ్ళు సంచరించే రూట్ కావచ్చనిపించింది.

ఆమె ఆలోచిస్తున్నంతలోనే ఎగువనుంచి ఏదో జీప్ వస్తున్న ఇంజన్ సౌండ్ విన్పించింది. అది దాదా మనుషులు తిరుగుతున్న వేన్ సౌండ్ కాదని గుర్తించింది. ఆమె అంచనాను అక్షరాలా నిజం చేస్తూ కొద్ది నిముషాల్లోనే అటుగా వచ్చింది ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ కి చెందిన జీప్.

అందులో ఒక రేంజరు, నలుగురు గార్డులు వున్నా రు. వాళ్ళందరి దగ్గర తుపాకులున్నా యి. తను త్వరగా కొండదేవత గుహకు చేరుకోవాలంటే వాళ్ళ హెల్ప్ తీసుకోవటం చాలా మంచిదనిపించింది. అందుకే చేయి వూపుతూ బాటకు అడ్డుగా నిలబడింది.

ఆమెను చూసి ఎవరో గిరిజన యువతి అనుకున్నా రు జీప్ లో వాళ్ళు. ఆమె అందం చూడగానే రేంజర్ కళ్ళు మెరిశాయి.

"వారెవా! పిల్ల పాలపిట్టలా వుందిరా. సమయానికి దొరికింది. ఛాన్స్ కొట్టేద్దాం. జీపు ఆపరా" అంటూ ఆర్డర్ చేశాడు.

దుమ్ము తెరలు రేపుతూ వచ్చిన జీప్ సూకీ ముందు సడెన్ బ్రేక్ తో ఆగింది. యూనిఫాంలో దుక్కలా వున్న రేంజరు కిందకు దిగి పళ్ళికిలించాడు.

వాడి వెకిలి నవ్వు చూడగానే పసిగట్టేసింది సూకీ వాడి మనసులో వున్న పాడు ఆలోచన ఏమిటో.

"ఏమిటో పిల్లా, ఏ గూడెం మనది ? ఎక్కడికి పోతున్నా వ్ ?" అంటూ అడిగాడు రేంజర్.

"మాది భైరన్న గూడెం దొరా! గువ్వలకొండ దాకా పోవాలి. మీ జీప్ లో తీసుకెళ్ళరూ ?" రిక్వెస్ట్ చేసింది సూకీ.

"అంటే నువ్వు దారితప్పిన పిట్టవన్న మాట. గువ్వలకొండ సగం దూరంలో వుందిగాని ఫరవాలేదు, నేన్నీకు సాయం జేస్తా నువ్వు నాకు సాయం చేస్తే. జస్ట్ ఇచ్చిపుచ్చుకునే సాయమన్న మాట. ఓ అరగంట నా ముచ్చట తీర్చు. కొండమల్లిలామెరిసిపోతున్నా మ్" అంటూ భుజంమీద చేయి వేసాడు.

"అబ్బో , రసికుడివే. అయితే రా మరి" అంటూ పొదల వెనక్కి దారి తీసింది.

అంత సులువుగా ఆమె ఒప్పుకుంటుందని రేంజరు అసలు వూహించలేదు. అడవిజాతి అమ్మాయిల గురించి తనకి బాగా తెలుసు. అవసరం అయితే రేప్ చేసే ఉద్దేశంలో వున్నాడు. కాని ఇంత సులువుగా పనయిపోతుందంటే చాలా ఖుషీ ఫీలవుతూ ఆమెను అనుసరించాడు. వాళ్ళిద్దర్నీ చూసి ముసిముసిగా నవ్వుకున్నారు గార్డులు.

పావుగంట తర్వాత జీప్ లో వాళ్ళకి కనబడేలా ఇవతలకి వచ్చింది సూకీ. ఒక గార్డుకి సైగచేసింది. తనకి కూడా ఛాన్స్ దొరికిన ఆనందంలో వాడు మెలికలు తిరిగిపోతూ జీప్ దిగి వచ్చేశాడు.

"మా రేంజర్ సాబ్ ఎక్కడ ?" చుట్టూ చూస్తూ అడిగాడు.

"ప్చ్. దున్నపోతులా వున్నాడు. ఏం లాభం ? దుక్కికి పనికిరాని ఎదవ. అందుకే నిన్ను పిలిచా. మీ సాబ్ ఆ పక్కన మైకంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. నువ్వు రా" అంటూ పక్కకు తీసుకెళ్ళింది.

అలా నలుగురు అయిపోయారు.

చివరిగా స్టీరింగ్ వెనక కూర్చున్న చివరి గార్డు వంతు వచ్చింది. వాడి మనసులో ఏదో డౌటు పీకుతూనే వుంది. వెళ్ళిన వాళ్ళలో ఏ ఒక్కడూ తిరిగి రాకపోవటం వాడి మనసులో సందేహాన్ని రేకెత్తించింది.

"ఎక్కడ ? మా వాళ్ళంతా ఎక్కడ ?" పొదల్లోకి వస్తూనే ఆత్రంగా అడిగాడు.

"వాళ్ళంతా విశ్రాంతి తీసుకుంటున్నారు. చూస్తావా.... ? రా మరి" అంటూ ఓ పొద వెనక్కి వాడ్ని తీసుకెళ్ళింది సూకీ.

అక్కడ రేంజర్ తో బాటు అంతా వరసగా స్పృహలేని స్థితిలో పడున్నారు నేలమీద.

"అర్థమైందా ? ఆడపిల్ల సాయం అడిగితే శీలం దోచుకోవాలని చూస్తార్రా కుక్కల్లారా! ఆడపిల్లంటే అంత లోకువరా మీకు ?" అంటూ పిడికిలి బిగించి ఫట్ న గుద్దింది వాడి చెవి పక్క నరం మీద . ఫినిష్!

నిలుచున్న వాడు నిలుచున్నట్టే తెలివితప్పి కట్టెలా విరుచుకుపడిపోయాడు వాడు. వాళ్ళంతా సాయంత్రం వరకూ స్పృహలోకి రాలేరని ఆమెకు తెలుసు. ఇక వాళ్ళ గురించి ఆలోచించలేదామె. వాళ్ళలో తన సైజుకుసరిపోయే గార్డును ఎంచుకుని , వాడి వంటి మీద ఖాకీ ఫాంటు షర్టు తీసేసుకుంది. తన గిరిజన యువతి గెటప్ నుంచి గార్డు దుస్తుల్లోకి మారిపోయి తలమీద హేట్ పెట్టుకుని కాళ్ళకు షూస్ వేసుకుంది. షర్టు టక్ చేసి బెల్టు బిగించింది. వెనక్కి వచ్చి జీప్ లో కూర్చుని స్టార్ట్ చేసింది.

చేతిలో జీప్ వుండటంతో ఇప్పుడు ఆమె ప్రయాణం సులువయింది. రెండు గంటల్లోనే గువ్వలకొండను చేరుకుని అటునుంచి లోయలోని కొండ గుహ దిశగా జీప్ ను దూకించింది.

ఇక గుహముందు పచ్చికబయలు ప్రాంతం సమీపిస్తుందనగా ఒక చోట సడన్ గా జీప్ ఆపింది. రివర్స్ తీసి కాస్త వెనక్కి పోనిచ్చి మరోసారి అటు పరిశీలనగా చూసింది.

ఆమె డౌటు క్లియరయింది.

అక్కడ చెట్టుకింద బండమీద ఎవరో పడుకుని వున్నారు. నట్టడవిలో బహిరంగంగా అంత కేర్ లెస్ గా పడి నిద్రపోతున్న మనిషి ఎవరు ? ఆలోచిస్తూనే ఇంకాస్త సమీపంలోకి పోనిచ్చి జీప్ దిగి వెళ్ళింది.

అక్కడ బండమీద పడున్న వ్యక్తి ని చూడగానే ఆమె కళ్ళు విశాలమయ్యాయి. అతను ఎవరో కాదు. తమను తీసుకొచ్చిన టాక్సీ డ్రైవర్ జలీల్ ఖాన్.

ఇతనికి ఏమైంది ? ఎందుకిలా పడున్నాడు ? అతన్ని పరిశీలించాక అర్థమైంది సూకీకి. పాముకాటు నుంచి అతన్ని ఎవరో రక్షించారు. ఇప్పుడే ఇంకా స్పృహలోకి రాడు. ఇతను బ్రతికి వున్నాడంటే ఖచ్చితంగా శ్యామ్ సుందర్ కూడా క్షేమంగానే వుండాలి. ఇతన్ని కాపాడి ఎటో వెళ్ళి వుండాలి. కానీ ఇలా వదిలిపోవడం మంచిదికాదని అతనికి తెలీదా ? ఏ జంతువు చూసినా ఇతన్ని బ్రతకనిస్తుందా ?

అయిదు నిముషాలు వెయిట్ చేసింది సూకీ. కాని ఎవరూ వస్తున్న జాడ కనబడలేదు. ఇక ఆలస్యం చేయకుండా జలీల్ ఖాన్ ని తన జీప్ లో వేసుకుని జీప్ ని ముందుకు దూకించింది.

ఆమె వెళ్ళిన పావుగంట తర్వాత వెనక్కి వచ్చాడు జలీల్ ఖాన్ ని కాపాడిన కాలేషావలీ. బండమీద వుండాల్సిన పెద్దమనిషి జాడలేదు. అతనికి స్పృహ వచ్చి నడచిపోయాడనుకోవడానికి లేదు. ఇప్పుడప్పుడే వాడు తెలివిలోకి వచ్చే ఛాన్సేలేదు. ఎవరో తీసుకెళ్ళి వుండాలి. లేదా అడవిజంతువులు లాక్కుపోయి వుండాలి.

ఆలోచిస్తూ నడుస్తున్న కాలేషావలీ తన ముందు నేలమీద జీపుటైర్లగుర్తులు గమనించాడు. ఆ గుర్తులు కొండగుహ దిశను సూచిస్తున్నాయి. అర్థగంట క్రితం ఎక్కడో ఇంజన్ సౌండ్ తను విన్న గుర్తు . వాళ్ళెవరో ఇటుగా వచ్చి అతన్ని జీప్ లో తీసుకుపోయి వుంటారా ?

ఓసారి కొండగుహ వరకూ వెళ్ళి చూసిరావటం ఎందుకయినా మంచిదన్న ఉద్దేశంతో అటు దారితీశాడు కాలేషావలీ.

అతను అడవిదాటి పచ్చికబయలుమీద కాలు మోపుతుండగానే అతడి దృష్టిపథంలో పడింది గుహముందు నిలబడున్న జీప్ ఒకటి. తన అంచనా కరక్టయిన ఉత్సాహంలో మరింత హుషారుగా అడుగులు ముందుకు వేశాడు కాలేషావలీ.

* * *

చాలా నెమ్మదిగా, జాగ్రత్తగా కనురెప్పలు తెరిచాడు బడేభాయి. అతడి కళ్ళకు చిమ్మచీకటి తప్ప మరేమీ కన్పించలేదు. కనురెప్పలు మాత్రం సూదులతో పొడుస్తున్నట్టు పోటు పెడుతుంటే భరించలేక తిరిగి కళ్ళు మూసుకున్నాడు.

తల మొత్తం రోకళ్ళతో కుమ్మినంత పెయిన్‌తో పగిలి పోతున్నట్టుంది. తను ఎవరు ? ఏం జరిగింది ? ఎక్కడున్నాడు ? ఏదీ మూడు నిముషాల వరకూ అతగాడికి గుర్తు లేకుండా పోయింది. ఆ తర్వాత నుంచి ఒక్కటొక్కటిగా జరిగిన సంఘటనలన్నీ గుర్తురానారంభించాయి. వాత్సవ రూపం కళ్ళముందు మెదలగానే బ్రహ్మరాక్షసుడ్ని చూసినంత భయంతో అదిరిపడి కళ్ళు తెరిచాడు.

కొద్ది సెకన్లలోనే అతని కళ్ళు చీకట్లకు అలవాటుపడ్డాయి. తను వేన్ వెనకసీట్లో కాళ్ళూ, చేతులు బంధించబడిన స్థితిలో పడున్నట్టు గుర్తించాడు. ముందుసీట్లో ఇద్దరున్నారు. స్టీరింగ్ వెనక సిగరెట్ దమ్ము కొడుతోంది వత్సవ. అవతల డోర్ కి జేరబడి నిద్రపోతోంది అతనితో వున్న యువతిగా గుర్తించాడు. వేన్ కదలటం లేదు. ఆగివుంది.

"ఎక్కడ వున్నాం ?" కంగారును అణుచుకుంటూ నీరసంగా ప్రశ్నించాడు వాడు.

"ఆగ్రాకి అరవై కిలోమీటర్లదూరంలో హైవేకిదగ్గరలోని తోటలో ఉన్నాం. నీకేమన్నా అభ్యంతరమా ?" కూల్ గా అడిగాడు వాత్సవ.

"నన్నెక్కడికి తీసుకుపోతున్నావ్ ?"

"సేఫ్ గా వుండే చోటుకు తీసుకొచ్చాను మిష్టర్ బడేభాయ్. నాకు నీ నుంచి ఇన్ఫర్మేషన్ కావాలి. నీకు స్పృహ వచ్చేవరకు వెయిట్ చేస్తున్నాం!" అంటూ వేన్ టాప్ లైట్ ఆన్ వేశాడు వాత్సవ.

చీకటి తొలగి వెన్నెలలాంటి వెలుగు పరుచుకుంది వేన్ లో. వాళ్ళ మాటలకు నిద్రాభంగమై కళ్ళు నులుముకుంటూ సరిగా కూర్చుంది భానుమతి.

వాత్సవ కిందకు దిగి వెనకసీట్లోకి వస్తూ బడేభాయ్‌ని లాగి సీటుకు జేరబడేలా కూర్చోబెట్టి తను పక్కన కూర్చున్నాడు.

"మా భోజనం అయిపోయింది బడేభాయ్! నీకోసం చక్కని చికెన్ బిర్యానీ ఎదురు చూస్తోంది. అలసిపోయి వుంటావ్! కొద్దిగా విస్కీ పుచ్చుకో. స్టడీగా వుంటావ్! తర్వాత నా ప్రశ్నలకి సరిగ్గా ఆన్సర్ చెప్పాలి. తేడా వస్తే నీకే ప్రమాదం. ఓకె ? టేకిట్!" అంటూ విస్కీ బాటిల్ వాడి చేతిలో పెట్టాడు వాత్సవ.

"నా చేతికట్లు విప్పు. పారిపోనులే!" బడేభాయ్ అడిగాడు.

"పారిపోలేవు. అలా చేస్తే చంపేస్తాను. అర్థమైందా ?" అంటూ కూల్ గా హెచ్చరిస్తూ కట్లు విప్పాడు వాత్సవ.

విస్కీ నాలుగు గుక్కలు రా సరుకు తాగి సిగరెట్ ముట్టించగానే పోయిన ప్రాణం లేచి వచ్చినట్టుంది బడేభాయ్ కి.

"అడుగు.... నాకు తెలిసిందంతా చెప్తాను" అన్నాడు.

వాళ్ళ ఇద్దరి సంభాషణను ఆసక్తి గా వింటూ కూర్చుంది భానుమతి. ఆమె కళ్ళలో ఇంకా నిద్రమత్తు తొంగి చూస్తోంది.

"ఖాద్రి నీతో ఏం చెప్పాడు ? నీకోసం నేను ఆగ్రాకి ఎందుకొస్తున్నానని చెప్పాడు ?" తన మొదటి ప్రశ్న అడిగాడు వాత్సవ.

"నువ్వు నన్ను చంపటం కోసమే వస్తున్నావని చెప్పాడు. ఖాద్రిని, నన్ను చంపమని నిన్ను ఎవరో నియమించారని చెప్పాడు."

"వాడు నిన్ను ఫూల్‌ని చేశాడు. అసలు విషయం దాచి నీకో పిచ్చి కథ విన్పించాడు. ఎవరూ ఎవరినీ ఊరకే చంపరు. అదీ ఒక బాధ్యతగల డిటెక్టివ్ చట్టానికి కట్టుబడే తన పనులు సాగిస్తాడు గానీ చట్టవిరుద్ధంగా ఏ పనీ చేయడు. మీలా మేం క్రిమినల్స్ కాదు. అసలు విషయం నేను చెప్తాను విను.

సరిగ్గా మూడు సంవత్సరాల క్రితం ఒక ఛైల్డ్ కిడ్నాప్ జరిగింది. ఆ కిడ్నాపర్స్ లో ఒకడు ఖాద్రి అని గుర్తించి వాడ్ని కార్నర్ చేశాను. వాడు చెప్పింది ఏమంటే, వాడ్ని నువ్వు కాంటాక్ట్ చేశావట. నువ్వు తప్ప మిగిలినవాళ్ళు తెలీదట. నిన్ను పట్టుకుంటే మిగిలినవాళ్ళ వివరాలు తెలుస్తాయని చెప్పాడు. ఆ ఛైల్డ్ కిడ్నాప్

వెనక వున్న కథ ఏమిటి ? ఆరేళ్ళ వయసులో కిడ్నాప్ చేయబడిన ఆ కుర్రాడ్ని మీరు ఏం చేశారు ? ఆ వివరాలు మొత్తంనాకు కావాలి. అర్థమైందా ?" అంటూ వివరించాడు వాత్సవ.

ఆ మాటలకు విచిత్రంగా వాత్సవ ముఖంలోకి చూసాడు బడేభాయి. సీరియస్ గా రా సరుకు బాటిల్ ఎత్తి మరో మూడు గుక్కలు తాగాడు.

"షిట్.... ఆ కుక్క ఖాద్రి... వాడు నిన్నూ నన్నూ కూడా మోసం చేసాడు" అన్నాడు కసిగా.

"ఏం చేశాడు ?" వాడినే గమనిస్తూ అడిగాడు వాత్సవ.

సిగరెట్ ఆఖరిదమ్ము లాగి బయటకు విసిరేసి భారంగా నిట్టూర్చాడు బడేభాయ్.

"బరోడా రాజకుటుంబానికి చెందిన నాలుగు వందలకోట్ల ఆస్తికి వారసుడు ఆదిత్య ప్రతాప్ సింగ్ అనే పసివాడి కిడ్నాపింగ్ గురించి నువ్వు అడుగుతున్నావ్ కదూ ?" అనడిగాడు.

"ఎగ్జాట్లీ... ఆ విషయమే అడుగుతున్నాను."

"ఆ కిడ్నాప్ వెనకాల వున్న మా అయిదుగురి గురించి వాడికి తెలుసు. కానీ తెలీదని నీతో అబద్ధం చెప్పి నిన్ను నా మీదకు డైవర్ట్ చేసాడు. నువ్వు నన్ను చంపటానికొస్తున్నావని నన్ను రాంగ్ రూట్ పట్టించాడు. దీనివల్ల వాడు సేఫ్. కానీ నేను మాత్రం సర్వనాశనమయ్యాను. నా అడ్డాలో బిల్డింగ్ తో సహా కోట్ల ఖరీదుచేసే సరుకు తగలబడింది. నా నూర్ బంగ్లా నాశనం చేసుకున్నాను. వాడు ఖాద్రి కాదు. పెద్ద కంత్రీ!"

"నీకు తెలిసింది చెప్పు."

"నువ్వు డైరెక్ట్ గానా దగ్గరకొచ్చి అడిగితే అప్పుడే మేటర్ సెటిలయిపోయేది. ఇంతవరకు వచ్చాక ఇక నేను ఆ సీక్రెట్ దాటి పెట్టాల్సిన అవసరం నాకు లేదు. ఆ కిడ్నాపర్ కి ముఖ్య సూత్రధారి ఒకడున్నాడు. వాడికి మేం నలుగురం సహకరించాం. ఖాద్రీతో బాటు నేనూ, జలంధర్ కి చెందిన రాంసింగ్, సూరత్ కి చెందిన నోటోరియస్ క్రిమినల్ బాబూ మిర్జా. ఈ కిడ్నాప్ కి అతను కుదుర్చుకున్న కాంటాక్ట్ ఎంతో మాకు తెలీదు. అతనికి సహకరించినందుకు మా నలుగురికి తలా అయిదు లక్షల రూపాయలు ఇచ్చాడు. కిడ్నాప్ సక్సెస్ అయి, సిటీ సరిహద్దులు దాటగానే మమ్మల్ని దించేసి పసివాడితో తను ఒక్కడే వెళ్ళిపోయాడు. కాబట్టి ఆ తర్వాత ఏం జరిగిందో, ఆ కుర్రాడ్ని ఏం చేసాడో నాకు తెలీదు."

"ఇంతకీ సూత్రధారి అయిన ఆ అయిదో వ్యక్తి ఎవరో చెప్పలేదు."

"వాడి పేరు భగవాన్ దాదా. గురుదాస్ పూర్ వూరికి చెందినవాడు. అనేకమంది కిరాతకులయిన గూండాలకి వాడు బాస్.

గురుదాస్ పూర్ పేరు వినగానే, ఉలిక్కి పడకుండా వుండలేకపోయాడు వాత్సవ.

ఎందుకంటే, శ్యామ్ సుందర్ చివరిసారిగా ఆఫీసుకు ఫోన్ చేసింది గురుదాస్ పూర్ నుంచే. ఎవరో అమ్మాయి కారణంగా లోకల్ రౌడీలతో గొడవపడి, టాక్సీలో పారిపోయాడని తెలిసింది. ఆ రౌడీలు భగవాన్ దాదా మనుషులని కూడా కాలేషావలి గేదర్ చేసిన ఇన్ ఫర్మేషన్ వలన తెలిసింది. సో.....భగవాన్ దాదా పేరు వినటం ఇది రెండోసారి. అక్కడ శ్యామ్ సుందర్ హెల్డప్ అయిన ఇష్యూకి, ఈ చైల్డ్ కిడ్నాప్ కేసుకి దగ్గర సంబంధం వుండే అవకాశం వుందా ? తీవ్రంగా ఆలోచిస్తున్న వాత్సవను చూసి సీరియస్ గా నవ్వాడు బడేభాయ్.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్ ? భగవాన్ దాదా గురించా ? వాడొక నీచ్ కమీన్ కుత్తే. వాడ్ని నువ్వు కార్నర్ చేయగలిగితే, ఆ కుర్రాడు ఎక్కడ వుందీ ఖచ్చితంగా తెలుస్తుంది. ఇంతకుమించినేనేమీ చెప్పలేను. నాలాగే ఖాద్రికి కూడా కిడ్నాప్ తర్వాత ఆ పసివాడి విషయంలో ఏం జరిగిందీ తెలీదు. జలంధర్ రాంసింగ్, సూరత్, బాబూమీర్జా వాళ్ళిద్దరి పరిస్థితి డిటోనే."

"చూడు బ్రదర్! సాధారణంగా ధనవంతుల బిడ్డల్ని కిడ్నాప్ చేయటం వెనక డబ్బు సంపాదించటం కిడ్నాపర్స్ లక్ష్యం అయి వుంటుంది. మాకు ఇంత డబ్బు కావాలి, ఇది కావాలి, లేదంటే పిల్లాడ్ని చంపేస్తాం అంటూ డిమాండ్స్ వుంటాయి. కాని ఈ కిడ్నాప్ తర్వాత కిడ్నాపర్స్ నుంచి ఏ విధమైన డిమాండ్ రాలేదు. ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం. డిమాండ్స్ ఏమీ లేవంటే, కేవలం పాత కక్షలు ఏవో కారణంగా పిల్లాడ్ని చంపటంకోసమే ఎత్తుకుపోయి వుంటారని ఎవరయినా వూహించటం సహజం. శవాన్ని పార్శిల్ పంపించి, ఇక్కడ అలాంటివేమీ జరగలేదు. డబ్బు డిమాండ్ చేయలేదు. జస్ట్ కిడ్నాప్ చేసి వూరుకున్నారు. ఆ పసివాడి పొజిషన్ ఏమిటో తెలీదు. మూడేళ్ళు గడిచిపోయాయి. బ్రతికి వుంటే ఆ కుర్రాడికి ఇప్పుడు తొమ్మిది నిండి పదో సంవత్సరంలో అడుగుపెట్టొచ్చు. సో.....ఇప్పుడు నా డౌటు ఏమంటే, ఏదో కొంత సమాచారం నీకు తెలిసింది, చెప్పకుండా దాస్తున్నావని...."

"లేదు మిస్టర్ వాత్సవ్" అంటూ వాత్సవ మాటల్ని ఖండించాడు బడేభాయ్.

"నాకు తెలిసింది ఎంతో చెప్పేశాను. అంతకుమించి ఆవగింజంత కూడా ఎక్కువ నాకు తెలీదు. ఇంత చెప్పి మిగిలింది దాచటం వలన నాకేమిటి ప్రయోజనం ? ఈ కేసు మిస్టరీ విడిపోవాలంటే నువ్వు పట్టాల్సిన ఏకైక వ్యక్తి భగవాన్ దాదా మాత్రమే" అంటూ ఖండితంగా చెప్పేశాడు.

"ఓ.కె! నిన్ను మా వెంట తీసుకెళతాం. నీ పక్కన బిర్యానీ పార్శల్ వుంది. మందుకొట్టు, తిని మంచినీరు తాగి హేపీగా సీట్లోపడ నిద్రపో. తప్పించుకుపోయే ప్రయత్నాలు చేయకు. నీ ఆరోగ్యానికి మంచిది కాదు" అంటూ హెచ్చరించి ముందు సీట్లోకి వచ్చేసాడు వాత్సవ.

"ఏం చేయాలనుకుంటున్నావ్ ?" అతను వేన్ స్టార్ట్ చేసి ముందుకు దూకించగానే భానుమతి సూటిగా అడిగిన ప్రశ్న అది.

"ఎవర్ని ? నిన్నా ?" అంటూ ఎదురు ప్రశ్నించాడు సీరియస్‌గా.

ఆమె ఉలిక్కిపడిపోతుందని తెలుసు.

వెనక సీట్లో బిర్యానీ తింటున్న బడేభాయ్ పగలబడి నవ్వాడు.

కాని ఆమె నవ్వలేదు.

సూటిగా వాత్సవనే చూస్తోంది.

"పోనీ నన్నే అనుకో. ఏం చేయాలనుకుంటున్నావ్... ?" ఆమె ముఖంలో కొంటెతనం లేదు. కాని ఆమె ప్రశ్నతో కొంటెతనం వుంది.

"నేను రంగంలోకి దిగానంటే, కేసును గురించి మాత్రమే ఆలోచిస్తాను ఏం చేయాలని. కాని అడిగావు గాబట్టి ఇప్పుడు చెపుతున్నాను. అనవసరంగా నా పనుల్లో వేలు పెట్టడం మానేయటం మంచిది. నిన్ను మీ పాలెస్ దగ్గరదించేసి వెళ్ళిపోవాలనుకుంటున్నాను."

"నువ్వలా చెప్తే నేను ఎలా వూరుకుంటాను ? ఖచ్చితంగా నీమీద పోలీస్ కేసు పెడతాను."

"ఏమని ?"

"నువ్వు నన్నే దోచేసి, వదిలేసి పోయావని."

"షిట్" అంటూ నుదురు కొట్టుకున్నాడు వాత్సవ.

ఈసారి మాత్రం చాలా అందంగా నవ్వింది భానుమతి.

"ఇందుకే మరి నేను అమ్మాయిల్ని అమడ దూరంలో వుంచుతాను. నీ తమ్ముడి ఆచూకీ రేపే దొరికిపోవచ్చు. ఇంతటితో నువ్వు బుద్ధిగా ఇంటికి చేరుకో" అంటూ వేన్ వేగం పెంచాడు వాత్సవ.

## 19

"మనం మళ్ళీ దారి తప్పాం...." సీరియస్ గా ముందుకు చూస్తూ ఎనౌన్స్ చేసాడు భగవాన్ దాదా.

అతడి మాటల్లో అబద్ధం ఏమీలేదు.

ఆకాశం మబ్బు పట్టడంతో దిక్కులు తెలీని పరిస్థితి ఏర్పడింది. క్రమంగా దారి మూసుకుపోతూ, వేన్ లు ముందుకు సాగలేని పరిస్థితి ఏర్పడుతోంది.

"నాకు గంటక్రితం వచ్చింది సాబ్ డౌటు. ఎగువన మనం కుడి పక్కగా పోతున్న బటను వదిలేసి తిన్నగా వచ్చేశాం. మనం వెనక్కి పోవటం మంచిది" అన్నాడు డ్రైవరు.

"ఏడవలేకపోయావ్ ? ఈ మాట ఏదో అప్పుడే చెప్పాల్సింది...."

"నేను చెప్పాను సాబ్, మీరు వినిపించుకోలేదు."

"సరిసరి, వేన్ లు వెనక్కి తిప్పండి. అవతల పొద్దుగూకుతోంది."

ఈ తతంగమంతా చూస్తున్న మియాచీ అసహనంగా చూస్తూ బోడి గుండు తడుపుకున్నాడు.

"మైగాడ్! ఇంకా ఎన్నిసార్లు మనం దారి తప్పాలి ? ఇలా మనం లేట్ చేస్తే సూకీ అడవి దాటిపోయే ప్రమాదం వుంది" అన్నాడు.

"అది అడవి దాటితే మనకే మంచిది. సులువుగా పట్టుకోవచ్చు. ఈ అడవిలో వెదికి పట్టుకోవడం అంత సులువుకాదు. అనవసరంగా టెంషన్ పడకు" అంటూ హెచ్చరించాడు దాదా.

ఇలాంటి పరిస్థితి ఏదో రావచ్చని వూహిస్తునే వున్నాడు చివరి వేన్ వెనక నిచ్చెనమీద ప్రయాణం చేసి వస్తున్న శ్యామ్ సుందర్. వేన్ లు ఆగిన మరుక్షణం కిందకు దూకి పక్కనున్న గుబురుపొద వెనక్కి దూకేశాడు.

ఎక్కడి వేన్ లు అక్కడే జాగ్రత్తగా రివర్స్ తిరిగాయి. అవి తిరిగి ముందుకు మూవ్ అయ్యేవరకు వెయిట్ చేశాడు శ్యామ్. చివరి వేన్ తనను దాటిన మరుక్షణం ఉన్న చోటు నుండి చివ్వున లేచి రేసు గుర్రంలా

పరుగెత్తాడు. దుమ్ము ధూళి ఎగసిపడుతున్నా లెక్క చేయకుండా దూసుకెళ్ళి తిరిగి నిచ్చెన మీదకు ఎక్కేశాడు. ఆ వేన్ లోనే మియాచీ దాదాలు ప్రయాణం చేస్తున్నారు.

క్రమంగా చీకటి పడింది.

హెడ్ లైట్లకాంతిలో నెమ్మదిగా ముందుకు సాగుతున్నాయి వేన్ లు.

రాత్రి ఎనిమిది గంటలకి వేన్ లు సరైనరూట్ ని చేరుకున్నాయి. మరో అరగంట ప్రయాణం చేశాక అనుకూలమైన చోటు చూసి వేన్లు ఆపించి, అక్కడ మకాం చేయించాడు దాదా.

బాట పక్కనే విశాలమైన రాతి ప్రదేశం అది. అడవిలో చలి ఎక్కువగానే వుంటుంది. ఎండుకట్టెలు తెచ్చి నెగళ్ళు వేశారు. ఆ మంటల మీద దగ్గరున్న వేటాడిన కోళ్ళు, ఇతరపక్షులు, కుందేళ్ళ మాంసాన్ని దోరగా కాల్చి ఆహారం తయారుచేస్తున్నారు. వాళ్ళంతా తిని, తాగి ఓ గంట కాలక్షేపం చేశారు.

అదను చూసి వాళ్ళ దగ్గర నుంచి కొంత విప్పసారాయి, ఒక కాల్చిన కోడిని తస్కరించి తన ఆకలి తీర్చుకున్నాడు శ్యామ్ సుందర్. వాళ్ళని గమనిస్తూ మాటువేసి కూర్చున్నాడు.

భగవాన్ దాదా వేన్ టాప్ మీదకు ఎక్కి పడుకున్నాడు. మియాచీ అదే వేన్ లో వెనక సీటులో పడి నిద్రపోయాడు. మిగిలిన వాళ్ళలో కొద్ది మంది మిగిలిన వేన్ లలో సర్దుకోగా, కొందరు నెగళ్ళ చుట్టూ పక్కలు వేసుకుని వెచ్చగా నిద్రలోకి జారుకున్నారు. ముగ్గుర్ని ఆ ప్రదేశానికి కాపలా వుంచారు.

వాళ్ళు ముగ్గురూ ఒక గంట తుపాకులతో గస్తీ తిరిగారు. తర్వాత నెగళ్ళలోకి మరికొన్ని కట్టెలు వేసి, వాటి పక్కన కూర్చొని కునికిపాట్లు అరంభించారు.

అప్పటికి అర్ధరాత్రి అయింది.

శ్యామ్ సుందర్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. తన వాళ్ళతో ప్రయాణం చేయటం కన్నా తన దారిన వెళ్ళిపోవటం బెటర్.

కనీసం వాళ్ళకన్నా మూడుగంటలయినా ముందుగా గుహ దగ్గర వుండాలి. అప్పుడే సూకీని, జలీల్ ఖాన్ ని వెదికిపట్టుకునే అవకాశం తనకి లభిస్తుంది.

ఏదో ఒకటి చేయాలి. ఏం చేయాలి ?

ఆలోచిస్తూ కూర్చోలేదు శ్యామ్.

తన పక్కనున్న చెట్టు కొమ్మలకి నిమ్మకాయ సైజులోనివేవో కాయలున్నాయి. సరిపడినన్ని కాయలు కోసుకున్నాడు. మూడు అడుగుల పొడవుండే సన్నటి కొమ్మను అందుకున్నాడు. పిల్లిలా కదిలాడు వేన్ ల వద్దకి.

చివరి వేన్ ను చేరుకుని దాని కిందకు దూరాడు. ఒక్కో కాయను తీసి సైలన్సర్లోకి తోసి పుల్లముక్కతో లోనకు తోశాడు. అలా డజను కాయల్ని లోనకు తోసాక బయటికి వచ్చాడు.

ఇక ఆ వేన్ స్టార్ట్ అవదు. ఆ కాయల్ని గమనించి బయటకు తీసే లోన వాళ్ళపని అయిపోతుంది.

అలా అయిదు వేన్ల సైలన్సర్ గొట్టాల్లోను పచ్చికాయల్ని కుక్కి ఆ తర్వాత చేతులు దులుపుకుని లేచాడు శ్యామ్.

వాళ్ళంతా గాఢనిద్రలో వున్నారు.

అందుకే శ్యామ్ చేసిన కొంటెపని ఏ ఒక్కరూ గమనించే అవకాశం లేకపోయింది. చివరిగా భగవాన్ దాదా పడుకున్న వేన్ ని చేరుకున్నాడు.

లోపల నిద్రపోతున్న మియాచీ గురక దారుణంగా వుంది. తాళాలు వేన్ లోనే వుండటం తన అదృష్టం అనుకున్నాడు. రెండో పక్కకి వచ్చాడు మియాచీని లాగి పడేసే ఉద్దేశ్యంతో డోర్ మీద చేయి వేయబోయాడు.

ఇంతలో తన వెనక అలికిడి.

వెనక్కి తిరిగి చూసేలోపే తుపాకి మొన వీపుమీద గుచ్చుకుంది.

"హేండ్సప్...." అంటూ వెనక వ్యక్తి కరుగ్గా హెచ్చరించాడు.

ఎవడో తనని పసిగట్టి కార్నర్ చేసాడని శ్యామ్ సుందర్ కి స్పష్టంగా అర్థమైపోయింది.

ఈ సమయంలో తను చేతులు ఎత్తడం అంటే అంతకుమించిన ఆత్మహత్య మరొకటి లేదు. అందుకే పూర్తిగాతెగించేసాడు శ్యామ్.

మెరుపు వేగంతో వెనక్కి తిరిగి తుపాకిని ఒడిసిపట్టాడు. ప్రత్యర్థి ఎంత మాత్రం వూహించని డెడ్లీ అటాక్ అది. తుపాకి లాగి తిప్పి ఈడ్చి కొట్టాడు వాడి ముఖంమీద.

ముఖం పగిలిపోయినంత బాధతో కెవ్వున అరిచాడు వాడు. రెండు చేతులతో ముఖం కప్పుకుని విరుచుకుపడిపోయాడు వాడు. వాడి అరుపు చీకట్లలో దారుణంగా ప్రతిధ్వనించింది. నిద్రపోతున్న వాళ్ళు తుళ్ళిపడి లేచి కూర్చున్నారు.

క్షణం కూడా ఆలస్యం చేయలేదు శ్యామ్ సుందర్. డోర్ తెరిచి లోన అప్పుడే లేవబోతున్న మియాచీ రెండుకాళ్ళు బలంగా పట్టుకున్నాడు. ఏం జరుగుతుందో వాడికి అర్థమయ్యేలోపలే ఉప్పుమూటను లాగినట్టు వాడ్ని సీట్లోంచి లాగి అవతల పారేసి డోర్ మూసాడు.

ఇంతలో టాప్ మీద నిద్రపోతున్న భగవాన్ దాదా గొడవకి లేచి పోతూ.... "ఏమైంది.... ఏం జరుగుతోందిక్కడ ?" అని పిడుగులా గర్జిస్తూ రివాల్వర్ అందుకున్నాడు.

అప్పటికే ఫ్రంట్ సీట్లోకి జంప్ చేసి స్టీరింగ్ ముందు కూర్చున్నాడు శ్యామ్ సుందర్. ఒక్కసారిగా ఇంజన్ స్టార్టయి ముందుకు ఉరికింది వేన్.

గొల్లున అరుస్తూ పక్కలకు దూకారు గూండాలు.

వేన్ టాప్ మీద ఉన్న భగవాన్ దాదా, ఏదో అదృశ్యశక్తి ఎత్తి బలంగా విసిరేసినట్టు వేన్ పైనుంచి ఎగిరి ఉప్పుమూటలా కిందపడి నడుం విరిగినంత బాధతో కెవ్వుమన్నాడు.

శ్యామ్ సుందర్ తిరిగి చూడలేదు.

వన్ని వేగంగా ముందుకు దూకించాడు.

"వదలవద్దు....వాడ్ని వదలకూడదు. వేన్లు తియ్యండి. త్వరగా" హైడ్ లైట్ల కాంతిలో దూరమవుతున్న వేన్ ని చూస్తూ గొంతు చించుకొని ఆర్డర్ వేసాడు దాదా.

అరుపులు, కేకలు, కాళ్ళు తొక్కుకుంటూ గూండాల పరుగులు. చిన్న పాటి గందరగోళం. కొందరు వెళుతున్న వేన్ మీదికి కాల్పులు కూడా జరిపారు. ప్రయోజనం లేకపోయింది.

మిగిలిన అయిదు వేన్ లు చూస్తే మారాం చేస్తున్న గుర్రాల్లా బిగ్గరగా సకిలించి ఆగిపోవటం తప్ప ఒక్క ఇంచ్ కూడా ముందుకు కదిలే పరిస్థితి కన్పించటం లేదు.

తల తీసి నేలకు కొట్టుకోవాలన్నంతగా పిచ్చికోపం వచ్చింది భగవాన్ దాదాకి. బండబూతులు తిడుతూ రంకెలేస్తున్నాడు.

"ఏమైందిరా వీటికి ?" షౌట్ చేసాడు వేన్లని చూస్తూ.

"వాడు ఏదో చేసాడన్నా. వేన్‌లు స్టార్ట్ గావటంలా...." చెప్పాడు ఒకడు.

"చూడండి. ఏం చేసాడో త్వరగా చూసి సరిచేయండి. పనికిమాలిన ఎదవలు మీరు. ఎవడో వచ్చి ఏదో చేసినా తెలుసుకోలేని దద్దమ్మలు...." అంటూ రంకెలేసాడు.

ఈ లోపల,

పడ్డచోటు నుంచి లేస్తూ "ఏమైంది... ? ఏమిటీ గొడవ ?" అంటూ అడిగాడు మియాచీ.

వాడింకా సగం నిషాలోనూ, సగం నిద్రమత్తులోనూ వున్నాడు. వాడ్ని విసుగ్గా చూసాడు భగవాన్ దాదా.

"వాడెవడో నిన్ను, నన్ను కిందపడేసి మన వేన్ లో పారిపోతున్నాడు. వాడ్ని ఫాలో చేద్దామంటే వీటికేమైందోగాని, ఒక్క వేన్ కూడా స్టార్టు కావటం లేదు...." అంటూ ఓపిగ్గా పరిస్థితి వివరించాడు.

"ఇది బయటవాడి పని కాదు....మనలోనే ఎవడో శతృవున్నాడు. ఈ పని చేసింది వాడే. ముందు మనవాళ్ళు లెక్కకు సరిపోయారా లేదా లెక్కపెట్టండి...." అంటూ సలహా యిచ్చాడు మియాచీ.

ఆ మాటతో సర్రున పొంగుకొచ్చేసింది కోపం భగవాన్ దాదాకి.

"షటప్.... జస్ట్ ఐ సే షటప్.... అండర్ స్టాండ్ ? ఉన్న కన్‌ఫ్యూజ్ చాలదని నువ్వు కొత్త దిసృష్టించకు. సాయంకాలం నీ ముక్కు పగల గొట్టినవాడు ఎలాగో యిక్కడికీ వచ్చుంటాడు. మనం వాడ్ని కనిపెట్టలేక పోయాం. ఏమైందిరా ? వేన్‌లు కదులుతాయా లేదా ?" అనరిచాడు.

"సారీ బాస్! ఈ చీకట్లలో చెక్ చేసి సరిచేయటం జరిగేపని కాదు. ఉదయం వరకు వెయిట్ చేయక తప్పదు...." పరిస్థితి వివరించాడు ఒక డ్రైవరు.

ఇక చేయగలిగింది ఏమీ లేకపోవటంతో భగవాన్ దాదా మియాచీతో మరో వేన్ లో పడుకుని నిద్రపోయాడు. అనుచరుల్లో చాలామంది రాత్రి నిద్రకు దూరమయ్యారు.

* * *

అడవిదారిలో ఎగిరెగిరి పడుతోంది వేన్.

హెడ్ లైట్లకాంతిలో స్లోగా పరుగుతీస్తోంది.

స్టీరింగ్ వెనక శ్యామ్ సుందర్ చాలా విసుగ్గా వున్నాడు. ఇంత వరకు ఎప్పుడూ ఉపయోగపడని టెంషన్స్ కి తను గురికాలేదు. సూకీ విషయంలో అక్షరాలా అదే జరుగుతోంది.

ఆమెను కలిస్తే గాని సమస్య ఏమిటో తెలీదు. అది తెలిస్తే గాని అందులో న్యాయాన్యాయాలు విశ్లేషించి కేసు టేకప్ చేయటం జరగదు. సాధారణంగా కేసు టేకప్ చేసాకే ట్రబుల్స్ ని ఫేస్ చేయటం జరుగుతుంది. కాని ఇక్కడ కేసు టేకప్ చేయకుండానే స్టార్టయిపోయాయి ట్రబుల్స్. అదీ ప్రాబ్లం.

సూకీ బ్రతికే వుంది. కాని కన్పించలేదు. ఆమెను వెదికి పట్టుకునేది ఎప్పుడు ? కేసు టేకప్ చేసేది ఎప్పుడు ? మధ్యలో ఈ మియాచీ భగవాన్ దాదాల గోల ఏమిటి ? కేసు టేకప్ చేసేది ఎప్పుడు ? మధ్యలో ఈ మియాచీ భగవాన్ దాదాల గోల ఏమిటి ? చీకట్లో వెదుకులాడినట్టు ఈ అడవిలో పడి తిరిగితే ప్రయోజనం ఎంతవరకు ?

నిద్రమత్తు వదలటానికి మరికాస్త మందు పుచ్చుకున్నాడు. డాష్ బోర్డులో సిగరెట్ల స్టాకు వుంది. అది భగవాన్ దాదా ప్రయాణిస్తున్న వేన్ గాబట్టి లోన మందుకి , సిగరెట్లకి కొరత వుండదు.

ఆలోచిస్తున్న శ్యామ్ సుందర్ రోడ్ కి అడ్డంగా వున్న శాల్తీ ని హెడ్ లైట్ల కాంతిలో కాస్త ఆలస్యంగా గుర్తించాడు.

గుర్తించిన మరుక్షణం అతని పాదం సడెన్ బ్రేక్ ను అప్లై చేసింది. కీచుమని శబ్దాలు సృష్టిస్తూ ఆ శాల్తీ కి మూడు అడుగుల సమీపంలోకొచ్చి ఆగింది వేన్.

అది ఒక కొండచిలువ. సుమారు పన్నెండు అడుగుల పొడవుంటుంది. మరి కుందేలును మింగిందో, జింకపిల్లను మింగిందోగానీ పొట్ట చాలా ఎత్తుగా వుంది. కట్టెలా బాటకి అడ్డంగా పడుంది. కదల్లేకపోతోంది. చాలా నెమ్మదిగా మూవ్ అవుతోంది.

కొండచిలువ అలవాట్లు శ్యామ్ కి తెలీనివికాదు. తన శక్తికి మించిన జంతువుల్ని కూడా అది మింగటానికి ప్రయత్నిస్తుంది. మింగటం పూర్తి కాగానే జాగ్రత్తగా సమీపంలోని ఏ చెట్టువద్దకో చేరుకుంటుంది. చెట్టుకు చుట్టుకొని శరీరాన్ని తాడులా బిగించగానే లోపల పొట్టభాగంలోని జంతువు ఎముకలు పెటపెటా విరిగి ముక్కలయిపోతాయి. ఆ తర్వాత అది జీర్ణమైపోతుంది.

ఇప్పుడు ఎదురుగా వున్న కొండచిలువ పరిస్థితీ అదే.

చూస్తూ చూస్తూ దాని పైనుంచివేన్ పోనీయలేదు.

అలాగని ఆలోచిస్తూ కూర్చుంటే అది కదిలేలా లేదు. అది బాటని క్రాస్ చేయాలంటే కనీసం అర్థగంట పట్టేలా వుంది. ఏదో ఒకటి చేసి ముందుకు పోవాలి. ఏం చేయాలి ?

ఎక్కువసేపు ఆలోచించలేదు శ్యామ్ సుందర్. వేన్ దిగి కొండ చిలువ తోక వద్దకెళ్ళాడు. రెండు చేతులతో దాని తోక బలంగా పట్టుకుని శక్తి నంతా ఉపయోగించి బరబర పక్కకు లాగేశాడు. అయినా దారి సగం మాత్రం క్లియరైంది.అంత బరువున్న ప్రాణిని మరోసారి పక్కకు లాగి తన ఎనర్జీని వేస్ట్ చేసుకునే సాహసం చేయలేదు అతను.

వచ్చి కూర్చుని వేన్ స్టార్ట్ చేశాడు.

కొంతదూరం రివర్స్ తీసుకున్నాడు.

కొండచిలువ కదల్లేక తలతిప్పి వేన్ హెడ్ లైట్లకాంతివంక తీక్షగ్గా చూస్తూ అలాగే పడుకుంది.

రైట్ సైడ్ లో దారి పక్కనే పెద్ద బండ, దాన్ని ఆనుకొని డొంకలు, పొదలు వున్నాయి. వేన్ ని ముందుకు పోనిస్తూ కొండచిలువను తొక్కకుండా వేన్ ను బాగా రైట్ కొసైడ్తీసుకున్నాడు.

డొంకను విరగదోసుకుంటూ బండ సమీపంలో టర్నింగ్ తీసుకుని ఎగిరెగిరిపడుతూ ముందుకు దూకి తిరిగి బాటమీదకు వచ్చి పరుగు ఆరంభించింది వేన్.

అలా పరుగుతీస్తుండగానే శ్యామ్ సుందర్ కి అర్థమైపోయింది. జరగాల్సిన డామేజ్ కాస్త జరిగిపోయిందని. వేన్ కుడిపక్క ఫ్రంట్ టైర్ లో ఏం దిగబడిందోగాని బుస్ మంటూ గాలిపోతున్న సౌండ్ క్లియర్ గా వినబడుతోంది. కేవలం రెండు ఫర్లాంగుల దూరం మాత్రమే దారివెంట ముందుకు పోగలిగాడు. గాలిపోయి టైరు చతికిలబడటంతో స్టీరింగ్ కంట్రోల్ గావటం లేదు. దారి నుంచి పక్కకు మళ్ళించి పొదల వెనక వేన్ ని ఆపేశాడు.

ఇక చేయగలిగింది లేదు. ముందుకు పోవటం కష్టం. వేన్ లోకి విషకీటకాలు ఏవీ జొరబడకుండా అద్దాలు క్లోజ్ చేశాడు. హెడ్ లైట్లు ఆఫ్ చేశాడు. కొద్దిగా మందుకొట్టి వెనక సీట్లో చేరి ముసుగుతన్ని నిద్రపోయాడు.

తిరిగి శ్యామ్ సుందర్‌కి మెలుకువ వచ్చేసరికి ఉదయం ఆరు గంటలు కావస్తోంది సమయం. ఇంకా అడవిలో చీకట్లు పూర్తి గాతొలగిపోలేదు.

బాటిల్ వాటర్ తో ముఖం కడుక్కున్నాడు. సిగరెట్లు పాకెట్లు స్టాక్ లోంచి తనకు సరిపడా తీసుకున్నాడు. వేన్ మొత్తం గాలించగా ఒక బ్రడ్ పాకెట్టు, ఒక బిస్కట్ పాకెట్టు దొరికాయి. వాటిని ఖాళీచేసి, నీరు తాగి ఆకలి తీర్చుకున్నాడు. అంతటితో ఆ వేన్ ని వదిలేసి కాలినడకన బయల్దేరాడు.

భగవాన్ దాదా కాన్వాయ్ రాత్రి ముందుకు వెళ్ళిపోయిందా ఇంకా వెనకాలే వుందో తెలీలేదు. సిగరెట్ దమ్ము కొడుతూ అర్థగంట ప్రయాణం చేశాక అక్కడ మనుషుల అలికిడి విన్పించింది.

గిరిజన యువకులు నలుగురు అక్కడున్న చెట్ల నుంచి కుంకుడు కాయలు సేకరిస్తున్నారు. శ్యామ్ సుందర్ ని చూడగానే వాళ్ళంతా చేస్తున్న పని ఆపి బాటమీదికి వచ్చారు.

వాళ్ళని చూడగానే శ్యామ్ సుందర్ కూడా సంతోషపడ్డాడు. ఆటవికులు గాబట్టి అడవుల్లో దారులన్నీ వాళ్ళకి కొట్టిన పిండి. వాళ్ళనడిగితే తనకి కరక్ట్ రూట్ తెలిసిపోతుంది. అందుకే తనని సమీసిస్తున్న ఆ నలుగుర్నీ చూసి స్నేహపూర్వకంగా నవ్వాడు.

"ఎవరు దొరా నువ్వు ? ఈ నట్టడివిలో ఏం జేస్తున్నావ్ ?" శ్యామ్ ని ఎగాదిగా చూస్తూ ఆ నలుగురులో ఒకడు అనుమానంగా అడిగాడు.

వాళ్ళంతా బలిష్టంగా ఉన్నారు. రంగు పంచెలు ఎగ్గట్టి విచిత్రమైన తీగలు , పూసలు అలంకరించుకున్నారు. చేతుల్లో బరిసెలున్నాయి.

"ఏం చేయటంలేదు ఫ్రెండ్స్! దారితప్పి తిరుగుతున్నాను. మీరు సరైనదారి చూపిస్తే నా దారిన నేను వెళ్ళిపోతాను" నిదానంగా బదులిచ్చాడు శ్యామ్.

వాళ్ళంతా ముఖముఖాలు చూసుకున్నారు.

వెంటనే బరిసెలు గురిపెడుతూ శ్యామ్ కి నాలుగుపక్కలా పొజిషన్ తీసుకునిలబడ్డారు. వాళ్ళ చర్యకి అసహనంగా నొసలు విరిచాడు శ్యామ్. "ఏమిటిది ?" అడిగాడు.

"ఏమిటో నీకు అర్థం కాదుగాని నీ చేతివాచీ చాలా బాగుంది. చాలా ఖరీదు వుంటుందనుకుంటా. దాన్ని తీసిపెట్టు" అన్నాడొకడు.

వాడి మాటలు అబద్ధం కాదు. శ్యామ్ చేతిన వున్నది అతి ఖరీదైన రాడోవాచ్. వాత్సవ గత సంవత్సరం ఫారెన్ నుంచి వచ్చేటప్పుడు తన కోసం తెచ్చి ప్రజంట్ చేసింది. తమ స్నేహానికి చిహ్నంగా తను ఆ వాచీని

ప్రాణంలా చూసుకుంటాడు. ఇప్పుడా గిరిజనుడి కన్ను ఆ వాచీమీద పడిందని తెలీగానే శ్యామ్ కి నవ్వు ఆగలేదు. కాని నవ్వుని బలవంతంగా అణచివేస్తూ సీరియస్ గా లుక్ ఇచ్చాడు.

"నీ మెళ్ళోది బంగారం గొలుసు. నాకు తెలుసు. పదితులాలు ఉంటుందనుకుంటాను. దాన్ని తీసి అక్కడపెట్టు" రెండోవాడు ఆర్డర్ చేశాడు.

"నీ జేబులో పర్సు చాలా ఎత్తుగా వుంది. అందులో చాలా డబ్బు వుండి వుంటుంది. దాన్ని కూడా తీసి అక్కడపెట్టు" అన్నాడు కరుగ్గా మూడోవాడు.

"మరి నీ సంగతేమిటి భాయ్! నీకేమీ అక్కరలేదా ?" నాలుగో వాడ్ని చూస్తూ కళ్ళెగరేసి ఎగతాళిగా అడిగాడు శ్యామ్.

"బూట్లు.... నీ బూట్లు నచ్చాయి. వాటిని విప్పి అక్కడ పెట్టు" అంటూ తన కోరిక వాడు బయటపెట్టాడు.

"ఇవి చాలా, ఇంకేమన్నా కావాలా ?" ఇక ఆపుకోలేక నవ్వేస్తూ అడిగాడు శ్యామ్.

"ఏమిటి ? వెటకారమా ? చచ్చిపోతావ్" బరిశెను గురిచూసి బెదిరించాడు. మొదటివాడు.

"ఓ.కె....మీరడిగినవి ఏవీ మీకు ఇచ్చే ఉద్దేశం నాకులేదు. నన్ను చంపి తీసుకోండి. కానీ ఒక్క షరతు. మీరు నన్ను చంపకపోతే ఖచ్చితంగా మిమ్మల్ని నేను చంపేస్తాను."

"అంత మొనగాడివా ?"

"ఏయ్.... మీతో ఛాలెంజ్ చేయటానికి మిమ్మల్ని వెదుక్కొంటూ ఈ అడవిలోకి నేను రాలేదు. అర్థమైందా ? దారితప్పి వచ్చాను. మర్యాదగా దారి చెప్తే నా దారిన పోతాను. పిచ్చి వేషాలేస్తే తాట తీస్తా! నా సంగతి మీకు తెలీదు..."

"ఓరే, వీడెవడో అతిగా మాట్లాడుతున్నాడు. వీడి శవాన్ని అడవి నక్కలు విందులు చేసుకోవాలని రాసిపెట్టి వుంటే ఎవరూ ఏమీ చేయలేరు. వేసేయండిరా" అంటూ ఎత్తేశాడు బరిసెను మొదటివాడు.

అంతటితో శ్యామ్ సుందర్ లోని సహనం పూర్తిగా అడుగంటిపోయింది. మెరుపులా కదులుతూ వార్నింగ్ యివ్వకుండా ఫైటింగ్ లోకి దిగిపోయాడు.

మీదికొస్తున్న బరిసెల్ని మెరుపులా తప్పించుకొని గిరుక్కున తిరుగుతూ వేగంగా కదిలాడు.

ఒకడి పక్కటెముకలకి పాదం కనెక్టయి కరెంట్ షాక్ తిన్నంత బాధతో ఎగిరి అవతల పడి కెవ్వుమన్నాడు.

వాడి అరుపు పూర్తి కాకముందే రెండోవాడి గుండెల్ని తాకింది శ్యామ్ పాదం. కాంక్రీట్ పిల్లర్ మీదపడి గుండెలు చితికినంత బాధతో దారుణంగా అరుస్తూ ఎగిరి దూరంగా పడ్డాడు వాడు. మూడోవాడి ముఖం పగిలింది. నాలుగోవాడి నడుం కలుక్కుమంది. కన్ను మూసి తెరిచేలోపల బరిసెలు వదిలి వాళ్ళు నలుగురూ నేలమీద పడి పొర్లిగింతలు పెట్టారు.

అయినా వదల్లేదు శ్యామ్.

ఒక నిముషంపాటు వాళ్ళందర్నీ ఫుట్ బాల్ ఆడేసాడు. శ్యామ్ సుందర్ పవర్ ఏమిటో అర్థంకాగానే ఇక పంతానికి పోకుండా రెండు చేతులూ ఎత్తి క్షమించమని నమస్కారాలు పెట్టేసారు వాళ్ళు.

"ఓ.కె. చిలక్కి చెప్పినట్టు చెప్పాను. విన్నారుకాదు. మీ ఖర్మ, ఏం చేస్తాం ? నా తప్పేమీలేదు. అవునా ?" అంటూ వాళ్ళందరికీ తలొక సిగరెట్ యిచ్చి తనూ ముట్టించుకున్నాడు.

"మనదికాని వాటికి ఎప్పుడూ ఆశపడకూడదు బ్రదర్. బయట ప్రపంచం ఎంత నాశనమవుతున్నప్పటికీ అడవితల్లిని నమ్ముకున్న మీలో ఇంకా నీతి, న్యాయం బ్రతికి వున్నాయని మా నమ్మకాన్ని నాశనం చేసి మీరు కూడా దొంగలు, హంతకులుగా మారకండి. ఓ.కె ?" అంటూ హెచ్చరించాడు.

"బుద్ధి వచ్చింది సాబ్. మమ్మల్ని వదిలేయండి. ఇంకెప్పుడూ ఇలాంటి పొరపాట్లు చేయం" అన్నాడు మొదటివాడు.

"నేను వదిలేస్తాను మై ఫ్రెండ్. మిమ్మల్ని నేను ఆపలేదు. మీకూ నాకూ శతృత్వం లేదు. నాక్కావలసిన సమాచారం చెప్తే నా దారిన నేను వెళ్ళిపోతాను. మీ దారి మీది."

"అడగండి సాబ్."

"నేను గువ్వలకొండకి ఆవల వున్న కొండదేవత గుహకి చేరుకోవాలి. అడవిలో దారితప్పి ఇటుగా వచ్చాను. దగ్గర దారి చెప్తే చాలు. నన్ను ఇబ్బంది పెట్టాలని తప్పుదారి చూపిస్తే మిమ్మల్ని వదలను. మీ గూడెం వచ్చి నిజంగానే మిమ్మల్ని చంపేస్తాను."

"లేదు దొరా. కొండదేవత అనగా మాకు అలాంటి ఉద్దేశంలేదు. మీకు దగ్గరి దారి చెప్పాను. ఇట్టనే ఓ అర్ధనే ఓ అర్ధగంట నడిచాక ఓ పాడుబడ్డ సత్రం వస్తుంది. ఆ సత్రం వెనకనుండి సన్నటి కాలిబాట తూర్పుగా పోతోంది. ఆ దారిన నడచిపోవడమే కష్టం. కాని జాగ్రత్తగా పోతే రెండు మూడు గంటల్లోనే మీరు గువ్వలకొండను చేరుకుంటారు. అక్కడ నుంచి ఎడం పక్క బాట మిమ్మల్ని కొండదేవత గుహకి చేరుస్తుంది. అయితే ఈ దారి చిరుతలు తిరిగే దారి. వాటికంట పడకుండా జాగ్రత్త గాపొండి దొరా."

"థాంక్స్ బ్రదర్! ఇక నాకు వదిలెయ్."

వాళ్ళని దాటి ముందుకు సాగిపోయాడు శ్యామ్ సుందర్.

అతను వెళ్ళిపోయిన సరిగ్గా మూడుగంటల తర్వాత భగవాన్ దాదా వేన్ లు అదే మార్గంలో ప్రయాణించాయి. కాని అప్పటికి ఆ ప్రాంతం నుంచి తమ దారిన వెళ్ళిపోయారు గిరిజనులు నలుగురూ. తెల్లవారాక వేన్ లను పరిశీలించి వాటి సైలెన్సర్స్ లోనిపచ్చికాయల్ని తీసిపడేసి ప్రయాణమయ్యేసరికి ఏడు గంటలు దాటిపోయింది వాళ్ళకి సమయం.

దారిలో శ్యామ్ సుందర్ వదిలేసిన వేన్ ని చూసి అంతా ఆగారు. పంక్చరయిన టైరు మార్చి రెడీ చేసుకుని ఆ వేన్ తో సహా ముందుకు సాగటంతో చాలా ఆలస్యమైపోయింది వాళ్ళకి. అప్పటికే శ్యామ్ సుందర్ గువ్వలకొండకు వెళ్ళే మార్గ మధ్యంలో నడచిపోతున్నాడు.

## 20

రివ్వున దూసుకొచ్చిన జీపు కొండదేవత విగ్రహం ముందున్న నీళ్ళ తొట్టి పక్కన ఆగింది.

జీపు దిగింది సూకీ.

ఓసారి పరిసరాల్ని గమనించింది.

కొండ పాదంలో సహజంగా ఏర్పడినట్టుంది ఆ గుహ. గుహలోని కొండ దేవత విగ్రహం భారీ ఎత్తున వుండి భీకరంగా వుంది. అక్కడికి సమీపంలోనే కుడిపక్కన ఉధృతంగా ప్రవహిస్తున్న కొండవాగు నీటి గలగల శబ్దాలు విన్పిస్తున్నాయి.

నీటితొట్టి పక్కన నిలబడి తల పైకెత్తి చూసింది సూకీ. అంత ఎత్తున కొండ పైనుంచి జారిపడి కూడా తనింకా ప్రాణాలతో ఉండటం ఆశ్చర్యమే కదా. ఆ క్షణాలు తలుచుకుంటుంటే ఇప్పటికీ శరీరం వణుకుతోంది.

ఆ రాత్రి తన ప్రాణాలు కాపాడిన ఆ నీటి తొట్టిని ఆప్యాయంగా తాకింది. కొండదేవత విగ్రహానికి వినయంగా మనసారా నమస్కారాలు చేసింది.

తను ప్రయాణం చేసి వచ్చిన జీపు ఫారెస్టు డిపార్టుమెంట్ వాళ్ళది. తప్పు ఆ రేంజర్ దయినా ఈ జీపు తన దగ్గర వుండటం ప్రమాదం. దీన్ని వదిలించుకోవాలి. అలాగే తన వంటిమీద గార్డు యూనిఫాం కూడా తీసేయాలి.

ముందు యూనిఫాం తీసేసి తన చారల పాంటు, టీ షర్టు దానిపైన చారల షర్టు ధరించింది. యూనిఫాంని జీపు సీటుకిందకు తోసేసింది.

జీపులో స్పృహలేని స్థితిలో వున్న జలీల్ ఖాన్ ని జాగ్రత్తగా లాగి అమ్మవారి విగ్రహం పక్కన బండమీద పడుకోబెట్టింది. జీపును స్టార్టు చేసి తీసుకెళ్ళి కాస్త దూరంలో పొదలపక్కన ఆపి వచ్చింది.

అప్పటికీ జలీల్ ఖాన్ లో చలనంలేదు.

ఆ రాత్రి తను కొండపైనుంచి జారిపడ్డాక ఆ తర్వాత శ్యామ్ సుందర్, జలీల్ ఖాన్‌లు ఏమయ్యారు, ఏం జరిగిందన్న విషయాలేవీ తనకు తెలీదు. ముఖ్యంగా శ్యామ్ సుందర్ ఏమయ్యాడో తెలియాలంటే ఖాన్ కి స్పృహరావాలి. దాదా వర్గం తనని చుట్టుముట్టేలోపు తను శ్యామ్ సుందర్ ని కలవటం చాలా అవసరం.

దోసిళ్ళతో తొట్టిలోని నీరుతీసి, జలీల్ ఖాన్ ముఖానకొట్టి... "ఖాన్! మిస్టర్ ఖాన్" అంటూ ఖాన్‌కి తెలివి రప్పించాలని ప్రయత్నించింది. కాని ఎంత అరిచినా అతడిలో చలనం లేదు.

"నువ్వెంత అరిచినా ప్రయోజనం ఏమీ వుండదు. కనీసం ఇంకో గంట గడిస్తే గాని అతనికి తెలివిరాదు" అంటూ ఉన్నట్టుండి తన వెనక మాటలు విన్పించటంతో అదిరిపడి చివ్వున వెనక్కి తిరిగింది సూకీ.

ఎవరో అపరిచిత వ్యక్తి సరాసరి తన వద్దకే వస్తూ కన్పించాడు. చూడ్డానికి బయట నుంచి అడవిలోకి వచ్చిన మనిషిలా వున్నాడు. కాబట్టి అతను దాదా గూండాల్లో ఒకడై వుండొచ్చు అనుకొంటూ గుప్పిళ్ళు బిగించి ముందుకొస్తూ "ఎవర్నువ్వు ? ఇక్కడ ఏం చేస్తున్నావ్ ? ఇతనికి అప్పుడే తెలివిరాదని ఎలా చెప్తున్నావ్ ?" అంటూ నిలదీసింది.

వచ్చిన వ్యక్తి కాలేషావలీ.

ఆ విషయం ఆమెకు తెలీదు. ఇంకా చెప్పాలంటే అతన్ని ఎప్పుడూ చూళ్ళేదు. ఆమె కంగారు చూసి నవ్వుతూ మరింత దగ్గరగా వచ్చాడు వలీ.

"చూడమ్మాయ్! ఇన్ని ప్రశ్న లు ఒకేసారి వేస్తే బదులు చెప్పడం కష్టం. నా అనుమానం కరక్టయితే అతను టాక్సీ డ్రైవరు జలీల్ ఖాన్. అవునా ?" అనడిగాడు.

"ఆ మాట నిజమే. నీకెలా తెలుసు ?" తన ఆశ్చర్యం మరోమెట్టు పైకి పోతుండగా అడిగింది సూకీ.

"మరో విషయం కూడా తెలుసు. ఇతని టాక్సీలో శ్యామ్ సుందర్ సాబ్ తో పారిపోయి వచ్చిన చైనా అమ్మాయివి నువ్వు అవునా ?"

"అవును. నా పేరు సూకీ. నువ్వు భగవాన్ దాదా మనిషివి కాదా ?"

"కాదు. నా పేరు కాలేషావలీ. శ్యామ్ సుందర్ సాబ్ కి ఫ్రండ్ ని. సాబ్ నుంచి ఆఫీసుకు మెస్సేజి ఏమీ రాకపోవడంతో ఏం జరుగుతుందో తెలుసుకు రమ్మని పంపిస్తే గురుదాస్ పూర్ వచ్చాను. మీరు ఘనాపూర్ అడవిలోకి తప్పించుకున్నట్టు తెలిసి మీకోసం వచ్చాను. నిజానికి ఇతను ఎవరో నాకు తెలియదు. మీ కోసం గాలిస్తుంటే ఇతను పాముకాటుకు గురై ప్రమాదస్థితిలో వున్నాడు. నాకు తెలిసిన నాటువైద్యంచేసాను. అక్కడ బండమీద పడుకోబెట్టి తినటానికి ఏమైనా తెచ్చుకుందామని అలా అడవిలోకి వెళ్ళాను. తిరిగి వచ్చి చూస్తే ఇతనక్కడలేడు. టైర్లగుర్తును బట్టి అటుగా ఎవరో వచ్చారని వూహించి వెదుకుతూ ఇటు వచ్చాను. ఇంతకీ మా శ్యామ్ సుందర్ సాబ్ ఎక్కడ ?"

కాలేషావలీ మాటలు విని , పెద్దగా నిట్టూర్చింది సూకీ.

"అది తెలీకే నేనూ కంగారుపడుతున్నాను. చెడ్డపని చేయాలంటే ఏ అడ్డంకీ వుండదు. కాని ఒక మంచిపని చేయాలని సంకల్పించినప్పుడు భగవంతుడు ఎందుకిన్ని అవరోధాలు కల్పిస్తాడో అర్థంకాదు" అంటూ ఆరోజు మొదటి సారిగా తను ఫోన్ చేసి శ్యామ్ సుందర్ తో మాట్లాడినప్పట్నుంచి తర్వాత జరిగిన విషయమంతా కాలేషావలీకి వివరించింది సూకీ.

ఆమె మాటలు విని ఆశ్చర్య సంభ్రమంతో ఒకసారి కొండపైకి తలెత్తి చూశాడు కాలేషావలీ. తల గిర్రున తిరిగినంత పనయింది.

"మూడు వందల అడుగుల ఎత్తుకు కొంచెం కూడా తగ్గదు. అక్కడ నుంచి కిందపడ్డ ఏ జీవికూడా ప్రాణాలతో బ్రతకదు. అక్కడి నుంచి పడి నువ్వింకా బ్రతికున్నావంటే అది ఖచ్చితంగా ఈ కొండదేవత కరుణే కారణమయి వుండాలి. ఈ నీళ్ళ తొట్టి నువ్వు బ్రతికినంతకాలం గుర్తుంచుకోవాల్సిన వస్తువు" అన్నాడు. తిరిగి తనే అడిగాడు.

"నీ సంగతి సరే. మా శ్యామ్ సుందర్ సాబ్, జలీల్ ఖాన్ వీళ్ళిద్దరి సమాచారం ఏమిటి ?"

"జలీల్ ఖాన్ కి స్పృహ వస్తే గాని ఆ వివరాలు తెలీవు."

"చైనా అమ్మాయివి మా భాష ఇంత స్పష్టంగా మాట్లాడటం చాలా ఆశ్చర్యంగా వుంది. నువ్వు ఇండియాలో పెరిగిన చైనా అమ్మాయివా ?"

"కాదు. నేను పుట్టి పెరిగింది అంతా హాంకాంగ్ లోనే. అక్కడ ఇండియన్ ఫామిలీస్ తో నాకు పరిచయాలున్నాయి. అందుకే వచ్చు."

"వివరించే అవకాశం ఎక్కడుంది ? వెంట వెంటనే జరిగిపోయాయి సంఘటనలు. అదేగా నా బాధ. అటు ఆ దాదా మనుషులు తిరిగి ఇక్కడికొస్తారని అనుమానంగా వుంది."

"వచ్చినా రావచ్చు. ఎందుకంటే, ఈ జలీల్ ఖాన్ టాక్సీ దగ్గర ఆరుగురు గూండాల్ని కాపలా వుంచిపోయాడు. ఏమైనా ఖాన్ కి తెలివి వస్తే గాని మనం ఏమీ చేయలేం. ఈ లోపల ఓ పనిచేద్దాం. నాకు ఆకలిగా వుంది. తినటానికి ఏమైనా రెడీ చేస్తాను" అంటూ లేచాడు వలీ.

అప్పుడు గమనించింది సూకీ. ఆతడి భుజంమీద కర్రకు ఒక కుందేలు, మూడు నాటుకోళ్ళు వేలాడుతున్నాయి.

"నాకూ ఆకలిగా వుంది" అంది.

కొన్ని ఫలాలు ఆమెకు ఇచ్చాడు వలీ. తను కార్యరంగంలోకి దిగాక వేటాడి తెచ్చిన కోళ్ళని, కుండేలుని శుభ్రం చేసి, వాటి మాంసానికి చక్కగా నూనె పట్టించి, ఉప్పు, కారం, మసాలా దినుసులు అద్ది పూచకు గుచ్చాడు. నెగడు మండించి, నిప్పులు చేసి దోరగా వాటిని కాల్చి సిద్ధం చేశాడు.

"నువ్వు అడవిలో తిరుగటానికి అవసరమైనవన్నీ పికప్ చేసుకునే వచ్చి నట్టున్నావ్" రుచికరమైన అడవి కోడిమాంసం తింటూ అంది సూకీ.

"నిజం చెప్పాలంటే అంతే మేడం. ఈ అడవులు నాకు బాగా తెలిసినవే. అవసరమైతే వారం రోజులు అడవిలో తిరగటానికి ఇబ్బందిలేకుండా రెడీ అయి వచ్చాను" అంటూ తనూ తినటం ఆరంభించాడు.

అతనివద్ద ఇంకా కొంత విప్పసారా మిగిలి వుంది. అది ఖాళీచేసి మాంసం మీదికి దాడి చేశాడు. ఆ విధంగా ఇద్దరికీ భోజనాల సమస్య తీరిపోయింది. మరికొద్ది సేపటికి జలీల్ ఖాన్ లో కాస్త చలనం ఏర్పడింది. కాలేషా వలీ అతడి ముఖంమీద నీళ్ళు కొట్టి లేపి కూర్చోబెట్టాడు.

వాడికి అసలు తను ఎక్కడున్నాడు, ఏం జరిగిందీ ఏదీ గుర్తు రాలేదు కాసేపు. సూకీని మాత్రం గుర్తుపట్టాడు. అతని ముఖం వివర్ణమైంది.

"మరీ ఆశ్చర్యపోవద్దు ఖాన్ భాయ్! నేను బ్రతికేవున్నాను" అంది సూకీ.

"నాకేమైంది ? ఎక్కడున్నాను.... ?" పిచ్చి చూపులు చూస్తూ అడిగాడు.

"ఆ సంగతి నేను చెపుతాను. ఇప్పుడు మనమంతా గుహలోని కొండదేవత విగ్రహం దగ్గర వున్నాం. నా పేరు కాలేషావలీ. శ్యామ్ సుందర్ సాబ్ ఫ్రండ్ ని. అడవిలో నువ్వు పాముకాటుకు గురై ప్రమాద పరిస్థితిలో వుంటే నిన్ను కాపాడాను. నా మాటలు అర్థమవుతున్నాయా ?" అడిగాడు వలీ.

"చెప్పండి నాకంతా గుర్తొస్తోంది."

"అయితే ఓ.కె. నీతో వున్న శ్యామ్ సుందర్ సాబ్ ఎక్కడ ?"

"తెలీదు"

"నీకు తెలీకపోవటం ఏమిటి ?"

"సూకీ కొండవైపునుంచి జారిపోయిన కొద్ది క్షణాల్లోనే నేనూ జారి పోయాను. నన్ను కాపాడబోయి శ్యామ్ సుందర్ సాబ్ కూడా జారిపోయాడు. ఇద్దరమూ అటు పక్కనున్న కొండవాగులో పడిపోయాము. నీటిలో పడిన కొద్దిసేపటికే నేను పైకివచ్చాను. కుండపోతగా వాన. వాగు పరవళ్ళు తొక్కుతోంది. చిమ్మచీకట్లో ఏమీ కన్పించటం లేదు. చచ్చిపోయాననే అనుకున్నాను. శ్యామ్ సుందర్ సాబ్ కోసం ఎంత అరిచినా లాభం లేకపోయింది. ఆయన జాడ తెలీలేదు. నేనూ అలా నీటి ప్రవాహంలో పడి ఎంత దూరం కొట్టుకుపోయానో తెలీదు. చివరికి అడవి తీగెలు ఏవో చేతికి తగిలితే వాటి సాయంతో తీరం చేరాను. మరునాటి నుంచి సాబ్ కోసం గాలిస్తునే వున్నాను. ప్రయోజనం లేకపోయింది. ఆయన క్షేమంగా వుంటే ఇక్కడికి తప్పకుండా వస్తారన్న నమ్మకంతో చివరికి ఇటు వస్తుండగా, పాము కాటుకు గురయ్యాను" అంటూ తన అనుభవం వివరించాడు ఖాన్.

అతడి మాటలు వినగానే ఎక్కడలేని నీరసం ఆవహించినట్టు సూకీ ముఖం పాలిపోయింది. ఖాన్ మూలంగా శ్యామ్ సుందర్ జాడ తెలుస్తుందనకున్న ఆశ ఈ విధంగా అడుగంటిపోతుందనుకోలేదు. అతను బ్రతికే వుంటే ఈ పాటికే ఖచ్చితంగా అతను తనకోసం వెదుకులాడుతూ రావాలి. అలా రాలేదు అంటే ఆమె మనసు ఆందోళనకి గురవుతోంది.

"లేదమ్మా! మీరనుకుంటున్నట్టు మా శ్యామ్ సాబ్‌కి ఏమీకాదు" ఆమె మనసులోని మాటను గ్రహించినట్టు కాలేశావలీ నచ్చచెప్పాడు.

"మా సాబ్ గురించి మీకు తెలీదు. ఇంతకన్నా దారుణమైన ప్రమాదాలనుంచే బయటపడిన అనుభవం సాబ్ ది. అంత సులువుగా ప్రమాదాలకి బలికావటం జరగని పని. ఆయన బ్రతికే వుంటాడు. తప్పకుండా వస్తాడు" అన్నాడు.

అతని మాటలు వింటున్న జలీల్ ఖాన్ తల పంకించాడు. అతని పెదవుల మీద చిరునవ్వు మెరిసింది. కళ్ళలో ఉత్సాహం తొంగి చూసింది.

"వలీభాయ్! నీ మాటలు అక్షరసత్యం భాయ్! ఆయన బ్రతికే వున్నారు. వస్తున్నారు. మనకోసం వస్తున్నారు, అటు చూడండి" అంటూ చేయి ఎత్తి పచ్చిక బయలుమీద కుడిపక్కకు చూపించాడు.

చటుక్కున తలతిప్పి అటు చూశారిద్దరూ.

ఆ దిశలో అక్కడక్కడా కొన్ని చెట్లు డొంకలున్నాయి. వాటికి అడ్డంబడి నడుచుకుంటూ వస్తున్నాడొక వ్యక్తి . కాస్త దూరంలో ఉన్నప్పటికీ అతన్ని సులువుగానే పోల్చుకున్నాడు. సిగరెట్ దమ్ము కొడుతూ డొంకదారి దాటి పచ్చిక బయలుమీదికి వచ్చేసాడు శ్యామ్ సుందర్.

అక్కడ గుహదగ్గర సూకీ, జలీల్ ఖాన్ లను చూడగానే తన అంచనా నూటికి నూరు శాతం కరక్టయినందుకు సంతోషించాడు. కాని అక్కడ కాలేషావలీని అతను ఎంతమాత్రం వూహించలేదు. అందుకే వస్తూనే ముందుగా అతడ్నే పలకరించాడు.

"అరె వలీభయ్! నువ్వేమిటి....ఇక్కడ ?" అనడిగాడు.

"ఏం చెప్పను సాబ్ ? మీ నుంచి ఏ సమాచారం లేదని సెక్రటరీ వాసంతి మేడంగారు కంగారుపడుతున్నారు. వాత్సవ సాబ్ ఆగ్ర వెళుతూ ఇక్కడ ఏం జరిగిందో తెలుసుకురమ్మని నన్ను పంపించారు. మీ గురించే కంగారుపడుతున్నాం" అన్నాడు కాలేషావలీ.

"ఏమైపోయారు సాబ్ ? మిమ్మల్ని నా కళ్ళతో చూస్తాననుకోలేదు" అన్నాడు జలీల్ ఖాన్. ఆ మాటలంటుంటే అతడి కళ్ళలో నీరు నిలిచింది. అతడి భుజం తట్టి నవ్వాడు శ్యామ్ సుందర్.

"డోన్ట్ వర్రీ బ్రదర్. మా ప్రొఫెషన్ లో ఇవన్నీ సహజం. నీకు కొత్త గాబట్టి నువ్వు భయపడటంలో ఆశ్చర్యంలేదు. మిస్ సూకీ! నేను భైరన్న గూడెం మీదుగా వస్తున్నాను. నువ్వు అక్కడ వుండిపోవల్సింది.

నువ్వు వచ్చేశాక భగవాన్ దాదా నీకోసం తన పటాలంతో ఆ గూడెం మీదకి దాడిచేశాడు. సింగన్న దొర కుటుంబాన్ని సజీవంగా చంపాలని నిప్పంటించి వెళ్ళిపోయాడు. వాళ్ళని నేను కాపాడాను" అంటూ జరిగింది చెప్పాడు.

"సింగన్న దొర చాలా మంచివాడు. నా మూలంగా వాళ్ళకేమన్నా జరిగి వుంటే ఆ పాపం నన్ను చుట్టుకునేది. వాళ్ళని కాపాడి మంచిపని చేసావ్. థాంక్స్ శ్యామ్" అంది కన్నీళ్ళతో సూకీ.

శ్యామ్ సుందర్ అడవి దారుల్లో నడచి నడచి రావటంతో చాలా అలసిపోయి వున్నాడు. అందుకే ముఖం కాళ్ళు చేతులు కడుక్కుని కాలేషావలీ రెడీ చేసి యిచ్చిన ఆహారం తీసుకున్నాడు.

ఆకాశం మబ్బు పట్టినట్టు సూర్యుడు కన్పించటం లేదు. వాతావరణం చల్లగానే వుంది. శ్యామ్ సుందర్ సూకీ వంక చూసాడు.

"నా వెనుక భగవాన్ దాదా, వాడి మనుషులు ఇక్కడికొచ్చే ప్రయత్నంలో అడవిలో తిరుగుతున్నారు. ఇంకో గంటలో వాళ్ళు ఇటు రావచ్చు. సో.... మిస్ సూకీ! ఏదో ఒక ప్రాబ్లం తిరిగి మీదపడకముందే ఈసారయినా నీ స్టోరీ చకటకా విన్పించేస్తే బాగుంటుంది" అనడిగాడు.

సూకీ ఏదో చెప్పేలోపలే కాలేషావలీ అడిగాగాడు.

"నా దగ్గర సెల్ వుంది. ఆఫీస్ కు ఫోన్ చేయనా సాబ్..... ?" అంటూ.

"ఇప్పుడు ఫోన్ చేయటం అంత అవసరమా ? ఎందుకు ?" రింగు రింగులుగా సిగరెట్ పొగ వదులుతూ తాపీగా అడిగాడు శ్యామ్ సుందర్.

"ఏంలేదు సాబ్! వాసంతి మేడం కంగారుపడుతున్నారు. ఫోన్ చేసి ఒకమాట చెప్తే బాగుంటుందని...." మనసులో మాట చెప్పాడు వలీ.

"నాకు బాగుండదు. ఎందుకంటే నేను వెనక్కి వెళ్ళగానే అర్జంటుగా చేసేపని ఏమిటో తెలుసా ? వాత్సవతో మాట్లాడి వాసంతిని ఇంటికి పంపించేయటం."

"అరే అల్లా.... అదేమిటి సాబ్!"

"అందతే వలీభాయ్! కంగారుపడే అమ్మాయిలు మా ఆఫీసులో సెక్రటరీ పోస్ట్ కి పనికిరారు. అర్థమైందా ? వాసంతిని డిస్మిస్ చేయిస్తాను నువ్వు ఫోన్ చేస్తే."

"చేయను సాబ్! చచ్చినా ఫోన్ చేయను. వాసంతి మేడంకి మా మూలంగా ఉద్యోగం పోకూడదు" అంటూ అవతలకు వెళ్ళిపోయాడు వలీ.

"చెప్పు సూకీ! ఏం జరిగింది ?" ఆ చైనా అమ్మాయిని గుచ్చి గుచ్చి చూస్తూ అడిగాడు.

సూకీ గొంతు విప్పింది.

"మాది హాంకాంగ్! ముందే చెప్పాను.... నా తల్లి పేరు చిన్ లీ. నా తండ్రి మాత్రం ఇండియన్. ఆయన పేరు విజయప్రతాప్ సింగ్. ఆయన బరోడా రాజవంశానికి చెందినవాడు" అంది.

"వెరీ ఇంట్రస్టింగ్! చెప్పు.... తర్వాత ఏమైంది ?" కుతూహలంగా అడిగాడు శ్యామ్ సుందర్.

"విజయప్రతాప్ సింగ్‌కి ఇక్కడ ఇద్దరు భార్యలున్నారు. మొదటి భార్యకు పిల్లలు లేకపోతే రెండో భార్యను చేసుకున్నాడు. రెండో భార్యకు ఆడపిల్ల పుట్టింది. తనకి మగసంతానం కావాలని ఆయన ఆశ. హాంకాంగ్‌లో ఆయనకి పాతికకోట్ల వరకు వ్యాపారం, ఆస్తులు వున్నాయి. అప్పట్లో హాంకాంగ్ వ్యవహారాలు చూడడానికి నా తల్లి చిన్ లీ ఆయన దగ్గర సెక్రటరీగా పనిచేసేది. ఉద్యోగంలో చేరిన నా తల్లి క్రమంగా ఆయనకు దగ్గరయింది.

నా తల్లి ద్వారానయినా మగబిడ్డలు కలక్కపోతారా అనే ఆశతో ఆయన నా తల్లిని పెళ్ళి చేసుకున్నాడు. కానీ ఆయన ఆశలకు విరుద్ధంగా ఆడపిల్లను నేను పుట్టాను. అయినా ఆయన బాధపడలేదు. నన్ను ప్రేమగా చూసేవారు. మాకు ఏ లోటూ లేకుండా అన్ని ఏర్పాట్లు చేసారు. సంవత్సరానికి రెండు మాసాలు ఆయన మా దగ్గర గడిపేవారు. ఈ లోపల ఆయన పెద్ద భార్యకు మగసంతానం కలిగింది. తనకి మగబిడ్డ పుట్టినందుకు డాడీ ఎంత ఆనందించారో నాకింకా గుర్తుంది. హాంకాంగ్ రాగానే ఇంట్లో గొప్ప పండగే జరిపారంటే చూడండి... అంతగా ఆనందించారు.

తర్వాత కాలంలో పరిస్థితులు మారాయి. డాడీ పోయారు. డాడీమీద బెంగతో పెద్దమ్మ పోయిందట. మమ్మీ కూడా డాడీ మీద బెంగతోనే కన్ను మూసింది. అప్పటికి నాకు పద్దెనిమిది సంవత్సరాలు. నేను ఒంటరిని కాకూడదనే ఉద్దేశంతో మమ్మీ చనిపోయేముందు నాకు, నా ఆస్తికి నా మేనమామ, తన తమ్ముడు అయిన బ్రాడ్ లీని గార్డియన్‌గా నియమించింది. అప్పటికీ నేను మమ్మీని వారించాను.

బ్రాడ్ లీ మంచివాడు కాదని నాకు తెలుసు. కానీ మమ్మీ నా మాటలు విన్పించుకోలేదు. డాడీ హాంకాంగ్‌లోని ఆస్తుల్ని మమ్మీకి ఇచ్చి వేయటం చేత ఆ ఆస్తికి నేను వారసురాల్ని అయ్యాను. నిజానికి డాడీ

ఫ్యామిలీలో ఎవరికీ మా గురించి తెలీదనే అనుకుంటాను. డాడీ ఎప్పుడూ సీక్రెట్స్ బయటపెట్టే వారుకాదు. ఆయన నన్ను ముద్దుగా సుధా అని పిలిచేవారు. ఆయన కృషివల్లనేనేను మీ భాషలు కూడా నేర్చుకోగలిగాను.

ఇక అసలు విషయానికొస్తాను.

మూడు సంవత్సరాల క్రితం ఒకరోజున మామయ్య బ్రాడ్ లీ ఆరేళ్ళ వయస్సున్న ఒక బాలుని మా ఇంటికి తీసుకొచ్చాడు. ముద్దులు మూటగట్టే ఆ పసివాడు ఎవరి బిడ్డ ? మామయ్య ఎందుకు తీసుకొచ్చాడు.... ? ఏమీ నాకు తెలీదు. కానీ వాడు మాట్లాడేది ఇండియన్ లాంగ్వేజ్. ఏడ్చి ఏడ్చి కళ్ళు వాచినట్టున్నాయి. ముఖంలో విషాదం, భయం గూడుకట్టుకుంది. వాడి వివరాలడిగితే మామయ్య చాలా కోప్పడ్డాడు.

"వాడు ఇక నుంచి ఇక్కడే వుంటాడు. మా ఇంట్లో వుంటాడు. వాడి వివరాల కోసం ప్రయత్నించకు" అంటూ హెచ్చరించాడు. వాడ్ని నాకు చూపించి తనతో వాళ్ళ ఇంటికి తీసుకుపోయాడు.

మా అత్తయ్య కూడా డబ్బు మనిషి. మామయ్యకు తగిన జోడీ! నా ఆస్తిని తమదిగా అనుభవించటమేగాక ఏదో వెధవపని చేసారని నాకు అప్పుడే డౌటు వచ్చింది. ఆ వారంలోనే మరోసారి ఆ కుర్రాడ్ని మా ఇంటికి తీసుకొచ్చాడు మామయ్య. వాడ్ని ఆప్యాయంగా ఎత్తుకుని పేరు అడిగాడు.

తన పేరు ఆదిత్య ప్రతాప్ సింగ్ అని చెప్పాడు. ఆ పేరు వినగానే షాక్ కి గురయ్యాను. ఎందుకంటే, అది మా తాతయ్య పేరు. వాడ్ని లోనకు తీసుకెళ్ళినప్పుడు మా తండ్రి విజయప్రతాప్ సింగ్ ఫోటో చూసి డాడీ.... డాడీ అంటూ ఏడుస్తుంటే నా గుండె కరిగిపోయింది. ఆ పసివాడు ఎవరో కాదు. మా పెద్దమ్మ కొడుకని అర్థమైంది. వాడ్ని మామయ్య ఎందుకు తీసుకొచ్చాడో, ఏం జరిగిందో అర్థం కాలేదు. అప్పటికి ఏమీ తెలీనట్టే కుర్రాడ్ని మామయ్యకిచ్చి పంపించేసాను. తర్వాత తెలిసిన భారతీయ సంతతికి చెందిన కుటుంబాలనుంచి ఇండియా న్యూస్ పేపర్స్ ని గేదర్ చేసి చదివాను. స్కూలు నుంచి అదిత్య ప్రతాప్ సింగ్ ని ఐదుగురు ముసుగు దుండగులు కిడ్నాప్ చేసారని, ఆచూకీ తెలీలేదని, కిడ్నాప్ సందర్భంగా హత్యలు కూడా జరిగాయని తెలిసింది.

నేనేం చేయాలో అర్థం కాలేదు. తన కొడుకును, కొడల్ని మనవడిలో చూసుకుంటున్న మా తాతగార్ని తలుచుకుంటే చాలా బాధ కలిగింది. కానీ నేనెవరో తెలీని ఇంటికి ఫోన్ చేసి ఇలా జరిగిందని ఎలా చెప్పగలను ? నా మాటలు వాళ్ళు నమ్ముతారా ? అసలు హాంకాంగ్ లో డాడీకి ఒక ఫ్యామిలీ వుందన్న సంగతే వాళ్ళకి తెలీదు.

అసలీ కిడ్నాప్ వెనక వుద్దేశం ఏమిటో తెలుసుకుందామని మామయ్య బ్రాడ్ లీని నిలదీసాను. అప్పుడు తన ఉద్దేశం ఏమిటో బయట పెట్టేశాడు.

"అవును. వీడు నీ తమ్ముడు. సందేహం అక్కర్లేదు....ఇండియా నుంచి కిడ్నాప్ చేయించి తీసుకొచ్చాను కారణం ఏమంటావా ? నీ తండ్రి మీకు ఏమిచ్చాడు ? ముష్టి పాతికకోట్ల ఆస్తి. ఇక్కడున్నది మీ ముఖాన కొట్టి మిమ్మల్ని వదిలించుకున్నాడు. కానీ తన రెండో భార్యకు వందకోట్ల ఆస్తి యిచ్చాడు. ఇక మొదటి భార్య కొడుకు ఈ పసివాడికిచ్చిన ఆస్తి ఎంతో తెలుసా ? నాలుగు వందల కోట్లు.

నీకు గార్డియన్‌గా నీ ఆస్తిని చూస్తున్నందుకు యింతకాలం నా స్వార్థంతో ఆదాయం తింటూ వచ్చినమాట నిజం. ఇంకో మూడేళ్ళలో నీ మైనారిటీ తీరిపోతుంది. మీ ఆస్తి నీకు చట్టప్రకారం అప్పగించాలి. ఆ తరువాత మా పరిస్థితి ఏమిటి ? అందుకే ఈ కిడ్నాప్ అన్నమాట. వీడ్ని నా దగ్గర వుంచుకుని, పనికిమాలిన వెధవగా పెంచుతాను. నా గుప్పిట్లో పెట్టుకుని తీసుకెళ్ళి ఇండియాలో కూర్చోబెడతాను. వీడ్ని అడ్డం పెట్టుకుంటే చాలు. నాలుగు వందలకోట్ల ఆస్తి మీద అజమాయిషీ నా గుప్పెట్లో వుంటుంది. అర్థమైందా ? నువ్వు ఈ విషయంలో మౌనంగా వుండు. లేదంటే నీకే ప్రమాదం. నిన్ను చంపించి, నీ ఆస్తికి మేమే వారసులం అవుతాం....." అంటూ వాడు నాకే వార్నింగ్ ఇచ్చి వెళ్ళాడు.

నా తమ్ముడ్ని చూస్తే నాకు బాధగా వున్నా నిస్సహాయురాలిగా వుండక తప్పలేదు. గొప్ప ఆస్తికి వారసుడయి వుండి, మామయ్య ఇంట్లో నా తమ్ముడొక అనాథ. వాడికి ఆ వయసు నుంచే తాగుడు నేర్పాడు. చీట్లాట నేర్పాడు. చదువు మొత్తం నిలిపేసాడు. ఇంటి పని కూడా చేయించుకున్నాడు. తమ్ముడ్ని ఇండియా తీసుకుపోవాలని నిర్ణయించుకున్నాను. తమ్ముడికి ఇప్పుడు తొమ్మిదేళ్ళు.

వారం రోజుల క్రితం నాకు సమయం సందర్భం కలిసొచ్చింది. నేను వాళ్ళింటికి వెళ్ళేసరికి మామయ్య ఇంట్లో లేడు. అత్తయ్య షాపింగ్ కి బయటకు పోతూ ఇల్లు నాకు వప్పగించిపోయింది. సమయం చూసి ఇంట్లో గాలించి తమ్ముడి పాస్ పోర్టు తీసుకున్నాను. వాడ్ని తీసుకుని కార్లో మా ఇంటికొచ్చేసాను. నా పాస్ పోర్టు తీసుకుని ఏర్ పోర్టుకి వచ్చేసాను. ఏ యిబ్బందీ లేకుండా విమానం ఎక్కేసాం.

అయినా నా మనసు ఏదో శంకిస్తూనే వుంది. నా పక్కసీట్లోని ఓ పెద్దాయన నా ముఖంచూసి కారణం అడిగాడు. ఆయన ఎవరో ఆర్మీలో పనిచేసి రిటైరయిన మనిషి. సింపుల్ గా నేను చెప్పిన మేటర్ విని, "కంగారుపడకమ్మా. నీకు నమ్మకంగా సాయం చేసేవాళ్ళ అడ్రసు నేను చెప్తాను. విమానం దిగ్గానే నేనిచ్చిన

నంబర్ కి ఫోన్ చెయ్యి. డైనమిక్ సెక్యూరిటీ సర్వీస్ సర్వీస్ వాళ్ళ ఆఫీసు నంబర్ అది. వాత్సవ గాని, శ్యామ్ సుందర్ గాని ఇద్దరిలో ఎవరున్నా నీకు సాయం చేస్తారు" అంటూ నంబర్ రాసిచ్చాడాయన.

అయితే నేను వూహించింది విమానం దిగ్గానే అక్షరసత్యం అవుతుందని నేను అనుకోలేదు. నేను ఆదిత్య ప్రతాప్ సింగ్ తో ఇండియాకి పారిపోతున్నానని తెలీగానే బ్రాడ్ లీ తన ఏర్పాట్లు తాను చేసేశాడు. వాడి నెట్ వర్క్ గురించి నాకు తెలీదు. నేను తమ్ముడితో ఏర్ పోర్ట్ లో దిగి బయటకు వచ్చేసరికి భగవాన్ దాదా తన మనుషులతో నన్ను కవర్ చేశాడు. మా ఇద్దర్నీ వేన్ లో ఎక్కించుకుని ఒక చోటుకి తీసుకెళ్ళి మమ్మల్ని ఒక గదిలో బంధించాడు. ఎదిరించాలంటే వాళ్ళు తమ్ముడి ప్రాణం తీస్తారనే భయం. వెయిట్ చేశాను.

మూడు గంటల తర్వాత మియాచీని వెంటబెట్టుకొచ్చాడు భగవాన్ దాదా. మియాచీ నాకు తెలిసినవాడు. మామయ్య బ్రాడ్ లీకి వాడు నమ్మినబంటు. వాడు చేసే ప్రతి వెధవపని వెనకా మియాచీ హస్తం వుంటుంది. మూడేళ్ళ క్రితం తమ్ముడ్ని ఇండియా నుంచి కిడ్నాప్ చేయించి హాంకాంగ్ తీసుకొచ్చింది కూడా వాడే. వాడు తమ్ముడ్ని తనవెంట తీసుకువెళుతూ దాదాతో చెప్పిన మాటలు నేను విన్నాను.

ఉదయం ఫ్లయిట్ కి బ్రాడ్ లీ వస్తున్నాడు. ఈ కుర్రాడ్ని ఆయనకు వప్పగించి నేను వెనక్కి వస్తాను. ఈ పిల్లని చంపేయమని ఆయన ఆర్డరు. నాకు దీనిమీద ఎప్పట్నుంచో మనసుంది. నా ఆశ తీరేలా దీని కన్నె అందాలతో విందు చేసుకుని నా చేతులతో చంపేస్తాను. నే వచ్చేవరకు దీన్ని జాగ్రత్తగా చూడండి. కనీసం పది రోజులు ఆగితేగాని మేం వెనక్కి హంకాంగ్ ప్రయాణం చేయలేం. ఈలోపల నీకు తప్పకుండా బ్రాడ్ లీని పరిచయం చేస్తాను" అని చెప్పి ఆదిత్యను తనతో వాడు తీసుకెళ్ళిపోయాడు.

ఇంత కష్టపడి కూడా తమ్ముడ్ని కాపాడుకోలేకపోయాననే బాధ నన్ను నిలవనీయలేదు. మియాచీ చేతుల్లో శీలం కోల్పోయి చావటంకన్నా తప్పించుకుని డైనమిక్ సెక్యూరిటీ సాయం తీసుకోవటం మంచిదనిపించింది. అందుకు సిద్ధమయ్యాను. మరునాడు ఉదయం అవకాశం నాకు వచ్చింది. నాకు టిఫిన్ సర్వ్ చేయాలని లోనకొచ్చిన ఇద్దరు గూండాల్ని పడగొట్టి బయటపడ్డాను. నలుగురు రౌడీలను చితగ్గొట్టి కాంపౌండ్ దూకి వీధిలో కొచ్చేశాను.

అదృష్టం కొద్దీ నా ఏర్ బేగ్ నా దగ్గరే వుంది. అందులో మా పాస్ పోర్టులు, దుస్తులతో బాటు సరిపడా డబ్బు కూడా వుంది. నాకోసం దాదా మనుషులు వీధుల్లో గాలింపు ఆరంభించారు. నేను ఒక హోటల్లో రూమ్ తీసుకుని స్నానం చేసి రెండు గంటలు నిద్రపోయాను. కొంత డబ్బు తీసుకొని ఏర్ బేగ్ ను హోటల్ రూంలోనే వుంచి లాక్ చేసుకుని బయటకొచ్చేశాను. ఆటోలో డైనమిక్ సర్వీస్ ఆఫీస్ వద్దకొచ్చాను. అదే సమయంలో

మీరు ఆఫీసు మెట్లు ఎక్కుతూ కన్పించారు. ఆటో డ్రైవర్ శ్యామ్ సుందర్ మీరేనని చెప్పాడు. నేను ఆటోదిగి మెట్లవైపువస్తూండగా దాదా మనుషులు రావటం కన్పించింది. తప్పించుకుపారిపోయి మీ ఆఫీసుకు ఫోన్ చేశాను. తర్వాత బాద్ షా టీ కార్నర్ దగ్గర మిస్సయ్యాం . మిగిలింది మీకు తెలుసు. బ్రాడ్ లీ నా తమ్ముడ్ని తిరిగి హాంకాంగ్ తీసుకుపోకుండా ఆపగలగాలి. ఆ పని మీరే చేయాలి" అంటూ విషయమంతా వివరించింది సూకీ.

ఆమె కథ వినడానికి మూడు నుంచి నాలుగు సిగరెట్లు తగలేసాడు శ్యామ్ సుందర్. అటు కాలేశావలీ, ఇటు జలీల్ ఖాన్ లు ఇద్దరూ ఆమె మాటలు విని ఆశ్చర్యం నుంచి ఇంకా కోలుకోలేదు.

"వెరీ ఇంట్రస్టింగ్. నీ తమ్ముడు ఆదిత్యప్రతాప్ సింగ్ ని మనం కాపాడే మాట అలా వుంచు. భగవాన్ దాదా, మియాచీల సంగతి ఏమిటి ? నిన్ను సాయంకాలమే కథ వాడికి తెలిసి వుంటుందన్న నమ్మకంతో వాడిని కార్నర్ చేయాలని చూశాను. లక్కీగా తప్పించుకున్నాడు. ఇప్పుడు వాళ్లంతా మనల్ని గాలిస్తున్నారు. ఏం చేద్దాం ?" అడిగాడు శ్యామ్.

"నాకు ముఖ్యం వీళ్ళుకాదు మిష్టర్ శ్యామ్ సుందర్! నా తమ్ముడ్ని కాపాడండి. మనవడికోసం అలమటిస్తున్న మా తాతయ్య వద్దకు చేర్చండి. మీ ఫీజు కోటిరూపాయలయినా ఇస్తాను."

"నువ్వు పదికోట్లు ఇచ్చినా ప్రస్తుతం నీ తమ్ముడు ఎక్కడ వున్నాడో కనిపెట్టడం అసాధ్యం. విశ్వప్రయత్నం చేస్తే గానీబ్రాడ్ లీ ప్రస్తుతం ఇండియాలో ఎక్కడ వున్నాడో ప్రేసవుట్ చేయటం సాధ్యం కాదు. ఆ చోటు తెలిసిన వ్యక్తి ప్రస్తుతం మియాచీ. ఒక్కడే. కాబట్టి వాడ్ని మనం పట్టుకోక తప్పదు. కానీ దాదా తన మనుషులతో వాడికి రక్షణగా వున్నాడు. మనం ఇక్కడ వాళ్ళతో దాగుడుమూతలతో వాడికి రక్షణగా వున్నాడు. మనం ఇక్కడ వాళ్ళతో దాగుడుమూతలకన్నా రాజధానికి వెళ్ళిపోవటం బెటర్ అనుకుంటాను. మనల్ని వెదుకుతూ ఎలాగూ వీళ్ళు అక్కడికి వస్తారు. మా వాత్సవను సంప్రదించి ప్రొసీడవుదాం. ఓ.కె ?"

"ఓ.కె."

అంతా కలిసి దాదా తన మనుషులతో వచ్చే లోపలే అడవిలోంచి బయట పడాలనే నిర్ణయానికి వచ్చేసారు. ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ జీపులో స్పేర్ గా పదిలీటర్ల డీసెల్ ఆయిల్ తో కేన్ వుంది. తమ టాక్సీకి ప్రస్తుతం అది చాలు.

ఇక టైమ్ వేస్ట్ చేయకుండా నలుగురూ జీప్ ఎక్కేసారు. శ్యామ్ సుందర్ స్టీరింగ్ తీసుకున్నాడు.

అర్థగంట ప్రయాణం తర్వాత ఆ జీపు జలీల్ ఖాన్ టాక్సీ వున్న ప్రాంతానికి చేరుకుంది. అక్కడ కాపలా వున్న ఆరుగురు గూండాలు వీళ్ళను చూడగానే ఆయుధాలు ఝళిపిస్తూ పరుగులెత్తుకు వచ్చేసారు. కానీ ఎదిరించి నిలవటం వాళ్ళకి సాధ్యం కాలేదు. శ్యామ్ సుందర్, సూకీలు సుడిగాలిలా విజృంభించారు వాళ్ళమీదికి. నలుగురు తెలివితప్పి పడిపోగా, ఇద్దరు చావు తప్పి దూరంగా పారిపోయారు. వాళ్ళలో ఒకడు తన దగ్గర సెల్ తీసి దాదాకి ఫోన్ చేశాడు.

"ఏమైందిబే ?" ఉరుములాంటి గొంతుతో హుంకరించాడు అవతల భగవాన్ దాదా.

"మనం వెదుకుతున్న వాళ్ళంతా జీపులో ఇక్కడికి వచ్చారు బాస్. మమ్మల్ని చితగ్గొట్టారు. టాక్సీ ట్యాంక్ లో ఆయిలు పోస్తున్నారు. టాక్సీలో వాళ్ళు పారిపోయేలా వున్నారు. మీరంతా ఎక్కడున్నారు ? మమ్మల్ని ఏం చేయమంటారు ?" అనడిగాడు వాడు.

"ఏం చేస్తారు ? అక్కడే ఆత్మహత్య చేసుకు చావండి. చేతకాని వెధవల్లారా! మేం దగ్గరలోనే వున్నాం. వాళ్ళ టాక్సీని అనుసరించి మీరు కూడా వచ్చేయండి. వాళ్ళ సంగతి మేం చూసుకుంటాం!" అంటూ లైన్‌కట్ చేసాడు. దాదా.

ఈ లోపల జీప్ ను అక్కడే వదిలి టాక్సీ ఎక్కేసారు శ్యామ్ సుందర్ వర్గం. సూకీ డ్రైవింగ్ బాధ్యత తీసుకుంది. టాక్సీ స్టార్టయి పొదల్లోంచి బయటపడి రివర్స్ తిరిగి స్లోపుమీదకు వచ్చి అవడవిలో ముందుకు పరుగుతీసింది.

దాదా మనుషులు తెలివితక్కువ వాళ్ళేమీకాదు. వాళ్ళు అక్కడ వదిలి వేయబడిన ఫారెస్ట్ డిపార్ట్ మెంట్ జీపు ఎక్కి టాక్సీని అనుసరించారు.

## 21

అడవిదారిలో నెమ్మదిగా పరుగుతీస్తోంది టాక్సీ. జలీల్ ఖాన్ మృత్యు ముఖంలోకి వెళ్ళి వచ్చినవాడు కాబట్టి ఇంకా నీరసంగానే వున్నాడు. సీటుకి జేరబడి కనులు మూసుకుని విశ్రాంతి తీసుకుంటున్నాడు. పక్కన కాలేషావలీ ఘనాపూర్ అడవుల్లో తన అనుభవం గురించి ఏదేదో అతనికి వివరిస్తున్నాడు.

శ్యామ్ సుందర్ మాత్రం తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. సూకీ దృష్టి డ్రైవింగ్ మీదే వున్నప్పటికీ శ్యామ్ ని గమనిస్తూనే వుంది.

"ఏమిటా ఆలోచన ?" అడిగింది.

"వాళ్ళ గురించే ఆలోచిస్తున్నాను" ఫ్రెష్‌గా సిగరెట్ ముట్టించుకుంటూ చెప్పాడు శ్యామ్ సుందర్.

"ఎవరి గురించి ?"

"ఇంకెవరు బేబీ! మన ప్రత్యర్థులు భగవాన్ దాదా, మియాచీల గురించే, నా అంచనా ప్రకారం ఈపాటికే వాళ్ళంతా మనల్ని చేరుకొని వుండాలి. ఇంతవరకు రాకపోవటం ఆశ్చర్యంగా వుంది."

"వాళ్ళు వచ్చే లోపల మనం హైవేలోకివెళ్ళిపోతాం."

"నేనలా అనుకోవటం లేదు. హైవేలోకి మనం చేరుకముందే మనల్ని కార్నర్ చేయాలని వాళ్ళు ప్లాన్‌తో వస్తున్నారని నా డౌటు."

"మనం వెళ్ళిపోతున్నట్టు వాళ్ళకి దివ్వదృష్టి వుందా ?"

"దివ్యదృష్టి లేకపోవచ్చు. కానీ మనం చితకతన్నిన దాదా మనుషుల దగ్గర సెల్ ఫోన్ ఉండి వుంటుంది. ఓసారి వెనక్కి చూడు. మనం వదిలేసిన జీప్ మన వెనకే వాళ్ళు ఫోలో చేసుకు వస్తున్నారు."

"డామిట్....టాక్సీ ఆపేస్తాను. ఆరుగుర్ని కీళ్ళు విరిచి వడేద్దాం" అంటూ సూకీ కోపంతో కారు ఆపబోయింది. శ్యామ్ సుందర్ వారించాడు.

"ఆపకు బేబీ.... మనం ఆగితే వాళ్ళకి మరింత అవకాశం ఇచ్చిన వాళ్ళం అవుతాం. ముందుకే పోనీ, మనం ఫైటింగ్ కిరెడీగా వుండటం మంచిది" అంటూ హెచ్చరించాడు.

టాక్సీ వేగం పెంచింది సూకీ.

అది గమనించి వారించాడు శ్యామ్ సుందర్.

"వేగం పెంచి కొంచెం కూడా ప్రయోజనం లేదు సూకీ. వాళ్ళు వచ్చేస్తున్నారు. స్లోగాపోనీ!" అన్నాడు.

ముఖం నిండుగా ఆశ్చర్యం నింపుకుంటూ శ్యామ్ సుందర్ ముఖం వంక చూసింది సూకీ. "వాళ్ళు వస్తే మనం వేగంగా వెళ్ళిపోవాలి గానీ, నువ్వేమిటి స్లో చేయమంటావ్ ? అయినా నాకెవరూ కన్పించటంలేదే! ఎక్కడ వాళ్ళు ?" అనడిగింది.

"పరుగెత్తినా లాభం లేనప్పుడు ఆగిపోవటం బెటర్ కదూ. పిల్లి కూడా కార్నర్ చేయబడితే తిరగబడుతుంది. మనం కార్నర్ చేయబడుతున్నాం. అర్థమైందా ? కంటికి ఎవరూ కన్పించనంత మాత్రాన

ప్రమాదం తప్పి పోయిందనుకోవటం చాలా పొరబాటు. మనకి చెవులున్నాయి. జాగ్రత్తగా వింటే పరిస్థితి అర్థమవుతుంది" అంటూ హెచ్చరించాడు.

అప్పుడు గమనించింది సూకీ. తమ టాక్సీ ఇంజన్ సౌండ్ గాక మరికొన్ని శబ్దాలని. ఎడంగా తమని చుట్టి అడవిలోంచి తూనీగ శబ్దాల్లా ఇంజన్ల రొద. అవి దగ్గరవుతున్నాయి. శ్యామ్ సుందర్ వినికిడి శక్తికి విస్తుపోక తప్పలేదు ఆమెకు.

అప్పటికి టాక్సీ చిన్నపాటి స్లోపును దిగుతోంది. డౌన్ లో నీరులేని ఎండిపోయిన వాగు, ఇసకతో నిండి వుంది అది. ఆ వాగు దాటి అవతలికి పోతే హైవే రెండు కిలోమీటర్ల దూరం కూడా వుండదు.

"టాక్సీ ఇక్కడే ఆపు. మనం ఫేస్ టు ఫేస్ ఫైటింగ్ కి రెడీ కావాల్సిన సమయం దగ్గర పడింది. క్విక్ ! గెరిల్లా యుద్ధం గురించి నీకు తెలుసుగా.... ప్రస్తుతం మనం అదే స్టయిల్లో ప్రత్యర్థుల మీదకు విరుచుకుపడబోతున్నాం. స్టాప్ హియర్!" అన్నాడు కరుగ్గా శ్యామ్.

ఒక చెట్టుకింద టాక్సీ ఆపింది సూకీ.

ఇప్పుడు దాదా వర్గానికి చెందిన వేన్ లు రాకను సూచిస్తూ ఇంజన్ సౌండ్స్ అడవిలో మరింత స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"వలీభాయ్! నీ చేతులకి పూర్తిగా పనిపడింది. రంగంలోకి దిగుతావా ?" జలీల్ ఖాన్ని తీసుకుని దూరంగా తప్పుకుంటావా ? ఖాన్ చాలా బలహీనంగా వున్నాడు. అతన్ని ఇందులోకి లాగటం బాగుండదు" టాక్సీ దిగుతూ అడిగాడు శ్యామ్.

"చాలారోజులుగా ఫైటింగులు లేక నా చేతులు దురదలు పడుతున్నాయి సాబ్! మీకిచ్చిన మాటకు కట్టుబడి బడ్డీ కొట్టులో బుద్ధిగా వుంటున్నాను. ఇప్పుడన్నా నాకు ఛాన్సు వదలకపోతే బాగుండదు. నేను ఫైట్ చేస్తాను" అన్నాడు మొండిగా కాలేషావలీ.

"సాబ్! నేనూ గురుదాస్ పూర్ వాడినే. కొట్లాటలు, గొడవలు నాకేమీ కొత్త కాదు. అంతమందిని ఎదిరించి మీరు రంగంలోకి దిగుతుంటే నేనెలా దూరంగా వుండగలను ? ఒక ఆడపిల్ల ప్రాణం తీయటానికి అంతమంది రావాలా ? నా కొడుకుల్ని విరగదీద్దాం సాబ్. సూకీని వప్పగించే ప్రశ్నే లేదు. నేనూ బలహీనంగా లేను!" అంటూ తనూ కారు దిగిపోయాడు జలీల్ ఖాన్.

ఇక ఎక్కువసేపు చర్చించలేదు శ్యామ్ సుందర్.

ఆయుధాలు అందుకుని టాక్సీని అక్కడే వదిలి తలొకపక్కకు చెదిరి పోయారు. వాళ్ళు వెళ్ళిన రెండో నిముషంలో దుమ్ము తెరలు రేపుతూ ముందుగా అక్కడికి వచ్చింది ఫారెస్ట్ డిపార్ట్ మెంటు వాళ్ళ జీపు. అందులో వస్తున్న దాదా మనుషులు ఆరుగురికీ అక్కడ టాక్సీ నిలిచిపోవటం చూడగానే మతిలేదు.

"చూడండి బే. వాళ్ళు టాక్సీ వదిలేసి ఎటు పోయారో అర్జంటుగా చూడండి రా. అవతల బాస్ వచ్చేస్తున్నాడు" అనరుస్తూ జీప్ లోంచి కిందికి ఉరికాడు ఒకడు. వాడి వెనకాలే మిగిలినవాళ్ళు కిందకు దూకారు. టాక్సీని మట్టి చూశారు.

"ఒరే, టాక్సీ ఖాళీగా వుందిరా. ఎవరూ లేరు" అనరిచాడు ఒకడు.

"వాళ్ళు పారిపోతూ వుండాలి. త్వరగా వెదకండి బే!" అనరుస్తూ అయిదుగుర్నీ తరుముతూ జేబులోంచి సెల్ తీశాడు మొదటివాడు.

"ఎవరికి బే ఫోన్ చేస్తున్నావ్ ?" నీడలా వాడి వెనకే ప్రత్యక్షమైన శ్యామ్ సుందర్ కూల్ గా అడిగాడు.

"ఇంకెవరికిబే! మన బాస్ కి" అంటూనే ఏదో డౌటు కొట్టి గిరుక్కున వెనక్కి తిరిగి చూశాడు వాడు.

చూసీ చూడకముందే వాడి గొంతు పుచ్చుకున్నాడు శ్యామ్ సుందర్. క్రూరంగా వాడి కళ్ళలోకి చూస్తూ "సో....ఇదంతా నీ నిర్వాకం అన్నమాట. ఏమనుకున్నావ్ బే, నన్నేమనుకున్నావ్ ?" అంటూ పిడికిలి బిగించి కొట్టాడు ముఖంమీద.

ఒకే దెబ్బ. కిక్కురుమనకుండా నిలుచున్నవాడు నిలుచున్నట్టే తెలివితప్పి కట్టెలా విరుచుకుపడిపోయాడు. వాడి చేతిలో సెల్ ఎగిరి కింద పడింది. "హలో.... హలో కిట్టూ! ఏమైందిబే!" అవతలి నుంచి దాదా గొంతు షౌట్ చేస్తోంది. వేన్ రన్నింగ్ సౌండ్ విన్పిస్తోంది.

శ్యామ్ సుందర్ ఆ సెల్ ని అందుకున్నాడు. ఎదురుగా వున్న రాతి బండకు బలంగా విసిరికొట్టాడు. ఫట్ న శబ్దం చేస్తూ ముక్కలు ముక్కలుగా పగిలిపోయింది అది. భగవాన్ దాదా చెవి ఆ శబ్దానికి ఎందుకూ పనికిరాకుండా పోతుందని అతడికి తెలుసు.

ఈలోపల అటూ ఇటూ పరుగులు తీస్తున్న అయిదుగురు గూండాల్ని తెలివి తప్పించి పక్కకు లాగి పడేశారు సూకీ, వలీ, ఖాన్ లు ముగ్గురూ.

జీప్ లో వున్న మరో ఆయిల్ కేన్ అందుకున్నాడు శ్యామ్. జీప్ ను ముందుకు తోశాడు. అది పల్లంలోకి పరుగుతీస్తూ వాగు ఇసకమీదకు పోయి ఆగింది.

దాని ఆయిల్ టాంక్ ఓపెన్ చేశాడు. జీప్ లోని ఒక తాడు ముక్కను తీసి టాంకు లోపల్నుంచి నేలమీదకు వదిలి దాన్ని ఆయిలుతో తడిపాడు. అక్కడి నుంచి కేన్ లోని ఆయిలును నేలమీద ధారగా వంచుతూ అంత దూరంలోని పొదల వెనక్కు పోయాడు. సరిగ్గా అదే టైంలో కుడిపక్కగా వాగులోని ఇసకమీద దుమ్ము తెరలు రేపుతూ దూసుకొచ్చి జీపు పక్కన ఆగింది ఒక వేన్.

ఆ వెనకే ఎడంపక్కగా మరో వేన్ వచ్చి ఆగింది.

మొదటి వేన్ లోంచి కిందకు ఉరికాడు భగవాన్ దాదా. వాడి వెనకే మియాచీ దిగాడు.

"ఎక్కడిదిరా.... ఈ జీప్ ఎక్కడ్నుంచి వచ్చిందిరా ? అనరిచాడు జీపు వంక చూస్తూ.

"ఏయ్ దాదా.....అటు చూడు. టాక్సీ ఇక్కడే వుంది. వాళ్ళు ఇక్కడే వున్నారు!" అనరిచాడు చేయి ఎత్తి ఎగువన చెట్టుకింద వున్న టాక్సీని చూపిస్తూ మియాచీ.

"వాళ్ళు టాక్సీ వదిలి పారిపోతున్నట్టున్నారు. ముందు మన ఎదవలు ఎక్కడున్నారో చూడండి. క్విక్!" అనరిచాడు చుట్టూ చూస్తూ దాదా.

రెండో వేన్ తో వాళ్ళు టాక్సీవై పుపరుగెత్తారు.

ఇంతలో వెనక నుంచి రెండు అటు ఇటు రెండుగా రివ్వురివ్వున దూసుకొచ్చి ఆగాయి మిగిలిన వేన్ లు. కోతుల మూకలా గూండాలు కిందకు ఉరికి పరుగులెత్తుకొస్తున్నారు.

సరిగ్గా అదే సమయంలో తను వున్న చోటనే నేలమీదికి వంచి ఆయిల్ కు నిప్పంటించాడు శ్యామ్ సుందర్. కన్ను మూసి తెరిచేలోన మంటలు వాగువై పుపరుగులు తీశాయి.

దాదా గాని, గూండాలు గాని వూహించని పరిణామం యిది. పెట్రోలు వాసన పసిగట్టడంలో వాళ్ళకి ఆలస్యమైంది. ఆలా గుర్తించనందుకు దారుణంగా పే చేయక తప్పలేదు వాళ్ళకి. మంటల దారిలో నిలబడిన నలుగురికి బట్టలు కాలి, గావుకేకలు వేస్తూ పక్కలకు పరుగుతీశారు. రివ్వున వ్యాపించిన మంటలు దూసుకెళ్ళి సరాసరి జీప్ ఆయిల్ టాంక్ లోకి జొరబడిపోయాయి.

మరుక్షణం ఏర్పడిందక్కడ దారుణ విస్ఫోటనం. చివ్వున పది మీటర్ల ఎత్తుకు ఎగిరిన జీప్ అగ్ని జ్వాలలు వెదజల్లతూవచ్చి పక్కన ఆగిన వేన్ మీద పడింది.

గొల్లున అరుస్తూచట్రాతికి కొట్టిన చిల్లపెంకుల్లా నలుదిక్కులకూ పరుగులు తీశారు గూండాలు. అలా పరుగులు తీస్తుండగానే వేన్ కి మంటలు వ్యాపించి ఆయిల్ టాంక్ దారుణంగా పగిలి మరో విస్ఫోటనం

ఏర్పడింది. చెల్లా చెదురుగా పడిన భాగాల నుంచి ఎగసిపడుతున్న మంటలతో బీభత్సంగా మారింది ఆ ప్రాంతం.

పది నిముషాలపాటు అరుపులు, కేకలు, ప్రేలుళ్ళతో గందరగొళంగా గడిచింది. ఆ సమయాన్ని శ్యామ్ సుందర్ వర్గం చక్కగా వుపయోగించుకుంది. పారిపోయి వస్తున్న వాళ్ళలో దొరికినవాడ్ని దొరికినట్టు తెలివి తప్పించి పొదల్లోకి లాగేశారు. అలా పదిహేనుమందిని సైడ్ చేసేశారు.

ఈ లోపల అరిచి కేకలుపెట్టి తన వాళ్ళందర్నీ వెనక్కి పిలిచి కూడగట్టాడు దాదా. దాదా, మియాచీలతోబాటు మరో నలుగురిదగ్గర రివాల్వర్లు వున్నాయి. అయిదుగురి దగ్గర తుపాకులున్నాయి. మిగిలినవాళ్ళ దగ్గర కత్తులు, ఇనపరాడ్లు వున్నాయి.

మొదటి ఆరుగురుగాక తర్వాత పదిహేనుమందితో కలిపి తన మనుషులు ఇరవై మంది షార్టేజ్ కన్పించడంతో భగవాన్ దాదా కల్లు తాగిన కోతిలా చిందులు తొక్కాడు.

"వాళ్ళు ఇక్కడే వున్నారు. మనల్ని దొంగదెబ్బ తీస్తున్నారు. వదలకూడదు. వాళ్ళని వదలకూడదు. కనబడగానే కాల్చిపారేయండి....." అనరిచి ఆర్డర్ వేసాడు.

వెంటనే అతని మాటలకి అడ్డు వచ్చేసాడు మియాచీ.

"మర్చిపోయవా ? నా కోరిక మర్చిపోయావా ? వాళ్ళందర్నీ చంపమను. కానీ సూకీ... అది నాకు ప్రాణాలతో కావాలి. దాన్ని రేప్ చేసి నా కోరిక తీర్చుకున్న తర్వాతనే దాన్ని చంపేస్తాను. నాకు సూకీ కావాలి" ఇంత లావున గొంతు తెరిచి షౌట్ చేసాడు వాడు.

మియాచీ మాటలకి భగ్గున మండిపడ్డాడు భగవాన్ దాదా. పిచ్చుక గూడు లాంటి జుత్తు పీక్కుంటూ ఉరిమి చూసాడు.

"ఎంతమందిని బలి పెట్టమంటావ్ రా! నా మనుషుల్ని ఎంతమందిని ఆ కుర్రపిల్లకోసం బలిపెట్టాలని చూస్తున్నావ్ ? నీ కోరిక తీర్చాలని నేను బుద్ధి తక్కువై అంగీకరించి ఇప్పటికే తప్పుచేసాను. బ్రాడ్ లీ ఆర్డర్ ప్రకారం అప్పుడే దాన్ని చంపేసి వుంటే ఈ తిప్పలు తప్పేవి. ఇంకా అది కావాలంటున్నావ్. బుద్ధి వుందా ? నీకసలు బుద్ధి వుందా అంటున్నాను. నా మాటలు అర్థమవుతున్నాయా ? మరోసారి నోరు విప్పితే నేనే నిన్ను చంపేస్తాను. పదండిబే.... కాల్చిపారేయండి వాళ్ళని..." అనరిచాడు.

దాదాలో ఇంత కోపాన్ని ఎప్పుడూ చూళ్ళేదు మియాచీ. అందుకే ఇక వాడు నోరు విప్పలేదు. సూకీ వర్గం కోసం గాలింపు ఆరంభమైంది.

ఈ లోపల తను వున్న పొదవైపువచ్చిన ఇద్దరు రివాల్వరు వీరుల మీదికి ఆడచిరుతలా లంఘించి వాళ్ళిద్దర్ని తెలివి తప్పించి రివాల్వర్లు సొంతం చేసుకుంది సూకీ.

మెరుపులా ప్రత్యక్షమై దెబ్బతీస్తూన్న శ్యామ్ సుందర్ వర్గాన్ని ఆపటం ఎలాగో అర్థంగాక చెట్టుకింద నిలబడి చిందులేస్తున్నాడు దాదా. అతడిమీద అలిగిన మియాచీ మౌనంగా టాక్సీ వెనక్కి పోయి నిలబడ్డాడు.

ఇంతలో దడదడ శబ్దం చేస్తూ గగన వీధిలో అతి చేరువగా హెలికాప్టర్ ఒకటి దూసుకుపోవటం కన్పించింది. ఈ సమయంలో ఘనాపూర్ అడవుల మీద హెలికాప్టర్ లో సర్వే చేస్తోంది ఎవరో అర్థం కాలేదు.

అప్పటికే భగవాన్ దాదా మనుషులు సగానికి పైగా తరిగిపోయారు. పిచ్చి పట్టినట్టు కాల్పులు ఆరంభించాడు దాదా.

శ్యామ్ సుందర్ , సూకీలు ప్రతికాల్పులు ఆరంభించారు.

మూడు నిముషాల కాల్పుల్లో ఇరుపక్షాల్లోనూ ఎవరూ గాయపడలేదు. ఇక ఫేస్ టు ఫేస్ ఫైట్ కి అయిపోయాడు శ్యామ్. సమీపంలోని వూడను అందుకొని రాకెట్ వేగంలో గాల్లో దూసుకెళ్ళాడు భగవాన్ దాదా వైపు.

శ్యామ్ రాకని కాస్త ఆలస్యంగా గుర్తించాడు దాదా. రివాల్వర్ ఎయిమ్ చేసే లోపలే శ్యామ్ సుందర్ పాదాలు వాడి గుండెల్ని దారుణంగా తాకాయి.

కెవ్వున అరిచాడు వాడు. చివ్వున ఎగిరి గింగిరాలు తిరుగుతూ పోయి టాక్సీ మీద పడి దబ్బున కిందకు దొర్లాడు. చేతిలో రివాల్వర్ ఎగిరి దూరంగా పడింది. చివ్వున లేచి రివాల్వర్ కోసం పరుగెత్తేలోగా శ్యామ్ సుందర్ పాదం మరోసారి వాడి పక్కటెముకల్ని తాకింది. బాధతో దారుణంగా అరిచాడు దాదా.

ఎనుబోతులా రంకెవేస్తూ రోషంతో తిరగబడి శ్యామ్ తో ఫైటింగ్ ఆరంభించాడు.

మరోపక్క సూకీ మియాచీ వైపుదూసుకెళ్ళింది. వాడు రివాల్వర్ గురిపెట్టక ముందే తన రివాల్వర్ తో వాడి చేతిని షూట్ చేసింది.

రివాల్వర్ పట్టిన చేతిని బుల్లెట్ చీల్చేయటంతో కెవ్వుమన్నాడు వాడు. రివాల్వర్ జారిపోయింది. సూకీకి వాడ్ని చంపే ఉద్దేశం లేదు. అందుకే తన రివాల్వర్ ని జేబులోకి నెట్టేస్తూ హేండ్ టు హేండ్ ఫైట్ కి సిద్ధమయింది.

మియాచీ నెత్తురు ఓడుతున్న తన చేతిని చూసుకొంటూ భగ్గుమన్నాడు.

"రావే.... నిన్ను చంపి అయినాసరే.....ఇవాళ నా కోరిక తీర్చుకుంటాను. నీ చావు నా చేతిలోనే...." ఫైటింగ్ ఆరంభించాడు.

రెట్టించిన కోపంతో అగ్గిశిఖలా విజృంభించింది సూకీ.

మరోపక్క –

కాలేషావలీ, జలీల్ ఖాన్ లు చెరో ఐరన్ రాడ్ పుచ్చుకుని వీరభద్రుని శిష్యుల్లా చెలరేగిపోయారు. దాదా మనుషుల్ని దెబ్బకు ఒకడ్ని పడగొడుతూ వీరవిహారం చేస్తున్నారు.

ఇటు శ్యామ్, దాదాల మధ్య దారుణంగా వుంది పోరు.

అయితే ఈ గందరగోళం మధ్యన జరిగిపోయింది వూహించని సంఘటన. ఉన్నట్టుండి అక్కడ ప్రత్యక్షమైంది పోలీసు పటాలం. పుట్టలోంచి వెలువడిన చీమలదండులా ఆ ప్రాంతాన్ని చుట్టుముడుతున్న పోలీసు బృందాన్ని చూడగానే దాదా మనుషులు పరుగులు ఆరంభించారు. కాని పారిపోయే ఛాన్స్ లేక పోయింది వాళ్ళకి. దొరికినవాడ్ని దొరికినట్టు విరగదీసి కూర్చోబెట్టసాగారు పోలీసులు.

పోలీసులు రంగప్రవేశం చేయటం అటు భగవాన్ దాదాగాని, ఇటు శ్యామ్ సుందర్ గాని వూహించని విషయం. వచ్చింది సాధారణ పోలీసులు కారు. రిజర్వు పోలీసు బృందాలు సుమారు వందపైగా వుంటారు. వాళ్ళలో అరడజను పైగా సుపీరియర్స్ వున్నారు.

ఇంతలో నేలకు దిగుతున్న హెలికాప్టర్ మీద పడింది శ్యామ్ సుందర్ దృష్టి. కాక్ పిట్ లో వున్న వాత్సవని చూడగానే ఏం జరిగి వుంటుందో వూహించేసాడు శ్యామ్. అదే క్షణంలో అప్పుడు గుర్తుకొచ్చింది అతడికి చైనా అమ్మాయి సూకీ. బోడిగుండు మియాచీ కూడా ఇంకా పట్టుబడలేదని గుర్తురాగానే "మైగాడ్! ఏమైపోయారు వీళ్ళిద్దరూ ?" అనుకుంటూ గిరుక్కున వెను తిరిగి వాళ్ళిద్దర్నీ వెదుకుతూ చెట్లతోపులోకి పరుగుతీసాడు.

అతడు అటు వెళ్ళిన వెనకే, దుమ్ము తెరలు రేపుతూ నేలకు దిగింది హెలికాప్టర్ లోంచి దిగారు. ఇవతలకు వస్తూనే వాత్సవ చూపులు శ్యామ్ సుందర్ కోసం గాలించాయి.

క్షణం క్రితం హెలికాప్టర్ దిగుతుండగా అక్కడే కన్పించినవాడు ఇంతలోనే ఎటుపోయాడో అర్థం కాలేదు.

బడేభాయ్ ఇచ్చిన ఇన్ఫర్మేషన్ ఆధారంగా చైల్డ్ కిడ్నాపింగ్ లో సూత్రధారి భగవాన్ దాదా గురించి వివరించాడు వాత్సవ. దాదా వర్గంతో శ్యామ్ సుందర్ తలపడుతున్నాడని, వాళ్ళంతా ఘనాపూర్ అడవుల్లో వున్నారని వాసంతి మూలంగా తెలిసింది.

కాలేషావలీ కూడా వెనక్కి తిరిగి రాకుండా అక్కడే వున్నాడని తెలీగానే, ఇక ఈ సమస్య సాగదీయటం అనవసరం అన్పించింది వాత్సవకి.

శ్యామ్ సుందర్ కి, భగవాన్ దాదాకి మధ్య వ్యవహారం ఏమిటో తనకు తెలీదుగాని, తనకి భగవాన్ దాదా చాలా ముఖ్యం. అందుకే తగిన ఏర్పాట్లతో అడవిలో ప్రవేశించాడు.

అయితే భానుమతిని వెనక్కి పంపించటం అతనికి సాధ్యం కాలేదు. తన తమ్ముడ్ని చూసేవరకు ఇంటికి వెళ్ళే ప్రశ్నే లేదని తెగేసి చెప్పింది. దాంతో ఆమెను వెంట తీసుకురాక తప్పలేదు. హెలికాప్టర్ ఏర్పాటు భానుమతి చేసిందే.

ఇక్కడ వాత్సవ శ్యామ్ సుందర్ కోసం చూస్తున్న అదే సమయంలో అక్కడ చెట్ల వెనక సూకీ, మియాచీల కోసం పరుగుతీస్తున్నాడు శ్యామ్ సుందర్. అతనికి పడుతూ లేస్తూ ఎదురు వచ్చాడు జలీల్ ఖాన్.

"సాబ్....ఇటురండి సాబ్! ఆ పిల్ల సూకీ మియాచీని చంపేలా వుంది. కాలేషావలీ అడ్డుపడుతున్నా వినటం లేదు....ఇటురండి...త్వరగా రండి" అనరిచాడు.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా—

అతనివెంట పరుగెత్తాడు శ్యామ్ సుందర్.

ఖాన్ మాటల్లో ఆవగింజంత కూడా అసత్యం లేదు.

మియాచీని ఎండిపోయిన వాగులోని ఇసుకమీద పడేసి ఫుట్ బాల్ ఆడేస్తోంది సూకీ. అంతలావు మనిషి ఆమె కొట్టే దెబ్బలు తట్టుకోలేక పొర్లి గింతలు పెడుతున్నాడు. అప్పటికే వాడి శరీరం రక్తసిక్తమైంది.బట్టలు

చినిగి పోయాయి. కాలేషావలీని అప్పటికి అరడజనుసార్లు అవతలికి తోసేసి మియాచీ మీద అటాక్‌ని కంటిన్యూ చేస్తోందామె.

"నన్ను రేప్ చేసి చంపే మొనగాడివిరా నువ్వు ? నామీద నీకు మనసయిందా కుక్కా! నన్నే వరనుకున్నావ్ రా, నీ ప్రాణం తీయకుండా వదలను" అంటూ వేట మీదికి తిరిగి అటాక్ చేసే చిరుతపులిలా వాడి మీదికి దాడి చేస్తోందామె. వాడిని శారీరకంగానూ, మానసికంగానూ హింసించి చంపటం ఆమె ఉద్దేశ్యం. అందుకే వాడింకా ప్రాణాలతో వున్నాడు....లేదంటే ఒక్క దెబ్బకి వాడి తలని రెండు ముక్కలు చేసి వుండేది.

"నా మాట విను తల్లో..... వీడు ఛస్తే కొంప మునుగుతుంది. కనీసం శ్యామ్ సాబ్ వచ్చేవరకయినా ఓపికపట్టు. వాడ్ని చంపకు" అని వలీ అరిచి చెపుతూనే వున్నాడు.

సుడిగాలి మాదిరి దూసుకొస్తూనే సూకీ భుజాలు పుచ్చుకుని పక్కకు లాగేసాడు శ్యామ్ సుందర్.

"సూకీ....మతిపోయిందా ? ఏమిటి నువ్వు చేస్తున్న పని. స్టాపిట్" అంటూ షౌట్ చేసాడు.

"నన్నాపకు శ్యామ్! నా శీలాన్ని దోచుకుని, నన్ను చంపాలనుకున్న కుక్కవీడు. మా మామయ్య బ్రాడ్ లీ పారేసే ఎంగిలికూడు తిని బతికే కుక్క వీడెంత, వీడిబ్రతుకెంత ? వీడ్ని చంపేస్తాను. వదులు....."  అంది ఆవేశంగా లేచి వస్తూ.

"వాడు ఛస్తే ఏమిటి లాభం ?" సూటిగా ప్రశ్నించాడు శ్యామ్.

"నీ పగ తీరుతుందిగానీ, నీ తమ్ముడు మనకి దక్కడు. బ్రాడ్ లీ నీ తమ్ముడ్ని తీసుకుని ఎక్కడ స్టే చేసాడో తెలిసింది వీడికి మాత్రమే. అర్థమైందా ? ఇంత శ్రమపడి ఇండియా ఎందుకు వచ్చావో మర్చిపోయి, నీ లక్ష్యాన్ని నువ్వే నాశనం చేసుకోకు. వాడి సంగతి నేను చూసుకుంటాను. వదిలేయ్" అంటూ హెచ్చరించాడు.

అతడి మాటలతో మేల్కొంది ఆమెలో వివేకం. శ్యామ్ సుందర్ చెప్పిన దాంట్లో అసత్యం ఏమీలేదు. బ్రాడ్ లీ ఆచూకీ తెలిసినవాడు మియాచీ ఒక్కడే, వాడ్ని చంపితే నష్టం తప్ప లాభం కొంచెం కూడా లేదు. ఆ విషయం అర్థం కాగానే సూకీ శాంతించింది.

"సారీ!" అంటూ అక్కడ్నుంచి వెనుతిరిగింది.

మియాచీని లేపి ముందుకు నడిపించాడు శ్యామ్ సుందర్. అంతలో అటుగా వచ్చిన పోలీసులు మియాచీని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అంతా టాక్సీ నిలిపిన చెట్టు వద్దకు వచ్చారు.

ఈ లోపల—

అక్కడ గుంపుగా కూర్చోబెట్టిన గూండాలనందర్నీ పరిశీలనగా చూసాడు వాత్సవ.

"ఎవడ్రా.... మీలో భగవాన్ దాదా ఎవడు ?" అనడిగాడు.

అనుచరులు ఎవరూ పెదవి విప్పలేదు.

భగవాన్ దాదా నిశితంగా వాత్సవని చూస్తూ తల ఎగరేసాడు.

"దాదా ఎవడో తెలీకుండానే రిజర్వు పోలీసులతో మరీ వచ్చి ఇక్కడ అరెస్టులు చేయించావా ? నేనే భగవాన్ దాదాని. ఇంతకీ నువ్వెవరు ?" అనడిగాడు రఫ్ గా.

"పిచ్చిగడ్డం , పిచ్చుకగూడులాంటి జుత్తు చూసినప్పుడే అనుకున్నాను నువ్వే దాదావని. ఇక నేనెవరో చెప్పేముందు ఈ అమ్మాయి ఎవరో పరిచయం చేస్తాను. ఈమె పేరు భానుమతి. బరోడా రాజవంశానికి చెందిన అమ్మాయి. విజయప్రతాప్ సింగ్ రెండో భార్య కూతురు. సో.....ఈపాటికి మేటర్ నీకు అర్థమైపోయి వుంటుందనే అనుకుంటున్నాను" అంటూ సిగరెట్ ముట్టించుకున్నాడు వాత్సవ.

అర్థంకానట్టు పెదవి విరిచాడు దాదా.

"నాకు ఏమీ అర్థం కాలేదు. బరోడా రాజవంశానికి నాతో ఏం పని ?" అన్నాడు.

"నీకు అర్థమవుతుంది. మిష్టర్ ఖాద్రి, ఆగ్రాకి చెందిన బడేమియా, జలంధర్ రాంసింగ్ , సూరత్ కి చెందినవాడితో కలిపి మీ అయిదుగుర్నీ ఒకచోట కూర్చోబెడితే తప్పకుండా నీకు అర్థమవుతుంది. రెడీగా వుండు" అంటూ లేచి ఇవతలికి వచ్చేసాడు వాత్సవ.

ఇంతలో శ్యామ్ సుందర్ వచ్చి అతడ్ని కలిసాడు.

"ఏమిటిది ? ఇంత హడావిడి అవసరమా ? పోలీసు బలగాలతో రావాల్సినంత అవసరం ఏమొచ్చింది ?" అనడిగాడు వాత్సవని.

"అవసరం వచ్చింది. వీళ్ళంతా మీ వెంట ఎందుకుపడ్డారో నాకు తెలీదు గానీ, నా కేసుకు సంబంధించి కీలకమైన వ్యక్తి భగవాన్ దాదా. అర్జంటుగా వాడ్ని పట్టుకోవడం కోసం రాక తప్పలేదు. పోలీసులు వాడ్ని తీసుకొస్తారు. మనం వెళ్ళిపోదాం. కమాన్" అంటూ హెలికాప్టర్ వైపుఅడుగు వేసాడు వాత్సవ.

"వన్ మినిట్! దాదాతోబాటు ఈ బోడిగుండు వాడు కూడా చాలా ముఖ్యం. వీడి పేరు మియాచీ. వాళ్ళిద్దర్నీ తీసుకురమ్మని చెప్పు" చెప్పాడు శ్యామ్.

"ఓ.కె." అంటూ వెనక్కి వెళ్ళి పోలీసు అధికారులతో మాట్లాడి వచ్చాడు. వాత్సవ.

ఈ లోపల రెండు మూడు పోలీస్ వేన్ లు అక్కడికి వచ్చాయి. దాదా మనుషుల్ని వేన్‌లలోకి ఎక్కిస్తున్నారు పోలీసులు. వాత్సవతోబాటు భానుమతి హెలికాప్టర్ ఎక్కింది. ఆమె వెనకే సూకీ, శ్యామ్ సుందర్ లు ఎక్కి కూర్చున్నారు.

హెలికాప్టర్ గాల్లోకి లేచింది.

"మీట్ మిస్ భానుమతి. బరోడా రాజవంశానికి చెందిన యువతి. శ్యామ్ సుందర్ నా పార్టనర్" అంటూ వాత్సవ యిద్దరికీ పరిచయం చేసాడు.

ఆశ్చర్యంతో నొసలు విరిచాడు శ్యామ్ సుందర్

"చాలా విచిత్రమైన పరిస్థితి.... నాతో కూడా ఒక యువతి వుంది, ఆమె కూడా బరోడా రాజవంశానికి చెందినదే. ఆమె తండ్రి విజయప్రతాప్ సింగ్" అన్నాడు నవ్వుతూ.

"ఇంపాసిబుల్" అంది భానుమతి.

"నా తండ్రిగారికి నేను మాత్రమే కూతుర్ని. మరో అమ్మాయిలేదు" అంది భానుమతి.

"ఉంది. రాజవంశం కదా....నీ తండ్రిగారికి హాంకాంగ్ లో ఒక భార్యవుంది. ఆమె పేరు చిన్ లీ. ఆమె కూతురు సూకీ. సుధా అని మీ నాన్నగారు ముద్దుగా పిలుచుకునే అమ్మాయి. ఆమె ఎవరోకాదు, నీ పక్కనున్న ఈ అమ్మాయి. మిస్ సూకీ! అర్థమైందా ? ఆమె నీ అక్క భానుమతి" అంటూ పరిచయం చేసాడు.

హెలికాప్టర్ గగన వీధిలో దూసుకుపోతోంది.

భానుమతి సూకీ క్షణకాలం ఒకరినొకరు చూసుకున్నారు.

"అక్కా....! నువ్వు చిన్నమ్మ అంజలాదేవి కూతురివి కదూ ?" అంది.

ఆ మాటతో భానుమతి అనుమానాలు తీరిపోయాయి. చిన్నప్పుడు తను విన్న సంగతులు గుర్తుకొచ్చేసాయి.

"ఇప్పుడు గుర్తొస్తోంది. మాకు హాంకాంగ్ లో ఆస్తులు వున్నాయని వాటిని డాడీ అక్కడి భార్యకు రాసిచ్చేసారనీ విన్నాను. ఇవాళ ఎంతో సుదినం. నా చెల్లెలిని ఇలా చూడ్డం నాకు చాలా ఆనందంగాను, థ్రిల్ గానూ వుంది" అంటూ సూకీని కౌగిలించుకుని కన్నీరు పెట్టుకుంది.

"ఇంతకీ మేటర్ ఏమిటి ? భగవాన్ దాదాతో అవసరం ఏమిటి ? సిగరెట్ ముట్టించుకుని రింగులు రింగులుగా పొగ వదులుతూ అడిగాడు శ్యామ్ సుందర్.

"మూడేళ్ళ క్రితం జరిగిన ఒక ఛైల్డ్ కిడ్నాప్ కేసులో వాడు ప్రధాన సూత్రధారి. ఆ కుర్రాడు ఏమయ్యాడు, ఎక్కడ వున్నాడు ఈ రోజుకీ ఆచూకీ లేదు" అంటూ జరిగింది వివరించాడు వాత్సవ.

అంతా విని చిద్విలాసంగా నవ్వాడు శ్యామ్ సుందర్.

ఆ నవ్వు చూస్తుంటే వళ్ళు మండింది వాత్సవకి.

"ఏమిటా నవ్వు ? దానికి అర్థం ఏమిటో తెలుసుకోవచ్చా ?" అనడిగాడు సీరియస్ గా.

"తప్పకుండా తెలుసుకోవచ్చు. తెలిసాక నువ్వు కూడా నవ్వుతావ్!"

"అంతగా నవ్వు పుట్టించే విషయం ఇందులో ఏముంది ?"

"ఉంది. మూడు సంవత్సరాల క్రితం జరిగిన ఛైల్డ్ కిడ్నాప్ గురించి నీ పరిశోధన సాగుతోంది. తిరిగి ఇండియా చేరిన ఆ పసివాడ్ని ప్రెసవుట్ చేసే దిశగా నా పరిశోధన సాగుతోంది. ఇంకా చెప్పాలంటే, సూకీని రక్షించి ఆదిత్య ప్రతాప్ సింగ్ ను కాపాడి తీసుకురావటం" అంటూ సూకీ చెప్పిన విషయాలన్నీ వాత్సవకి వివరించాడు శ్యామ్ సుందర్.

"సో..... ఆ పసివాడు ప్రస్తుతం బ్రడ్ లీ దగ్గర వున్నాడు. వాడు ఎక్కడ వున్నాడో మియాచీకి మాత్రమే తెలుసు. వాడి నుంచి ఆ వివరాలు సేకరించే ఉద్దేశంతో మేం ఫేస్ ఫైట్ లో వుండగా మీరు పోలీసులతో రావటంతో కాస్త గందరగోళమైపోయింది పరిస్థితి" అన్నాడు.

మిస్ భానుమతికి వాస్తవాలు తెలియగానే సూకీ మీద ఆమెకు అభిమానం మరింత ఎక్కువైంది.వాత్సవ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

మిస్ భానుమతికి వాస్తవాలు తెలియగానే సూకీమీద ఆమెకు అభిమానం మరింత ఎక్కువైంది.వాత్సవ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"పొరపాటు జరిగిపోయింది. ఈ విషయాలు ముందే తెలిసి వుంటే ఇక్కడే మియాచీ నోరు విప్పించేవాళ్ళం. టైం వేస్ట్ చేయకుండా వెంటనే వాడ్ని మనం ఇంటారాగేట్ చేయాలి. లేకపోతే బ్రాడ్ లీ ఆ కుర్రాడితో మనకి మరింత దూరం వెళ్ళిపోయే ప్రమాదం వుంది" అన్నాడు.

"వాళ్ళంతా వేన్ లలో హైవేలోకి ఈపాటికే వచ్చేసి వుంటారు. మనం వెనక్కి వెళ్ళి మియాచీని హేండోవర్ చేసుకుంటే బెటర్. ఇప్పటికయినా మించి పోయింది లేదు" అంటూ సలహా యిచ్చాడు శ్యామ్ సుందర్.

"ఓ.కె. హెలికాప్టర్ ని వెనక్కి తిప్పండి" అంటూ ఆర్డర్ చేశాడు వాత్సవ.

గగనవీధిలోనే వెనుతిరిగి హై వేవెంట పోలీసు వాహనాలను వెదుకుతూ బయలుదేరింది హెలికాప్టర్.

* * *

"వద్దు. నా వంటిమీద మరొక్క దెబ్బ పడినా చచ్చిపోతాను. నిజం చెప్పేస్తాను" అంటూ రిక్వెస్ట్ చేశాడు మియాచీ.

హై వేపక్కనే పోలీసు వాహనాలు నిలిచాయి.

పక్కన మైదానంలో హెలికాప్టర్ నిలబడుంది.

"ఓ.కె. చెప్పు. బ్రాడ్ లీ ప్రస్తుతం ఎక్కడున్నాడు ?" అడిగాడు వాత్సవ.

"పాట్నాలోని స్వాగత్ హోటల్లో వున్నాడు. సూకీ నుంచి తిరిగి పిల్లవాడ్ని తీసుకున్నాక నేను వాడ్ని పాట్నా తీసుకెళ్ళి బ్రాడ్ లీకి వప్పగించాను. కలిసి వెళ్ళిపోదాం రమ్మన్నాడు. కానీ సూకీమీది ఆశతో నేను వెనక్కి వచ్చాను. వాడితో మాత్రం సూకీని చంపేశామని చెప్పాను. నిన్నటి వరకు బ్రాడ్ లీ నాకోసం పాట్నాలో వెయిట్ చేస్తానన్నాడు. నేను వెళ్ళలేదు గాబట్టి ఈ ఉదయం పాట్నా వదిలి వెళ్ళిపోయి వుంటాడు." వివరించాడు మియాచీ.

"పాట్నా నుంచి ఎక్కడకు వెళ్తాడు ?"

"కలకత్తా....అక్కడ బ్రాడ్ లీకి ఒక ఫ్రెండ్ వున్నాడు. వాడి పేరు సురేన్ ముఖర్జీ. హాంకాంగ్ వస్తే బ్రాడ్ లీ ఇంట్లోనే స్టే చేస్తాడతను. సురేన్ ముఖర్జీని కలిసివుంటే ఒకటి రెండు రోజులు అక్కడ వుంటాడు. లేదంటే అక్కడ్నుంచి వెళ్ళిపోతాడు. ఎయిర్ రూట్ లో వారం పదిరోజుల వరకూ వెళ్ళటం సాధ్యం కాదు బ్రాడ్ లీకి. అంతవరకు ఇక్కడ వుంటే ప్రమాదమని తలుసు."

"ఓ.కె....కలకత్తా వదిలితే ఎటు వెళ్ళే అవకాశం వుంది ?"

"గౌహతి.... అక్కడ బన్సీలాల్ మిశ్రా అనే స్మగ్లర్ తో బ్రాడ్ లీకి వ్యాపార సంబంధాలున్నాయి. వాడిద్వారా సరిహద్దులు దాటి బంగ్లాదేశ్ లోకి వెళ్ళిపోతే అక్కడి నుంచి హాంకాంగ్ చేరుకోవటం సులువు. మూడేళ్ళ క్రితం ఆదిత్య ప్రతాప్ సింగ్ ను భగవాన్ దాదా కిడ్నాప్ చేసి తీసుకొచ్చి వప్పగించింది నాకే. నేను ఆ కుర్రాడితో కలకత్తా వెళ్ళేసరికి అక్కడ బ్రాడ్ లీ మా కోసం ఎదురు చూస్తూ వున్నాడు. అక్కడి నుంచి గౌహతిలో లంచం ఇచ్చి ఒక అనాధాశ్రమం నుంచి ఆ కుర్రాడు అనాధ అని, బ్రాడ్ లీ దత్తత తీసుకున్నాడనీ దొంగ సర్టిఫికెట్లు పుట్టించాం. వాటి ఆధారంగా ఎయిర్ రూట్ లో సునాయాసంగా దేశం వదిలి వెళ్ళిపోయాం. ఇప్పుడు కూడా బన్సీలాల్ వద్దకే వెళ్ళిపోతాడు. ఆదిత్య ప్రతాప్ సింగ్ పాస్ పోర్టు సూకీ నుంచి తీసుకోలేకపోవటం మూలంగా బ్రాడ్ లీకి ఈ ట్రబుల్స్" చెప్పాడు మియాచీ. కలకత్తాలో సురేన్ ముఖర్జీ , గౌహతిలో బన్సీలాల్ అడ్రస్ లు చెప్పాడు.

"ఓ.కె... నువ్వు చెప్పిన ఈ మూడు చోట్లలోనూ బ్రాడ్ లీ జాడ దొరకలేదంటే నువ్వు చాలా కష్టాలు పడతావ్. నిన్ను క్షమించను" హెచ్చరించాడు వాత్సవ.

"నాకు తెలిసింది చెప్పాను. అది నిజం. తర్వాత మీ యిష్టం" అంటూ భారంగా నిట్టూర్చాడు మియాచీ.

"ఏం చేద్దాం ?" అన్నట్టు శ్యామ్ సుందర్ వంక చూశాడు వాత్సవ. సిగరెట్ ఆఖరిదమ్ము లాగి అవతల పారేస్తూ లేచాడు శ్యామ్.

"ఇక వాడితో మనకు పనిలేదు వాత్సవ. వాడి సంగతి చట్టం చూసుకుంటుంది. వాడ్ని పోలీసులకు వప్పగించెయ్. మనం బయలుదేరదాం" అన్నాడు.

మియాచీని పోలీసులు తీసుకుపోయారు.

పోలీస్ వేన్ లు కదిలి ముందుకు సాగేవరకూ ఆగి వాత్సవ బృందం హెలికాప్టర్ ఎక్కింది.

## 22

శ్యామ్ సుందర్, సూకీ ఇద్దరూ పాట్నా ఏర్ పోర్ట్ లోంచి బయటికి వచ్చేసరికి ఉదయం ఎనిమిది గంటలు దైం.

"ఏం చేద్దాం ?" అడిగింది సూకీ. ఉదయపు చలిగాలి హాయిగా వుంది.

ఈరోజు మరింత అందంగా వుంది. ఆమెను ఉడికించాలని–

"మనం వచ్చింది హనీమూన్ కి కాదు బేబీ! బ్రాడ్ లీ కోసం. మనం హోటల్ స్వాగత్‌కి వెళ్తున్నాం" అన్నాడు.

"ఆ మాట మామూలుగా చెప్పొచ్చుగా. హనీమూన్ కి కాదు అని వెటకారం దేనికి ? పిచ్చిపిచ్చిగా వాగితే చంపేస్తాను" అంది రుసరుస లాడుతూ.

"శాంతి శాంతి.... కోపంలో నువ్వు మరింత అందంగా వుంటావు. కీపిటప్" అంటూ టాక్సీని పిలిచాడు.

ముసిముసిగా నవ్వుతూ అతని వెనకే టాక్సీ ఎక్కింది.

హోటల్ స్వాగత్ దిశగా పరుగు ఆరంభించింది టాక్సీ.

మొదట ప్లాన్ వేసింది వాత్సవ. భానుమతితో పాటు నలుగురూ పాట్నా రావాలని. కాని చివరి నిముషంలో ప్లాన్ ఛేంజ్ చేశాడు వాత్సవ. శ్యామ్ సుందర్, సూకీలను పాట్నా పంపించాడు. బ్రాడ్ లీ అక్కడ లేడూ అంటే కలకత్తా రాకుండా వాళ్ళిద్దరినీ గౌహతి చేరుకుని బన్సీలాల్ మిశ్రా అడ్డామీద కన్నేసి వుంచమన్నాడు. తను భానుమతితో కలకత్తా బయలుదేరి వెళ్ళిపోయాడు.

అర్థగంట ప్రయాణం తర్వాత పాట్నా నడిబొడ్డున వున్న ఖరీదైన హోటల్ స్వాగత్ ముందు ఆగింది టాక్సీ. టాక్సీ దిగి పంపించేశాడు శ్యామ్.

ఇద్దరూ రిసెప్షన్ లోకి వెళ్ళారు.

"యస్.... వాట్ కెన్ ఐ డూ ఫర్ యూ సర్ ?" అంటూ రిసెప్షన్ లోని లేడీ ఎంతో వినయంగా శ్యామ్ ని ప్రశ్నించింది.

"మేము మిష్టర్ బ్రాడ్ లీని కలవాలి. రూం నంబర్ ప్లీజ్" చాలా కాజువల్ గా అడిగాడు శ్యామ్ సుందర్.

"యు మీన్ బ్రాడ్ లీ ఫ్రం హాంకాంగ్" నొసలు విరుస్తూ అడిగిందామె.

"యాఁ. అతనితో తొమ్మిదేళ్ళ కుర్రాడు కూడా వుంటాడు" ఓపిగ్గా చెప్పాడు.

"యస్.... బ్రాడ్ లీ వెరీ నైస్ మన్.కుర్రాడితో అర్థగంట క్రితమే బయటికి వెళ్ళారు. కూర్చోండి వస్తారు" అంది పొలైట్‌గా రిసెప్షనిస్టు.

బ్రాడ్ లీ వెళ్ళిపోకుండా ఇంకా హోటల్ స్వాగత్ లోనే వున్నాడంటే శ్యామ్ సుందర్ అసలు నమ్మలేకపోయాడు. మియాచీ చెప్పిన ప్రకారం చూసినా వాడు నిన్న ఉదయమే పాట్నా వదిలేయాలి. ఇక్కడ వుండడని వూహించినా డౌటు క్లియర్ చేసుకోడానికి మాత్రమే పాట్నా రావటం జరిగింది. కాని దానికి విరుద్ధంగా బ్రాడ్ లీ ఇక్కడే వున్నాడంటే బోలెడు ఆశ్చర్యపోక తప్పలేదు ఇద్దరికీ.

"రూం వెకేట్ చేశారా ?" డౌటుకొద్దీ అడిగాడు.

"నోనో....చెయలేదు. రూం నంబర్ త్రీ నాట్ టు. సీ దిస్" అంటూ రిజిష్టర్ తీసి ఇద్దరి ముందుకు తోసిందామె.

ఆమె మాటల్లో అబద్ధం ఏమీలేదు.

రూం ఇంకా బ్రాడ్ లీ పేరుమీదే వుంది.

"మీరు వెయిట్ చేయండి. ప్లీజ్" అంది ఇద్దర్నీ చూస్తూ ఆమె.

"ఓ.కె!" అంటూ అక్కడే వున్న సోఫాలో కూర్చున్నాడు శ్యామ్ సుందర్.

"రిసెప్షనిస్టు ఏదో ప్లే చేస్తోందని డౌటుగా వుంది" పక్కన కూర్చుంటూ గొణిగింది సూకీ.

"ఓ.కె. నువ్వు ఇక్కడే కూర్చో. నేవెళ్ళి త్రీనాట్ టుని ఒకసారి చెక్ చేసి వస్తాను" అంటూ లేచాడు శ్యామ్ సుందర్.

అంతలో ఒక వ్యక్తి నిపిలిచి శ్యామ్ సుందర్ , సూకీలను చూపించి ఏదో చెప్పింది రిసెప్షనిస్టు.

అతను దొరనవ్వులు ఒలకబోస్తూ గబగబా యిద్దరి ముందుకు వచ్చాడు.

"క్షమించాలి. నా పేరు మనోహర్. ఈ హోటల్ మేనేజర్ ని. మీరు బ్రాడ్ లీ సాబ్ కోసం వచ్చారట ?" అంటూ వినయం కురిపిస్తూ అడిగాడు.

"యస్....అతని కోసమే వచ్చాం" చెప్పాడు శ్యామ్ సుందర్.

"సాబ్ బయటికెళ్ళారు. కొద్దిసేపట్లో వచ్చేస్తారు. ఇంతకీ మీరు ఎక్కడ్నుంచి వస్తున్నారు ?"

"ఢిల్లీ నుంచి."

"ఏమిటి పని ?"

"పర్సనల్."

"మీ పేరు ?"

"ఇవన్నీ చెప్తే గాని బ్రాడ్ లీని పిలిపించవా ?"

"ఓ సారి....అయాం సారీ. పిలిపించక్కర్లేదు. ఆయనే వస్తారు. రాగానే పిలుస్తాను. ప్లీజ్ వెయిట్" అంటూ ఇంకొక్క మాట కూడా మాట్లాడకుండా అవతలకి వెళ్ళిపోయాడతను.

"సూకీ! నీ డౌటు నూరు శాతం నిజం. వెయిట్ అండ్ సీ" అన్నాడు సూకీతో శ్యామ్.

సరిగ్గా పావుగంట తర్వాత.

హడావిడిగా ఇద్దరి ముందుకు వచ్చాడు మేనేజరు మనోహర్.

"సారీ సర్! మిమ్మల్ని ఎక్కువసేపు కూర్చోబెట్టినట్టున్నాను. బ్రాడ్ లీ సాబ్ అయిదు నిముషాల క్రితమే వచ్చారు. పైన వున్నారు. రండి వెళ్ళాం" అన్నాడు.

ముఖముఖాలు చూసుకున్నారు ఇద్దరూ.

మౌనంగా అతడ్ని అనుసరించారు.

లిఫ్టులో ప్రవేశించారంతా.

లిఫ్టు పైకి పోతోంది.

"మీ హోటల్ కష్టమర్స్ అందరికీ ఇలాగే బ్రడ్ లీకి ఇచ్చినంతగా మర్యాద యిస్తారా ?" అడిగాడు శ్యామ్ సుందర్.

"అఫ్ కోర్స్! అది మా డ్యూటీ సర్" అంటూ పళ్ళికిలించాడు వాడు.

లాస్ట్ ఫ్లోర్ లో లిఫ్టు ఆగింది.

అది ఏడో అంతస్థు.

డోరు తెరుచుకుని ముందుగా మనోహర్ ఆ వెనకే ఇద్దరూ బయటికొచ్చారు. ఎదురుగా వున్నది రూఫ్ గార్డెన్. అక్కడ ఎవరూ లేరు. అది చూసి ఆశ్చర్యపోలేదు శ్యామ్.

"బ్రాడ్ లీ ఎక్కడ ?" కరుగ్గా అడిగాడు మేనేజర్ని.

"ఇక్కడే వున్నారండీ. అదో ఆ మొక్కల వెనక చూడండి" అంటూ కుడిపక్కగా అంత దూరంలోని మొక్కల్ని చూపించాడు వాడు.

అక్కడ ఎవరో వున్న మాట నిజమే.

శ్యామ్ సుందర్ తోబాటు సూకీ నాలుగడుగులు ముందుకెళ్ళాడు. తిరిగి చూస్తే అక్కడ మేనేజర్ మనోహర్ లేడు. లిఫ్ట్ లో వున్నాడు.

"హలో! పావుగంట తర్వాత మళ్ళీ పైకి వస్తాను. కాని మిమ్మల్ని తీసుకెళ్ళటానిక్కాదు. మీ శవాల్ని తీసుకెళ్ళటానికి వస్తాను. మీకు మా బ్రాడ్ లీ సాబ్ కావాలా..... ? హిహిహి" అనరిచాడు.

వాడ్ని లిఫ్టులోంచి బయటకు లాగి ఒక్క గుద్దుతో పళ్ళు రాలగొడితే ఎలా వుంటుందన్న ఆలోచన కుదిపి వదిలింది శ్యామ్ సుందర్ ని.

లిఫ్ట్ కిందకు వెళ్ళిపోయింది.

"సో....గెట్ రెడీ సూకీ. ఇక్కడ బలమైన ఏర్పాటు ఏదో చేసే వుంచాడు బ్రాడ్ లీ" అంటూ సూకీని హెచ్చరిస్తూ అడుగులు ముందుకు వేశాడు శ్యామ్ సుందర్.

ఇద్దరూ రూఫ్ గార్డెన్ మధ్యకు చేరుకునేసరికి మొక్కల వెనక అలికిడయింది. అదే క్షణంలో అంతవరకు కుడిపక్క మూలన అటు తిరిగి కూర్చునున్న దుక్కలాంటి వ్యక్తి చివ్వున పైకి లేచి ఇద్దరికీ ఎదురు వచ్చాడు. మొక్కల వెనక నుంచి సుమారు పదిమంది బలమైన వ్యక్తులు ఇద్దర్నీ రౌండప్ చేస్తూ ముందుకు రాసాగారు. వాళ్ళ చేతుల్లో తళతళ మెరుస్తున్నాయి పొడవాటి కత్తులు.

"ఎవరు మీరు ? బ్రాడ్ లీతో ఏం పని ?" వెకిలిగా నవ్వుతూ ముందు కొచ్చి ప్రశ్నించాడు మొదటి వ్యక్తి.

"ప్రస్తుతం వాడితో పనిలేదు బ్రదర్. ఉన్న పనంతా నీతోనే. ఈ బచ్చాగాళ్ళను వేసుకుని వచ్చావ్. ఎవరు నువ్వు ? ఏమిటి కథ ?" రఫ్ గా చూస్తూ అడిగాడు శ్యామ్ సుందర్.

"ఏమిటీ....బచ్చాగాళ్ళా ? ఒరే, మీరు బచ్చాగాళ్ళటబే, విన్నారా ?" అంటూ అదేదో గొప్ప జోకులా చప్పట్లు కొట్టి మరీ ఫెళ్ళున నవ్వాడు వాడు.

వాడు నవ్వుతూనే వున్నాడు.

శ్యామ్ సుందర్ మెరుపులా కదిలాడు. ఎంత వేగంగా అంటే, ప్రత్యర్థి కిందపడి కెవ్వున అరిచేవరకు కూడా ఏం జరిగిందో వాడికీ అర్థంగానంత వేగంగా కదిలాడు. ముందు వరుసలోని మూడు పళ్ళు రివ్వున ఎగిరి

గవ్వల్లా రాలాయి. బొటబొటా నెత్తురు పొంగుతూండగా, "నన్నే కొట్టాడు....వేసేయండి బే యిద్దర్నీ" అంటూ గొంతు చించుకుని అరిచాడు.

వాడి అరుపు గొంతు దాటకముందే శ్యామ్ సుందర్ కుడిపాదం హేమర్ లా తాకింది వాడి పక్క బెముకల్ని. బాధతో మరోసారి గొల్లున అరిచాడు వాడు.

శ్యామ్ సుందర్ తమని బచ్చాగాళ్ళని ఎందుకన్నాడో అప్పటిగ్గాని అర్థంకాలేదు వాడికి.

"మమ్మల్ని వేసేసే మగాళ్ళబే మీరు, రండిబే" అంటూ వాడ్ని వదిలేసి గిరుక్కున వెనుకిరిగాడు.

అతను చెప్పే వరకు ఆగలేదు. సూకీ. శ్యామ్ సుందర్ మొదటి వాడ్ని పడగొట్టిన మరుక్షణమే అడవిచిరుతలా రంకెవేస్తూ, రాక్షసిలా విరుచుకుపడింది మిగిలిన వాళ్ళమీద. మరోపక్క నుంచి శ్యామ్ సుందర్ సుడిగాలి మాదిరి విజృంభించాడు.

వాళ్ళ చేతుల్లోని పదునైన నకత్తులు వీళ్ళిద్దరి చేతుల ముందు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. వట్టి చేతులతోనే ఎలా ఫైట్ చేయవచ్చో ఆ ఇద్దర్నీ చూపించాలనిపించేంత అద్భుత ప్రదర్శన.

అరుపులు, కేకలు, ఆర్తనాదాలు, మూడే మూడు నిముషాలు సూపర్ ఫైట్. కరెంట్ షాక్ తిన్న కాకుల్లా వాళ్ళంతా తలోపక్కన కిందపడి బాధతో పొర్లిగింతలు పెట్టారు. చుట్టూ చక్కని మొక్కలు, తీగలు తెగి చెల్లాచెదురుగాపడి బీభత్సంగా వుందా ప్రాంతం.

కిందకు వెళ్ళిన మేనేజరు ఏ క్షణంలోనయినా లిఫ్ట్ లో పైకి రావచ్చు. శ్యామ్ సుందర్ సైగను అర్థం చేసుకుని వేగంగా వెళ్ళి లిఫ్ట్ రూం పక్కన రెడీగా నిలబడింది.

ఈ లోపల తొలిసారిగా తన చేతిదెబ్బ రుచి చూసి, మూడు పళ్ళు రాలగొట్టించుకున్న హీరోని కుక్కను లాగినట్టు లాగి కూర్చోబెట్టాడు శ్యామ్.

"చెప్పరా....బ్రాడ్ లీ ఎక్కడ..... ?" సిగరెట్ ముట్టించుకుంటూ కూల్ గా అడిగాడు వాడ్ని.

ఆ ప్రశ్న తనకి అస్సలు అర్థంగానట్టు చూశాడు వాడు. పైగా "బ్రడ్ లీ ఎవరు ?" అంటూ ఎదురు ప్రశ్నించాడు.

"మీరంతా ఎవరు ? ఎందుకొచ్చారు ?"

"నా పేరు డాంగే సాబ్. ఈ ప్రాంతం గూండాని, మేనేజరు మనోహర్ కి నమ్మినబంటుని. హోటల్ దగ్గర గొడవలు జరిగితే నా సాయం తీసుకుంటాడు. ఇప్పుడూ అలాగే వచ్చాం. అతను పిలిస్తే వచ్చాం...." చెప్పాడు వాడు.

"బ్రాడ్ లీ ఎవరో తెలీదంటావ్."

"సత్యంగా తెలీదు సాబ్."

"మరి బ్రాడ్ లీతో ఏంపని ? అంటూ రాగానే నన్నెందుకు ప్రశ్నించావ్ ?"

"అలా అడగమని మనోహర్ చెప్పాడు సాబ్! ఇంతకుమించి నాకేమీ తెలీదు."

"ఓ.కె. మనోహర్ రానీ, నీముందే చెప్పిస్తాను" అంటూ లేచి ఇవతలికి వచ్చేశాడు శ్యామ్.

సరిగ్గా మరో మూడు నిముషాలు తర్వాత విన్పించింది లిఫ్ట్ పైకి వస్తున్న శబ్దం. సూకీ గుప్పిళ్ళు బిగించి, డోర్ పక్కన రెడీగా నిలబడి వుంది. శ్యామ్ సుందర్ మొక్కల చాటుకు తప్పుకున్నాడు.

లిఫ్ట్ పైకి వచ్చింది.

డోర్ తెరుచుకుంది.

లిఫ్ట్ లోంచి అడుగు బయట పెట్టకుండానే రూఫ్ గార్డెన్ లో ఎదురుగా దృశ్యం చూసి అదిరిపడ్డాడు మేనేజర్ మనోహర్. వీరకిశోరాల్లా నిలబడి వుండాల్సిన డాంగే మనుషులు నేలమీద పడి మూలుగుతున్నారు. వచ్చిన యువతి యువకుడు యిద్దరి జడలేదు.

కంగారుపడి లిఫ్ట్ డోర్ మూయబోయాడు. వాడికా ఛాన్స్ వదల్లేదు సూకీ. మెరుపులా డోర్ లోకొచ్చింది. వాడి కాలర్ పుచ్చుకుని దూది మూటను లేపినట్టు లేపి బయటకు విసిరేసింది.

కింద పడుతూనే నడుం విరిగిపోయినంత బాధతో కెవ్వున అరిచాడు వాడు. ఆ బాధ నుంచి తేరుకునేలోపలే శ్యామ్ సుందర్ బూటుకాలు వాడి గుండెలమీద వుంది. అతడి చేతిలోని పొడవు కత్తిని చూడగానే పై ప్రాణాలు ఎగిరిపోయినట్టు మరోసారి కెవ్వుమన్నాడు గజగజ వణికిపోతూ.

"వద్దు....నన్ను చంపొద్దు. ప్లీజ్" అనరిచాడు.

"మమ్మల్ని చంపమని వీళ్ళందర్నీ ఏర్పాటు చేసిన కుక్కవి. నీకెందుకురా చావంటే భయం ? బ్రాడ్ లీ ఎక్కడున్నా పట్టుకోగలం. కాని నువ్వింత హైడ్రామా నడిపాక నిన్ను చంపకుండా వదలను. నీ తల నరికి వీధిలోకి విసిరేస్తాను" అంటూ కత్తి ఎత్తాడు . అంతే—

వాడు భయంతో చచ్చిపోతూ శ్యామ్ సుందర్ కాళ్ళని చుట్టుకుపోతూ "నన్ను చంపకండి సాబ్. పిల్లలుగలవాణ్ణి . తప్పుచేశాను. క్షమించండి" అంటూ బావురుమని ఏడ్చేశాడు.

"ఓ.కె...చంపను. లేచి కూర్చో" అంటూ వాడ్ని లాగి కూర్చోబెట్టాడు. ఎదురుగా కూర్చుని ఫ్రెష్ గా మరో సిగరెట్ వెలిగించుకున్నాడు శ్యామ్.

"చెప్పు. బ్రాడ్ లీ ఇక్కడ నుంచి ఎప్పుడు వెళ్ళాడు ?" అడిగాడు.

"నిన్న ఉదయం వెళ్ళిపోయాడు సాబ్."

"వెంట కుర్రాడు వున్నాడా ?"

"వున్నాడండి , ఆదిత్య ఆయనెంటే వున్నాడు."

"ఎక్కడికి వెళ్ళాడు ?"

"కలకత్తా....సురేన్ ముఖర్జీ యింటికి."

"రైలుకా, విమానానికా ?"

"రైలుకి వెళ్ళారండి. ప్రస్తుతం సురేన్ ముఖర్జీ యింట్లోనే వున్నారు. ఉదయం ఏడుగంటలకు నాకు ఫోన్ చేసి మాట్లాడారు."

"సరే... ఇప్పుడు అసలు విషయానికి రా. ఈ గూండాల ప్లాన్ ఎవరిది ? మేం వస్తాని వూహించింది ఎవరు ? అసలు బ్రాడ్ లీకి నువ్వు ఇంత ప్రాముఖ్యత యివ్వటానికి కారణం ఏమిటి ?"

"కారణం వుంది సాబ్. ఆయన మా ఓనరు. మా హోటల్ స్వాగత్ యజమాని బ్రాడ్ లీ."

వాడి మాటలు వినగానే సూకీ , శ్యామ్ సుందర్ లు ముఖముఖాలు చూసుకున్నారు. బ్రాడ్ లీకి ఇక్కడ ఆస్తులు వున్న సంగతి ఇంతవరకు సూకీకి కూడా తెలీదు. అది కూడా కాదు.

కనీసం మియాచీ కూడ హోటల్ స్వాగత్ కి యజమాని బ్రాడ్ లీ అన్న సంగతి చెప్పలేదు. ఇందుకే మూడేళ్ళ క్రితం ఆ కుర్రాడ్ని కిడ్నాప్ చేసినప్పుడు హోటల్ స్వాగత్ కేంద్రమైంది. ఇప్పుడూ అదే. బ్రాడ్ లీ పాట్నా నుంచి కథ నడిపించటంలో కారణం ఏమిటనేది ఇప్పుడు అర్థమైంది.

"ఓ.కె. తనకోసం ఎవరైనా రావచ్చని ఎలా వూహించాడు ?" తన తదుపరి ప్రశ్న అడిగాడు శ్యామ్.

"ఓ.కె. తనకోసం ఎవరైనా రావచ్చని ఎలా వూహించాడు ?" తన తదుపరి ప్రశ్న అడిగాడు శ్యామ్.

"ఎలా అంటే....మియాచీ మీద బ్రాడ్ లీ సాబ్ చాలా కోపంగా వున్నాడు. సూకీ అనే అమ్మాయి మీకు తెలుసా ?" మనోహర్ అడిగాడు.

"నా పక్కనున్న అమ్మాయి సూకీ. నీలాంటివాళ్ళు పదిమందిని వట్టి చేతులతో చంపేస్తుంది. ఏం జరిగిందో చెప్పు."

"మైగాడ్ ! సూకీ అంటే ఈ అమ్మాయా.....సాబ్. ఈ పిల్ల పట్టుబడగానే చంపేసి వుంటే సమస్య వుండేదికాదని సాబ్ అభిప్రాయం. అలా చేయకుండా ఈ పిల్ల కోసం మియాచీ వెనక్కి రావటమే సమస్యలకు మూలం అయిందట. గురుదాస్ పూర్ కి ఫోన్ చేసి ఎవరితోనో మాట్లాడినప్పుడు ఆ పిల్ల కోసం వీళ్ళంతా ఘనాపూర్ అడవుల్లో గాలిస్తున్నట్టు తెలిసింది. దాంతో సాబ్ విసిగి పోయాడు. తన కోసం ఎవరైనా వచ్చే అవకాశం వుందని, వస్తే ఖతం చేయించమని ఆర్డర్ చేసి ఆయన వెళ్ళిపోయారు. మిమ్మల్ని తప్పుదోవ పట్టించి ఖతం చేయించాలని చూసిన పాపిని, నన్ను క్షమించి వదిలేయండి సాబ్. ఇంకెప్పుడూ పొరబాట్లు చేయను" అంటూ రెండు చేతులూ జోడించాడు వాడు.

"ఓ.కె. నీ దగ్గర సురేన్ ముఖర్జీ ఫోన్ నంబర్ వుందా ?" అడిగాడు శ్యామ్.

"లేదుసాబ్. అవన్నీ బ్రాడ్ లీ పర్సనల్ డైరీలో వుంటాయి" చెప్పాడు మనోహర్.

"ఓ.కె. ఈసారి వాడు ఫోన్ చేస్తే మేం కలకత్తా వస్తున్నామని చెప్పు. తప్పించుకుపోలేడు. ఈ వెధవల్ని వెంటనే ఆస్పత్రికి పంపించు. లేదంటే ఛస్తారు వెధవలు. సూకీ! లెటజ్ గో " అంటూ వెనుతిరిగి లిఫ్ట్ వైపు అడుగులు వేశాడు శ్యామ్ సుందర్.

అతడ్ని అనుసరించింది సూకీ.

"ఏం చేద్దాం ?" వీధిలోకొచ్చాక అడిగింది సూకీ.

"మనం గౌహతి వెళ్ళిపోదాం. బ్రాడ్ లీ ఓ గుంటనక్క. అంత తేలిగ్గా మనవాళ్ళకి కలకత్తాలో దొరికే అవకాశం లేదు" అన్నాడు శ్యామ్.

అటుగా వచ్చిన టాక్సీ ఎక్కి—

ఏర్‌పోర్ట్‌కి వెళ్ళిపోయారు ఇద్దరూ.

## 23

ఆ వీధిలో ఆ చివరి నుంచి ఈ చివరివరకు కాలినడకన అటు ఇటు తిరిగారు వాత్సవ, భానుమతి ఇద్దరూ. సురేన్ ముఖర్జీ ఇంటిని ఫైండవుట్ చేయటం కష్టంకాలేదు. ఎందుకంటే, వీధి మధ్యలో కుడి పక్కన విశాలమైన కాంపౌండ్ లో వుంది అందమైన ఆకుపచ్చని భవంతి. చుట్టూ ఎత్తయిన కాంపౌండ్.పెద్ద కాంపౌండ్ గేట్, అక్కడొక గూర్ఖా. అంతా చాలా పకడ్బందీగా వుంది. గూర్ఖాని దాటి లోనకు ఎంటర్ కావటం కష్టం కాదు. కాని అప్పాయింట్‌మెంట్ లేకుండా సురేన్ ముఖర్జీ తమతో మాట్లాడతాడా అనేది సమస్య. కలకత్తాలోని కోటీశ్వరుల్లో వాడొకడు.

"ఏం చేద్దాం ? లోనకు పోదామా ?" అనడిగింది భానుమతి.

"గూర్ఖా మనల్ని వదలడు. లోనకు వెళ్ళినా ముఖర్జీ వున్నాడో లేదో తెలీదు. ముందే గొడవపడితే, బ్రాడ్ లీ జారుకునే అవకాశం వుంది. రా చెప్తా" అంటూ సమీపంలోని యస్ టిడి బూత్ వైపు అడుగులేసాడు వాత్సవ.

"సురేన్ ముఖర్జీ ఫోన్ నంబర్ కోసం ప్రయత్నిద్దాం" అంటూ లోనకు అడుగుపెట్టాడు వాత్సవ.

సుమారు అర్ధగంట సేపు కలకత్తా టెలిఫోన్ డైరెక్టరీని పరిశోధించాక దొరికింది ముఖర్జీ ఇంటి ఫోన్ నంబరు. ఆ నంబర్ కి ఫోన్ చేసాడు వత్సవ.

ఎవరో ఫోన్ లిఫ్ట్ చేసారు."

"హలో....ముఖర్జీసాబ్ వున్నారా ?" అడిగాడు.

"సాబ్ బయటకెళ్ళారు. నేను మిసెస్ ముఖర్జీని. ఎవరు మాట్లాడుతోంది ?" అవతల నుంచి లేడీ వాయిస్.

"మేడం నేను మియాచీని. బ్రాడ్ లీసాబ్ ఇక్కడే వున్నారా ? గౌహతి వెళ్ళిపోయారా....నేను అర్జంటుగా సాబ్ ని కలవాలి మేడం" వాయిస్ బొంగురు చేసి అడిగాడు.

"మియాచీ..... ఏమయ్యా , బాగున్నావా ?" అడిగిందామె.

"బాగున్నాను మేడం. నేను రావటం ఆలస్యమైంది...."

"సరిసరి..... బ్రాడ్ లీ ఇక్కడే వున్నారు. అర్థగంట క్రితం పాట్నా నుంచి ఎవరో ఫోన్ చేశారు. దాంతో ఇక్కడ వుండటం బాగుండదని బ్రాడ్ లీని, ఆ కుర్రాడిని తీసుకుని కారులో వెళ్ళారు ముఖర్జీ. బహుశ మన గెస్ట్ హౌస్ కి తీసుకెళ్ళి వుంటారనుకుంటాను. ఆ కుర్రాడికి వంట్లో బాగుండలేదు. రెండ్రోజుల వరకు ప్రయాణాలు అవీ చేయకూడదని డాక్టర్లు చెప్పారు."

"అలాగా. థ్యాంక్యూ మేడం. ఇంతకీ ఏ గెస్ట్ హౌస్కి వెళ్ళుంటారు ? నేను సరాసరి అక్కడికే వెళ్ళి కలుస్తాను."

"ఇప్పుడు ఎక్కడి నుంచి మాట్లాడుతున్నావ్ ?"

"రైల్వేస్టేషన్నుంచిమేడం."

"అలాగా.... ఓల్డ్ టౌన్ సౌత్ లోని పార్థసారథి గుడిపక్క వీధిలో గెస్ట్ హౌస్ తెలుసుగా... అక్కడికే వెళ్ళారు. నువ్వు వెళ్ళు. నేను ఫోన్ చేసి చెప్తాను."

"అక్కర్లేదు మేడం. ఫోన్ దేనికి ? నేను వెళుతున్నాగా. ఉంటాను" అంటూ లైన్కట్ చేసాడు వాత్సవ.

ఫోన్ బిల్లు పే చేసి బయటకొచ్చారు ఇద్దరూ. టాక్సీలో కూర్చున్నాక అడిగింది భానుమతి ఏమైంది ? అని.

"ముఖర్జీ భార్యనంటూ ఒక లేడీ మాట్లాడింది. నేను మియాచి పేరు వాడటం మంచిదయింది. ముఖర్జీ వాళ్ళిద్దర్నీ గెస్ట్ హౌస్ కి తీసుకెళ్ళాడట. ఇప్పుడు అక్కడికే పోతున్నాం. ఒకటి, ఆమె చెప్పింది నిజమై అక్కడ మనకి ఆదిత్యతో సహా బ్రాడ్ లీ దొరకవచ్చు. లేదా మనల్ని ట్రాప్ చేయటానికి ప్లాన్ కావచ్చు. మనం రెడీగా వుండాలి" అంటూ హెచ్చరించాడు వాత్సవ.

"మనం వస్తున్నట్టు వాళ్ళకి తెలీదుగదా. ట్రాప్ చేసే అవకాశం ఎక్కడిది ?" అనుమానంగా అడిగింది భానుమతి.

"అవకాశం వుంది మిస్ భానుమతి. మా శ్యామ్ సుందర్ తో బాటు సూకీ పాట్నా వెళ్ళారు. ఆ సంగతి మర్చిపోయినట్టున్నావ్. అక్కడ గడబిడ జరిగి వుంటే, ఆ సంగతి ఖచ్చితంగా ఇక్కడికి ఫోన్ చేసే అవకాశం వుంది. కాబట్టి ఇక్కడికి కూడా వెదుకుతూ ఎవరో కొందరు వచ్చే అవకాశం వుందని వూహించటం పెద్ద సమస్య కాదు" తన అభిప్రాయం చెప్పాడు వాత్సవ.

అతను వూహించి చెప్పినప్పటికీ జరిగిన వాస్తవం అదే. హోటల్ స్వాగత్ నుంచి మేనేజర్ మనోహర్ ఫోన్ చేసేవరకు బ్రాడ్ లీ కుర్రాడు ఆదిత్యతో సురేన్ ముఖర్జీ ఇంట్లోనే వున్నడు. ఆ ఫోన్ లో వివరాలు తెలుసుకున్నాకనే ముఖర్జీతో ఆలోచించి గెస్ట్ హౌస్ కి షిఫ్టయ్యే ఆలోచన చేసింది.

అర్ధగంట పైగా ప్రయాణించి పార్థసారధి గుడి దగ్గరకు చేరుకుంది టాక్సీ. అక్కడే దిగిపోయి టాక్సీని పంపించేసాడు వాత్సవ.

వీధి చివరకు విసిరేసినట్టుంది ఆ గెస్ట్ హౌస్. చుట్టూ మూడు అడుగుల ఎత్తుకు మించిన కాంపౌండ్ గోడ వుంది. విశాలమైన ఆవరణ మధ్యలో చక్కని బంగ్లా. కాంపౌండ్ లో రకరకాల ఫలవృక్షాలు, వాటి కింద రెండు జీప్ లు, అరడజను మోటార్ బైక్ లు, ఒక కారు వున్నాయి. లోన ఎంత మంది వున్నారో తెలీదు. బయట పదిమంది గూండాలు అటు ఇటు తిరుగుతున్నారు.

"నీ డౌటు నూరుశాతం నిజమైంది వాత్సవ. వాళ్ళు రెడీగా వున్నారు" అంది ఆ బంగ్లాని గమనిస్తూ భానుమతి.

"కాని బ్రాడ్ లీ ఇక్కడికి వచ్చాడో లేదా తెలీదు."

"వచ్చాడు. రాకపోతే అంత కాపలా దేనికి ?"

"ఓ.కె....పదినిముషాలు వెయిట్ చేద్దాం. తర్వాత లోనకు ఎంటరవుదాం. నాకెందుకో వాళ్ళింకా రాలేదని అనుమానంగా వుంది."

"అనుమానం పెళ్ళాంతోనే కాదు, అనుమానం మొగుడితో కూడా కాపురం చేయటం కష్టమేనట. మా వేలువిడిచిన మేనత్త చెప్పేది. అలానే అనుమానంతో చేసే పనులు కూడా సక్సెస్ కావు."

"కావచ్చు. కాని నాతో కాపురం చేయాలని మాత్రం ఆశపడకు. ఆహ్... అలాంటి అభిప్రాయం నీ మనసులో వుందేమోనని అనుమానం సుమా. కరాటే వచ్చిన పిల్లతో కాపురం కష్టమని మా వేలు విడిచిన మామయ్య చెప్తూ వుంటాడు."

"అలాగా....ఆ మామయ్య ఎవడో నా దగ్గరకు పంపించు. ఒక్క దెబ్బతో ముఖంపగలగొట్టి చంపేస్తాను" అంటూ నవ్వేస్తూ బయలుదేరింది.

"ఏయ్. ఎక్కడికి ?" కంగారుగా అడిగాడు.

"సారీ మిస్టర్ వాత్సవ్! నీలా మీనమేషాలు లెక్కపెడుతూ కూర్చునే అలవాటు నాకు లేదు. నేను లోనకెళ్ళిపోతున్నాను. నువ్వు మంచి ముహూర్తం చూసుకుని లోనకు రా" అంటూ గోడదూకి లోనకు వెళ్ళిపోయింది.

చికాగ్గా తల విదిలించాడు వాత్సవ్.

ఆడపిల్లలతో వచ్చిన తంటా ఇదే.

ముందు వెనుకలు చూసుకోకుండా ముందుకు ఉరుకుతారు. ఆలోచించి లాభం ఏమిటి ? తనూ ఎంటర్ గాక తప్పదు. సిగరెట్ ఆఖరి దమ్ము లాగి అవతల పడేసి తనూ గోడ దూకాడు వాత్సవ.

"ఏయ్ అమ్మాయ్... ఎవర్నువ్ ? అక్కడే ఆగు. అడుగు ముందుకు వేస్తే ఖతం అయిపోతావ్" ముందుగా ఆమెను చూసిన గూండా ఇంత లావున నోరు తెరిచి అరుస్తూ, గబగబా ఆమె దారికి అడ్డం వచ్చేశాడు.

"నేను ఆగటంలేదు బ్రదర్! ఖతం చేస్తావా ? కమాన్" అంటూ సమీపిస్తూనే సూపర్ వేగంతో కదిలింది భానుమతి.

ఏం జరిగిందో అర్థంగాకుండా గావుకేక వేసాడు వాడు. రెండు చేతులతో ముఖం కప్పుకుని బోర్లా పడిపోయాడు. వాడు ఏమయ్యాడో కూడా చూడలేదు ఆమె. తనవైపు దూసుకొస్తున్న హీరోల మీదకు సుడిగాలి మాదిరి దూసుకెళ్ళింది.

లోనకు వస్తూనే అక్కడ దారుణ పోరాటంలో బిజీగా వున్న భానుమతిని చూసాడు వాత్సవ. వాళ్ళ అరుపులకు, కేకలకు బిల్డింగ్ లోను, చుట్టు పక్కల వున్న గూండాలంతా కట్ట కట్టుకొని పరుగులెత్తుకు రాసాగారు. ఇక ఆలస్యం చేయలేదు వాత్సవ. తనూ ఫైటింగ్ లోకి ఎంటరయిపోయాడు. దొరికినవాడ్ని దొరికినట్టు కుమ్మి పారేస్తున్నాడు.

అసలు ఈ ఫైటింగు ఎందుకు జరుగుతోంది, ఎలా ఆరంభమైంది అనే విషయంలో గూండాల్లోనే పలు అనుమానాలున్నాయి. కాని తీరిగ్గా అడిగే అవకాశం ఎవరికీ లేదు.

సుమారు పాతికమంది గూండాలు.

వాళ్ళు తప్ప అక్కడ ఇంకెవరూ కన్పించటం లేదు. వాత్సవ, భానుమతిలను పడగొట్టాలని గూండాలు విశ్వప్రయత్నం చేస్తున్నారు. కాని వాళ్ళకి సాధ్యం కావటంలేదు సరికదా, చావుదెబ్బలు తింటున్నారు. నిముషానికి ఒకడు తెలివితప్పి కూలిపోతున్నాడు.

గూండాల్ని పడగొట్టి బిల్డింగ్ లోకి ఎంటరై బ్రాడ్ లీ ఆదిత్యల జాడ తెలుసు కోవాలని భానుమతి అగ్ని శిఖలా విజృంభిస్తోంది. మరోపక్క వాత్సవ దెబ్బకి ఒకడ్ని పడగొడుతున్నాడు.

అరుపులు , కేకలు , గందరగోళం

"వేసేయండి. ఇద్దర్నీ ముక్కలుగా నరికి మన పరువులు నిలబెట్టండిబే. వాళ్ళు ప్రాణాలతో బయటకు పోకూడదు" అంటూ ఫైటింగ్ ని సూపర్‌వైజ్ చేస్తూ ఎడం పక్కగా వుండి అరుస్తున్న జుత్తుపోలిగాడిమీద పడింది వాత్సవ దృష్టి. చిన్నగా అటు కదలనారంభించాడు.

వాత్సవకు దగ్గరగావటం గమనిస్తూనే వాడు గిరుక్కున తిరిగి బిల్డింగ్ లోకి పారిపోబోయాడు.

వాత్సవ ఒక ఐరన్ రాడ్ ని అందుకున్నాడు. చేతికొద్దీ వాడిమీదికి విసిరాడు. గింగిరాలు తిరుగుతూ దూసుకెళ్ళిన ఐరన్ రాడ్ వాడి కాళ్ళని బలంగా తాకి అడ్డంకొట్టింది.

బొక్కబోర్లా పడుతూ కెవ్వున అరిచాడు వాడు. తిరిగి లేచేలోన దుక్కలా వున్న గూండా ఒకడు ఫైటింగ్ లోంచి ఎగిరి వాడి మీద పడ్డాడు.

అంతే.

కిక్కురుమనకుండా తెలివితప్పిపోయాడు వాడు. చావుదెబ్బలు తిని తెలివి తప్పి పడుతున్న వాళ్ళు పడుతుంటే , తెలివి తెచ్చుకుని తిరిగి ఫైటింగ్ లోకివచ్చే వాళ్ళు వస్తున్నారు.

భానుమతి దెబ్బకి వాళ్ళు మంచినీళ్ళు తాగుతున్నారంటే ఆశ్చర్యం లేదు.

మరోపక్క వాత్సవ దొరికినవాడ్ని దొరికినట్టు తాటతీసి వదులుతున్నాడు.

సరిగ్గా ఫైటింగ్ ఆరంభమైన పదో నిముషంలో ఒక ఫారెన్ కారు రివ్వున దూసుకొచ్చింది కాంపౌండ్ లోకి , అక్కడ ముమ్మరంగా సాగుతున్న ఫైటింగ్ ను చూడగానే వచ్చిన కారు వచ్చినట్టే చివ్వున వెనుతిరిగింది.

*"డామిట్... అనుకున్నంతా అయింది. వచ్చినట్టే వచ్చి కారు వెళ్ళిపోతోంది. వాళ్ళిద్దరూ ఆ కారులో వున్నారు. హరియప్..." అంటూ ఫైటింగ్ వదిలి పరుగుతీసాడు అటు వాత్సవ.*

*అతడి మాటలు వింటూనే క్షణం కూడా అక్కడ ఆగలేదు భానుమతి. లేడిపిల్లలా వాత్సవ వెనకే పరుగు తీసింది.*

*కాని అప్పటికే ఆ కారు వీధిలో దూసుకుపోతోంది. భానుమతి అక్కడ వున్న జీపును స్టార్ట్ చేసి వేగంగా వచ్చి వాత్సవ పక్కన ఆపింది. అతడు ఎక్కి కూర్చోగానే ఆ ఫారెన్ కారు వెనక దూకించింది.*

*"ఏమిట్రా ఇది! ఆ కుర్రాడు, ఆ అమ్మాయి ఎందుకు వచ్చినట్టు ? మనల్ని ఎందుకు కొట్టినట్టు ? ఎందుకువెళ్ళిపోతున్నట్టు ?" దెబ్బల నుంచి కోలుకొంటూ పక్కవాడిని అడిగాడు ఒక గూండా.*

*"అదే అర్థంగావటంలేదు బే! అమ్మో.... అది ఆడపిల్ల కాదుబే....ఆడ పులి! వారం రోజులు బెడ్ మీద వున్నా కోలుకోలేననుకుంటూ...." అన్నాడు రెండోవాడు.*

*"అలా కాదురా! వాళ్ళిద్దరూ మన ఛటర్జీసాబ్ ని మర్డర్ చేయటానికి వచ్చుంటారు. ఆయన కారు చూడగానే మనల్ని వదిలి ఆ కారు వెనక అందుకే పరుగెత్తారు వాళ్ళిద్దరూ...." అంటూ తన అభిప్రాయం చెప్పాడు మూడోవాడు.*

*"అయితే బ్రాడ్ లీని అక్కడికి తీసుకొస్తున్నట్టుగాని, వాడి రక్షణ కోసమే తమను రప్పించినట్టుగాని ఆ గూండాల్లో ఏ ఒక్కరికీ తెలీకపోవడం విశేషం!*

## 24

*కలకత్తా వీధుల్ని అద్భుతంగా సర్వే చేస్తున్నాయి వాహనాలు రెండూ. ముందు ఫారెన్ కారు, వెనక పాతకాలం జీపు.*

*ఆ కారు తమ దృష్టిపథంలో నుంచి మిస్ కాకూడదన్న పట్టుదలతో ఆక్సిలేటర్ని కిందివరకూ తొక్కేసింది భానుమతి.*

*థండర్ బర్డ్లా రోడ్ను దడ– దడలాడిస్తూ దూసుకుపోతోంది జీపు, ఆమె డ్రైవింగ్ నైపుణ్యం చూసి వాత్సవ నిజంగానే ముగ్ధుడయ్యాడు.*

ఒక ఫారెన్ కారును వేగంగా నడపడం గొప్పకాదు. ఒక డబ్బా జీపును అంత వేగంగా నడపటం నిజంగా గొప్పే... ! వాటి స్పీడు చూసి వాహనాలు పక్కలకు తొలిగి దారి యిస్తున్నాయి. జనం దూరంగా పరుగులు తీస్తున్నారు.

"అందులో మా తమ్ముడు ఆదిత్యతో బ్రాడ్ లీ ఉన్నాడంటావా మిస్టర్ వాత్సవా ?" డౌటుగా అడిగింది భానుమతి.

"ఖచ్చితంగా వున్నాడు. డౌటులేదు. వాళ్ళని బంగ్లా దగ్గర పట్టుకోగలిగే వాళ్ళం. నీ మూలంగా టెంషన్ లో పడ్డాం..." అన్నాడు సిగరెట్ ముట్టించుకుంటూ వాత్సవ.

"నేనేం చేశాను ?" సీరియస్ గా తలతిప్పి చూస్తూ అడిగింది భానుమతి.

"ఇటు చూడకు.... ఆక్సిడెంట్లు అయిపోతాయి. జరిగిందేమంటే....పాట్నా నుంచి ఫోన్ రాగానే బ్రాడ్ లీని ఇంట్లో వుంచుకోవటం మంచిది కాదనే నిర్ణయానికొచ్చేసాడు సురేన్ ముఖర్జీ. అందుకే గెస్ట్ హౌస్ కి తమ గూండాల్ని పంపించాడు. తను వాళ్ళిద్దర్నీ కారులో తీసుకుని బయల్దేరాడు. దారిలో టిఫిన్‌కో, పర్చేజింగ్‌కో ఏమైనా కావచ్చు. వాళ్ళ కారు లేటయింది. మనం ముందు వచ్చాం. అక్కడికి నేను డౌటు పడుతూనే వున్నాను.... నా మాటలు వినకుండా గూండాల్ని చూసి రెచ్చిపోయిన నువ్వు లోనకు ఎంటరై పోవడంతోనేనూ ఫైటింగ్ లోకి రాక తప్పలేదు.

అంతలో ఆ ఫారెన్ కారులో వాళ్ళు రానేవచ్చారు. జరుగుతున్న ఫైటింగ్ చూడగానే విషయం అర్ధమైపోయి కారు రివర్స్ చేయటం, మనకీ ఛేజింగ్ తిప్పలు తప్పలేదు. ఏం చేస్తాం....ఆడాళ్ళ పెత్తనం అధ్వాన్నంగా వుంటుందని మా పెద్దాయన చెప్తే ఏమో అనుకునేవాడ్ని. ఇప్పుడు అర్ధమైంది...." అన్నాడు వాత్సవ.

"నాకు అర్ధంకాదులే" అంటూ కోపంతో అతడి కాలు తొక్కింది భానుమతి. ఇద్దరూ నవ్వుకున్నారు.

ఇంతలో జీప్ వెనక ఒక పోలీస్ వేన్ పడింది. ట్రాఫిక్ రూల్స్ కి విరుద్ధంగా, జనాల్ని భయభ్రాంతులకు గురిచేస్తూ వీధుల్లో పరుగు తీస్తున్న ఆ రెండు వాహనాల్ని పట్టుకునేందుకు కలకత్తా పోలీసులు రంగంలోకి దిగారు.

"మన వెంట పోలీసులు పడ్డారు. దొరికితే బుక్కయిపోతాం...." హెచ్చరించాడు వాత్సవ.

"చూసాలే...." అంది భానుమతి.

ఇంతలో ఒక సెంటర్ ని చేరుకున్నా యి వాహనాలు. ఆ ఫారెన్ కారు సిగ్నల్స్ దాటేసింది. దాని వెనకే రెడ్ సిగ్నల్ పడ్డంతో వాహనాలు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. జీపు వాటి మధ్య లాకయిపోయింది. ముందుకు పోవటం సాధ్యం కాలేదు.

అవతల పోలీసు వాహనం దగ్గరపడింది. పోలీసులు కిందకు ఉరుకుతున్నా రు.

"కమాన్... గెట్ డౌన్...." అంటూ ఆమెను జీపులోంచి తోసి కిందకు ఉరికేసాడు వాత్సవ.

పోలీసులు జీపును చేరి అందులోని సాహసవీరుల కోసం గాలించటం ఆరంభించేసరికి వాత్సవ, భానుమతి యిద్దరూ రోడ్ అవతల సందులో వున్నా రు.

"బ్లడీ సిగ్నల్! ఇప్పుడే పడాలా ? ఆ కారు మిస్సయింది" అంది అసహనంగా ఆమె.

పోలీసులు నుంచి తప్పించుకున్నాం. అందుకు సంతోషించు మేడం...." అంటూ వెక్కిరించాడు వాత్సవ.

"ఓ.కె! ఇప్పుడు ఏం చేద్దాం... ?" రెండు చేతులూ నడుం మీద వుంచుకొని వున్న చోటే నిలబడి సూటిగా చూస్తూ అడిగిందామె.

"ఓ కప్పు టీ తాగుదాం..." చెప్పాడు.

"ఇప్పుడు టీ అవసరమా ? ఆ కారు మిస్సయింది."

"కారు సంగతి నాకు తెలీదు , టీ తాగాలి. వస్తున్నా వా రావా ?"

"రాకపోతే ఏం చేస్తావ్ ?"

"నీ కర్మ నుకుని వదిలేసి , నా దారినపోయి హేపీగా చాయ్ తాగుతాను."

"అయిదే వెళ్ళు."

"థాంక్స్...."

మరో మాటకి అవకాశం ఇవ్వకుండా గిరుక్కున వెనుతిరిగి దగ్గరలోని ఇరానీ హోటల్ వైపు అడుగులేసాడు వాత్సవ.

అతను రుసరుసలాడుతూ గబగబా వచ్చి అతనితో జాయినయింది.

"నువ్వు రాక్షసుడివి. నీతో రావటం నా బుద్ధితక్కువ...." అంది కసిగా.

"ఇప్పటికయినా నన్ను అర్థం చేసుకున్నావ్. థాంక్యూ" అన్నాడు.

"నా తమ్ముడి గురించి కొంచెం కూడా నీకు బాధలేదు."

"వాడు నీ తమ్ముడు....నాకు బాధ ఎందుకు ? వాడ్ని వప్పగించే పూచీ నాది. డోంట్ వర్రీ."

"వాళ్ళు మిస్సయ్యారు. గౌహతి వెళ్తారో, వేరెక్కడికైనావెళ్తారో ఎలా తెలుస్తుంది ?"

సడన్ గా ఆగి తలతిప్పి ఆమె ముఖం వంక చూసాడు వాత్సవ.

"ఇందుకే చెప్పారు పెద్దలు... పెళ్ళికి పోతూ పిల్లిని చంకనబెట్టుకుపోడం తప్పని. ఇలా ప్రశ్నలతో నా బుర్రతినకపోతే కాస్త మౌనంగా వుండొచ్చుగదా!" అనడిగాడు.

"అందుకని నేను పిల్లినా ? నా గురించి ఏమనుకుంటున్నావ్ ?" నిలదీసింది. ఆమె ప్రశ్నలకి చిద్విలాసంగా నవ్వాడు వాత్సవ.

"నేను ఏమి అనుకోవటం లేదు. చాయ్ తాగుతూ కాస్సేపు మౌనం పాటిద్దాం. కమాన్" అన్నాడు.

"నాకు ఆకలవుతోంది" అంది.

"ఇది ఇరానీ హోటల్. సోమానీ బన్ బటర్ జాంలాంటివి దొరుకుతాయి. మంచి ఫుడ్ తినాలంటే మనం వేరే హోటల్ కి పోవటం బెటర్."

"బన్ బటర్ , జాం చాలు. చెరోకటి."

"ఓ.కె"

ఇద్దరూ తిని చాయ్ తాగారు.

సిగరెట్ ముట్టించాడు వాత్సవ.

బిల్ పేచేసి ఇద్దరూ బయటకొచ్చారు.

అతనితోబాటు తనూ వాకింగ్ ఆరంభించిందామె. పదినిముషాల తర్వాత డౌటు వచ్చి అడిగింది. "మనం ఎక్కడికి వెళుతున్నాం ?" అని.

"ఇక్కడ దగ్గర లో ఒక థియేటర్ వుంది. సినిమా చూద్దామని. నీకేమన్నా అభ్యంతరమా ?" ఆమెను ఉడికిస్తూ అడిగాడు.

"షిట్....మనం లవర్స్‌మా సినిమా చూస్తూ కుర్చోడానికి ? అడిగినదానికి సూటిగా సమాధానం చెప్పటం నీకు చేతకాదా ?"

"నువ్వు పిచ్చిపిచ్చిగా అడిగితే నేను అలాంటి సమాధానాలే చెప్తాను. అర్థమైందా! నోరు మూసుకుని నాతోరా" అంటూ హెచ్చరించి–

"వద్దువద్దంటున్నా వినకుండా వెంటపడి ప్రాణాలు తీస్తుంది రాక్షసి" అంటూ గొణిగాడు చిన్నగా. అయినా ఆమె వినేసింది.

"హలో! నేను నా తమ్ముడి కోసం వచ్చాను. నీకోసం రాలేదు. అలా గొణుగుతావేమిటి ?" అంటూ దబాయించింది.

అంతలో ఒక యస్.టి.డి. బూత్ ని ఇద్దరూ సమీపించారు. సిగరెట్ దమ్ముకొడుతూ అక్కడే నిలబడ్డాడు వాత్సవ.

అతడి ఉద్దేశం ఏమిటో తెలీక–

ఉడికిపోయింది భానుమతి.

పావుగంట గడిచింది. అప్పటికి కారు మిస్సయి ముప్పావుగంట కావస్తోంది. అప్పుడు కదిలాడు వాత్సవ. బూత్ లోకి వెళ్ళి సురేన్ ముఖర్జీ ఇంటి నంబర్ కి ఫోన్ చేశాడు. లక్కీగా సురేన్ ముఖర్జీ స్వయంగా ఫోన్ లిఫ్టు చేసాడు.

"హలో! ముఖర్జీ హియర్" గరగరలాడింది అతని గొంతు.

"నేను సాబ్. మియాచీని మాట్లాడుతున్నాను" మియాచీ గొంతును మరోసారి ఎరువు తెచ్చుకుని మాట్లాడాడు వాత్సవ.

భానుమతి ఆశ్చర్యంగా చూస్తోంది.

"ఏమిటోయ్ మియాచీ, ఎక్కడ్నుంచి మాట్లాడుతున్నావ్ ? రెండు గంటల క్రితం ఫోన్ చేసావటగా, మా మిసెస్ చెప్పింది. నేనూ ఇప్పుడే వచ్చాను" అన్నాడు ఫోన్ లో ముఖర్జీ.

"అవును సాబ్. మీరు బ్రాడ్ లీతో గెస్ట్ హౌస్ కి వెళ్ళారని అమ్మగారు చెప్పారు. నేను ఇక్కడికి వస్తే ఎవరూ లేరు. అందుకే ఫోన్ చేశాను."

"సారీ మియాచీ! డౌటు పడుతూనే వున్నాం. అలాగే జరిగింది. పాట్నా నుంచి హోటల్ స్వాగత్ మేనేజర్ మనోహర్ ఫోన్ చేసి చెప్పాడు. అక్కడ ఎవరో ఒక యువకుడు, యువతి దారుణంగా ఫైట్ చేస్తున్నారు. ఇక వీళ్ళని ఇక్కడ వుంచితే ప్రమాదమని ఏర్ పోర్ట్ కి తీసుకెళ్ళి గౌహతికి విమానం ఎక్కించి ఇప్పుడే వస్తున్నా, నువ్వు కూడా అటు వెళ్ళిపో. అన్నట్టు నువ్వు పోలీసులకు చిక్కివుంటావని బ్రాడ్‌లీ భయపడుతున్నాడు. ఏమైంది ?"

"అదేంలేదు సాబ్. అంతా పట్టుబడ్డా నేను తప్పించుకొని వచ్చేశాను. ఉంటాను. ఇప్పుడే గౌహతికి రైలు ఎక్కేస్తాను. ఉంటాను" అంటూ లైన్‌కట్ చేసాడు.

బల్లు పేచేసి బయటకొచ్చాక అడిగింది భానుమతి.

"ఏం చెప్పాడు ముఖర్జీ ?" అంటూ.

"మనకు కావలసిన సమాచారం దొరికిపోయింది. బ్రాడ్ లీ, ఆదిత్యలు ఇద్దర్నీ గౌహతికి విమానం ఎక్కించేసాడు సురేన్ ముఖర్జీ. పాట్నాలో మా శ్యామ్, సూకీ యిద్దరూ అక్కడి మేనేజర్ని, గూండాలని ఉతికి వెళ్ళారట. వాళ్ళు గౌహతిలో ఈపాటికి రెడీగా వుంటారు గాబట్టి కంగారు పడాల్సింది ఏమీలేదు. మనం భోంచేసి ఫ్లయిట్ కి వెళ్ళిపోదాం. ఓ.కె ?" అంటూ అటుగా వచ్చిన టాక్సీ ఆపాడు వాత్సవ.

## 25

"మనం ఇక్కడ పడిగాపులుపడి వుండటం శుద్ధ దండగ. రైలుగాని, బస్సుగాని దిగి డైరెక్ట్‌గా బన్సీలాల్ అడ్డాకు వెళ్ళిపోయి వుంటాడు" టిఫిన్ ముగించి హోటల్లోంచి బయటకి వస్తుండగా తన అభిప్రాయం చెప్పింది సూకీ.

ఆమెకు చాలా ఆత్రంగా వుంది, ఎంత తొందరగా తన మేనమామ బ్రాడ్ లీ నుంచి తమ్ముడ్ని రక్షించాలా అని తొందర. అందుకే ఖాళీగా వుండకుండా ఏదో ఒకటి చేసి ఆదిత్యను విడిపించాలని తపన.

"నేనలా అనుకోవటం లేదు" సిగరెట్ ముట్టించుకుంటూ చెప్పాడు శ్యామ్ సుందర్.

అప్పటికి సరిగ్గా గంటక్రితం వాళ్ళిద్దరూ పాట్నా నుంచి గౌహతికి వచ్చిన విమానంలో దిగారు. ఏర్ పోర్ట్ సమీపంలోని ఒక మంచి హోటల్ చూసి టిఫిన్ చేసి బయటకొచ్చారు. తిరిగి తనే చెప్పాడు శ్యామ్.

"మరో అర్ధగంటలో కలకత్తా నుంచి గౌహతికి విమానం వుంది. అందులో తప్పకుండా బ్రాడ్ లీ వస్తాడని నా నమ్మకం. ఒకవేళ రాకపోతే అప్పుడే వెళ్ళి బన్సీలాల్ మిశ్రా అడ్డామీద అటాక్ చేద్దాం. కమాన్" అంటూ ముందుకు అడుగులు వేసాడు.

కాని అతను వెళుతోంది ఏర్ పోర్ట్ వైపు కాదు. రోడ్డు వెంట ముందుకు. ఆమెకు డౌటు వచ్చేసింది.

"ఎక్కడికి వెళుతున్నాం ?" అడిగింది.

"ఏమిటి , చెప్తే గాని రావా ?"

"చెప్పకుండా రావటానికి నేను మీ లవర్ని కాను."

"నాకూ లవర్స్ ఎవరూ లేరు. ఏదీ చెప్పి చేసే అలవాటు మాకు లేదు. నోరు మూసుకుని రా."

"షిట్.... నన్ను నోరుమూసుకురమ్మంటావా! ఏమనుకుంటున్నావ్ నన్ను ? నిన్ను చంపేస్తాను" అంటు కోపంతో పిడికిళ్ళు బిగించింది సూకీ. ఆమె ముఖం ఎర్రబడింది. ఆమెని చూసి చిలిపిగా నవ్వేస్తూ

" కూల్ బేబీ... కూల్. ప్రశ్నలతో విసిగించోవాళ్ళంటే నాకు అస్సలు గిట్టదు. అందుకే అలా చెప్పాను. నువ్వు కోపంలో అందంగా వుంటావని నాకు తెలుసు. ఇదిగో వచ్చేసాం. కమాన్ " ఒక రెడీమేడ్ దుస్తులషాపును సమీపిస్తూ చెప్పాడు.

అయినా ఆమె శాంతించలేదు.

"అంటే నీ ఉద్దేశం ఏమిటి ? కోపం లేదంటే నా ముఖం అంత అసహ్యంగా వుంటుందా ? అసలు నా అందం పొగడటానికి నువ్వెవరు ?" దబాయించింది.

"సారీ.... యదార్థ వాది లోకవిరోధి అన్నారు. ఉన్న మాట చెపితే ఇన్ని కష్టాలున్నాయని నాకు తెలీదు. ముందు లోనకు పద."

"ఇంకెప్పుడూ ఉన్న మాట చెప్పకు."

"ఓ.కె."

ముసిముసిగా నవ్వుతూ అతడ్ని అనుసరించింది.

అతను ఆ షాపులోకి ఎందుకు తీసుకొచ్చాడో ఆమెకు అర్థం కాలేదు. ముస్లిం యువతులు ధరించే రెండు నల్లని బురఖా గౌనులను ఎందుకు కొన్నాడో అంతకన్నా అర్థం కాలేదు. అందులో ఒకటి పెద్దది. రెండోది కాస్త చిన్నది. పెద్దగౌను సూకీ చేతిలో వుంచాడు.

"నీ ముఖం అందంగా వుంటుందిగదా. అది కన్పించకూడదని ఈ ఏర్పాటు. అర్జంటుగా ఈ బురఖా ధరించు చెప్తాను" అన్నాడు.

"నిన్నూ.....ఇదిగో చెప్తున్నా. నన్ను ఉడికించడం పనిగా పెట్టుకోకు. నాకు చాలా కోపం వస్తుంది చెప్తున్నాను" అంటూ హెచ్చరించింది. కాని అతను చెప్పినట్టే బురఖా ధరించింది. ఇప్పుడు ఆమె ఎవరో గుర్తించడం కష్టం.

ఒక క్యారీబ్యాగ్ లో రెండో బురఖా వుంచి ఆమె చేతిలో పెట్టాడు. బిల్లు పే చేసి ఇద్దరూ షాపులోంచి బయటపడ్డారు.

"చూడు, బ్రాడ్ లీ నీ మేనమామ" ఏర్ పోర్ట్ దిశగా అడుగులేస్తూ ఆమెకు వివరించాడు శ్యామ్ సుందర్.

"ఏర్ పోర్ట్ లో నిన్ను చూడగానే వాడు జాగ్రత్తపడే ప్రమాదం వుంది. అందుకే ఈ ఏర్పాటు. నా అనుమానం కరక్టయితే బ్రాడ్ లీ చాలా జాగ్రత్తగావుంటాడు. బన్సీలాల్ మనుషుల్ని తనకు రక్షణగా ఏర్ పోర్ట్ కి రప్పించుకునే అవకాశం వుంది. నేను ఎవరో వాడికి తెలీదు కాబట్టి ప్రాబ్లం లేదు. ఇక నా ప్లాన్ విను.

పిల్లాడ్ని తీసుకుని వాడు వస్తుంటాడు. వాడ్ని నాకు చూపించు. నేను వెళ్ళి కావాలని వాడితో గొడవ పెట్టుకుంటాను. సందుచూసి నీ తమ్ముడ్ని పక్కకు లాక్కుపో. ఈ బురఖాను వాడికి తొడిగి, కామ్ గా బయటికి వెళ్ళిపోయి ఇంతకుముందు మనం టిఫిన్ చేసిన హోటల్లో కూర్చోండి. నేను వెనకాల వచ్చి జాయినవుతాను. ఓ.కె ?"

"ఈ ప్లాన్ వర్కవుట్ అవుతుందని నాకు నమ్మకంలేదు" అంది.

"ఎందుకని ?"

"బ్రాడ్ లీ విమానంలో వస్తే గదా ?"

"వస్తే ఏమిస్తావు ?"

"రాకపోతే నువ్వేమిస్తావో చెప్పు."

"వాడు విమానంలో రాలేదంటే నా వేలెట్ లో డబ్బంతా నీకే ఇచ్చేస్తాను."

"వస్తే....ఓ.కె....వాడు నీ అంచనా ప్రకారం విమానంలో రావటం జరిగితే నేను డబ్బు కన్నా విలువైనది ఒకటిస్తాను."

"అదేదో చెప్పొచ్చుగా ?"

"ముందు చెప్తే థ్రిల్లేముంది ? చెప్పకుండానే ఇస్తాను."

"ఓ.కె."

ఇద్దరూ ఏర్ పోర్ట్ చేరుకున్నారు.

అక్కడ పార్కింగ్ లో నిలబడిన రెండు సుమో వేన్ల మీద శ్యామ్ సుందర్ దృష్టి పడింది. అంతక్రితమే అవి వచ్చి వుండాలి. డజనుకు పైగా రఫ్ కారక్టర్స్ ఆ వేన్ ల దగ్గర తచ్చాడుతున్నాయి.

"నో డౌట్. వాళ్ళు బన్సీలాల్ మనుషులు. బ్రాడ్ లీని రిసీవ్ చేసుకోవడానికి వచ్చుంటారు. నేనే విన్ చేయబోతున్నాను. గెట్ రెడీ" అంటూ ఆమె చేయి పట్టుకుని లోనకు దారితీసాడు.

ఇద్దరూ విజిటర్స్ గేలరీకి చేరిన పది నిముషాల తర్వాత కలకత్తా నుంచి వచ్చిన విమానం ఏర్ పోర్ట్ లో లాండయింది.

మరో పది నిముషాల తర్వాత ప్రయాణీకులు ఒక్కొక్కరే బయటకు రావటం ఆరంభమైంది. కొద్దిసేపటడి తర్వాత చటుక్కున శ్యామ్ సుందర్ చేయి పట్టుకుని నొక్కింది సూకీ.

"నువ్వే నెగ్గావ్. మామయ్య వస్తున్నాడు. ఆ చారల షర్టు టక్ చేసిన వ్యక్తే" అంటూ సూచించింది.

అతన్ని చూశాడు శ్యామ్ సుందర్.

ఆరడుగుల పొడవున అంత లావు, సన్నంగాని వ్యక్తి. టక్ చేసి స్లిమ్ గా వున్నాడు. జుత్తు అక్కడక్కడా నెరిసింది. భుజాన ఏర్ బేగ్ వుంది. పక్కన తొమ్మిదేళ్ళ ఆదిత్య ప్రతాప్ సింగ్. ఆ కుర్రాడి చేయి పుచ్చుకుని గబగబా బయటికి వచ్చేస్తున్నాడు. ముద్దులు మూటగట్టే ఆ పసివాడి ముఖంలో గూడు కట్టుకునుంది విషాదం. ఆ చూపుల్లో కళలేదు. వాళ్ళు గేటుదాటి వచ్చేస్తున్నారు.

"గెట్ రెడీ సూకీ. అవకాశం చేజారకూడదు" అంటూ గబగబా ముందుకెళ్ళాడు శ్యామ్ సుందర్.

వేగంగా వెళ్ళి బ్రాడ్ లీ దారికి అడ్డంగా నిలబడ్డాడు. "హలో!ఎన్ని రోజులు తప్పించుకు తిరుగుతావ్ ?" అనడిగాడు.

బ్రాడ్ లీ తెల్లబోయాడు.

శ్యామ్ సుందర్ ని ఎగాదిగా చూశాడు.

"ఏయ్! నన్నె వరనుకున్నావ్ ? తప్పుకో" అన్నాడు కళ్ళురుమేస్తూ.

"ఎవరా ? నువ్వెవరో తెలీకుండానే నీకు అయిదుకోట్లు అప్పుగా ఇచ్చానా ? నీ పేరు బ్రాడ్ లీ. హాంకాంగ్ కి చెందినవాడివి. ఇది చాలదా ? నీ పాస్ పోర్ట్ ఇక్కడున్న వాళ్ళకి చూపించు. నిజం ఏమిటో తేలిపోతుంది. బాకీ తీర్చకుండా ఎంతకాలం తప్పించుకుంటావ్ బే ?" అంటూ వూహించని వేగంతో బ్రాడ్ లీ ముఖంమీద గుద్దాడు.

బ్రాడ్ లీ ఎంతమాత్రం వూహించని అటాక్ ఇది . ముఖం పగిలి పోయినంత బాధతో కెవ్వుమని వెనక్కి వరుచుకుపడిపోయాడు వాడు. అదే సమయంలో చుట్టూ చేరిన గుంపులోంచి చేయి పెట్టి తన తమ్ముడు ఆదిత్య ప్రతాప్ సింగ్ ను ప్రక్కకు లాగేసింది సూకీ. వాడు కంగారుపడే లోపలే తన ముఖంమీద గుడ తొలగించి చూపించింది.

"అక్కనురా, కంగారుపడకు. మనం తప్పించుకుందాం" అంటూ చిన్నగా చెప్పి, వాడికి బురఖా వేసేసింది. సూకీని చూడగానే ఆదిత్యలో కొత్త ఉత్సాహం వచ్చేసింది. ఇక మాట్లాడలేదు. వాడు. ఇప్పుడు ఇద్దరూ బురఖాలో వున్నారు. ఎవరూ వాళ్ళని గుర్తుపట్టలేరు. తమ్ముడి చేయి పుచ్చుకుని చరచరా బయటికి అడుగువేసింది సూకీ. అక్కడి హడావిడిలో వీళ్ళని ఎవరూ గుర్తించలేదు.

కిందపడి చివ్వున లేస్తూనే రివాల్వర్ తీశాడు బ్రాడ్ లీ.

"నిన్ను చంపేస్తాను. నీ ట్రిక్స్ నా దగ్గర సాగవు" అంటూ శ్యామ్ ని రివాల్వర్ తో కవర్ చేస్తూనే "ఆదిత్యా....రేయ్ ఆదిత్యా" అంటూ చుట్టూ చూశాడు.

ఆ కుర్రాడు జాడ లేకపోవడంతో కంగారుపడి మూడు పక్కలకి చూస్తూన్నంతలోనే శ్యామ్ సుందర్ ఆ సమయాన్ని చక్కగా వినియోగించు కున్నాడు. వాడి చేతిలో రివాల్వర్ ని ఎగరగొట్టాడు. గబగబా నాలుగు పీకాడు.

ఇంతలో ఏర్ పోర్ట్ సిబ్బంది, పోలీసులు గొడవను గమనించి పరుగులెత్తుకురావటం గమనించాడు శ్యామ్ సుందర్. అంతే, కన్ను మూసి తెరిచే లోన చుట్టూ జనంలోకి జొరబడి ఏర్ పోర్ట్ బయటికి వచ్చేశాడు.

శ్యామ్ సుందర్ కోసం చూడలేదు బ్రాడ్ లీ.

ఆదిత్య కోసం గేలరీ అంతా పరుగులు తీసి వెతికాడు. ఇంతలో బయట అతడి కోసం ఎదురు చూస్తున్న బన్సీలాల్ మిశ్రా మనుషులు లోనకు పరుగు లెత్తుకు వచ్చారు. వాళ్ళతో జరిగింది చెప్తూ ఏర్ పోర్ట్ బయటకు దూసుకొచ్చాడు బ్రడ్ లీ.

ఆ చుట్టు పక్కలంతా గాలించినా ఆ కుర్రాడి జాడగాని, శ్యామ్ సుందర్ గాని కన్పించలేదు. అప్పటిగ్గాని జరిగిన మోసం ఏమిటో బ్రాడ్ లీ కి అర్థం కాలేదు.

"వాళ్ళు మోసం చేసి ఆదిత్యను చేజిక్కించుకున్నారు. బన్సీలాల్ తో చెప్పి తగిన ఏర్పాట్లు చేద్దాం. వాళ్ళు సిటీ దాటి బయటకు పోకూడదు" అంటూ రంకెలేస్తూ గూండాలతో వేన్ ఎక్కాడ బ్రాడ్ లీ.

అంతవరకూ ఆ సమీపంలోనే నక్కి గమనిస్తున్నాడు శ్యామ్ సుందర్. వేన్లు రెండూ వెళ్ళిపోగానే ఇవతలకు వచ్చాడు. తాపీగా సిగరెట్ దమ్ము కొడుతూ హోటల్ వైపు అడుగులేశాడు.

* * *

మరొక్క రెండు గంటల అనంతరం వచ్చిన కలకత్తా విమానంలో గౌహతి చేరుకున్నారు వాత్సవ, భానుమతి ఇద్దరూ.

ఏర్ పోర్టు నుంచి బయటికు వచ్చేసరికి శ్యామ్ సుందర్ వచ్చి వాళ్ళని కలుసుకున్నాడు. నిజానికి అక్కడ శ్యామ్ సుందర్ ని చూసినవాడు బ్రాడ్ లీ ఒక్కడే. ఏర్ పోర్టు పరిసరాల్లో బన్సీలాల్ మిశ్రా మనుషులు కొందరు తిరుగుతున్నారుగాని వాళ్ళెవరూ శ్యామ్ సుందర్ ను గుర్తించలేదు. గుర్తు పట్టలేరు కూడా. ఎందుకంటే, ముఖమే తేలీని వ్యక్తి కోసం గాలించి ప్రయోజనం ఏముంది ? బ్రాడ్ లీ తిరిగి ఏర్ పోర్టు పరిసరాలకు రాకపోవటంతో శ్యామ్ సుందర్ అక్కడే తిరుగుతున్నాడు.

"ఏం జరిగింది ?" రోడ్డు మీద అడుగులు వేస్తూ అడిగాడు వాత్సవ.

"కుర్రాడు దొరికాడు, బ్రాడ్ లీని కవర్ చేయటం ఏర్ పోర్టులో సాధ్యం కాలేదు" అంటూ జరిగింది వివరించాడు శ్యామ్.

తన దమ్ముడు దొరికిన వార్త వినగానే భానుమతి ముఖంలో సంతోషం పొంగింది. ఉత్సాహం ఉరకలు వేసింది.

"చూడాలి. వాడ్ని ఇప్పుడే నేను చూడాలి" అంది ఆత్రంగా.

ఆ సమీపంలోనే వున్న హోటల్ రూంకి చేరుకున్నారు ముగ్గురూ. అక్క సూకీతో కబుర్లు చెప్తున్నాడు ఆదిత్య. లోనకు వచ్చిన ఆ ముగ్గుర్ని వాడు ఆశ్చర్యంగా చూసాడు.

ఆరు సంవత్సరాల వయసులో మూడేళ్ళక్రితం కిడ్నాప్ కు గురైనపసివాడు. ఇప్పుడు వాడికి తొమ్మిది సంవత్సరాలు. నాలుగు వందల కోట్ల ఆస్తికి వారసుడు. వాడ్ని తిరిగి చూస్తామన్న ఆశ వదులుకున్నారంతా.... అటువంటి తన తమ్ముడ్ని తిరిగి చూడగానే భానుమతి కళ్ళలో ఆనంద భాష్పాలు వరదలయి పొంగాయి. వాడ్ని కౌగిలించుకుని ఏడ్చేసింది. కాస్సేపటికి వాడూ ఆమెను గుర్తుపట్టాడు.

"ఇప్పుడే ఈ విషయాన్ని మా తతయ్యకు ఫోన్ చేసి చెప్తాను. చాలా సంతోషిస్తాడు" అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"తొందరపడకు మిస్ భానుమతి.....ఇప్పుడీ విషయం చెప్పటం మంచిది కాదు.... నువ్వే కుర్రాడ్ని ఇంతకాలం ఎక్కడో దాచేసి , ఇప్పుడు తీసుకొచ్చావనుకుంటాడాయన. ఇందులో ఆయనకు తెలీని మెలిక.....మీ కుటుంబ రహస్యం ఇమిడివుంది. అది సూకీ గురించి. ఇవన్నీ సాల్వ్ కావాలంటే బ్రాడ్ లీని బంధించి ఆయన ముందుంచాలి...." అంటూ వారించాడు వాత్సవ.

అతని మాటల్లోని వాస్తవాన్ని గుర్తించిఫోన్ చేసే ఉద్దేశాన్ని విరమించుకుంది భానుమతి.

"ఏయ్ శ్యామ్.....నువ్వేమీ మాట్లాడవేమిటి ?" ఎడంగా ఛైర్ లో కూర్చుని తాపీగా రింగులు రింగులుగా పొగ వదులుతున్న శ్యామ్ సుందర్ ని చూస్తూ అడిగాడు వాత్సవ.

"మనం వెంటనే ఈ ప్లేస్ ను వెకేట్ చేయటం మంచిది. ఏ క్షణంలోనయినా బన్సీలాల్ మనుషులు ఇక్కడకు రావచ్చు. మనం వీధిలో వుంటేనే సేఫ్" అంటూ లేచాడు శ్యామ్.

వాత్సవకు బాగా తెలుసు , శ్యామ్ రాబోయే ప్రమాదాలను చాలా ఖచ్చితంగా వూహిస్తాడని. అంతా హోటల్ రూం ఖాళీచేసి బయటకు వచ్చేసారు. వాళ్ళు వీధిలోకి వచ్చి పాతిక అడుగుల దూరం కూడా వెళ్ళకముందే గూండాలతో నిండిన ఒక జీపు హోటల్ పార్కింగ్ లోకిపోయి ఆగటం ముగ్గరూ చూసారు. ఇక ఆలస్యం చేయకుండా అటుగా వచ్చిన ఆటో ఎక్కేసారు.

పబ్లిక్ పార్క్ దగ్గర ఆటో దిగిపోయాక అడిగాడు శ్యామ్ సుందర్.... "ఇప్పుడు ఏం చేద్దాం ? పరిస్థితులు చూస్తుంటే బన్సీలాల్ మిశ్రా ఆ బ్రాడ్ లీకి పూర్తి మద్ధతునిచ్చే ఉద్దేశంలో వున్నట్టు కన్పిస్తోంది...." అని.

"ఏం చేద్దాం నువ్వే చెప్పు ?" అడిగాడు వాత్సవ.

"నా ఉద్దేశం ప్రకారమయితే కుర్రాడితోపాటు లేడీస్ యిద్దర్నీ వెనక్కి పంపి వేయటం బెటర్....మనిద్దరం బ్రాడ్ లీ సంగతి చూద్దాం...." చెప్పాడు శ్యామ్.

"అలా వీల్లేదు" అంది వెంటనే భానుమతి.

"వాత్సవ ఇంతక్రితమే చెప్పారు.....మా తాతయ్యకి మేం వెళ్ళి ఏం చెప్పినా నమ్మడని. సో.....మనమంతా కలిసే వెళుతున్నాం. దట్సాల్...." అంది ఖచ్చితంగా.

"అవును అలాగే చేద్దాం" అంది అక్కను బలపరుస్తూ సూకీ.

అసహనంగా చూసాడు శ్యామ్.

"లేడీస్ తో ఇదే ప్రాబ్లం. వాత్సవా.... ఈ సమస్యకు పరిష్కారం ఏమిటో నువ్వే ఆలోచించి చెప్పు. నాకయితే ఖచ్చితంగా యిష్టంలేదు...." అనేసాడు.

"ఓ.కె. ఓ.కె. డోంట్ వర్రీ. నాకు తెలిసిన ఫామిలీ ఒకటి ఇక్కడ వుంది. ఆదిత్యను అక్కడ వుంచి, మనం బ్రాడ్ లీ కోసం వెళదాం. ఇక వాదోపవాదాలతో పనిలేదు" అంటూ అటుగా వచ్చిన టాక్సీని ఆపాడు.

అర్ధగంట ప్రయాణం తర్వాత దక్షిణ గౌహతిలోని ఒక మిడిల్ క్లాస్ ఏరియాలోకి ఎంటరయింది టాక్సీ. ఒక డాబా యింటి ముందు టాక్సీ ఆపించాడు వాత్సవ. అంతా కిందకు దిగి టాక్సీని పంపించేసారు.

ఆ ఇల్లు దత్తారామ్ అనే లారీ డ్రైవరుది. గతంలో బీహార్ లో ఒక మాఫియా ఉచ్చు నుంచి వాత్సవ దత్తరామ్ ని కాపాడాడు. దత్తారామ్ ఫామిలీ వాత్సవను దేవుడిలా యిప్పటికీ భావిస్తుంది. గౌహతి వస్తే దత్తారామ్ ఇంటికి పోకుండా వుండడు వాత్సవ. ఇప్పుడు తమ పనులు పూర్తి అయ్యేంతవరకు ఆదిత్య బాధ్యతను వప్పగించటానికి అక్కడికి తీసుకు వచ్చాడు వాత్సవ.

లక్కీగా దత్తారామ్ కూడ ఆ సమయంలో ఇంట్లోనే వుండటంతో మరింత కలిసొచ్చింది. వాత్సవను చూడగానే ఆ కుటుంబం ఆనందానికి హద్దు లేకుండా పోయింది. ఆ పూటకి చక్కటి విందు భోజనం ఏర్పాటు చేసాడు.

వాత్సవ పరిస్థితిని దత్తారామ్ కి వివరించాడు.

"సాబ్! వాడికి మూడింది సాబ్! కొరివితో తల గోక్కుంటున్న సంగతి తెలీక ఆ బద్మాష్ బన్సీలాల్ బ్రాడ్ లీకి ఆశ్రయం యిచ్చాడు. బాబు గురించి మీరేమీ వర్రీకానక్కర్లేదు. మీరు వచ్చేంతవరకు దగ్గరండి నేను జాగ్రత్తగాచూసుకుంటాను...." అంటూ తనకు తెలిసిన బన్సీలాల్ వివరాలన్నీ అందించాడు దత్తారామ్.

కనుచీకటి పడేంతవరకు అక్కడే వున్నారంతా. ఆ తర్వాత అక్కడి నుంచి నలుగురూ బ్రాడ్ లీ కోసం బన్సీలాల్ అడ్డామీద అటాక్ చేయటానికి బయలు దేరారు.

## 26

"ఏం జరిగింది మైఫ్రండ్ ? ఎందుకిలా జరిగింది ?" తాగుతున్న విస్కీగ్లాసు పక్కన పెడుతూ ఉరుములాంటి గొంతుకతో ప్రశ్నించాడు బన్సీలాల్ మిశ్రా.

అతడి వయసు సుమారు ఏభై సంవత్సరాలు. మనిషి ఎర్రగా బలిష్టంగా వున్నాడు. గౌహతిలో తిరుగులేని క్రిమినల్ వాడు. పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ వుంది. పోలీసు అధికారుల కరుణ వుంది. అందుకే అతడి స్మగ్లింగ్ రాకెట్ మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. బంగ్లా సరిహద్దులు అతడి కీలక వ్యాపార మార్గాలు. అతని అడ్డావైపు పోలీసులు కన్నెత్తి కూడ చూడరు. చేతికింద అనేకమంది వున్నా అడ్డాలో అరవై మందికి పైగాకనిపెట్టుకుని కాపలా వుంటారు.

ఎదురుగా కూర్చున్న బ్రాడ్ లీ దిగులుగా చూసాడు.

"నేను వూహించని సంఘటన జరిగింది. అంతా ఆ బద్మాష్ మియాచీ వల్ల జరిగింది. వాడు సూకీని ఆశపడకుండా అప్పుడే ఖతం చేసి వుంటే పరిస్థితి ఇలా వుండేదికాదు. ఆదిత్యను గుప్పిట వుంచుకుని నాలుగు వందల కోట్ల ఆస్తిని చక్రం తిప్పాలనుకుని ఎన్నో కలలు కన్నాను. నా కలలన్నీ మియాచీ మూలంగా బుగ్గిపాలయ్యాయి. ఆదిత్యను ఏర్ పోర్టులో చాలా తెలివిగా నా చేతిలోంచి తప్పించారు. సూకీ వెనక ఎవరున్నారో తెలిస్తేగాని అర్థంకాదు, నా ఉద్దేశమైతే ఆ కుర్రాడు దొరికాడు కాబట్టి వాళ్ళు గౌహతి వదిలి వెళ్ళిపోయి వుంటారు" అన్నాడు. అంటూనే విస్కీ గ్లాసు ఎత్తి ఖాళీచేసాడు.

"వెళ్ళిపోయారని ఎలా అనుకుంటున్నావ్ ? అప్పట్లో హత్యలుచేసి, ఆ కుర్రాడ్ని కిడ్నాప్ చేశారు. ఇప్పుడు కిడ్నాప్ చేసిన భగవాన్ దాదా బడేమియాలతో సహా అయిదుగురూ పోలీసు కస్టడీలో వున్నారని నువ్వే చెప్తున్నావ్. మియాచీ పట్టుబడ్డాడు. లేకపోతే కలకత్తా అడ్రసుగానీ, గౌహతి అడ్రసుగానీ వాళ్ళకి తెలిసే

ఛాన్సేలేదు. ఇప్పుడు వాళ్ళు వెనక్కి వెళ్ళిపోయి ఉంటారంటున్నావ్! నీకు బుద్ధిలేదు బ్రడ్ లీ. ఉంటే ఇలా జరిగేది కాదు" అంటూ తన గ్లాసు ఫినిష్ చేశాడు బన్సీలాల్.

"అంటే....వాళ్ళు ఇక్కడికి వస్తారనా నీ ఉద్దేశం ?" అనుమానంగా అడిగాడు బ్రాడ్ లీ.

"ఉద్దేశం కాదు వాస్తవం!"

"పోలీసులకు నీ జోలికివచ్చే దమ్ములేదు. ఒకరిద్దరు వచ్చి నన్ను పట్టుకు పోగలరా ? నీ అడ్డావైపు కన్నెత్తి చూడలేరు!"

"నా మీద నీకంత భరోసా వున్నందుకు చాలా థాంక్స్ బ్రదర్...కానీ ఏదీ అలక్ష్యం చేసి వూరుకునే అలవాటు నాకు లేదు. పాము చిన్నదే అయినా పెద్ద కర్రతో కొట్టమన్నారు. అందుకే అడ్డాలో మనవాళ్ళని అలర్ట్ గా వుండమన్నాను."

బన్సీలాల్ మాట్లాడుతూనేవున్నాడు.

అంతలో రింగయింది ఫోన్.

"బన్సీలాల్ మిశ్రా హియర్!" రిసీవర్ ఎత్తి విసుగ్గా అరిచాడు.

"హలో మిశ్రా హియర్! చాలా హీట్ గా ఉన్నట్టున్నావ్. బ్రాడ్ లీ తో డిస్కషనా ?" అవతలి నుంచి హుందాగా విన్పించింది ఒక గొంతు.

ఆ ప్రశ్నతో ఒక్కసారిగా బన్సీలాల్ ముఖంలో రంగులు మారిపోయాయి. "ఎవర్నువ్వు ?" అంటూ హుంకరించాడు.

"చూడు మిశ్రాభాయ్! నా పేరు వాత్సవ. డైనమిక్ సెక్యూరిటీ సర్వీస్ అనే సంస్థకి చెందిన ప్రైవేట్ డిటెక్టివ్‌ని. మూడు సంవత్సరాల క్రితం కిడ్నాప్ అయిన పసివాడు ఆదిత్య ప్రతాప్ సింగ్ కేసును టేకప్ చేసి వర్క్ చేస్తున్నాం. ఆ కుర్రవాడు మాకు దొరికాడు. కానీ బ్రాడ్ లీ నీవద్ద తలదాచుకున్నాడు. సో.... విషయం అర్థమై ఉంటుందనుకుంటున్నాను ?"

"అర్థమైంది మిష్టర్ వాత్సవ్! ఇప్పుడు ఎక్కడి నుంచి మాట్లాడుతున్నావ్ ?"

"నీ అడ్డాకి అరకిలోమీటరు దూరంలోని ఫ్లయిఓవర్ బ్రిడ్జి అవతల బూత్ నుంచి. ఏం ? నీ మనుషుల్ని పంపిస్తావా ? నాకు అభ్యంతరం లేదు. కానీ నేను చెప్పదలుచుకుంది పూర్తి గావిను."

"చెప్పు. వింటున్నాను."

"ఇనుముతో చేరిన నిప్పుకీ సమ్మెట దెబ్బలు తప్పవు. బ్రాడ్ లీని కాపాడాలనుకొని నీ నాశనాన్ని నువ్వు కొని తెచ్చుకోకు."

"బెదిరిస్తున్నావా ?"

"హెచ్చరిస్తున్నాను. చూడు మిశ్రాభాయ్! నీకూ మాకూ శతృత్వం లేదు. నీ వ్యాపారాలతో గానీ అడ్డగోలు పనులతో గానీ అంతకన్నా సంబంధం లేదు. ఆ కారణంగా నీ మీద అటాక్ చేయటం న్యాయమనిపించటంలేదు. బ్రాడ్ లీ చేసిన తప్పులకి వాడు శిక్ష అనుభవించక తప్పదు. సో.... మర్యాదగా నువ్వే వాడ్ని మాకు వప్పగిస్తే సేవ్ అవుతావ్! లేదంటే నిన్ను కూడా ఎవరూ కాపాడలేరు. నీ సమాధానం మీద నీ భవిష్యత్తు ఆధారపడుంది. సంధికొస్తావా ? అటాక్ ని కోరుకుంటావా చెప్పు."

"అటాకా.... నామీదా ?" అంటూ పగలబడి నవ్వాడు మిశ్రా.

"అరే బేవకూఫ్ డిటెక్టివ్! నన్నే మనుకున్నావ్ బే ?" నవ్వాపుకొంటూ తిరిగి తనే అడిగాడు.

"నా ఇలాకాకొచ్చి నన్నే బెదిరిస్తున్నావ్ రా ? నీ ధైర్యానికి మెచ్చుకోవాలి బే! చెయ్యరా. అటాక్ చేసి చూడు తెలుస్తుంది. నెత్తురు తాగే కిరాతకులు అరవై మంది నా మనుషులు నా అడ్డాని సురక్షితంగా కాపాడుతున్నారు. బ్రాడ్ లీని వప్పగించను. ఏం చేస్తావ్ ? ఏం చేయగలవ్ బే..... రా చూద్దాం!" బి.పి పెరిగిన పేషంట్ లా అరిచాడు మిశ్రా.

అవతల వాత్సవ క్షణం మౌనం వహించాడు. తర్వాత గొంతు విప్పాడు. " మిశ్రాభాయ్! నా గురించి నీకు తెలీదు. కనీసం పేరు కూడా విని వుండవు. కానీ నీ గురించి నాకు పూర్తిగా తెలుసు. ఒక్కటి గుర్తుంచుకో. వేలు పెట్టిన తర్వాతే నిప్పు కాలుతుందని పసివాడికి అర్థమవుతుంది. నువ్వు పసివాడివి కావని తెలుసు. గాబట్టి నీకు నీతులు చెప్పాల్సిన పనిలేదని తెలిసిపోయింది. సో.....నువ్వు రిసీవర్ పెట్టిన రెండో క్షణం నుంచే అటాక్ స్టార్టవుతుంది. గెట్ రెడీ!" అంటూ లైన్ కట్ చేశాడు వాత్సవ.

అతడి మాటల్ని తేలిగ్గా తీసుకుంటూ రిసీవర్ పెట్టేశాడు. తిరిగీ తిరక్క ముందే ఒక్కసారిగా భూమి కంపించినట్టయింది. అడ్డా తూర్పు భాగంలోంచి వినవచ్చింది ఒక దారుణ విస్ఫోటక శబ్దం. ఏవో కిరకిర కూలుతున్న భీకర శబ్దాలు, ఆ వెంటనే అరుపులు, ఆర్తనాదాలు.

అదిరిపడి లేచి నిలుచున్నారు మిత్రులిద్దరూ.

"మోసం....దగా.....ఆ డిటెక్టివ్ బాంబుదాడి చేస్తాడనుకోలేదు. ఏం జరుగుతోంది బయట ?" అంటూ లుంగీ జారిపోతున్నా పట్టించుకోకుండా బయటికి పరుగుతీశాడు.

అలా పరుగు తీస్తుండగానే పశ్చిమ దిక్కు నుంచి మరో దారుణ ప్రేలుడు శబ్దం వినవచ్చింది.

బయటకు అడుగుపెడుతూనే తన అడ్డాని అలుముకొంటున్న మంటలు చూసి గుండెలు బాదుకున్నాడు మిశ్రా. తూర్పు దిక్కులో వున్న స్మగుల్డ్ గూడ్స్ వుంచే పెద్ద గోడౌన్ తునాతునకలుగా పేలి దారుణ మంటల్లో తగలబడి పోతోంది. పశ్చిమ దిక్కులో వెపన్స్ గోడౌన్ పేలి వరస పేలుళ్ళతో ఆ ప్రాంతం మారుమ్రోగుతోంది.

"అయిపోయాను.....సర్వనాశనం అయిపోయాను" మిశ్రా ఏడుపు ముఖంతో అరుస్తుండగానే అతనున్న కట్టడం వెనక భాగంలో మరో ప్రేలుడు, ఆ వెంటనే మెయిన్ బిల్డింగ్ కుడి పక్క మరో ప్రేలుడు. ఆ భవంతి కిరకిరలాడింది.

దిక్కు తోచక అటూ ఇటూ పరుగులు తీస్తున్నారు చావగా మిగిలిన అనుచరులు.

బ్రాడ్ లీ కి ఆ పరిస్థితి చూస్తుంటే అరచేతులు చెమటలు పట్టేశాయి. తను అక్కడ ఉండటం ప్రమాదమని అర్థమైపోయింది. పారిపోయే ఉద్దేశంతో గిరుక్కున వెనుతిరిగాడు.

తిరిగిన మరుక్షణం ముష్టిఘాతం ఒకటి ముఖాన్ని బలంగా తాకింది. కెవ్వున అరిచి పక్కకు తూలాడు వాడు.

అలా తూలుతూ వుండగానే అతని పక్కకొచ్చిన శ్యామ్ సుందర్ పిడికిలి సూటిగా బ్రాడ్ లీ మెడ నరం మీద కనక్టయింది. అంతే! ఉన్నా వాడు ఉన్నట్టే తెలివితప్పి దబ్బున కిందపడిపోయాడు. పడకుండా ఒడిసిపట్టి ఎత్తి భుజాన వేసుకున్నాడు వాడ్ని శ్యామ్ సుందర్.

"నువ్వు పద శ్యామ్! బన్సీలాల్ మిశ్రా షాక్ తిన్నట్టున్నాడు. కాస్త పరామర్శించి వస్తాను." అన్నాడు ఎదురుగా వున్న వాత్సవ.

అక్కడి నుంచి బ్రాడ్ లీతో అదృశ్యమయ్యాడు శ్యామ్ సుందర్. భానుమతి, సూకీ ఇద్దరూ అప్పటికే బన్సీలాల్ మనుషులతో భీకర పోరాటంలో వున్నారు. వాత్సవను చూసి రెచ్చిపోయాడు మిశ్రా.

"నువ్వు ఫోన్ లో ఎక్కడి నుంచో మాట్లాడుతున్నట్టు అబద్ధం చెప్పావ్! నన్ను నిలువునా నాశనం చేశావ్! నిన్ను వదలను" అనరుస్తూ రివాల్వర్ అందుకోబోయాడు.

వాత్సవ దారుణంగా అటాక్ చేశాడు.

జాలి అనే మాటకు అర్థం మర్చిపోయి దొరికినవాడ్ని దొరికినట్టు విరగదీశాడు.

ప్రేలుడు శబ్దాలకు సిటీలో భీతి ఏర్పడుతుంది. ఏ క్షణంలోనయినా పోలీసులు పరుగులెత్తుకు రావచ్చు. ఎక్కువసేపు అక్కడ వుండటం మంచిదికాదని తెలుసు. అందుకే మూడో దెబ్బకే మిశ్రాని స్పృహ తప్పించాక ఇక తిరిగి చూళ్ళేదు వాత్సవ. భానుమతి, సూకీలను కూడా హెచ్చరిస్తూ అడ్డాలో అడ్డంపడినవాడ్ని నేలకూలుస్తూ బయటకు దారితీశాడు.

ఎంత వేగంగా అటాక్ ఆరంభమైందో అంత వేగంగానూ అంతమైంది. పోలీసు వేన్ లూ, ఫైరింజన్ లూ ఆఘమేఘాలమీద అక్కడికి దూసుకొచ్చేసరికి వాత్సవ బృందం ఆ ప్రాంతాలకు అరకిలోమీటరు దూరంలో తమ దారిన టాక్సీలో వెళ్ళిపోతోంది.

* * *

"నాకు తెలుసు..... మా డిపార్టుమెంటుకు పేరు రాకుండా చేయటం కోసం నువ్వు కంకణం కట్టుకొని పనిచేస్తున్నావని నాకు బాగా తెలిసిపోయింది. లేకపోతే ఆ ఛైల్డ్ కిడ్నాప్ కేసు విషయంగా మీరు పనిచేస్తున్నట్టు నాతో చిన్న మాటయినా చెప్పవా ?" నిష్ఠూరంగా వాత్సవ చెవిలో తన అక్కసునంతా వెళ్ళ గక్కాడు యస్.ఐ. రమేష్.

"చెప్పను.... స్నేహాన్ని స్వార్థానికి వాడుకొనే వాళ్ళతో అస్సలు ఇలాంటి విషయాలు చెప్పను" అన్నాడు నవ్వుతూ వాత్సవ.

పెద్దాయన ఆదిత్య ప్రతాప్ సింగ్ తన పేలస్‌లో ఏర్పాటు చేసిన పెద్దసమావేశం అది.

ఆశ వదులుకున్న తన మనవడు ఆదిత్య తిరిగి దొరకటంతో ఆయనకు పెన్నిధి దొరికినంత ఆనందంగా వుంది.

మొదటిసారి అయితే మనవణ్ని చూసిన ఆనందంలో వాడ్ని గుండెలకు హత్తుకొని అర్థగంటపాటు ఏడుస్తూనే వున్నాడు. తను అపార్థం చేసుకున్నందుకు భానుని క్షమించమని అడిగాడు. అంతేకాదు—

సూకీ తన మనవరాలని, ఆ అమ్మాయి మూలంగానే హాంకాంగ్‌లో అష్టకష్టాలు పడుతున్న తన మనవడ్ని చూడగలిగాడని తెలిసి సూకీని కౌగిలించుకుని ఓదార్చాడు.

"నాకు తెలీదు, నా కొడుకు రక్తం హాంకాంగ్‌లో పెరుగుతున్న సంగతి. నాకు తెలీదు తల్లీ. తెలిస్తే ఎప్పుడో నీ దగ్గరకు వచ్చి వుండేవాడ్ని. నువ్విక ఎక్కడికీ వెళ్ళాల్సిన పనిలేదు. మాతోనే వుంటున్నావ్" అంటూ తన నిర్ణయం చెప్పేశాడు.

బ్రాడ్ లీ అందరి ఎదుటా తన నేరాన్ని అంగీకరించాడు. భగవాన్ దాదా, మియాచీ మిగిలిన వాళ్ళంతా జరిగింది చెప్పి, నేరాన్ని ఒప్పుకున్నారు. వాళ్ళందర్నీ పోలీసులు తీసుకువెళ్ళిపోయారు.

ఈ కేసు పరిశోధించిన వాత్సవ, శ్యామ్ సుందర్‌ల సంస్థ డైనమిక్ సెక్యూరిటీ సర్వీసెస్ కి పెద్దాయన ఆదిత్య ప్రతాప్ సింగ్ తన సంతోషం వ్యక్తం చేస్తూ ఏభై లక్షలకు చెక్కు యిచ్చాడు. ఇక భానుమతి మరో ఏభై లక్షలకు చెక్కు అంద చేసింది. అంతేకాదు, తమకు సహకరించిన టాక్సీ డ్రైవర్ జలీల్ ఖాన్‌కు అయిదు లక్షలు, కాలేషావలీకి లక్షరూపాయలు యిచ్చింది.

ఇక సమావేశం ముగిసి అంతా బయటకెళ్ళిపోతున్నారు. ఆ సమయంలో చటుక్కున శ్యామ్ సుందర్ చేయి పుచ్చుకుని పక్కగదిలోకి లాక్కుపోయింది సూకీ.

"ఏమిటి ? ఆశ్చర్యంగా అడిగాడు శ్యామ్ సుందర్.

"నీకొకటి బాకీ వున్నాను నేను. గౌహతి ఏర్‌పోర్ట్‌లో విమానంలో బ్రాడ్ లీ వస్తాడని చెప్పిన నువ్వు నెగ్గావు. గుర్తుందిగా ?" అంది అందంగా నవ్వుతూ.

"అవునవును. అయితే ఇప్పుడు ఏమంటావ్ ?" మీదిమీది కొస్తున్న ఆమెను అనుమానంగా చూస్తూ అడిగాడు.

"ఏమంటాను ? బాకీ తీర్చేయాలనుకుంటున్నాను. ఇచ్చింది కాదనకుండా తీసుకోవాలి."

"అయితే త్వరగా ఇచ్చెయ్. బయట వాళ్ళంతా వెళ్ళిపోతున్నారు."

"ఇస్తున్నాగా. తొందరేమిటి ?" అంటూ అతని మెడను తన చేతులతో పూలచెండులా చుట్టేస్తూ మెడను వంచింది. ఆమె ఉద్దేశం ఏమిటో గ్రహించే లోపలే ఆమె అధరాలు అతడి అధరాలమీద చిక్కని ముద్దును ప్రజంట్ చేశాయి.

"థాంక్యూ బేబీ...." అంటూ ఆమె కౌగిలి విడిపించుకుని బయట తనను పిలుస్తున్న వాత్సవవైపు అడుగులువేస్తూ వెళ్ళిపోయాడు శ్యామ్ సుందర్.

వెళుతున్న అతడ్నే చూస్తూ—

భారంగా నిట్టూర్చింది సూకీ.

----: శుభం :-----

# Visw aprayatnam

By

## Madhu Baabu



**Sri Srinivasa Publications**

4th line, A.T. Agraharam,

GUNTUR - 522 004.